# ఆదర్శ మహిళ హజ్రత్ ఆయిషా (ర.అ)

మౌలానా ముహమ్మద్ తఖీయుద్దీన్

మజ్లిసె ఇషాఅతె ఇస్లాం

https://teluguislam.net

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

https://teluguislam.net

అనంత కరుణామయుడు
అపార కృపాశీలుడైన
అల్లాహ్ పేరుతో

https://teluguislam.net

# ఆదర్శ మహిళ
# హజ్రత్ ఆయిషా (ర.అ)

ఉర్దూ సంకలనం
మౌలానా హాఫిజ్ ముహమ్మద్ తఖీయుద్దీన్

తెలుగు అనువాదం
ఇక్బాల్ అహ్మద్

సంపాదకత్వం
ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

https://teluguislam.net

**Adarsha Mahila Hazrat Ayesha (R.A)**
**Seerat Hazarat Ayesha (R.A.)**

*compiled by:*
**Moulana Hafiz Muhammed Taqiuddin**

*Translated by :*
**Iqbal Ahmed**

*Edited by :*
**Muhammed Azeezur Rahman**

*All Rights Reserved*

| | | |
|---|---|---|
| First Edition | : | September, 1995 |
| Copies | : | 2000 |
| Price | : | Rs. 50/- |
| Cover Designed by | : | Wali (Art Span) |
| Typeset and **Printed by** | : | **Kala Jyothi Process Limited,** R.T.C. X Road, Hyderabad. |

| | | |
|---|---|---|
| Published by | : | **Majlis-e-Isha'ate Islam** Near Ujalesha Mosque Sayeedabad Hyderabad - 500 059. |

https://teluguislam.net

# విషయ సూచిక


ముందు మాట............................................. ix

1. పుట్టు పూర్వోత్తరాలు............................................. 1
జననం-2, బాల్యం-3, వివాహం-5, హి(జత్ (ప్రస్థానం)-7, వీడ్కోలు-9.

2. విద్యా శిక్షణలు............................................. 11

3. కుటుంబ వ్యవహారాలు............................................. 21

4. దాంపత్య వ్యవస్థ............................................. 25
భార్యపట్ల ప్రేమ - 26, భర్త పట్ల ప్రేమ -28, భార్యకు సత్కారం-31, మనోల్లాసం-32, కలసిభుజించడం-34, ప్రయాణంలో-34, పరుగు-35, గారాలు-35, సేవా తత్పరత-37, విధేయత, అజ్ఞాపాలన - 38, పరస్పర ధార్మిక జీవితం-39, ఇంట్లో ఉన్నప్పుడూ ప్రవక్త పదవీ బాధ్యతలు- 41.

5. సవతులతో వ్యవహరణ............................................. 45
సవతి సంతానంతో - 53

6. అపనింద............................................. 57
సర్ విలియం మ్యూర్ వక్రీకరణ - 66, తయమ్ముమ్ ఆజ్ఞ - 67

7. మూడు ముఖ్య సంఘటనలు............................................. 69
తహ్రీమ్ సంఘటన-69, ఈలా సంఘటన -71, తఖ్యీర్ - 73

8. వైధవ్యం............................................. 75

9. ఆనాటి స్థితిగతులు............................................. 81
సిద్దీఖీ యుగం-81, పితృ వియోగం-81, ఫారూఖీ హయాం - 82, హజ్రత్ ఉస్మాన్ (రజి) హయాం-83, హజ్రత్ అలీ(రజి) ముర్తుజా హయాం - 89

10. సంస్కరణ కోసం పిలుపు............................................. 91
ముస్లిం స్త్రీ బాధ్యతలు - 91, జమల్ యుద్ధం-102, హజ్రత్ అలీ (రజి)తో అభిప్రాయ భేదమా ? - 106, హజ్రత్ ముఆవియా కాలం-108, మరణం-110, పెంపుడు తల్లి-111, రూపలావణ్యాలు-112

11. నీతి నడవడికలు.............................................113
తోటి స్త్రీలకు సహాయం - 114, భర్తకు విధేయత - 114, పరోక్ష


https://teluguislam.net

నిందలకు, దూషణలకు దూరంగా - 114, ఉపకారాన్ని స్వీకరించడం - 115, ఆత్మ స్తుతి అంటే గిట్టదు - 115, పౌరుషం - 115, దాతృత్వం - 116, దైవారాధన - 119, మామూలు విషయాల పట్ల శ్రద్ధ - 120, బానిసల పట్ల ప్రేమ - 120, యాచకుల స్థాయిని బట్టి సహాయం-120, హజ్రత్ ఆయిషా విశిష్టత -121, అపార నైపుణ్యం ఆమె స్వంతం - 122.

12. విజ్ఞాన ఖని ........................................ 125

దివ్య ఖుర్ ఆన్ అవగాహన -125, హదీసు పరిజ్ఞానం - 134, పదే పదే అడిగి తెలుసుకోవడం-139, ఉల్లేఖనంలో జాగ్రత్తలు - 139, ఉన్నత స్థాయి-140, వ్యక్తిగత పరిజ్ఞానం-143, జ్ఞాపక శక్తి -145, హజ్రత్ ఆయిషా (రజి) హదీసుల క్రోడీకరణ - 146, ఖుర్ ఆన్ ద్వారా ధర్మసూత్రాల అన్వయింపు - 146, హదీసు ద్వారా - 147, బుద్ధి కుశలత - 150

13. గ్రంథ జ్ఞానం – విశ్వాసాలు ........................................ 151

దైవానికి అవయవాలా - 151, దైవ సాక్షాత్కారం - 152, అగోచర జ్ఞానం - 152, ప్రవక్తలు వహీని పూర్తిగా వినిపిస్తారు - 153, మేరాజ్ ఆత్మకు సంబంధించినదా ? - 155, ప్రవక్త శిష్యుల తటస్థ వైఖరి-156, ఖిలాఫత్ పరంపర -157, సమాధిలో బాధ -157, సమాధిలోని శవాలు వింటాయా? - 157

14. ధర్మావగాహనలో సాటిలేని మేటి ........................................ 159

పవిత్ర ఖుర్ఆన్ అవతరణ - 160, ఉదయం, అసర్ నమాజ్ తర్వాత - 162, కూర్చుని నమాజ్ చేయటం - 162, ఆషూరా ఉపవాసానికి హేతువు-163, హజ్ వాస్తవికత - 165, వాహనంపై ఉండి తవాఫ్ చేయడం - 165, హిజ్రత్ (ప్రస్థానం)-166, దైవ ప్రవక్త (సఅసం) కుటీరంలో ఖననం చేయబడటం-166

15. బహుముఖ ప్రజ్ఞాశాలి ........................................ 169

వైద్యం - 169, చరిత్ర - 170, సాహిత్యం- 171, వక్తృత్వం-171, కవిత్వం-172, విద్య-173, ఉర్వహ్ - 175, ఖాసిమ్ బిన్ ముహమ్మద్-175, అబూ సల్మా-176, సఫియా బిన్తె షీబా - 176, ఆయిషా బింతె తల్హా-177, ముఅజ్ బిన్తె అబ్దుల్లా అద్వియ - 177

16. ధర్మాసనం (ఇఫ్తా) ........................................ 179

ఇస్లాం ఖలీఫాలు - 179, నాయకులయిన సహాబా - 180, ముస్లిం రాజ్యాల ప్రజలు - 181, ఉపదేశం - 184,

17. మహిళా లోకానికి మహోపకారం చేసిన మహిళామణి ............ 191

మహిళా ప్రపంచంలో ఆయిషా (రజి) స్థానం-199

https://teluguislam.net

# ముందుమాట

మానవ మహోపకారి, కారుణ్యమూర్తి, హృదయాల విజేత అయిన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) గుణగణాలు, దినచర్యలు, ఆయన వ్యవహార సరళి గురించి తెలిపే పుస్తకాలు తెలుగు భాషలో కొన్ని వచ్చాయి. అలాగే, ఆయా గ్రంధాల్లో దైవప్రవక్త (సఅసం) సతీమణులను గురించి వారి గృహస్థ జీవితంలోని ముఖ్య సంఘటనలను గురించి సవివరంగా తెలిపే పుస్తకాలు తెలుగులో దాదాపు లేవనే చెప్పవచ్చు.

ఒక మహాసాధ్వి జీవిత చరిత్రనే గాకుండా భార్యవలన భర్తకు ఏవిధంగా మనశ్శాంతీ, ఊరట లభిస్తాయో, లభించాలో ఈ పుస్తకం మనకు వివరిస్తుంది. ఆయా పరిస్థితులలో తనకెదురయిన వివిధ సంఘటనల్ని ఇబ్బందుల్ని, పరీక్షల్ని ఆ మహిళా లోక మార్గదర్శి ఎలా అధిగమించారో కళ్ళకు కట్టినట్లు చూపే ఓ సజీవ దృశ్య కావ్యం ఈ గ్రంధం. ఇంకా 'ధర్మేచ, అర్థేచ, కామేచ, నాతిచరామి' అన్నట్లుగా కష్టాలయినా, సుఖాలయినా భర్తతో ఆమె ఎలా కలిసి పంచుకున్నారో మనకు విశదమవుతుంది.

నేటి ముస్లింల పతనావస్థకు గల కారణాలలో సగభాగం ముస్లిం మహిళలే అంటే అతిశయోక్తి అనిపించవచ్చు. కాని రకరకాల భయాలకు భ్రమలకు దాసోహం కావడాలు, సమాధుల పూజలు, అనాగరిక మూఢాచారాలు, వివాహ సందర్భాల లోనయినా, దుఃఖ సందర్భాలలోనయినా జరుగుతున్న మూఢత్వపు తంతులు, దుబారా వ్యయం మన ప్రాంగణాలలో బ్రతికి బట్టకడుతున్నాయంటే అందుకు కారణం ఏమిటీ? నేటి ముస్లిం మహిళల్లో ఇస్లామీయ చైతన్యం మృగ్యమవడం కాదా? అయితే ఒక్క విషయం! ముస్లిం స్త్రీయొక్క పరిపూర్ణ నమూనా ఏదీ వారికి లభించనప్పుడు వారు మాత్రం ఏం చేస్తారు? ప్రతి పురుషుడి విజయం వెనుకా ఒక స్త్రీ హస్తం ఉండాలి, ఉందీ, అంటే ఆ విజయం సాధించిన పురుషుల తోడ్పాటూ, సహకారం, సమన్వయం వారికి లభించడం వల్లనే కదా!

https://teluguislam.net

ఇక ఈ పుస్తకం ద్వారా......

దైవదౌత్య ప్రాతినిధ్యంలో సహధర్మచారిణిగా మహాప్రవక్త (సఅసం) ప్రాంగణంలో దాదాపు 40 ఏళ్ళు బోధనావృత మణిదీపికగా భాసిల్లి, విశ్వాసుల మాతగా ఆచంద్రతారార్కం కీర్తించబడే మహిళా శిరోమణి అపురూప వ్యవహరణా శైలిని మహిళాలోకానికి పరిచయం చేసే భాగ్యం లభించడం మా అదృష్టం!!

స్త్రీ... తరతరాలుగా పీడనకు, పురుషాహంకారానికీ బలవుతూ వచ్చింది. స్త్రీ తన తోటి స్త్రీల వల్ల కూడ చిక్కులకు, వేదనకు, క్షోభకు గురి అయింది. అవుతూ వుంది కూడా. అందుకేనేమో ''స్త్రీకి స్త్రీయే శత్రువు'' అన్నారు.

'పితారక్షతి కౌమారే, భర్తా రక్షతి యవ్వనే, సుతా రక్షతి వార్ధక్యే, నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అంటూ కొందరు స్త్రీకి స్వాతంత్ర్యమే లేదు పొమ్మన్నారు. మరికొందరు మహానుభావులు స్త్రీని మోక్ష సాధనకు ఆటంకమని ఘోషించారు.

ఇస్లాం ఆవిర్భావానికి పూర్వం అనాగరిక అరబ్బులు స్త్రీని భోగ వస్తువుగా, కోర్కెలు తీర్చుకునే యంత్రంగా చేసుకున్నారు.

ఇస్లాం ఈ విధమయిన రెండు అతివాద భావాలను ఖండిస్తూ ఆమె శారీరక, మానసిక స్వభావానికి అతికినట్లుగా సరిపోయే సమతౌల్యంతో కూడిన కార్యక్షేత్రాన్ని సూచించింది. ''తల్లి పాదాల క్రింద స్వర్గం ఉంది'' అంటూ స్త్రీకి మహోన్నత స్థానం కల్పించింది. స్వాతంత్ర్యం, ఆస్తిహక్కు, సమాజంలో సమున్నత స్థానం ఇస్లాం ద్వారా మాత్రమే స్త్రీకి లభించాయి. ఇస్లాం స్త్రీకి కల్పించిన స్థానం ఎటువంటిదో పరిశీలిస్తే వాస్తవం వెల్లడవుతుంది. ఆధారాల్లేని విమర్శలతో, పసలేని వాదాలతో వ్యాఖ్యలు చేయడంలో ఔచిత్యం ఏముంటుంది?

హజ్రత్ ఆయిషా జీవితం సుఖ, దుఃఖాల సంభరితం. జీవితంలో ఎన్నో మార్పుల్ని, కష్టాల్ని, ఎదుర్కొన్నారా మహావనిత. భర్తతో కాపురం, విరహం,

https://teluguislam.net

ఇల్లు చక్కబెట్టుకోవడం, సవతుల ఈర్ష్యా సూయల్ని ఆమె చవిచూశారు. వైధవ్యం పొందారు. అనాథ అయ్యారు. ఉత్థాన పతనాల తెరల వెనుక జరిగిన రాజకీయాలను అవలోకనం చేసుకున్నారు. వైముఖ్య ధోరణులను ఎదుర్కొన్నారు. ఒకటేమిటి జీవితంలోని అన్ని పరిస్థితుల్నీ అధిగమించడంలో ఆయా సందర్భాలలో ఆమె వ్యవహారణా సరళి నేటి ముస్లిం స్త్రీకి మార్గదర్శకం. నైతిక, విజ్ఞాన ఆచరణాత్మక ఆణిముత్యాలతో సుసంపన్నమైన ఆమె పవిత్ర జీవితం చదవదగ్గదీ, చదివి తీరవలసినదీను.

ఇందులో మహిళాలోకానికి మార్గదర్శక సూత్రాలు ఉన్నాయి. బాల్యం నుండే విద్యా విజ్ఞాన విషయాలను ఆకళింపు చేసుకోవడం, భర్త ఆశయాలకు అనుగుణంగా తనను తాను మలచుకోవడం, నిస్సంతు అయినప్పటికీ అనాథ పిల్లల్ని పెంచి, వారికి బోధనా శిక్షణలు గరపడంతోపాటు, వారి వివాహాలు చేయడం, భర్త వియోగానంతరం ఆయన నడిపిన ఉద్యమాన్ని కొనసాగించడం, ధార్మిక తీర్పులు ఇవ్వడం, ఇంకా చాలా చాలా విషయాలు ఈనాటికీ ఆదర్శనీయములే. ఒక మహిళ ఇలా బహుముఖ ప్రజ్ఞ కనబర్చడం చూస్తుంటే ''ముదితల్ నేర్వగ రాని విద్య కలదే!'' అనిపిస్తుంది.

పాఠకులకు, ముఖ్యంగా మహిళలకు ఈ పుస్తకం అభిమానపాత్రం కావాలని కాంక్షించడంలో విడ్డూరమేముందీ..!? మజ్లిసె ఇషాఅతె ఇస్లాం తెలుగు ప్రచురణా విభాగం స్థాపకులైన మౌలానా హాఫిజ్ ముహమ్మద్ తఖీయుద్దీన్ గారి ప్రోద్బలం, సోదరులు ముహమ్మద్ అజీజు ర్రహ్మాన్‌గారి ప్రోత్సాహం... అన్నింటికీ మించి దేవుని తోడ్పాటు వల్ల ఇది పుస్తక రూపం దాల్చింది. ఇందలి లోపాలను పాఠకులు దృష్టికి తెస్తే మలిసారి ముద్రణలో సరిదిద్దుకోగలము. ఈ చిరు కృషిని కారుణ్య ప్రభువు స్వీకరించాలని వేడుకుంటూ..

కృతజ్ఞతలతో

**ఇఖ్బాల్ అహ్మద్**

https://teluguislam.net

కరుణామయుడు, కృపాసాగరుడైన అల్లాహ్ పేరుతో

# హ|జత్ ఆయిషా

## ( రజి అల్లాహు అన్హా)

### పుట్టుపూర్వోత్తరాలు

| | | |
|---|---|---|
| పేరు | : | ఆయిషా (ర.అ) |
| బిరుదు | : | సిద్దీఖా |
| సంబోధన | : | ఉమ్ముల్ మోమినీన్ |
| కునియత్★ | : | ఉమ్మె అబ్దుల్లాహ్ |

ఈమెకు 'హుమైరా' అన్న బిరుదు కూడా ఉంది. హుమైరా అంటే అరుణిమ లేక ఎరుపురంగు గలది అని అర్థం వస్తుంది. ఆమె చిన్న తనంలో ఎఱ్ఱగా, నాజూకుగా ఉండేవారు. ఆ కారణం చేత ఆమె ఆ బిరుదుతో పిలువబడేవారు. దైవ ప్రవక్త (స అసం) ఆమెను బిన్తె సిద్దీఖ్ (సిద్దీఖ్ కుమార్తె) అని కూడా సంబోధించేవారు.

హ|జత్ ఆయిషా ( రజి) అక్కగారయిన హ|జత్ అస్మా ( రజి) కుమారుడు

---

★ (కునియత్ అంటే అరబ్బుల ఆచారం ప్రకారం, తమ సంతానం పేరిట ఫలానా పిల్లవాడి లేక పిల్లకు తండ్రి లేక తల్లి అని పిలువబడటం, ఉదా : ఉమ్మె అబ్దుల్లాహ్ అంటే అబ్దుల్లా తల్లి, అబూ తల్హా అంటే తల్హా తండ్రి) - అను

అబ్దుల్లాహ్ (రజి). ఈయన తన తండ్రి పేరుతో కలుపుకొని అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) (జుబైర్ కుమారుడైన అబ్దుల్లాహ్)గా ప్రసిద్ధి చెందారు. అరబ్బులు తమ పేరుతో కాక తమ పిల్లలకు తల్లిగానో, తండ్రిగానో పిలవబడటాన్ని గౌరవప్రదంగా భావించేవారు. అయితే హ(జత్ ఆయిషా (రజి)కు సంతానం లేకపోవడం చేత ఒకసారి ఆమె దైవప్రవక్త (సఅసం)ను, ''తమరి మిగతా భార్యలు వారి వారి సంతానానికి తల్లులుగా పిలువబడుతున్నారు. మరి నేను ఎవరి తల్లినని చెప్పుకోవాలి?'' అని దీనంగా అభ్యర్థించారు. దానికి ఆయన (సఅసం) ''నీ అక్క కొడుకైన అబ్దుల్లాహ్‌కు తల్లి (ఉమ్మె అబ్దుల్లాహ్)నని చెప్పుకో'' అని సలహా ఇచ్చారు. అప్పటి నుండి ఆమె ''ఉమ్మె అబ్దుల్లాహ్''గా కూడా పిలువబడేవారు.

నిజానికి హ(జత్ ఆయిషా (రజి) తండ్రిగారి పేరు కూడా అబ్దుల్లాహ్‌యే. అబూబకర్ అనేది కునియత్. సిద్దీఖ్ బిరుద నామం. ఆమె తల్లిపేరు ఉమ్మె రూమాన్.

ఏడెనిమిది తరాల వెనక్కిపోయి చూస్తే దైవప్రవక్త (సఅసం) మరియు ఉమ్ముల్ మోమినీన్ హ(జత్ ఆయిషా (రజి) గారలు ఒకే వంశానికి చెందిన వారని తేలుతుంది.

## జననం

హ(జత్ ఆయిషా తల్లిగారైన ఉమ్మె రూమాన్ (రజి)గారి మొదటి వివాహం అబ్దుల్లా జవీతో జరిగింది. అబ్దుల్లా జవీ మరణించిన తరువాత ఆమెను హ(జత్ అబూబకర్ వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు సంతానం. వారిలో ఒకరు అబ్దుర్రహ్మాన్, రెండవ వారు హ(జత్ ఆయిషా (రజి). ఆమె జనన కాలాన్ని గురించి చారిత్రక గ్రంథాలలో స్పష్టమైన వివరాలు లేవు.

మహాప్రవక్తకు ప్రవక్త పదవి లభించిన తర్వాత - నాలుగవ ఏట - హ(జత్ ఆయిషా(రజి) జన్మించినట్లు ఇబ్నె సఅద్ అనే చరిత్రకారుడు వ్రాయగా మరి కొందరు చరిత్రకారులు దాన్నే అనుసరిస్తూ, హ(జత్ ఆయిషా ప్రవక్త పదవి తర్వాత నాలుగవ సంవత్సరం ఆరంభంలో జన్మించారనీ, ప్రవక్త పదవి లభించిన పదవ ఏట వివాహం జరిగిందనీ, అప్పటికి ఆమెకు 6 సంవత్సరాలనీ వ్రాశారు. కాని ఇది ఏ విధంగానూ సరి కాదు. ఎందుకంటే; ఒకవేళ ప్రవక్త పదవికి నాల్గోఏట ఈమె జన్మించారనే అనుకున్నా ప్రవక్త పదవికి పదవ ఏట ఆమెకు ఆరుఏళ్ళుకావు ఏడో సంవత్సరం వచ్చి ఉంటుంది.

ఇదిలా ఉండగా హ(జత్ ఆయిషా(రజి) వయస్సు గురించి ఏకాభిప్రాయంతో కూడిన కొన్ని ఆధారాలు రుజువై ఉన్నాయి. హి(జత్‌కు (మహాప్రవక్త మదీనాకు

https://teluguislam.net

వలసపోక) మూడేళ్ళ క్రితమే - ఆరవ ఏట ఆమె వివాహం జరిగింది. 9వ ఏట అంటే హిజ్రీ మొదటి సంవత్సరం షవ్వాల్ మాసంలో కాపురానికి పంపబడ్డారు. 18వఏట, అంటే హిజ్రీ 11వ సంవత్సరం రబీవుల్ అవ్వల్ మాసంలో వైధవ్యం పొందారు. ఆ ప్రకారంగా ఆమె జనన కాలం వాస్తవానికి ప్రవక్తకు దైవదౌత్యం లభించిన తర్వాత ఐదవ సంవత్సరం అయి ఉండాలి.

రాబోయే చారిత్రక సంఘటనల్ని అర్థం చేసుకోవడానికి గాను మహాప్రవక్త తనకు లభించిన దైవదౌత్యపు 23 ఏళ్ళకాలంలో దాదాపు 13 ఏళ్ళు మక్కాలో, 10 ఏళ్ళు మదీనాలో గడిపారు అన్న సంగతిని దృష్టిలో పెట్టుకోవాలి. హజ్రత్ ఆయిషా (రజి) జన్మించే నాటికి ప్రవక్త పదవి లభించి నాలుగు ఏండ్లు గడిచిపోయి ఐదవ ఏడు ప్రవేశించింది.

దైవ ప్రవక్త (సఅసం) తర్వాత ఇస్లాం కాంతి కిరణాలు అందరికన్నా ముందు అబూబకర్ సిద్దీఖ్ నిలయంపై ప్రసరించాయి. ఈ విధంగా హజ్రత్ ఆయిషా (రజి) దైవంచే ఎన్నుకోబడిన పుణ్య స్త్రీలలో ఒకరు. ఏనాడూ ఆమె దైవ తిరస్కారం, బహుదైవారాధనకు సంబంధించిన నాదాలను విని ఎరుగరు. హజ్రత్ ఆయిషా (రజి) స్వయంగా సెలవిచ్చారు, ''నేను నా తల్లిదండ్రుల్ని గుర్తు పట్టే వయస్సులోనే వారిని ముస్లింలుగా చూశాను''. (బుఖారీ షరీఫ్)

## బాల్యం

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లుగా అసాధారణ వ్యక్తులు బాల్యం నుండే తమ చేష్టల ద్వారా ప్రాముఖ్యత సంతరించుకుంటారు. వారి స్వభావ స్వరూపాలలో ఒకవిధమైన ఆకర్షణ ఉంటుంది. వారి మేధాసంపత్తి కారణంగా వారి భవిష్యత్తు ఉజ్వల మానమై ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది. హజ్రత్ ఆయిషా (రజి) కూడా ఆ కోవకు చెందినవారే. బాల్యం నుండే ఆమెలో గౌరవోన్నత లక్షణాలు ప్రస్ఫుటం కాసాగాయి. అయినా పిల్లలు పిల్లలే కదా! ఆ వయస్సులో ఆటపాటలే వారి దినచర్య. హజ్రత్ ఆయిషా (రజి) కూడా బాల్యంలో ఆటపాటల పట్ల మక్కువ చూపేవారు. వాడకట్టు పిల్లలంతా ఆమె చుట్టూ చేరేవారు. ఆమె ఎప్పుడు చూసినా వాళ్ళతో ఆటలాడుతుండేవారు. కాని ఆ చిన్న వయస్సులో కూడా దైవప్రవక్త (సఅసం) పట్ల గౌరవం ఆమెలో వెల్లి విరుస్తుండేది.

తరచుగా జరిగే విషయం : హజ్రత్ ఆయిషా (రజి) ఆటల్లో వుండేవారు. చుట్టూ స్నేహితురాళ్ళ బృందం గుమిగూడేది. అకస్మాత్తుగా దైవ ప్రవక్త (సఅసం) అక్కడికి చేరుకుంటే ఆమె వెంటనే ఆట బొమ్మల్ని దాచేసుకునేవారు.

https://teluguislam.net

స్నేహితురాళ్ళంతా చెల్లా చెదురయి దాక్కునేవారు. ఆయన (సఅసం)కు చిన్న పిల్లలంటే అమితమైన (పేమ. కాబట్టి వారి ఆటపాటల్ని తప్పుగా భావించేవారు కాదు. అందుచేత బాలికల్ని పిలిచి ఆయిషాతో ఆడుకోమనేవారు.

(సహీహ్ ముస్లిం, అబూదావూద్)

ఆటలన్నింటిలో ఆమెకు రెండు ఆటలంటే మరీ ఇష్టమైనవి. (1) బొమ్మలాట (2) ఉయ్యాల ఊగటం.

(అబూదావూద్)

ఒకసారి హ(జత్ ఆయిషా బొమ్మలతో ఆడుకుంటున్నారు. దైవ(ప్రవక్త (సఅసం) అక్కడికి వచ్చారు. ఆ బొమ్మలలో ఒక గు(రపు బొమ్మ కూడా వుంది. దానికి రెండు రెక్కలు కూడా వున్నాయి. ''ఆయిషా! ఇదేమిటి?'' అని ఆయన (సఅసం) (ప్రశ్నించారు;

''గు(రం'' అని జవాబిచ్చారామె

''గు(రానికి రెక్కలుండవే?''

''గు(రానికి రెక్కలుండవా ఏమిటి? హ(జత్ సులైమాన్ (రజి) గు(రానికి రెక్కలుండేవిగా?!'' అని తడుముకోకుండా బదులిచ్చారు.

ఆమె అలా ఆలోచించకుండా వెంటనే జవాబివ్వడం చూచి చిరునవ్వు నవ్వారు దైవ(ప్రవక్త (సఅసం).

హ(జత్ ఆయిషా సమయస్ఫూర్తికి, ధార్మిక పరిజ్ఞానానికి, తెలివితేటలకు ఈ సంఘటన ఒక మచ్చుతునక లాంటిది.

నాటికీ నేటికీ పిల్లల ఆలోచనాశక్తి ఒకేవిధంగా ఉంది. సాధారణంగా ఏడెనిమిదిఏళ్ళ వయసులో చిన్న పిల్లల్లో జ్ఞాపకశక్తి బాగా ఉంటే ఉండొచ్చుగానీ విచక్షణాజ్ఞానం అంతగా ఉండదు. ఏ విషయంలోయినా వాళ్లు లోతుగా పరిశీలించలేరు. కాని హ(జత్ ఆయిషా (రజి) బాల్యంలోని ఒక్కో విషయాన్నీ గుర్తుంచుకునేవారు. వాటిని ఉల్లేఖించేవారు. వాటినుండి పరమార్థాలను వెలికి తీసేవారు. ఇంకా బాల్యంలోని చిన్న చిన్న సంఘటనలలోని మర్మాలను తెలిపేవారు. బాల్య దశలో ఆటపాటల్లో నిమగ్నులయి ఉన్నప్పటికీ ఏదైనా ఖురానీ వాక్యం ఆమె చెవులబడితే దాన్ని కూడా కంఠస్థం చేసేసేవారు. మక్కాలో ''బలిస్సా అతు మవ్ అద్హుమ్ వస్సాఅతు అద్వావ అమరు'' అన్న ఆయత్ అవతరించినపుడు తాను ఆటలాడుతున్నాను అని ఆమె స్వయంగా తెలిపారు.

https://teluguislam.net

## వివాహం :

దైవప్రవక్త (సఅసం)గారి మొట్ట మొదటి భార్య హజ్రత్ ఖదీజాతో వివాహం నాటికి ఆయన (సఅసం) వయస్సు 25 సంవత్సరములు. హజ్రత్ ఖదీజా (రజి) వయస్సు 40 సంవత్సరాలు. వారి దాంపత్య జీవితంలో పాతికేళ్ళు గడిచాక రమజాన్ మాసంలో - హిజ్రత్‌కు మూడేళ్ళ క్రితం - హజ్రత్ ఖదీజా (రజి) పరమ పదించారు. (ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్) అప్పటికి దైవప్రవక్త (సఅసం) వయస్సు 50 ఏళ్ళు. హజ్రత్ ఖదీజా (రజి) వయస్సు 65 ఏళ్ళు.

ఇస్లాంలో భార్యకు ఎటువంటి స్థానం ఉండాలో తెలుసుకోవాలంటే ఇది గమనించండి. తన ప్రియతమ భర్త తర్వాత రెండవ ముస్లిం ఆమె. ఇస్లామీయ సందేశ ప్రచారం ఆరంభించిన తరుణంలో దైవప్రవక్త ఏకాకిగా ఎన్నో ఆటంకాలు, ఇబ్బందులలో ఉన్నప్పుడు, కష్టాల కడలిలో అలజడుల అలల్లో అన్ని చోట్లా చేదోడు వాదోడుగా నిలిచారామె. పవిత్రమూర్తి అయిన భర్తకు ప్రతి సందర్భంలోనూ ఓదార్పు ఆమెచేత లభించింది. విపత్కర సమయాల్లో వెన్నుతట్టి నిలిచారామె. అటువంటి సహధర్మచారిణి, సహానుభూతి పరురాలయిన జీవిత భాగస్వామిని ఎడబాసిన తర్వాత దైవ ప్రవక్త (సఅసం) అత్యంత ఖిన్నులయి ఉండేవారు. అంతేగాక వియోగభారం, ఒంటరితనం వల్ల ఆయనకు జీవితమే దుర్భరమైపోయింది. ఆయనంటే ప్రాణాలిచ్చే ఆయన సహచరులకు ఈ విషయం ఎంతో వ్యాకుల పర్చింది. హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ ప్రసిద్ధ సహాబీ భార్య అయిన ఖౌల (రజి) దైవ ప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి ''ఓ దైవ ప్రవక్తా (సఅసం)! తమరు మరో వివాహం చేసుకోండి'' అని సూచించారు. ''ఎవరిని'' అని ఆయన (సఅసం) అడిగారు. ''(1) వితంతువులూ ఉన్నారు. (2) కన్నె పిల్లలూ ఉన్నారు. మీరెవరిని ఇష్టపడితే ఆ సంబంధం గురించి మాట్లాడవచ్చు'' అన్నారావిడ.

''ఎవరు వాళ్ళు?''

''వితంతువైతే సౌద, అవివాహితురాలైతే అబూబకర్‌గారి అమ్మాయి ఆయిషా''★ అని ఖౌల చెప్పారు. అయితే ఈ సంబంధాల గురించి మాట్లాడమని చెప్పారు మహనీయ ముహమ్మద్.

హజ్రత్ ఖౌల (రజి) దైవప్రవక్త (సఅసం) అనుమతితో ముందు అబూబకర్ ఇంటికి వెళ్ళారు. ఆయన ముందు సంబంధాన్ని గురించి ప్రస్తావించారు. అజ్ఞాన కాలంనాటి అరబ్బుల ఆచారం ప్రకారం; ఏ విధంగా సోదరుల పిల్లల్ని వివాహం చేసుకోవడం ధర్మ సమ్మతం కాజాలదో, అదేవిధంగా అరబ్బులు సోదరునిగా పిలుచుకునే వారి పిల్లలను పెళ్ళి చేసుకోవడం కూడా నిషిద్ధంగా భావించేవారు.

https://teluguislam.net

అందుచేత హజ్రత్ అబూబకర్ ఊగిసలాడారు. ''ఖౌలా! ఆయిషా దైవ ప్రవక్త (సఅసం)కు సోదరుని కూతురు అవుతుంది కదా! ఆయన (సఅసం)తో ఆమె పెళ్ళి ఎలా ధర్మ సమ్మతం అవుతుంది?'' అని ప్రశ్నించారు. హజ్రత్ ఖౌల(రజి) వచ్చి దైవ ప్రవక్త (సఅసం)ను విచారించారు. దానికి ఆయన (సఅసం)''అబూబకర్ నా ధార్మిక సోదరుడు మాత్రమేగాని తోబుట్టువు కాదు. ఇటువంటి సోదరుల కుమార్తెలతో నికాహ్ ధర్మసమ్మతమే'' (సహీహ్ బుఖారీ) అని సమాధాన మిచ్చారు. ఈ విషయం తెలిశాక హజ్రత్ అబూబకర్ పెళ్ళికి ఒప్పుకున్నారు. కాని అంతకు ముందే హజ్రత్ ఆయిషా (రజి)కు జబీర్ బిన్ ముత్ అమ్ కుమారునితో సంబంధం ఖాయం అయింది. అందుచేత ఆయన్ని కూడా ఒక్కమారు కనుక్కోవడం అవసరం. హజ్రత్ అబూబకర్ (రజి) జబీర్‌ను సంప్రదించారు. ''నీవు నీ కుమారుడితో ఆయిషాకి పెళ్ళి సంబంధం ఖాయపర్చుకున్నావు. మరి ఇప్పుడు ఏమనుకుంటున్నావు?'' జబీర్ వెళ్ళి తన భార్యను సంప్రదించాడు. అప్పటికి జబీర్ కుటుంబం ఇస్లాం పట్ల ఆకర్షితం కాలేదు. ''ఈ అమ్మాయిని గనక మనింటికి తెచ్చుకుంటే మన అబ్బాయి ధర్మభ్రష్టుడైపోతాడు కాబట్టి ఈ సంబంధం నాకిష్టం లేదు'' అంటూ తిరస్కరించింది జబీర్ భార్య (ముస్నద్ అహ్మద్).

హజ్రత్ ఆయిషా అప్పటికి చిన్నపిల్ల. బాల్య చేష్టల కారణంగా తల్లి ఇష్టానికి వ్యతిరేకమయిన పని ఏదైనా చేస్తే తల్లి ఆమెను దండించేది. ఆ పరిస్థితుల్లో ఆమెను చూసిన దైవ ప్రవక్తకు బాధ కలిగేది. అందుచేత హజ్రత్ ఉమ్మె రూమాన్ (రజి)కు

---

★ అరబీ భాషలో అవివాహితుడ్ని ''బకర్'' అంటారని పాశ్చాత్య విమర్శకులు క్రైస్తవ పరిశోధకులు స్థూలంగా తేల్చిచెప్పేశారు. ఇది వారి అజ్ఞానానికి ప్రతీక. ఇస్లామీయ ప్రవక్తగారు కౌమార్యంలో వున్న ఆయిషాగారిని వివాహమాడటం వల్ల లభించిన గౌరవం, ప్రత్యేకతల వల్ల ఆమె తండ్రికి అబూబకర్ అన్న బిరుదు లభించిందట! ముక్కూ మొహం ఎరుగని వారికి అసలు విషయం తెలియనందువల్ల ఈ సందర్భంగా పప్పులో కాలేశారులే అని అనుకోవచ్చు. కాని విచారించవలసిందేమిటంటే మన వాళ్ళూ ఇలాంటి అజ్ఞానాన్ని వెదజల్లడంలో పాశ్చాత్యులకు తీసిపోని విధంగా వ్యవహరించారు. నవతరం అందించిన ప్రతిభా వ్యుత్పత్తిగా పేరు మోసిన విద్యావేత్త మిస్టర్ అమీర్ అలీగారు ''లైఫ్ ఆఫ్ ముహమ్మద్'' 14వ అధ్యాయంలో సరిగ్గా ఇదే తప్పు చేశారు. అరేబియాలో కునియత్ (సంతానం పేరుతో ఫలానా సంతానానికి తండ్రిగా పిలువబడటం)ను గౌరవ సూచకంగా భావించేవారు. కునియత్‌తో సంబోధన అరేబియాలో అత్యంత గౌరవప్రదం. ఎంతో ప్రఖ్యాతి చెందినవారి అసలు పేర్లు వారి కునియత్ చాటున మరుగున పడిపోయేవి. అబూసుఫ్యాన్ (సుఫ్యాన్ యొక్క తండ్రి) అబూజహల్ (జహల్ యొక్క తండ్రి), అబూలహబ్, అబూజర్‌లను అందరూ ఎరుగుదురు. కాని వారి అసలు పేర్లు ఎంతమందికి తెలుసు? అబూబకర్ కూడా అంతే. ఈ కునియత్ పద్ధతి హజ్రత్ ఆయిషా (రజి) పుట్టకపూర్వమే కాక ఇస్లాంకు పూర్వమే అమలులో ఉండేది. ఇక 'బకర్' అని పిలిచేది అవివాహితుడ్ని కాదని వారెవరు చెప్పాలి?

https://teluguislam.net

''నా కోసమయినా ఆమెను బాధించకండి'' అని కబురంపించారు. ఒకసారి ఆయన (సఅసం) హజ్రత్ అబూబకర్ (రజి) ఇంటికి వచ్చేసరికి హజ్రత్ ఆయిషా గుమ్మానికి ఆనుకుని ఏడుస్తూ నిలబడి వున్నారు. అది చూసిన దైవప్రవక్త (సఅసం) ఉమ్మెరూమాన్‌తో ''మీరు నామాటను ఖాతరు చేయలేదు'' అన్నారు. ''దైవ ప్రవక్తా (సఅసం)! ఈ పిల్ల చీటికి మాటికీ నా గురించి తండ్రికి ఫిర్యాదు చేస్తోంది'' అని చెప్పిందామె. ''ఏం చేసినా సరే, ఆమెను బాధించవద్దు'' అన్నారు దైవప్రవక్త (సఅసం).

వివాహానికి పూర్వం ఒకసారి ప్రియప్రవక్త (సఅసం)కు ఒక కల వచ్చింది. ఒక దైవదూత ఒక వస్తువుని పట్టుబట్టలో చుట్టి ఆయన (సఅసం) ముందు ఉంచుతున్నాడు ''ఏమిటిది? అని అడిగారాయన. ''ఈమె మీ భార్య'' దైవదూత జవాబిచ్చాడు. ఆయన (సఅసం) విప్పిచూస్తే ఆ వస్త్రంలో హజ్రత్ ఆయిషా (రజి) ఉన్నారు. (సహీహ బుఖారీ)

హజ్రత్ ఆయిషా (రజి)కు వివాహం జరిగే నాటికి ఆమెకు ఆరేళ్ళు. ఇంత చిన్నవయస్సులోనే దైవ ప్రవక్తతో పెళ్ళి చేయడంలోని అసలు ఉద్దేశ్యం ప్రవక్త పదవికీ - ఖిలాఫత్ వ్యవస్థకు మధ్య సంబంధాన్ని పటిష్టవంతం చేయడమే. అరేబియా వాతావరణంలో పుట్టిన ఆడపిల్లల శారీరక పెరుగుదల అసాధారణంగా వుంటుంది. అదీగాకుండా అసాధారణ వ్యక్తులు మానసికంగా ఎంతో శీఘ్రంగా పరిణతి చెందినట్లే శారీరకంగా కూడా తొందరగానే ప్రౌఢత్వాన్ని పొందుతారు. హజ్రత్ ఆయిషా శరీర స్వభావం కూడా అటువంటిదే. మొత్తానికి దైవ ప్రవక్త (సఅసం) హజ్రత్ ఆయిషా (రజి)లోని ఈ విశిష్ట గుణాలను పరికించి మరీ ఆమెను తన నికాహ్‌లోకి తెచ్చుకున్నారు.

పెళ్ళి కూడా చాలా నిరాడంబరంగా జరిగింది. ఆటలాడుకుంటున్న పిల్లను పిలిచి ముస్తాబు చేసి ఎటువంటి ఆడంబరం, ఆర్భాటం లేకుండా సాదాసీదాగా జరిపించారు. ఆమెకు ఇవ్వబడిన 'మహర్' గురించి విభిన్న ఉల్లేఖనాలు ఉన్నాయి. స్వయంగా హజ్రత్ ఆయిషా కథనం ప్రకారం ఆమెకు అయిదు వందల దిర్హమ్‌లు 'మహర్'గా ఇవ్వబడ్డాయి.

## హిజ్రత్ (ప్రస్థానం) :

హజ్రత్ ఆయిషా(రజి) వివాహం అయిన తరువాత దాదాపు మూడు సంవత్సరాలు మక్కాలోనే ఉన్నారు.

ముస్లింలు తమ స్వస్థలం నుండి రెండుసార్లు హిజ్రత్ చేశారు. మొదట అబిసీనియా దేశానికి ఆ తర్వాత మదీనాకు వలసపోయారు. హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలియచేశారు :.''హజ్రత్ అబూబకర్ (రజి) కూడ అబిసీనియాకు

హిజ్రత్ చేయాలనుకున్నారు. మక్కా నుండి 5 రోజుల ప్రయాణం చేసి బ్రక్ అల్ గమాద్ అనే మజిలీ వరకూ చేరుకున్నారు. అకస్మాత్తుగా ఇబ్నులద్‌గన్ అనే వ్యక్తి ఎటునుంచో వస్తూ అబూబకర్‌ను చూచి చలించిపోయాడు. అబూబకర్ వంటి సౌమ్యుడే వలసపోవలసి రావటం ఖురైషుల దురదృష్టానికి చిహ్నమని తలపోసి, ఆయన్ని బ్రతిమాలి వెనక్కి తీసుకువచ్చాడు'' (బుఖారీ). బహుశా ఈ ప్రయాణంలో హజ్రత్ ఆయిషా మరియు వారి కుటుంబీకులు కూడా తోడు వచ్చి ఉండవచ్చు.

మరోసారి మక్కా బహు దైవారాధకుల దౌర్జన్యాలు ముస్లింల సహనానికి చిచ్చు పెడుతున్నపుడు దైవప్రవక్త (సఅసం) మదీనావైపు హిజ్రత్ చేయాలని అభిలషించారు. ఆయన (సఅసం) ప్రతిరోజూ ఉదయంగానీ సాయంత్రంగానీ క్రమం తప్పక అబూబకర్ (రజి) ఇంటికి వచ్చేవారని హజ్రత్ ఆయిషా (రజి) వివరిస్తున్నారు. ఒకరోజు అలవాటుకు భిన్నంగా వదనంపై దుప్పటి కప్పుకుని మధ్యాహ్నం వేళ వచ్చారు. అబూబకర్ (రజి)తో పాటు హజ్రత్ ఆయిషా, హజ్రత్ అస్మా ఇంకా ఇద్దరు కుమార్తెలూ కూర్చొని ఉన్నారు. ఆయన (సఅసం) అబూబకర్ (రజి)ని పిలుస్తూ ''కాస్త వాళ్ళను తప్పుకోమనండి. మీతో సమాలోచన జరపాలి'' అన్నారు. ''ఇక్కడ పరాయి వాళ్ళెవరూ లేరు. అందరూ మా కుటుంబ సభ్యులే ఉన్నారు'' అని అబూబకర్ చెప్పారు. ఆయన (సఅసం) హిజ్రత్ చేయాలన్న అభిప్రాయాన్ని వెల్లడించారు. హజ్రత్ ఆయిషా(రజి), హజ్రత్ అస్మా(రజి) ఇద్దరూ కలిసి ప్రయాణ సామగ్రి సిద్ధం చేశారు. కుటుంబ సభ్యులందర్నీ శత్రు వలయంలో విడిచిపెట్టి ఈ పురుషులిద్దరూ మదీనాకు ప్రయాణమయ్యారు. ఎట్టకేలకు శత్రువుల ముట్టడి నుంచి బయటపడి ఈ చిన్న బృందం మదీనా చేరుకుంది. ఈ సంఘటన ప్రవక్త పదవి లభించిన పధ్నాలుగో సంవత్సరం ఆరంభంలో - రబీవుల్ అవ్వల్ నెల 12వ తారీఖున సంభవించింది.

మదీనాలో కాస్త స్థిమితం చిక్కాక, తన ఆలు బిడ్డలను పిలుచుకు రావడానికి తమ బానిసలయిన హజ్రత్ జైద్ బిన్ హారిస్(రజి), అబూరాఫె(రజి)లను మక్కాకు పంపారు. హజ్రత్ అబూబకర్(రజి) కూడా తన మనుషులను మక్కాకు పంపారు. దరిమిలా హజ్రత్ అబ్దుల్లా ఇబ్నె అబూబకర్ తన తల్లి మరియు ఇద్దరు సోదరీమణులను తీసుకుని మక్కా నుండి ప్రయాణమయ్యారు. అనుకోకుండా హజ్రత్ ఆయిషా (రజి) కూర్చున్న ఒంటె వేగంగా పరుగు తీసింది. ఎంత వేగంగా దౌడు తీసిందంటే ఒంటె మీది జీను ఎక్కడ పడిపోతుందో అన్న భయం కలిగింది. ఆయిషా తల్లిగారు సహజ ధోరణిలో, తనకేం జరిగినా ఫరవాలేదు గాని తమ చిన్నారులేమయిపోతారో అన్న భీతితో బావురుమంది. చివరకు కొన్ని మైళ్ళ దూరం

https://teluguislam.net

పోయిన తర్వాత ఒంటె పట్టుబడింది. అప్పటికిగానీ వాళ్ళ ప్రాణాలు కుదుట పడలేదు. ఈ చిన్నబృందం మదీనా చేరేసరికి దైవప్రవక్త (సఅసం) మస్జిదె నబవీ చుట్టు ప్రక్కల ఇళ్ళు కట్టిస్తూ ఉన్నారు. దైవప్రవక్త (సఅసం) కుమార్తె అయిన హజ్రత్ ఫాతిమా (రజి), హజ్రత్ ఉమ్మె కుల్సుం (రజి), ఆయన (సఅసం) భార్య హజ్రత్ సౌదా (రజి)లు ఆ క్రొత్త ఇంట్లోనే స్థిరపడ్డారు.

## వీడ్కోలు :

హజ్రత్ ఆయిషా (రజి) తన అప్తులతో బనూహారిస్ బిన్ ఖజ్‌రజ్ తెగకు చెందిన వాడలో ఏడెనిమిది నెలలపాటు తల్లిగారి యింట్లోనే వున్నారు. ముహాజిర్లకు మదీనా వాతావరణం పడక చాలామంది తరచూ అస్వస్థులయ్యేవారు. హజ్రత్ అబూబకర్ (రజి) కూడా అప్పట్లో జబ్బు పడ్డారు. చిన్నారి కుమార్తె తన తండ్రికి సపర్యలు చేసేది. ఆమె తండ్రిని సమీపించి కుశల ప్రశ్నలు వేస్తే ఆయనగారు కవిత్వం చెప్పేవారు.

హజ్రత్ ఆయిషా(రజి) తన తండ్రి ఆరోగ్య పరిస్థితిని దైవప్రవక్త (సఅసం)కు వివరిస్తే ఆయన (సఅసం)దుఆ చేశారు. ఆ తర్వాత హజ్రత్ ఆయిషా కూడా అస్వస్థురాలయ్యారు. ఇక కుమార్తెకు ధైర్యం చెప్పే బాధ్యత తండ్రిపై పడింది. కుమార్తె దగ్గర దీనంగా కూర్చునేవారు. వ్యాధి తీవ్రత మూలంగా హజ్రత్ ఆయిషా(రజి) జుట్టంతా రాలిపోయింది. ఆరోగ్యం చేకూరిన తర్వాత హజ్రత్ అబూబకర్ (రజి) దైవప్రవక్త (సఅసం) వద్దకెళ్ళి ''దైవప్రవక్తా! ఇక మీరు మీ భార్యను మీ యింటికి తీసుకెళ్ళరాదా!'' అని కోరారు. ప్రస్తుతానికి తనవద్ద మహర్ చెల్లించడానికి పైకం లేదని జవాబిచ్చారాయన(స). నా దగ్గరి నుంచి చేబదులు స్వీకరించండని హజ్రత్ అబూబకర్ చెప్పారు. నిర్ణీత పైకం హజ్రత్ అబూబకర్(రజి) నుండి అప్పుగా తీసుకొని హజ్రత్ ఆయిషా(రజి)కి పంపించారు. ఈ సంఘటన మహర్‌ను దీర్ఘకాలిక రుణంగా భావిస్తున్న నేటి నవతరానికి గుణపాఠం వంటిది. ఈ కాలం వాళ్ళు మహర్ చెల్లించే సున్నత్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారు. మహర్ అనేది స్త్రీ హక్కు. అది ఎట్టి పరిస్థితిలోనూ ఆమెకు దక్కవలసిందే.

మదీనా హజ్రత్ ఆయిషా(రజి)కు మెట్టినిల్లు అయింది. అన్సారీ ముత్తయిదువలు పెళ్ళి కుమార్తెను తీసుకెళ్ళేందుకు హజ్రత్ అబూబకర్ యింటికి వచ్చారు. హజ్రత్ ఉమ్మెరూమాన్ కూతుర్ని పిలిచారు. ఆ సమయంలో ఆమె చెలికత్తెలతో ఉయ్యాల లూగుతూ వుంది. తల్లి పిలుపు వినగానే రొప్పుతూ రోజుతూ పరిగెత్తుకుంటూ వచ్చింది. తల్లి కూతుర్ని చేయిపట్టుకుని గుమ్మందాకా తీసుకువచ్చి మొహం కడిగి, తైల సంస్కారం చేసి, జడవేసి అన్సారీ స్త్రీలు పెళ్ళికూతురు కోసం వేచియున్న గదిలోకి తీసుకుపోయింది. ఆమె గదిలోకి ప్రవేశించగానే అతిథురాండ్రు ''నీరాక

https://teluguislam.net

శుభకరం, మేల్తరం'' అంటూ మంగళ వాక్యాలు పలికారు. పెళ్ళికూతుర్ని అలంకరించారు. కొంతసేపటికి దైవప్రవక్త (సఅసం) కూడా అక్కడికి వచ్చారు. (సహీహ్‌బుఖారీ)

అప్పటికి ఆయన (సఅసం)కు ఆతిథ్య మివ్వడానికి ఇంట్లో కొన్ని పాలు తప్ప మరేమీ లేదు. హజ్రత్ ఆయిషా (రజి) చెలికత్తె అయిన హజ్రత్ అస్మా(రజి) బిన్తె మజీద్(రజి) ఇలా వివరించారు:

''నేనప్పుడు అక్కడే వున్నాను. దైవప్రవక్త (సఅసం) కొన్ని పాలు త్రాగి ఆ పాత్రను హజ్రత్ ఆయిషాకు అందించారు. ఆమె సిగ్గుపడింది. 'ఇది దైవప్రవక్త (సఅసం) ప్రసాదించిన కానుక. దీన్ని తిరస్కరించకు' అని నేనన్నాను. ఆమె సిగ్గుపడుతూ తీసుకుని కాసిని పాలు త్రాగి వదిలేశారు. 'నీ స్నేహితురాళ్ళకు్కాడ యివ్వు' అన్నారు ఆయన (సఅసం). ఓ దైవప్రవక్తా! మాకిప్పుడు త్రాగాలని లేదు అన్నాం మేమంతా. ''అబద్ధం చెప్పకండి. మనిషి ఆడే ఒక్కొక్క అబద్ధమూ లిఖించబడుతుంది'' అని ఆయన (సఅసం) ఉపదేశించారు.

ఆ విధంగా హజ్రత్ ఆయిషా(రజి) హిజ్రీ 1వ సంవత్సరంలో కాపురానికి వెళ్ళారు. అప్పటికి ఆమెకు తొమ్మిది ఏళ్ళే.

పై వివరాల ప్రకారం హజ్రత్ ఆయిషా (రజి) వివాహంగానీ, ఆమె వీడ్కోలుగానీ ఎంత సాదా సీదాగా జరిగిపోయాయో ప్రతి ఒక్కరికీ అర్థమవుతుంది. అందులో కృత్రిమమైన మొహమాటాలుగానీ, కుహనా ప్రతిష్టలుగానీ లేవు. వృధా ఖర్చు మచ్చుకైనా కానరాదు.

హజ్రత్ ఆయిషా (రజి) వివాహ వేడుకలో మరో ప్రత్యేకత కూడా వుంది. అదేమంటే ఈ పెళ్ళి ద్వారా అరబ్బు దేశంలోని మూఢాచారాల బంధనాలు తెగిపోయాయి. మొదటిది: అరబ్బులు సోదరునిగా పిలుచుకునేవారి కుమార్తెలను పెళ్ళాడటం అధర్మంగా భావించేవారు. అందువల్లనే సంబంధం వచ్చినప్పుడు, అబూబకర్ (రజి) ''ఇది ధర్మ సమ్మతమేనా'' అని సంభ్రమాశ్చర్యాలతో ప్రశ్నించారు. కాని దైవప్రవక్త (సఅసం) ''నీవు కేవలం ఇస్లామీయ సోదరుడవు మాత్రమే'' అని చెప్పి సందేహ నివృత్తి చేశారు.

రెండో మూఢాచారం : అరబ్బులు షవ్వాల్ మాసంలో వివాహాలు చేసేవారే కాదు. గతంలో ఎప్పుడో అరబ్బు దేశంలో కలరా వ్యాధి ప్రబలిన కారణంగా షవ్వాల్ మాసాన్ని దుష్ట మాసంగా భావించేవారు. అందుచేత ఈ మాసంలో వివాహాలు జరిగేవి కావు.

https://teluguislam.net

# విద్యా శిక్షణాలు

అరబ్బులలో (పురుషుల్లోనే) చదవడం వ్రాయడం అన్న రివాజే లేదు. ఇక స్త్రీలలో ఎందుకుంటుంది? ఇస్లాం ఆవిర్భవించేనాటికి ఖురైష్ తెగ మొత్తంలో కేవలం చదవను, వ్రాయను ఎరిగినవారు పదిహేడు మంది మాత్రమే. వారిలో ఒక్కరు మాత్రమే మహిళ. ఆమె పేరు షిఫా బిన్తె అబ్దుల్లా అద్వియ. ఇస్లాం ద్వారా లభించిన ప్రాపంచిక శుభాలలో చెప్పుకోదగ్గది ఏమిటంటే, ఇస్లామీయ ప్రచారంతోపాటు విద్యార్జన అభిలాష కూడా ప్రజల్లో పెంపొందసాగింది. బదరు యుద్ధ ఖైదీలలో ఫిదియ(పరిహారం) చెల్లించలేని ఖైదీలు ఒక్కొక్కరు పదేసి మంది ముస్లిం పిల్లలకు చదవను వ్రాయను నేర్పడమే 'ఫిదియ'గా నిర్ణయించారు మహాప్రవక్త (సఅసం). సుఫ (అరుగు) వారిలో దాదాపు వందమంది సహాబా ఉన్నారు. వారికి ఇతర శిక్షణలతో పాటు చదవడం, వ్రాయడం కూడా నేర్పబడేది.

మహాప్రవక్త (సఅసం)గారి పవిత్ర సతీమణుల్లో హజ్రత్ హఫ్స మరియు హజ్రత్ ఉమ్మె సల్మా(రజి)గారలు చదవడం వ్రాయడం ఎరిగినవారే. హజ్రత్ హఫ్స (రజి) దైవప్రవక్త (సఅసం) ఆదేశంపై షిఫాబిన్తె అబ్దుల్లా అద్వియ వద్ద వ్రాత కోతలు నేర్చుకున్నారు. మరికొందరు సహాబియాత్ కూడా అక్షరాస్యులే.

దైవ ప్రవక్త (సఅసం) బహు భార్యాత్వాన్ని పాటించడం, ప్రత్యేకించి పిన్న వయస్కురాలైన హజ్రత్ ఆయిషా (రజి)ను వివాహం చేసుకోవడంలో గొప్ప మర్మ హేతువు వుంది. (కేవలం ఐహిక సుఖాల నాశించి ఆయన ఇన్ని పెళ్ళిళ్ళు చేసుకోలేదు). ఆయన (సఅసం) సహచర్య భాగ్యం లభించిన ఎందరో పురుషులు ఆధ్యాత్మికంగా కీర్తి శిఖరాలకు చేరుకున్నారు. ఆయన(సఅసం) వెదజల్లిన పరిమళాలు పంచి యిచ్చిన ప్రబోధనా కుసుమాల్ని వందలాది పురుషులు ఆస్వాదించారు. కాని స్వాభావికంగా ఈ అవకాశం సాధారణ మహిళలకు లభించేదెలా?! అందుచేత పవిత్ర సతీమణులు మాత్రం ఈ మహద్భాగ్యాన్ని పొందగలిగారు. ఈ విజ్ఞాన వీచికలు వీరి ద్వారానే అఖిల మహిళా జగత్తులో వ్యాపించడానికి అవకాశం లభించింది.

హజ్రత్ ఆయిషా (రజి) తప్ప తక్కిన సతీమణులందరూ వైధవ్యం పొందిన తరువాతనే దైవప్రవక్త (సఅసం) జీవితంలోకి అడుగు పెట్టారు. పైగా వారిలో

https://teluguislam.net

అనేకులు వయస్సు మీదపడిన వారే. వీరిలో ఒక్క హజ్రత్ ఆయిషా (రజి)లో మాత్రమే దైవదౌత్యపు పరమార్థాలను గ్రహించే శక్తి పుష్కలంగా ఉండేది. అందునా బాల్యదశ, విద్యాశిక్షణలకు అనువైన కాలం. ఈ దశ ప్రారంభమయిన వెంటనే ఈ గౌరవం ఆమెను అజ్ఞానాంధకార కుహరాల నుండి వేరు చేసి ప్రవక్త పదవీ భాగస్వామ్యంలోకి చేర్చింది. ఆమె విశిష్ట వ్యక్తిత్వం పరిపూర్ణమయి, దేదీప్యమానమై ప్రపంచంలోని అర్ధభాగం అయిన కోమలాంగులకు దారిచూపే దివ్వెగా ఆమెను తీర్చిదిద్దింది.

ఖురైష్ ప్రజలలో కెల్లా హజ్రత్ అబూబకర్(రజి) కవిత్వంలో ఉద్దండ పాండిత్యం కలవారు. వంశావళి (ROOTS)ని వర్ణించడంలో అందెవేసిన చేయి. ఖురైష్ కవుల కవితలకు జవాబుగా ఇస్లాంలో భాషావేత్తలయిన కవులు ఉత్తమ కవితల్ని వినిపించినపుడు అవి హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(రజి) చేత సంస్కరించబడకుండా, అయన సలహా పొందకుండానే వ్రాయబడ్డాయంటే తిరస్కారులు నమ్మేవారు కాదు. మరి హజ్రత్ ఆయిషా (రజి) శిక్షణ పొందింది ఆ తండ్రి ఒడిలోనే. కాబట్టి వంశావళి గురించిన జ్ఞానము, కవితాభిరుచి ఆమెకు వంశపారంపర్యంగా అబ్బిన కళే.

హజ్రత్ అబూబకర్ (రజి) తమ సంతానానికి తర్ఫీదు నివ్వడంలో చాలా స్ట్రిక్ట్‌గా ఉండేవారు. ఒకసారి తన కుమారుడు అబ్దుర్రహ్మాన్ అతిథికి భోజన ఏర్పాట్లు చేయడంలో ఆలస్యం చేసినందుకు కొట్టబోయారు. హజ్రత్ ఆయిషా (రజి) పెళ్ళి అయిన తర్వాత కూడా తన పొరపాట్లపై తండ్రికి భయపడేవారు. ఎన్నో సందర్భాలలో ఆమెను హజ్రత్ అబూబకర్(రజి) మందలించేవారు. ఒకసారి దైవప్రవక్త (సఅసం) సమక్షంలో ఇలాంటి సంఘటనే ఎదురయితే దైవప్రవక్త (సఅసం) ఆమెను కాపాడారు.

హజ్రత్ ఆయిషా (రజి) విద్యా శిక్షణల అసలు కాలం కాపురానికి వచ్చాకే అరంభమయింది. అప్పుడే ఆమె చదవడం నేర్చారు. దివ్యఖుర్ఆన్‌ను చూసి పఠించేవారు. ఆమెకు వ్రాయడం రాదని ఒక ఉల్లేఖనంలో ఉంది. హజ్రత్ ఆయిషా (రజి) కోసం ఆమె బానిస జక్వాన్ ఖుర్ఆన్ వ్రాసేవాడని హదీసుల ద్వారా తెలుస్తోంది. దీన్ని బట్టి ఆమెకు వ్రాయడం రాదు అని ఊహించవచ్చు. కాని కొన్ని ఉల్లేఖనాలలో ఆమె ఫలానా ఉత్తరానికి జవాబుగా ఇలా వ్రాశారు అని ఉంది. బహుశా ఉల్లేఖకులు అలవాటు కొద్దీ 'వ్రాయించారు' అనే బదులు 'వ్రాశారు' అన్నారేమో!

మొత్తానికి వ్రాతకోతలు అనేది మానవుడి బాహ్యపరమైన విద్య. వాస్తవమైన విద్యకు గల ప్రమాణం ఎంతో ఉన్నతమైంది. మానవత్వ పరిపూర్ణత, నైతికతా శోధన, ధార్మిక అవసరాల పట్ల అవగాహన, షరీఅత్ కోరే మౌలికాంశాల పరిజ్ఞానం,

https://teluguislam.net

దైవ వచనాల పరమార్థాన్ని ఆకళింపు చేసుకోవడం, దైవప్రవక్త ఆజ్ఞల్లోని అంతరార్థం కూడా ఉన్నత స్థాయి విద్యయే. హజ్రత్ ఆయిషా(రజి) ఇటువంటి విద్యలో ఆరితేరినవారు. ధార్మిక విద్యలతోపాటు చరిత్ర, వైద్యం మరియు సాహిత్యాలలో కూడా ఆమెకు మంచి ప్రవేశం ఉండేది.

చరిత్ర, సాహిత్యాలలో నైపుణ్యం స్వయానా తండ్రిగారి నుండే లభించింది. అప్పుడప్పుడూ ఇరుగు పొరుగు దేశాల నుండి దైవ ప్రవక్త సన్నిధికి వచ్చిపోయే అరబ్ బృందాల ద్వారా వైద్య శాస్త్ర పరిజ్ఞానం లభించింది. దైవప్రవక్త (సఅసం) కడపటి దినాలలో తరచుగా వ్యాధి గ్రస్తులయ్యేవారు. ఆ సందర్భంగా అరబ్బు వైద్యులు సూచించిన మందుల్ని హజ్రత్ ఆయిషా (రజి) బాగా గుర్తు పెట్టుకునేవారు.

ధార్మిక విద్య నేర్చుకోడానికి ప్రత్యేకించి ఒక సమయం అంటూ ఏదీ లేదు. షరీఅత్ బోధకుడే స్వయంగా ఇంట్లో ఉంటే కొదవేముంది? ఆమెకు రాత్రింబవళ్ళు ఆయన సహచర్య భాగ్యం లభించింది. ఆయన (సఅసం) శిక్షణా తరగతులు, ఉపదేశ కూటములు ప్రతిరోజూ మస్జిదె నబవీలో ఏర్పాటయ్యేవి. హజ్రత్ ఆయిషా(రజి) నివసించే గది మస్జిదె నబవీకి అనుకునే ఉండేది. అందుచేత ప్రవక్త ప్రవచనాలు పొద్దస్తమానం ఆమెకు వినబడుతుండేవి. దైవ ప్రవక్త(సఅసం) ఇంటి వెలుపల ప్రజలకు బోధించే సమయంలో కూడ ఆమె పాల్గొనేవారు. ఒకవేళ ఏ విషయమయినా అర్థం అవని సందర్భాలలో, దైవప్రవక్త(సఅసం) ఇంట ఉన్న సమయాల్లో ఆయన్ని (సఅసం) అడిగి సందేహ నివృత్తి చేసుకునేవారు. ఒక్కోసారి లేచి మస్జిద్ దగ్గరకు వెళ్ళేవారు. అంతేకాక వారంలో ఒకరోజు మహిళల ప్రత్యేక సమావేశం జరిపి హితబోధ చేయాలని మహిళలు అభ్యర్థిస్తే ఆయన(సఅసం) ఆ రోజున స్త్రీలకు ఉపదేశం చేసేవారు.

దైనందిన జీవితంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలు, మీమాంసలు ఆవిడ చెవుల్లో పడుతుండేవి. దాంతోపాటు ప్రతి సమస్యనూ జాప్యం చేయకుండా దైవప్రవక్త (సఅసం)కు వినిపించడం హజ్రత్ ఆయిషా(రజి.)కు అలవాటు, ఎప్పటికప్పుడు సందేహ నివృత్తి అవకపోతే ఆమెకు ఊరట కలగదు. ఒకసారి ఆయన (సఅసం): ''తుది దినాన ఎవరి లెఖ్ఖ అయితే తీసుకోబడుతుందో అతడికి మూడుతుంది'' అని పలికారు. తక్షణం హజ్రత్ ఆయిషా(రజి) ''దైవ ప్రవక్తా ! మరి అతని నుంచి తేలికపాటి లెఖ్ఖ తీసుకోబడుతుందని (ఇన్షిఖాఖ్‌సూరాలో) అల్లాహ్ సెలవిచ్చాడు గదా'' అని ప్రశ్నించారు. ''ఇది కర్మలు దైవ సమక్షంలో సమర్పించబడే విషయం. కాని ఎవరి కర్మలలో అవకతవకలు అభ్యంతరాలు ఉంటాయో అతడికి మూడుతుంది'' అని దైవ ప్రవక్త(స) విప్పి చెప్పారు.

https://teluguislam.net

ఒకసారి ఆమె అడిగారు, ''దైవ ప్రవక్తా! నాకు అర్థం గాక అడుగుతున్నాను - ఖుర్‌ఆన్‌లో రెండు వాక్యాలలో వేర్వేరు విధంగా అల్లాహ్ సెలవిచ్చాడు. ఒక చోట ఇలా ఉంది:

يَوْمَ تُبَدَّلُ الْاَرْضُ غَيْرَ الْاَرْضِ وَالسَّمٰوٰتُ وَبَرَزُوْا
لِلّٰهِ الْوَاحِدِ الْقَهَّارِ○

''భూమిని ఆకాశాన్ని పూర్తిగా వేరొక రూపంలో మార్చడం జరిగినప్పుడు, అద్వితీయుడు అత్యంత ప్రాబల్యం కలవాడు అయిన అల్లాహ్ ముందు అందరూ ప్రత్యక్షమవుతారు'' (ఇబ్రాహీం : 48)

మరో ఉల్లేఖనంలో ఈ వాక్యం పఠించారని ఉంది:

''భూమి అంతా అతని గుప్పెట్లో ఉంటుంది, ఆకాశాలు అతని చేతిలో చుట్టబడి వుంటాయి'' (జుమర్)

''మరి భూమి, ఆకాశాలూ ఏమీ ఉండనప్పుడు ప్రజలు ఎక్కడ వుంటారు?''

ఈ ప్రశ్నకు ఆయన (సఅసం) ''మార్గంపై వుంటారు'' అని జవాబిచ్చారు.

ఒకసారి ఉపన్యాసమిస్తూ ఆయన (సఅసం) ''ప్రళయ దినాన ప్రజలు దిగంబరులయి ఉంటారు'' అని ప్రవచించారు.

''ఓ దైవప్రవక్తా! పురుషులూ, స్త్రీలూ ఆ స్థితిలో ఒకే చోట గుమిగూడినపుడు ఒకరి నొకరు చూసుకోరా!?'' అని హజ్రత్ ఆయిషా సందేహ పడగా ''ఆయిషా! ఆ సమయం అత్యంత సంక్లిష్టమైనది. (అంటే ఎవరూ ఎవరినీ పట్టించుకోని స్థితిలో ఉంటారు) అని ప్రవక్త బదులిచ్చారు.

ఒకసారి ఆమె ''దైవ ప్రవక్తా! తుది దినాన కనీసం ఒకరి నొకరు జ్ఞాపకం అయినా చేసుకుంటారా?'' అని అడిగితే ''మూడు సందర్భాలలో ఎవ్వరూ ఎవరినీ గుర్తు చేయరు. **ఒకటి** : కర్మలు తూయబడే వేళ, **రెండు** : కర్మల పత్రాలు పంచబడుతున్నప్పుడు, **మూడు** : తాను మూడురకాల మనుషుల కోసం నియమింపబడ్డానని నరకం గర్జిస్తున్నప్పుడు'' అని మానవ మహోపకారి విశదీకరించారు.

ఒకరోజు ఆమె ''సత్య తిరస్కారులు, బహు దైవారాధకులు సత్కార్మలేవయినా చేస్తే అందుకు వారికి పుణ్యం లభిస్తుందా? లేదా?'' అని అడిగారు.

https://teluguislam.net

''మక్కాలో అబ్దుల్లాబిన్ జిద్ ఆన్ అనే పుణ్యాత్ముడు, దయార్ద్ర హృదయుడు అయిన బహు దైవారాధకుడు ఉండేవాడు. ఇస్లాంకు పూర్వం ఖురైషులలో ఉన్న ప్రతీకార వాంఛను, రక్తపిపాసను నిర్మూలించేందుకు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. అందులో దైవ ప్రవక్త (సఅసం) కూడా పాల్గొన్నారు. అందుకే హజ్రత్ ఆయిషా(రజి)కు సందేహం వచ్చింది. ''దైవప్రవక్తా! అబ్దుల్లా బిన్‌జిద్‌ఆన్ అజ్ఞానంలో ఉన్నప్పటికీ ప్రజల పట్ల దయతో వ్యవహరించేవాడు, పేదలకు తిండి పెట్టేవాడు. అతడి ఈ సత్ప్రవర్తన అతనికేమయినా లాభం చేకూరుస్తుందా? అని అడగనే అడిగారు. ''లేదు ఆయిషా! అతడు 'దేవా! తుది దినాన నా తప్పుల్ని క్షమించమని' ఏనాడూ ప్రార్థించలేదు'' అని మహాప్రవక్త (సఅసం) బదులిచ్చారు.

ఇస్లాం యొక్క విధుల్లో జిహాద్ ఒకటి. హజ్రత్ ఆయిషా(రజి) ఉద్దేశ్యంలో మిగతా విధులలో స్త్రీ, పురుషభేదం లేనట్లే ఈ విధి(జిహాద్) కూడా స్త్రీలపై తప్పనిసరి కావచ్చునని ఆమె తలపోసేవారు. ఒకరోజు దైవ ప్రవక్త (సఅసం)ను ఆ విషయమే ప్రశ్నించగా ''స్త్రీలు హజ్ చేయడమే జిహాద్ వంటిది'' అని ఆయన స్పష్టం చేశారు.

నికాహ్ (వివాహం)లో అంగీకారం అనేది ఒక షరతు. కాని కన్నె పిల్లలయిన పెళ్ళికూతుళ్ళు తమ నోటితో అంగీకారం వెల్లడించడానికి సిగ్గుపడతారు. అందుచేత ఆమె ''దైవ ప్రవక్తా(సఅసం)! నికాహ్ సందర్భంగా స్త్రీ అనుమతి తీసుకోవాలా?'' అని దర్యాప్తు చేశారు, ''అవును'' అని బదులిచ్చారు దైవ ప్రవక్త (సఅసం). ''సిగ్గుతో ఆమె మౌనం దాలుస్తుంది కదా!'' అని మళ్ళీ అడిగారు ఆయిషా(రజి). ''ఆమె మౌనమే అంగీకారానికి ఆనవాలు'' అన్నారు కారుణ్యమూర్తి (సఅసం).

ఇస్లాంలో పొరుగు వారి హక్కులు నెరవేర్చటం చాలా ముఖ్యం. ఆ హక్కుల్ని నెరవేర్చే అవకాశం ఎక్కువగా స్త్రీలకే లభిస్తుంది. అయితే పొరుగువారిలో ఎవరికి ప్రాధాన్యత నివ్వాలి అన్న మీమాంస ఎదురవుతుంది. ఈ ప్రశ్ననే దైవ ప్రవక్త (సఅసం)కు విన్నవించారు హజ్రత్ ఆయిషా(రజి). ''ఎవరి గుమ్మం మీ యింటికి అత్యంత సమీపంగా ఉంటుందో వారికి'' (ముస్నద్ అహ్మద్) అని బదులు లభించింది.

ఒకసారి హజ్రత్ ఆయిషా(రజి)కు పాలు త్రాపించిన స్త్రీ యొక్క మరిది (అంటే వరసకు హజ్రత్ ఆయిషా(రజి) కు బాబాయి అన్నమాట) ఆమెను చూసిపోదామని వచ్చాడు. కాని ఆమెగారు అతని ఎదుట రావడానికి నిరాకరించారు. తాను పాలు త్రాగింది ఒక స్త్రీ దగ్గర అనీ, ఆమె మరిదితో తనకేం పని అన్నది ఆమె అభిమతం. అంతలో దైవప్రవక్త (సఅసం) వచ్చి ''ఆయన మీ బాబాయి. ఆయన్ని లోపలికి పిలువు'' అని అన్నారు. పవిత్ర ఖుర్ఆన్‌లోని ఒక వాక్యంలో

https://teluguislam.net

సెలవీయబడింది. ''ఇంకా వారు దైవమార్గంలో చేయవలసిన దానధర్మాలు చేస్తారు. అయినా తాము తమ ప్రభువు వద్దకు మరలిపోవలసి ఉందన్న భావంతో వారి మనస్సులు కంపిస్తుంటాయి''. (మోమినూన్ :61)

ఒక వ్యక్తి దొంగ, దుర్మార్గుడు, త్రాగుబోతు, అయినా కూడ దైవానికి భయపడతాడు: అటువంటి వ్యక్తిని ఉద్దేశించి ఈ మాటలు అనబడుతున్నాయా అన్న సందేహం హ(జత్ ఆయిషాకు కలిగింది. ''లేదు, ఆయిషా లేదు. నమాజీ లయినవారు, ఉపవాసవ్రతం పాటించేవారు, ఇంకా దైవానికి భయపడే వారిని ఉద్దేశ్యించి ఇలా వర్ణించబడింది'' అని దైవ ప్రవక్త (సఅసం) సెలవిచ్చారు.

ఒకసారి దైవప్రవక్త (సఅసం) ''ఎవరైతే దైవాన్ని కలుసుకోవడానికి ఇష్టపడతారో దైవం కూడా అతన్ని కలుసుకోవడానికి ఇష్టపడతాడు. ఇంకా ఎవరైతే దైవాన్ని కలుసుకోవడాన్ని ఇష్టపడడో అటువంటి వాడ్ని కలుసుకోవడానికి దేవుడు కూడా ఇష్టపడడు'' అని ప్రబోధించారు. ''దైవప్రవక్తా! మరి మనలో ఎవ్వరూ మరణానికి ఇష్టపడము కదా!'' అని ఆమె అడిగారు.

''దాని అర్థం అదికాదు. అసలు విషయమేమంటే, దైవ కారుణ్యం, దైవ ప్రసన్నత మరియు స్వర్గం గురించి విన్నప్పుడు విశ్వాసి హృదయంలో దైవాన్ని కలుసుకోవాలన్న అభిలాష జనిస్తుంది. దైవం కూడా అతడి రాకపట్ల ఆసక్తి కలిగి వుంటాడు. కాగా; అవిశ్వాసి పరిస్థితి తద్భిన్నంగా ఉంటుంది. దైవం యొక్క శిక్ష గురించి, దేవుని అప్రసన్నత గురించి విన్నప్పుడు అతడి మనసు దైవం ఎదుట పోవడానికి ఇష్టపడదు. దైవం కూడా అతని పట్ల అయిష్టత కలిగి వుంటాడు'' అని ఆయన విప్పి చెప్పారు.

హదీసులలో ప్రస్తుతించబడిన ఇలాంటి ఎన్నో ప్రశ్నలు, తర్జన భర్జనలే వాస్తవానికి ఆమె దైనందిన శిక్షణలోని వివిధ పాఠాలు.

దైవప్రవక్త (సఅసం) కోపంగా వుండి మండిపడతారేమో నన్న అనుమానం ఉన్నప్పటికీ ఆమె ప్రశ్నించడానికి, వాదించడానికి వెనుకాడేవారు కారు. వాస్తవానికి అలాంటి వాదోపవాదాలను దైవప్రవక్త (సఅసం) కూడా ఏవగించుకునేవారు కారు. ఒకసారి ఆయన(సఅసం) ఒకానొక విషయంపై అలిగి ఒక నెల రోజుల వరకు ఏ భార్య వద్దకూ వెళ్ళనని శపథం చేసుకున్నారు. అందుచేత 29 రోజుల వరకూ ఆయన (సఅసం) ఇంటి పైభాగంలోనే గడిపారు. సతీమణు లందరూ కళవళపడి పోయారు. కాకతాళీయంగా ఆ నెలలో చాంద్రమానం ప్రకారం 29 రోజులే. ముప్పయవరోజు- అంటే మరుసటి నెల మొదటి రోజున ఆయన (సఅసం) దిగి హ(జత్ ఆయిషా(రజి) గదిలోకి వచ్చారు. ఆ సందర్భంలో హ(జత్ ఆయిషా(రజి) జరిగిందంతా మర్చిపోయి సంతోషంతో పొంగిపోయి వుండాల్సింది. కాని ఆ

https://teluguislam.net

సంఘటనను తిరగదోడి, దైవప్రవక్త (సఅసం) మనస్సును మరోసారి నొప్పించడమూ భావ్యం కాదు. కాని దైవ ప్రవక్త స్వభావాన్ని క్షుణ్ణంగా ఎరిగిన ఆమె స్వయంగా షరీయత్ మర్మాన్ని వెలికి తీసుకురావడానికే ప్రాధాన్యత నిచ్చారు. ''మీరు నెలరోజుల వరకూ మా గదులకు రానని పట్టుబట్టారుగా, మరి ఒకరోజు ముందుగానే వచ్చేశారే?!'' అని మొహం మీదే అడిగేశారు. దానికి మహాప్రవక్త రెచ్చిపోలేదు, బాధ పడలేదు. పైగా ఆయన (స) ఇలా అన్నారు. ''ఆయిషా! 29 రోజుల నెల కూడా వుంటుంది'' (సహీహ్ బుఖారీ).

ఒకసారి ఒక వ్యక్తి దైవ ప్రవక్త (సఅసం) సమక్షంలో హాజరు కాగోరి కబురంపించాడు. ఆయన (సఅసం) అన్నారు: ''రానీయండి''. అతను తన కుటుంబం అంతటిలోకి చెడ్డవాడు. కాని ఆ మనిషి వచ్చి కూర్చున్నాక అతడితో ఎంతో శ్రద్ధగా, మరెంతో మర్యాదగా మాట్లాడారు. ఈ వైనం హజ్రత్ ఆయిషా(రజి)కి ఎంతో ఆశ్చర్యం కలిగించింది. ఆ వ్యక్తి లేచి వెళ్ళిపోయాక ''దైవప్రవక్తా! అతడు మంచివాడు కాదని మీరే అన్నారాయె. మరి అతనితో అంత ప్రేమగా మాట్లాడారే అని దైవప్రవక్త (సఅసం)ను అడిగారు. ''ఆయిషా! ఒకరి దుష్ప్రవర్తనకు భయపడి జనం అతడ్ని కలుసుకోవడమే మానేస్తే అది మరీ దుర్వర్తన అవుతుంది.'' (సహీహ్ బుఖారీ)

అరేబియాలో అనాగరిక మోటు మనుషులు, పల్లెటూరి బైతుల జీవిత విధానం కడు విచిత్రంగా ఉండేది. అన్నపానీయాల విషయంలో ఏమాత్రం జాగ్రత్త వహించేవారు కారు. షరీఅత్ గురించి వారికి తెలియదు. అందుచేత దైవప్రవక్త (సఅసం) అటువంటివారు తెచ్చిన ఆహార పదార్థాలను తినే విషయంలో జాగ్రత్త పాటించేవారు. ఒకసారి ఉమ్మె నబీల అనే గ్రామీణ మహిళ దైవప్రవక్త (సఅసం)కు కానుకగా కాసిని పాలు తెచ్చింది. ఆయన (సఅసం) త్రాగివేశారు. హజ్రత్ అబూబకర్ (రజి) కూడ అక్కడే ఉన్నారు. ఆయన కూడ కొన్ని పాలు త్రాగారు. ''దైవప్రవక్తా! తమరు వారి వస్తువులను తినడానికి ఇష్టపడరు కదా!?'' అని హజ్రత్ ఆయిషా(రజి) అడిగారు. ''ఆయిషా! వీళ్ళు ఆ మనుషులు కారు. వీళ్ళను పిలిచినప్పుడల్లా వస్తుంటారు. అంటే ఈ కారణంచేత వీరికి షరీఅత్ పరిజ్ఞానం ఉంది. (ధర్మమేదో, అధర్మమేదో వీరికి తెలుసు)'' అని ఆయన(స) వివరించారు.

ఒకసారి దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చారు, ''సమతూకంతో పని చేయండి. ప్రజల్ని చేరదీయండి. ప్రజలు కేవలం తమ ఆచరణ ఆధారంగా స్వర్గానికి చేరలేరనీ దైవ కారుణ్యము తోడ్పడితేనే స్వర్గానికి చేరుకోగలరని వారికి శుభవార్త వినిపించండి.''

హజ్రత్ ఆయిషాకు ఈ చివరి పదాలు వింతగా తోచాయి. నిర్దోషులైన వారు ఈ నిబంధనకు అతీతులని ఆమె భావించారు. ''మీ సంగతీ అంతేనా?'' అని

https://teluguislam.net

అడిగారు. ''అంతే. కాని దైవం తన కారుణ్య ఛాయలో, మన్నింపుల నీడలో ఆశ్రయమిస్తే అది వేరే విషయం'' అని ఆయన (స) బదులిచ్చారు.

ఈ ప్రశ్నోత్తరాలు, వాదోపవాదాలేకాక దైవ ప్రవక్త (సఅసం) హ|జత్ ఆయిషా(రజి) గారి ఒక్కొక్క ఆచరణను, ఒక్కొక్క కదలికను గమనిస్తూ ఎక్కడైనా ఏదైనా లోటు కనిపిస్తే సరిదిద్దేవారు. తగు సూచనలిస్తుండేవారు. ఒకసారి ఆయన (సఅసం) సమక్షంలో కొందరు యూదులు వచ్చారు. వాళ్ళు 'అస్సలాము అలైకుం' (నీపై శాంతి కలుగుగాక!) అనే బదులు గొంతు బిగబట్టి 'అస్సాము అలైక్' (నీకు చావు మూడుగాక!) అన్నారు. హ|జత్ ఆయిషా ఇది వింటూనే ఉన్నారు. ఆమె ఉగ్రురాలయి ''చావు మీకే మూడ! శాపం మీపైనే పడుగాక!'' అన్నారు. ''ఆయిషా! మృదువుగా వ్యవహరించు. ఘనత కల ప్రభువు ప్రతి విషయంలోనూ మృదుత్వాన్నే ఇష్టపడతాడు'' అని ఉపదేశించారు కారుణ్యమూర్తి(సఅసం). (సహీహ్ బుఖారీ)

ఒకసారి హ|జత్ ఆయిషా(రజి)గారి వస్తువును ఎవరో దొంగిలించారు. ఆడవారి అలవాటు కొద్దీ ఆమె దొంగిలించిన వారికి శాపనార్థాలు పెట్టారు. వెంటనే ఆయన (సఅసం) వారించారు. ''శాపనార్థాలు పెట్టి నీ పుణ్యాన్ని, వాళ్ళ పాపాన్ని తగ్గించకు'' అని ఉపదేశించారు.

ఒకసారి ప్రయాణంలో ఆమె(రజి) దైవప్రవక్త (సఅసం)తో ఒంటెపై ప్రయాణిస్తున్నారు. ఒంటె కాస్త వేగంగా పోసాగింది. సాధారణ స్త్రీలకు మల్లే ఆమె నోటి నుండి శాపనార్థాలు వెలువడ్డాయి. తక్షణం ఆయన (సఅసం) కల్పించుకొని ''ఒంటెను త్రిప్పి పంపేయి. శాపగ్రస్తమైనదేదీ మన వెంట ఉండకూడదు'' అని కఠినంగా ఆదేశించారు. పశువుని కూడా తిట్టకూడదు అని బోధించటం దీని ముఖ్యోద్దేశం.

సర్వసాధారణంగా జనులు, ముఖ్యంగా ఆడవారు చిన్న చిన్న పాపాల్ని లెఖ్ఖ చేయరు. దైవప్రవక్త (సఅసం) హ|జత్ ఆయిషా(రజి)ను సంబోధించి, ''ఆయిషా! చిన్న చిన్న పాపాల నుండి కూడ దూరంగా ఉండు. దైవ సమక్షంలో వాటి లెఖ్ఖ కూడ తీసుకోబడుతుంది'' అని ఉపదేశించారు. ఒకసారి హ|జత్ ఆయిషా (రజి) మాటల సందర్భంగా మరొక స్త్రీని గురించి చెపుతూ 'ఆమె పొట్టిగా ఉంటుంది' అన్నారు. దైవ ప్రవక్త (సఅసం) వెంటనే ''ఆయిషా! ఇది కూడ గీబత్ (పరోక్షనింద)యే'' అని హెచ్చరించారు.

హ|జత్ సఫియ (రజి) కాస్త పొట్టిగా ఉంటారు. ఒకరోజు ఆమె గురించి అభిప్రాయం తెలుపుతూ హ|జత్ ఆయిషా(రజి) ''చాల్లెద్దురూ, సఫియ 'ఇంతే' ఉంటుంది'' అన్నారు. దీనికి దైవప్రవక్త (సఅసం) తీవ్రంగా స్పందించారు.

https://teluguislam.net

''నువ్వన్న మాట ఎంతటి (కాలుష్యంతో కూడుకున్నది) దంటే దాన్ని సముద్రంలో కలిపినా కలిసి(కలుషితం అయి)పోతుంది.'' ''దైవ ప్రవక్తా! నేను ఒక మనిషిని గురించి ఉన్నదాన్ని చెప్పాను, అంతేకదా!'' అని హజ్రత్ ఆయిషా(రజి) అంటే, ''నాకు ఎన్ని ఆశలు చూపినా ఇటువంటి మాటలు ఎవరి గురించీ పలకను'' అని ఆయన (సఅసం) సెలవిచ్చారు.

ఒకసారి హజ్రత్ ఆయిషా(రజి)ను ఎవరో ధర్మం అడిగారు. ఆయిషా(రజి) సైగ చేయగా ఆమె బానిసరాలు కొద్ది పరిమాణంలో బిచ్చం వెయ్యబోయింది. అది చూసి ''ఆయిషా! కొసరి కొసరి ఇవ్వకు. దైవం కూడా నీకు కొసరి కొసరి మరీ ఇస్తాడు'' అని దైవప్రవక్త (సఅసం) తాకీదు చేశారు. (అబూదావూద్)

మరో సందర్భంలో ఇలా సెలవిచ్చారు. ''ఆయిషా! ఖర్జూరపు ముక్క అయినా సరే అడిగిన వానికి ఇచ్చి నరకాగ్ని నుండి కాపాడుకో. దాన్ని ఆ క్షుద్బాధా పీడితుడు తింటే అది మేలే. ఒకవేళ దాంతోనే అతడి కడుపు నిండితే అంతకన్నా ఏం కావాలి?''

ఒకానొక సందర్భంలో ఆయన (సఅసం) ఇలా ప్రార్థించారు; ''దేవా! నన్ను రిక్తుడిగానే బ్రతుకనియ్యి, రిక్తస్థితిలోనే నాకు చావు ప్రసాదించు. తుది దినాన రిక్తుల వెంటే తిరిగి లేపు'' ''దైవ ప్రవక్తా! ఎందుకలా కోరుకుంటారు?'' అని హజ్రత్ ఆయిషా(రజి) ప్రశ్నించగా, దైవప్రవక్త(స) ఈ విధంగా జవాబిచ్చారు, ''రిక్తుడు ధనికుడి కంటే నలభయి ఏళ్ళు ముందుగా స్వర్గంలో ప్రవేశిస్తాడు. ఆయిషా! నిరాధారుడు (రిక్తుడు) ఎవరొచ్చినా వొట్టి చేతులతో పంపకు. ఖర్జూరపు తునక అయినా సరే ఇచ్చి పంపు. అటువంటి వారిని ఆదరించు, వారికి నీ వద్ద కాస్త చోటు చూపించు.''

(తిర్మిజీ)

https://teluguislam.net

# కుటుంబ వ్యవహారాలు

హజ్రత్ ఆయిషా కాపురానికి వచ్చిన ఇల్లు ఎత్తయిన, శోభాయమానమైన భవంతి కాదు. బనీ నజ్జార్ వారి పేటలో మస్జిదె నబవీ చుట్టుతా చిన్న చిన్న కుటీరాలు చాలా ఉన్నాయి. వాటిలోని ఒక కుటీరమే హజ్రత్ ఆయిషా (రజి) నివాస గృహం. ఈ గది 'మస్జిదె నబవీ'కి తూర్పువైపున ఉండేది. కాని దాని గుమ్మాలలో ఒకటి మస్జిద్ పడమటి దిక్కుకు అభిముఖంగా ఉండేది. అంటే మస్జిదె నబవీ ఆ గదికి ముంగిలి అన్నట్లుగా ఉండేది. దైవప్రవక్త (సఅసం) ఆ ద్వారం నుండే మస్జిదె నబవీలో ప్రవేశించేవారు. మస్జిద్‌లో 'ఏతెకాఫ్' పాటించేటప్పుడు తలను హజ్రత్ ఆయిషా (రజి) గదిలోకి వంచితే ఆవిడగారు ప్రవక్తకు తల దువ్వేవారు. మస్జిద్‌లో కూర్చొని ఉండి ఏదైనా వస్తువు కావాలంటే చేయి గదిలోకి చాపి అడిగేవారు (బుఖారీ). గది ఆరేడు గజాల కంటే పొడవేమీ కాదు. మట్టితో కట్టబడిన గోడలు. ఖర్జూరపు ఆకులు, రెమ్మలతో పై కప్పు నిర్మించబడింది. వాటిమీద వర్షం నుండి రక్షణగా కంబళి వేయబడింది. మనిషి చేయి పైకి ఎత్తితే అందే పైకప్పు. ఒంటి రెక్క తలుపుకి గొళ్ళెం ఉండేది. కాని ఆ తలుపు జీవితాంతం తెరువబడే ఉంది. గుమ్మానికి తెరగా ఒక కంబళి వేయబడి ఉండేది. ఆ ఇంటిలో ఒక మంచం, ఒక చాప, ఒక ప్రక్క, ఒక దిండు. ఆ దిండులో పొట్టు నింపబడి ఉండేది. పిండి, ఖర్జూరం పెట్టుకునేందుకు రెండు కుండలు, నీళ్ళకోసం ఒక పాత్ర, నీళ్ళు త్రాగేందుకు ఒక కప్పు. ఇంతకంటే మరే సామాను లేదు. ఆ శూన్యహస్త ప్రభాకరునికి తేజోమయ రూపమైతే ఉందిగాని రాత్రిళ్ళు దీపం వెలిగించుకునే స్తోమత అయినా లేకుండా పోయింది (సహీహ్ బుఖారీ). నలభయ్యేసి రాత్రులు గడిచిపోయేవి కాని ఇంట్లో దీపం వెలిగేది కాదు.

ఆ ఇంట్లో ఉండేది ఇద్దరే. ముహమ్మద్ (సఅసం) మరియు హజ్రత్ ఆయిషా (రజి) మాత్రమే. కొన్నాళ్ళకు బరీరా అనే బానిసరాలు కూడా వచ్చి చేరింది. హజ్రత్ ఆయిషా (రజి) మరియు హజ్రత్ సౌద (రజి) ఇద్దరే భార్యలున్నంత కాలం దైవప్రవక్త (సఅసం) రోజు విడిచి రోజు హజ్రత్ ఆయిషా (రజి) కుటీరంలో రాత్రిళ్ళు గడిపేవారు. ఆ తర్వాత మరికొందరు సతీమణులు కూడా ప్రవక్తగారి దాంపత్యంలోకి వచ్చారు. హజ్రత్ సౌద (రజి) వృద్ధాప్యం కారణంగా తన 'వంతు'ను హజ్రత్ ఆయిషా (రజి)కు 'త్యాగం' చేశారు. ఈ ప్రకారం ఆయన (సఅసం) ప్రతి 9 రోజులలో రెండు రోజులు హజ్రత్ ఆయిషా (రజి) యింట గడిపేవారు.

https://teluguislam.net

ఇంటి వ్యవహారాల నిర్వహణకు పెద్దగా ఏర్పాట్లు, పర్యవేక్షణ చేయవలసిన అవసరం ఉండేదికాదు. అన్నం వండవలసిన అవసరం బహుకొద్దిసార్లే కలిగేది. హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలియజేస్తున్నారు: ''ప్రవక్త కుటుంబీకులు మూడురోజులు వరుసగా కడుపునిండా తిన్న సందర్భం ఒక్కటి కూడా లేదు (సహీహ్ బుఖారీ). నెలరోజులపాటు పొయ్యిలో నిప్పు ముట్టించబడలేదు. ఖర్జూరపు పండ్లు నీళ్ళతో గడిపేవారు''. ఖైబర్ విజయానంతరం దైవప్రవక్త (సఅసం) తన సతీమణులకు సాలుసరి ఖర్చుల నిమిత్తం పెన్షన్‌ను నిర్ణయించారు. కాని త్యాగం, దాతృత్వ గుణాలవల్ల ఆ భృతి సంవత్సరానికి సరిపోయేది కాదు.

సహచరులు (రజి) ప్రేమతో కానుకలు పంపుతూ ఉండేవారు. ముఖ్యంగా దైవ ప్రవక్త (సఅసం) హజ్రత్ ఆయిషా (రజి) ఇంట్లో బసచేసే రోజు వీరు తప్పనిసరిగా ఏవో కానుకలు పంపేవారు. ఆయన (సఅసం) తరచు బయట నుండి రాగానే, ''ఆయిషా! తినడానికేమయినా ఉందా?'' అని అడగటం, ''ఏమీ లేదు దైవప్రవక్తా!'' అని హజ్రత్ ఆయిషా (రజి) జవాబివ్వటం మామూలే. అలాంటి సందర్భాల్లో ఇంటిల్లిపాదీ ఉపవాసమే. ఎప్పుడయినా అన్సారులు పాలు పంపేవారు. ఈ కుటుంబం ఆ పాలతో సరిపెట్టుకునేది.

ఇంతటి బుద్ధీ జ్ఞానాలు దేవుని వరంగా లభించినప్పటికీ చిన్నతనపు అశ్రద్ధకు, మతి మరుపులకు ఆమె అతీతురాలు కాదు. ఇంట్లో పిండి కలిపి వుంచి మర్చిపోయి ఆదమరచి నిద్రపోయేవారు. మేక వచ్చి ఆ పిండిని కాస్తా తిని వేసేది. ఒకరోజు ఏం జరిగిందంటే ఆమె స్వయంగా పిండి విసిరి ముద్దలు చేసి వుంచారు. దైవప్రవక్త (సఅసం) రాకకై ఎదురు చూడసాగారు రాత్రివేళ. ఆయన (సఅసం) వచ్చి నమాజ్‌లో లీనమయ్యారు. ఈవిడగారి కళ్ళు మూతలుపడ్డాయి. పొరుగువారి మేక ఒకటి వచ్చి మొత్తం స్వాహా చేసింది. మిగతా భార్యామణులతో పోలిస్తే ఈవిడగారి వంట అంత బ్రహ్మాండంగా ఏమీ వుండదు (అబూదావూద్).

దైవప్రవక్త (సఅసం) గారి వ్యక్తిగత వ్యవహారాలను హజ్రత్ బిలాల్ (రజి) చూసుకొనేవారు. ఆయనే సంవత్సరానికి సరిపడా ఆహార సామగ్రి పంచేవారు. అవసరం అయినపుడు బయటినుండి అప్పుగా తెచ్చేవారు (అబూదావూద్). దైవప్రవక్త (స) దైవ సన్నిధికి చేరుకునే నాటికి అరబ్బు దేశం యావత్తూ ఇస్లాం పాదాక్రాంతమయ్యింది. అన్ని రాష్ట్రాలనుండీ బైతుల్ మాల్ (కోశాగారం)కు సంచుల కొద్దీ ఖజానా తరలివచ్చేది. అయినా దైవప్రవక్త (సఅసం) పరమపదించిన నాడు హజ్రత్ ఆయిషా (రజి) ఇంట్లో ఒకరోజుకు సరిపడా ఆహార సామగ్రి కూడా లేకపోయింది (తిర్మిజీ).

https://teluguislam.net

హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) ఖలీఫాగా ఉన్నకాలంలో ఖైబర్ పంట నుండి నిర్ణీత ఆహార సామగ్రి సక్రమంగా లభించసాగింది. హజ్రత్ ఉమర్ (రజి) తన హయాంలో అందరికీ పింఛను నిర్ణయించారు. మిగతా భార్యామణులకు పదివేల దిర్హములు ఏటా లభించేవి. కాని హజ్రత్ ఆయిషా (రజి)కు పన్నెండు వేల దిర్హములు దక్కేవి. హజ్రత్ ఉమర్ (రజి) తన పరిపాలనా కాలంలో పంటను గానీ, భూమినిగానీ ఏది కావాలంటే అది తీసుకునే అవకాశం కల్పించారని ఒక ఉల్లేఖనంలో వుంది (బుఖారీ). కాని ఈ మొత్తంలో అధికభాగం నిరాధారులు, పేదలకే వెళ్ళిపోయేది. హజ్రత్ ఉస్మాన్ (రజి), హజ్రత్ అలీ (రజి) మరియు అమీర్ ముఆవియా (రజి) గార్ల హయాంలో కూడా దాదాపు ఇదే పద్ధతి. హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి), అమీర్ ముఆవియా (రజి) తర్వాత హిజాజ్‌కు ఖలీఫా అయ్యారు. ఆయన హజ్రత్ ఆయిషా (రజి) అక్క కొడుకు. ఆయన పిన్నిగారి ఖర్చుల బాధ్యత వహించారు. కాని విచిత్రం విశేషం ఏమిటంటే బైతుల్‌మాల్ నుండి పింఛన్ వచ్చిన రోజునే సాయంత్రం ఆమె ఇంట్లో వస్తువులు గడిచేవి.

(సహీహ్ బుఖారీ)

❋ ❋ ❋

https://teluguislam.net

# దాంపత్య వ్యవస్థ

స్త్రీని ప్రాచ్యులూ ఎగతాళి చేశారు, అప్రాచ్యులూ (పాశ్చాత్యులు) ఎగతాళి చేశారు. కాకపోతే ఎగతాళి చేయడంలో వారు అవలంబించిన ధోరణులు విభిన్నం అంతే. తూర్పు దేశాల వారు స్త్రీ పొందును పురుషుడి శీలానికి మచ్చగాను, మోక్షసాధనకు అవరోధంగాను చిత్రించారు. వీళ్ల దృష్టిలో ఆమె కేవలం భోగవిలాసాలకు ఆటవస్తువు, పురుషుల మనస్సులు రంజింపచేయటానికి వాడబడే సాధనం, ఆమె సన్యాసాశ్రమాలలోని ఇరుకు గదులను మరింత చీకటి మయం చేసివేసే పీడాకారం.

ఇక ప్రేమోపాసకులయిన పాశ్చాత్యులయితే ఆమెను దేవతగానో, దైవ సమానురాలుగానో భావిస్తారు. వాళ్ళే మంటారో తెలుసా! ''ఆమె ఇష్టమే దేవుని ఇష్టం''. పాశ్చాత్యుల దృష్టిలో స్త్రీకి ఉన్నత స్థానం కల్పించిన మతమే సముచితమైన మతం. అంటే ఒక మతం యొక్క సమంజసత్వం, సమగ్రతా అనేది ఆ మతం స్త్రీకి ఇచ్చే గౌరవంపై ఆధారపడి ఉందన్నమాట.

కాగా; ఇస్లాం చూపే రుజుమార్గం ఈ రెండు రకాల అతివాదాల నడుమ నుండి ఉద్భవిస్తుంది. ఇస్లాం దృష్టిలో స్త్రీ దైవమూ కాదు, జీవన మార్గంలో కంటకమూ కాదు. ఈ ఆకర్షణా పూరిత ప్రపంచంలో పురుషుడికి నెమ్మదిని, ప్రశాంతతను చేకూర్చేది స్త్రీయేనని ఇస్లాం స్త్రీని కొనియాడింది:

> ''మీరు వారి వద్ద సౌఖ్యం పొందేటందుకు మీనుండే మీ జతలను మీ కొరకు పుట్టించాడు. మరి ఆయనే మీ జంట మధ్య ప్రేమానురాగాలను సృజించాడు. అతడి శక్తి సూచనలలో ఇది ఒకటి'' (సూరయే రూమ్: 21)

అయితే ఇస్లాంలో స్త్రీ స్థానం ఏమిటి? ఆమెకున్న హక్కులేవి? అన్నది ఇక్కడ చర్చనీయాంశం కాదు. మహాప్రవక్త (సఅసం) మరియు హజ్రత్ ఆయిషా (రజి) గార్ల (వ్యక్తిగత జీవితంలో) దాంపత్య సంబంధాల సరళి ఏ విధంగా ఉండేదో వివరించటమే ఇక్కడ ప్రధానాంశం.

దైవప్రవక్త (సఅసం) ఏమని సెలవిచ్చారో చూడండి:

https://teluguislam.net

''మీ భార్యయెడల మంచివాడే మీలో అందరి కన్నా మంచివాడు.
నేను నా భార్యల యెడల మీ అందరికన్నా మంచివాణ్ణి''.
(సహీహ్ బుఖారీ)

హ॥జత్ ఆయిషా (రజి)గారి తొమ్మిదేళ్ళ దాంపత్య జీవితమే దీనికి సజీవ సాక్ష్యం. ఈ దీర్ఘకాలంలో 'ఈలా సంఘటన' తప్పించి సంసారంలో పెద్ద గొడవలు, ఉద్రిక్తతలు నెలకొన్న సంఘటనలు ఏవీ ఎదురవలేదు. ఈ ఆలుమగలు కట్టుకున్న అనురాగ గోపురంలో ఎల్లప్పుడూ ప్రేమాదరణలు, పరస్పర సానుభూతి, నిస్వార్థ భావం నెలకొని ఉండేవి. ప్రత్యేకించి దైవ ప్రవక్త (సఅసం) కుటుంబం ఏవిధంగా ప్రాపంచిక జీవితం గడిపిందీ, కలిమిలోనూ, లేమిలోనూ ఎలా మెలిగిందన్న ఆలోచనతో చూస్తే మరింత గౌరవభావం కలుగుతుంది.

## భార్యపట్ల ప్రేమ

దైవప్రవక్త (సఅసం) హ॥జత్ ఆయిషా (రజి)ను ఎంతగానో ప్రేమించేవారు. ఈ సంగతి ఆయన సహచరుల (రజి)కూ తెలుసు. అందుచేత దైవప్రవక్త (సఅసం) హ॥జత్ ఆయిషా (రజి) ఇంట గడిపే రోజున బహుమానాలు, కానుకలూ పనికట్టుకొని మరీ వెళ్ళి అందజేసేవారు. మిగతా భార్యామణులకీ విషయం వ్యాకులపరచేది. కాని ఆక్షేపించే ధైర్యం ఎవరికీ లేదు. చివరికి అందరూ కలసి కుమార్తె అయిన హ॥జత్ ఫాతిమ (రజి) దగ్గర తమ గోడు వినిపించుకున్నారు. వాళ్ల సందేశాన్ని తీసుకొని ఆమె దైవప్రవక్త (సఅసం) సమక్షంలో హాజరయ్యారు. అంతా విని ఆయన (సఅసం) ''ప్రియపుత్రికా! నేను ఇష్టపడేవారిని నీవు ఇష్టపడవా?!'' అన్నారు. అంతే, ఆమె మారు మాట్లాడకుండా తిరిగి వచ్చేశారు. భార్యామణులు మరోసారి ఆమెను పంపుదామని భావించారు. కాని ఆమె ఎంతకీ ఒప్పుకోలేదు.

ఒకసారి ఎవరో ఒక హారం పంపారు. ఆయన (సఅసం) అన్నారు: ''నేను దీన్ని ప్రపంచం మొత్తమ్మీద నాకు అందరికన్నా ప్రియతములయిన వారికి ఇస్తాను.'' అందరూ హ॥జత్ ఆయిషా (రజి)కే ఇస్తారని భావించారు. కాని ఆయన (సఅసం) దాన్ని తన చిన్నారి మనుమరాలు, హ॥జత్ జైనబ్(రజి) కుమార్తె అయిన ఉమామాకు బహూకరించారు.

హ॥జత్ అమ్ర్ బిన్ ఆస్ 'సలాసిల్' యుద్ధం నుండి తిరిగివచ్చిన తరువాత అడిగారు, ''దైవప్రవక్తా (సఅసం)! తమరు ప్రపంచంలో అందరికన్నా అధికంగా ఎవరిని ప్రేమిస్తారు?'' ''ఆయిషాని'' అని సెలవిచ్చారు. ''దైవప్రవక్తా! (సఅసం) పురుషులలో ఎవరిని?'' అని మళ్ళీ అడగగా ''ఆయిషా తండ్రిని'' అని దైవ ప్రవక్త (సఅసం) జవాబిచ్చారు (సహీహ్‌బుఖారీ). ఒకరోజు హ॥జత్ ఉమర్(రజి)

https://teluguislam.net

హ|జత్ హఫ్సా (రజి అన్‌హా)కు నచ్చజెపుతూ, ''నువ్వు ఆయిషా(రజి) పట్ల అసూయ చెందకు. ఆమె దైవ ప్రవక్త (సఅసం)కు ప్రియతమురాలు'' అని అన్నారు.

ఒకరోజు ప్రయాణంలో హ|జత్ ఆయిషా(రజి) ప్రయాణిస్తున్న ఒంటె బెదరిపోయి ఆమె కూర్చుని ఉండగానే ఎటో పారిపోయింది. దైవప్రవక్త(సఅసం) ఎంతగా ఆందోళన చెందారంటే ఆయన(సఅసం) నోట ''అయ్యో! నా వధువా'' అన్న పదం అప్రయత్నంగా వెలువడింది.

ఒకసారి మహాప్రవక్త (సఅసం) బయట నుండి వచ్చారు. హ|జత్ ఆయిషా(రజి) తలనొప్పితో మూల్గుతున్నారు. ఈ పరిస్థితి చూచి ''ఆహ్! నా శిరస్సు'' అన్నారాయన. ఆ క్షణం నుంచే ఆయన (సఅసం) అస్వస్థతకు గురయ్యారు. ఆ దీర్ఘకాలిక అస్వస్థతతోనే ఆయన (సఅసం) తనువు చాలించారు.

(సహీహ్ బుఖారీ)

ఆ పరిస్థితిలోనూ ''ఇవ్వాళ ఏం వారం?'' అంటూ పదే పదే ప్రశ్నించసాగారు. హ|జత్ ఆయిషా(రజి) ఇంటి వంతుకోసం ఎదురు చూస్తున్నారని ప్రజలకు అర్థం అయిపోయింది. అందుచేత ఆయన(సఅసం)ను ఆమె గదిలోకి తీసుకు వెళ్ళారు. ఆయన(సఅసం) మరణం ఆసన్నమయ్యే వరకూ అక్కడే బస చేశారు. అక్కడే హ|జత్ ఆయిషా(రజి) ఒడిలో తలవుంచి అదే స్థితిలో మహాప్రస్థానం చేశారు.

(సహీహ్ బుఖారీ)

ఆయన(సఅసం) సెలవిస్తూ ఉండేవారు :

> ''ప్రభూ! నా అధీనంలో ఉన్న విషయమై (అంటే భార్యలతో సహజీవనం, ఇచ్చి పుచ్చుకోవడాల్లో సమతూకం పాటించడంలో) నేను నీ ఆదేశాలను ఉల్లంఘించను. కాని నా అధీనంలో లేని (అంటే ఆయిషా(రజి) పట్ల నాకు గల అపారమైన ప్రేమ) విషయమై నన్ను మన్నించు.'' (అబూదావూద్)

అందచందాల కారణంగా ఆయన (సఅసం) హ|జత్ ఆయిషా (రజి) పట్ల ఎక్కువ ప్రేమ కలిగి ఉన్నారని సాధారణంగా ప్రజలు భావిస్తారు. కాని ఇది వాస్తవం కాదు. అందచందాల విషయానికి వస్తే పవిత్ర సతీమణుల్లో హ|జత్ జైనబ్(రజి), హ|జత్ జువేరియా (రజి) హ|జత్ సఫియ(రజి) గారలు కూడా అందగత్తెలే. వారి బాహ్య సౌందర్యాలను గురించి హదీసులలో, చరిత్ర గ్రంధాలలో ప్రస్తావించబడింది. దాంతోపాటు పిన్నవయస్కురాలు, కుమారి అయిన హ|జత్ ఆయిషా(రజి) గురించి కూడా ప్రసక్తి వచ్చింది. కాని అందచందాల ప్రాతిపదికగా ఒకటి రెండు సందర్భాలలో తప్ప హదీసులు, చరిత్ర గ్రంథాలలో ఎక్కడా ఒక్క అక్షరం కూడా

https://teluguislam.net

వ్రాయబడలేదు. హ|జత్ ఉమర్ (రజి) తన కుమార్తె హఫ్స(రజి)ను మందలిస్తూ, ''హ|జత్ ఆయిషా(రజి)తో పోటీ పడకు. ఆమె నీకంటే అందమైనది. అంతేకాక దైవ ప్రవక్త (సఅసం)కు ప్రియమైనది'' అని చెప్పిన సందర్భం మాత్రం మినహాయించదగినది. ఉమర్‌గారి వ్యాఖ్యానం విని దైవప్రవక్త (సఅసం) చిరునవ్వు చిందించారు. దీన్నిబట్టి హ|జత్ ఆయిషా(రజి) హ|జత్ హఫ్స (రజి) కంటే మెరుగ్గా ఉంటారన్న విషయం నిర్ధారితమవుతుంది, అంతే! సహీహ్ ముస్లిం, మరియు అబూదావూద్ (కితాబున్నికాహ్) గ్రంథాలలో ఆయన (సఅసం) సెలవిచ్చారని హ|జత్ అబూహురైరా (రజి) ఉల్లేఖిస్తున్నారు: ''వివాహం కోసం స్త్రీని నాలుగు కోణాల నుంచి ఎన్నుకుంటారు. (1) సంపన్నత (2) అందచందాలు (3) వంశపారంపర్యం (4) ధార్మికత. అయితే మీరు ధార్మికురాలిని అన్వేషించండి. ఎందుకంటే ధార్మికురాలైన భార్య మాత్రమే అఖరికి స్వీకార యోగ్యమవుతుంది.''

మరి హ|జత్ ఆయిషా(రజి) విషయావగాహనలోనూ, దైనందిన జీవితంలోని సమస్యలను షరీఅత్ సూత్రాలకు అన్వయింపజేయడంలోనూ, అజ్ఞాల్ని వల్లెవేయడంలోనూ భార్యలందరిలోకీ అగ్రగణ్యురాలు. ఈ కారణంచేతనే భర్త దృష్టిలో ఆమె అందరికన్నా ఎక్కువ ప్రీతి పాత్రురాలయ్యారు.

హ|జత్ ఆయిషా(రజి) ఆ కాలపు స్త్రీలందరిలో కెల్లా ఉన్నతురాలని మరో హదీసు ద్వారా తెలుస్తోంది. అంటే హ|జత్ ఆయిషా(రజి)కు లభించిన గౌరవోన్నతులకు కారణం ఆమె బాహ్య సౌందర్యం కాక ఆమెలో అంతర్లీనమయి వున్న విశేష ప్రజ్ఞా ప్రాటవాలేనని దీన్నిబట్టి అర్థమవుతుంది. అంతర్గత ప్రజ్ఞా పాటవాలలో హ|జత్ ఆయిషా (రజి) తర్వాతి స్థానంలో హ|జత్ ఉమ్మె సల్మా(రజి) ఉన్నారు. అందుచేత ఆమె వయసు మళ్ళిన స్త్రీయే అయినా ఆమె కూడా దైవప్రవక్త (సఅసం)కు ప్రియతమురాలే. హ|జత్ ఖదీజా(రజి) అరవైయేళ్ళ వయస్సులో మరణించారు. కాని దైవ ప్రవక్త (సఅసం) మనస్సులో ఆమె పట్ల గల ప్రేమ ఏ మాత్రం చెక్కు చెదరలేదు. దీనిపై హ|జత్ ఆయిషా(రజి) కూడ ఈర్ష్యపడేవారు. అందుచేత ఒకసారి హ|జత్ ఆయిషా(రజి) ఆమెను అమర్యాదకరంగా సంబోధిస్తే దైవప్రవక్త (సఅసం) ఉగ్రులయ్యారు.

## భర్తపట్ల ప్రేమ

హ|జత్ ఆయిషా(రజి)కు కూడా దైవ ప్రవక్త (సఅసం) పట్ల అమితమైన ప్రేమ మాత్రమే కాక ఆయన(స) పట్ల అపారమైన వ్యామోహం ఉండేది. ఆయన (సఅసం)పై ఆమెకున్నటువంటి ప్రేమను మరెవరైనా వ్యక్తపరిస్తే ఆమె మనస్తాపానికి గురయ్యేవారు. అందుచేత ఇతర సతీమణులు ఈ విషయంలో

https://teluguislam.net

జాగ్రత్త వహించేవారు. దీనికి సంబంధించిన ఉదాహరణలు తరువాయి పుటలలో చూడవచ్చు. హజ్రత్ ఆయిషా (రజి) కు రాత్రివేళల్లో ఎప్పుడయినా మెలకువ వచ్చి ప్రక్కలో ఆయన (సఅసం) లేకపోతే కంగారు పడేవారు. ఒకసారి రాత్రి ఆమెకు మెలకువ వచ్చి చూస్తే దైవ ప్రవక్త(స) కనబడలేదు. ఆ రోజుల్లో అనేక రాత్రుళ్ళు ఇళ్ళలో దీపాలు వెలిగేవి కావు. చీకటిలో తడుముకుంటూ పోతే ఒకచోట దైవ ప్రవక్త (సఅసం) పాదాలు చేతికి తగిలాయి. ఆయన (సఅసం) సజ్దా స్థితిలో దైవ ప్రార్థనలు చేస్తున్నారు.

మరోసారి ఇటువంటి సంఘటనే ఎదురయింది. బహుశా ఆయన మరో భార్య దగ్గరకైనా వెళ్ళారేమోనని అనుకున్నారు. లేచి అటూ ఇటూ చూడసాగారు. ఒకవైపు ఆయన (సఅసం) దైవస్తోత్రం చేస్తూ కనబడేసరికి తన తప్పిదానికి సిగ్గుపడ్డారు. అసంకల్పికంగా ఆమె నోటినుండి వెలువడింది: ''నా తల్లి దండ్రుల్ని అర్పింతు! ఆయన ఈ స్థితిలో ఉండగా నాకు ఇలాంటి పాడు ఆలోచనలు వస్తున్నాయి ఏమిటి?!''

వేరొక రాత్రివేళ ఆమెకు మెలకువ వచ్చి చూసేసరికి దైవ ప్రవక్త (సఅసం) కనబడలేదు. రాత్రి సగభాగం గడిచిపోయింది. అటూ ఇటూ వెదికారు. కాని ప్రాణనాథుని దర్శనభాగ్యం కలగలేదు. అలా అన్వేషిస్తూ ఆమె కబరస్థాన్ (గోరీలదొడ్డి) వరకు వెళ్లారు. అక్కడ దైవప్రవక్త (సఅసం) క్షమార్పణ కోరుతూ, ప్రార్థిస్తూ ఉన్నారు. వెళ్ళిన దారినే ఆమె వెనక్కు వచ్చారు. మరునాడు ఉదయం ఆయన(సఅసం) కు ఈ సంగతి చెప్పగా ''అవును రాత్రి నల్లని ఆకారమేదో ఎదుటినుంచి వెళ్ళినట్లు అనిపించింది, అది నువ్వేనా?'' అన్నారాయన(స).

ఒక ప్రయాణంలో హజ్రత్ ఆయిషా (రజి) హజ్రత్ సఫియా(రజి) లిద్దరూ ఆయన (సఅసం) వెంట వున్నారు. రాత్రివేళ నాగా లేకుండా ఆయన (సఅసం) హజ్రత్ ఆయిషా(రజి) ఒంటెమీద వేయబడే అంబారీలాంటి చిన్నసైజు గుడారంలోకి వచ్చేవారు. బిడారు ప్రయాణిస్తున్నంత సేపు ఆమెతో కబుర్లు చెబుతుండేవారు. ఒకరోజు హజ్రత్ హఫ్స(రజి) హజ్రత్ ఆయిషా(రజి)తో ''మనం ఒంటెలు మార్చుకుందాం'' అని చెప్పి ఒంటెలు మార్చుకున్నారు. రాత్రి యథాప్రకారం దైవ ప్రవక్త (సఅసం) హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరకు వచ్చేసరికి అక్కడ హజ్రత్ హఫ్స(రజి) ఉన్నారు. ఆమెకు సలామ్ చేసి కూర్చున్నారు. హజ్రత్ ఆయిషా(రజి) అక్కడ దైవప్రవక్త (సఅసం) రాకకై ఎదురు చూస్తున్నారు. బిడారు మజిలీ చేసేసరికి హజ్రత్ ఆయిషా(రజి) సహనం కట్టలు త్రెంచుకుంది. ఒంటెపై నుంచి క్రిందికి దిగిపోయి రెండు కాళ్ళు గడ్డిలో వుంచి : ''దేవుడా! నేను వారినేమీ అనలేను, కాని ఏ పామునో తేలునో పంపు. అవి నన్ను కాటేసిపోతాయి'' అన్నారు.

https://teluguislam.net

ఈ మాటల్లో స్త్రీ సహజమైన గుణం( ఉక్రోషం) ఏవిధంగా ఉట్టిపడుతుందో గమనించారా?!

దైవ ప్రవక్త (సఅసం) ఒక విషయంపై కోపగించుకుని ఒక నెల రోజుల వరకూ ఏ భార్య దగ్గరకూ వెళ్ళనని శపథం చేసుకున్నారు. ఆరు బయట కుటీరానికి ఆనుకొని ఉన్న మిద్దెపైనే నెల రోజుల పాటు గడిపారు. భార్యలందరూ వ్యాకులతకు లోనైపోయారు (సహీహ్ బుఖారీ). ఆ సమయంలో దైవప్రవక్త (సఅసం) ఇష్టానికి వ్యతిరేకంగా ఆయన దగ్గరికి వెళ్ళనూలేదు. హ॥జత్ ఆయిషా (రజి) గారయితే నెల ఎప్పుడు గడుస్తుందా అని రోజులు లెక్కించేవారు. నెలపూర్తి కాగానే ఆయన (సఅసం) మొట్టమొదట ఆయిషా(రజి) గదికే వెళ్ళారు.

పవిత్ర సతీమ తల్లులలో వివిధ శ్రేణులకు చెందిన స్త్రీలు ఉన్నారు. కొందరు నాయకుల కుమార్తెలు, కొందరు ధనవంతుల కుమార్తెలూ ఉన్నారు. వాళ్ళు ఈ రకంగా పేదరికపు జీవితం గడపడానికి ఇష్టపడేవారుకాదు. అందుచేత వారికి హెచ్చరికగా దైవాదేశం అవతరింపబడింది: ''కావాలంటే ఈ గౌరవాన్ని స్వీకరించవచ్చు. దైవదౌత్య గృహాన్ని విడిచి పోదలచుకున్నవారు వేరవనూవచ్చు'', అని స్పష్టం చేయబడింది. ప్రవక్త (సఅసం) సతీమణుల్లో అలా వేరయిపోయే దురదృష్టవంతురాలు ఎవరున్నారని?!'' అందరూ సంతోషంగా ఒప్పేసుకున్నారు. ప్రవక్తతో దాంపత్య జీవితానికే ప్రాధాన్యత ఇచ్చారు. కాని అందరికంటే ముందు తన సమ్మతిని హ॥జత్ ఆయిషా(రజి)యే తెలిపారు. ''దైవప్రవక్తా! నా జవాబును ఎవ్వరికీ వినిపించకండి'' అంటూ తాను ఈ నిర్ణయంలో ముందంజ వేసిన విషయం వెల్లడి కాకూడదని కోరారు. ఇక్కడ కూడ ఆడవారి మనస్తత్వం వెల్లడవుతోంది.

'మూతా' యుద్ధంలో హ॥జత్ జాఫర్ తయ్యార్(రజి) అమరగతులయ్యారన్న వార్త దైవ ప్రవక్త (సఅసం)ను ఎంతో కలచివేసింది. ఇస్లాంలో మాతం చేయడం (గుండెలు బాదుకోవడం, బిగ్గరగా ఏడవడం) నిషిద్ధం. హ॥జత్ జాఫర్ (రజి) ఇంట్లో స్త్రీలు మాతం చేస్తున్నారని ఒకరు తెలియచేశారు. దైవప్రవక్త (సఅసం) వారిని నిరోధించమని చెప్పారు. ఆ వ్యక్తి తిరిగివచ్చి ''ఒప్పుకోవడం లేదు'' అని తెలియచేశాడు. ''వాళ్ళ నోట్లో మన్నుకొట్టు''మని సెలవిచ్చారు. ఆ మనిషి తిరిగివచ్చి మరేదో చెప్పసాగాడు. ఇదంతా తలుపు సందులోంచి హ॥జత్ ఆయిషా(రజి) గమనిస్తూ; ఈ మహానుభావుడు ఆయన (సఅసం) చెప్పినట్లూ చేయడు, ఆయన మానాన ఆయన్ని విడిచీపెట్టనూ విడిచిపెట్టడే అని విసుక్కున్నారు. (సహీహ్ బుఖారీ)

https://teluguislam.net

## భార్యకు సత్కారం

దైవప్రవక్త (సఅసం) పవిత్ర జీవితం మానవ సమాజానికి ఆదర్శప్రాయం. అందుచేత దైవప్రవక్త (సఅసం) బోధనల ద్వారా భర్త తన భార్య అభిమానాన్ని చూరగొనడానికి ఏవిధంగా ప్రయత్నించాలి అన్న విషయం కూడ నేర్చుకోవచ్చు. ఆయన (సఅసం) అప్పుడప్పుడూ వారితో ఆహ్లాదంగా గడిపేవారు. ఆయన (సఅసం) హ|జత్ ఆయిషా(రజి) ఆటపాటలపై కూడ సంతోషం వెలిబుచ్చారని మనం చదివియున్నాం. హ|జత్ ఆయిషా (రజి) ఒక అన్సారీ బాలికను చేరదీసి ఆ పిల్ల పెళ్ళి అతి నిరాడంబరంగా జరిపారు. బయట నుండి వచ్చిన దైవ ప్రవక్త (సఅసం), ఈ దృశ్యం చూచి ''ఆయిషా! రాగం, పాటలు లేనే లేవే!?'' అని అభిప్రాయపడ్డారు.

ఒకసారి పండుగరోజు నీగ్రోలు పండుగ సంబరంలో ఈటెలు తిప్పుతూ మల్ల విద్య ప్రదర్శన ఇస్తున్నారు. హ|జత్ ఆయిషా( రజి) ఈ వేడుక చూడాలనుకున్నారు. ఆమెకు ఆసరాగా ఆయన (సఅసం) ముందు నిలబడ్డారు. ప్రవక్త భుజాల చాటున ఆమె ఆ దృశ్యాన్ని తిలకించారు. ఆమె అలసి అక్కడి నుంచి వెళ్ళిపోయే వరకూ మహాప్రవక్త అలాగే నిలబడి ఉన్నారు. (సహీహ్ బుఖారీ)

ఒకసారి హ|జత్ ఆయిషా(రజి) దైవప్రవక్త (సఅసం)తో దీటుగా మాట్లాడుతుండగా హ|జత్ అబూబకర్(రజి) అకస్మాత్తుగా అక్కడికి వచ్చారు. ఈ అధిక ప్రసంగాన్ని చూసి ఉగ్రులయి కూతుర్ని కొట్టడానికి చెయ్యెత్తారు. దైవప్రవక్త (సఅసం) వెంటనే అడ్డుపడ్డారు. అబూబకర్ (రజి) వెళ్ళిపోయాక తన సతీమణిని ఉద్దేశించి, ''చూశావా! నిన్ను ఎలా కాపాడానో?'' అని చెప్పారు. (అబూదావూద్)

ఒకసారి ఆయన (సఅసం) ఒక బానిసరాల్ని వెంటబెట్టుకొని హ|జత్ ఆయిషా (రజి) దగ్గరకు వచ్చారు.

''నీవీమెను ఎరుగుదువా?''

''లేదు'' అన్నారు ఆయిషా(రజి)

''ఫలానా వ్యక్తికి చెందిన బానిసరాలు. నీవీమె పాట వింటావా?''

ఆమె సరేనంటే ఆ బానిసరాలు కొంతసేపు పాటలు పాడింది. పాట విన్నాక ఆయన (సఅసం) ''ఆమె ముక్కుపుటాలలో షైతాన్ బాజా వాయిస్తున్నాడు'' అని అభిప్రాయపడ్డారు. అంటే ఇటువంటి పాటల్ని స్వతహాగా ఆయన (సఅసం) ఇష్టపడేవారు కాదు. (ముస్నద్ అహ్మద్)

https://teluguislam.net

## మనోల్లాసం

అప్పుడప్పుడూ మనస్సును ఉల్లాస పర్చడానికి ఆయన (సరసం) కథలు కూడా విన్పించేవారు. ఒకసారి సందర్భానుసారం 'ఖురాఫా' పేరు వచ్చింది. ఖురాఫాను ఎరుగుదువా? అతడు ఉజర్హ్ తెగకు చెందిన మనిషి. అతడ్ని జిన్ను ఎత్తుకు పోయింది. అక్కడ అతను గొప్ప గొప్ప వింతలు చూసి తిరిగి వచ్చాక ఆ వింతల్ని ప్రజలకు వివరించాడు. ఈకారణంచేత ఏదైనా వింతను గురించి ప్రజలు విన్నప్పుడు, ''ఓహో! ఇది ఖురాఫా విషయం కదూ'' అనేవారు.

ఒకసారి హజ్రత్ ఆయిషా ఒక కథ చెప్పసాగారు. అరబ్బుల పరాచికాలు ఎంత సున్నితంగా ఉంటాయెో ఈ కథ వింటే తెలుస్తుంది. కథ ఈ విధంగా మొదలవుతుంది.

ఒకరోజు పదకొండుగురు చెలులు ఒకచోట కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళంతా ఒక నిర్ణయానికి వచ్చారు. దానిప్రకారం తమలో ప్రతి ఒక్కరూ తమతమ భర్తల్ని గురించి ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలి. మొదటి మహిళచెప్పసాగింది: ''నా భర్త పర్వతంపై పెట్టబడిన ఒంటె మాంసం లాంటివాడు. అక్కడిదాకా చేరుకోడానికి అదేమైనా మైదానమా! పోనీ, ఎవరన్నా దాన్ని తన్నుకుపోవడానికి అంత మంచి మాంసమూ కాదు''

రెండో మగువ చెప్పింది;''నేను నా భర్త గుర్ంచి చెప్పనుగాక చెప్పను. చెప్పాలంటే ఆయన ఓ పెద్ద కథ చెప్పడం ప్రారంభిస్తే ఎక్కడన్నా వదలివేస్తానేమోనని భయం.''

మూడో మగువ చెప్పింది, ''నా భర్త చండశాసనుడు. చెప్పానా విడాకులే, చెప్పకపోతేనో పెళ్ళి అయి కూడా పెళ్ళికానిదాన్నే.

నాలుగో నెచ్చెలి చెప్పింది : ''నా భర్త హిజాజ్ రాత్రివంటివాడు. అంత వేడీ కాదు, అంత చల్లనా కాదు. భయమూ లేదు విచారమూ లేదు''.

ఐదో అతివ చెప్పింది : ''నా భర్త ఇంటికి వస్తే చిరుతపులే. బయటికి వెళ్తే పెద్దపులే! వాగ్దానం చేశాడూ అంటే తిరిగి అతన్ని అడగవలసిన పనేలేదు''.

ఆరవ ముదిత అన్నది : నా భర్త భోజనానికి కూర్చున్నాడంటే మొత్తం తానే తినేస్తాడు. త్రాగడం మొదలెడితే అంతా జుర్రేస్తాడు. పడుకుంటే మొత్తం తనే కప్పుకుంటాడు.

ఏడవ మానిని ఇలా చెప్పసాగింది: ''నా భర్త వట్టి మూర్ఖుడు, నపుంసకుడు, ఒక్కోసారి తల పగులగొడ్తే మరొకసారి ఏదయినా విరగ్గొడతాడు.

https://teluguislam.net

ఎనిమిదవ భామ ఇలా చెప్పింది, ''నా మొగుడు ముట్టుకుంటే కుందేలులా మెత్తగా ఉంటాడు''

తొమ్మిదో ముద్దుగుమ్మ ఇలా అంది, ''నా భర్తకు పెద్ద ఇల్లు వుంది. ధనవంతుడు. ఎత్తుగా వుంటాడు. అతని పొయ్యిలో బూడిద కుప్పలకొద్దీ వుంటుంది. (అంటే అతిథుల కోసం ఎప్పుడూ వంట చేయబడుతూండటం వల్ల బూడిద ఎక్కువగా ప్రోగవుతుంది).

పదవ పడతి చెప్పనారంభించింది, ''నా భర్త అధికారి. ఆ అధికారిని మీరేమనుకుంటున్నారు? ఆయన వీళ్ళందరికంటేగొప్పవాడు. అతడికి పెద్ద ఒంటెల మంద వుంది. అవి ఎప్పుడూ ఇంట్లోనే కట్టబడి వుంటాయి. మేతమేయడానికి వెళ్ళవు. (ఎప్పుడు ఏ చుట్టాలు వస్తారో, ఏమో? వారికోసం జిబహ్ చేసి వండి పెట్టడానికి సిద్ధంగా ఉంచే సంకల్పంతో వాటిని బయటకు వదలరు అని భావం)

పదకొండవ ఇల్లాలు పెద్ద కథ మొదలెట్టింది. ''నా భర్త పేరు అబూజర. అబూజర ఎలాంటి వాడనుకున్నారు? అతడు నగలతో నా చెవుల్ని నింపేశాడు. కొవ్వుతో నా భుజాల్ని కప్పేశాడు. సంతోషంతో నా మనస్సును సుఖపెట్టాడు. మేకలు కాసేవారి అమ్మాయినైన నన్ను పాడి పంటలు పొంగిపొరలే పరిసరాలలో తెచ్చి ఉంచాడు. మాట్లాడితే చెడు మాట్లాడను. పడుకుంటే తెల్లవారిపోతుంటుంది. తాగడం మొదలెడితే మొత్తం తాగేస్తుంటాను. ఉమ్మె అబీజర! (అత్తగారు) ఉమ్మెఅబీజర ఎలాంటిదనుకున్నారు? ఆమెకు పెద్ద బట్టల మూట వుంది. ఆమె ఉండే ఇల్లు విశాలమైనది. ఇక అబూజర కొడుకు! అబూజర కొడుకు ఎలాంటి వాడనుకున్నారు? పడుకొని వుంటే విచ్చుకత్తిలా వుంటాడు. ఇక అబూజర కూతురు ఎలాంటిదో తెలుసా?! తల్లిదండ్రుల మాట జవదాటదు. ఆమెను చూచి సవతికి ఈర్ష్య కలుగుతుంది. అబూజర బానిస!- అబూజర బానిసరాలు ఎలాంటిదో తెలుసా?! ఇంటి విషయం ఎక్కడా బయటకు పొక్కనీయదు. ఆహారధాన్యాలు ఏమాత్రం వ్యర్థపర్చదు. ఇంట్లో చెత్తా చెదారం ఉండనీయదు.''

దైవప్రవక్త (సఅసం) ఎంతో ఓపికగా ఈ కథ వినసాగారు. చివరికి పలికారు : ''ఆయిషా! అబూజర తన భార్యయెడల ఎలాంటివాడో నేనూ నీపట్ల అలాంటివాణ్ణే.'' ఆయన (సఅసం) ఇటువంటి ఆసక్తికరమైన సంభాషణలో ఉండగా అప్పుడే అజాన్ వినవచ్చింది. ఆయన (సఅసం) లేచి నిలబడ్డారు. ''ఆ తర్వాత ఆయన మమ్మల్ని ఎరుగనివానిలా నిష్క్రమించారు'' అని హజ్రత్ ఆయిషా(రజి) చెప్పారు.

## కలిసి భుజించడం :

ఆయన(స) తరచుగా హజ్రత్ ఆయిషా(రజి)తో కలిసి ఒకే కంచంలో భోజనం చేసేవారు. ఒకసారి వీరిద్దరూ కలిసి భోంచేస్తుండగా హజ్రత్ ఉమర్ (రజి) వచ్చారు. ఆయన(స) ఉమర్(రజి)ని కూడా భోజనానికి పిలిచారు. ముగ్గురూ ఒకేసారి భోంచేశారు (ము అజ్జం-తిబ్రాని). అప్పటికి పరదా ఆజ్ఞలు ఇంకా జారీ కాలేదు. భోజనం చేసేటప్పుడు కూడా హజ్రత్ ఆయిషా ఎంగిలిని దైవప్రవక్త (స) తినేవారు. ఆయిషాపట్ల అంతటి ప్రేమ మరి! ఒకసారి ఇద్దరూ కలిసి భోజనం చేస్తుండగా హజ్రత్ సౌదా(రజి) వచ్చి ''హజ్రత్ ఉమర్ నన్ను బజారు పని ఉన్నప్పటికీ బయటకు పోనీయడం లేదు'' అంటూ షికాయతు చేశారు (సహీహ్ బుఖారీ). రాత్రుళ్ళు ఇంట్లో దీపాలు వెలగని కారణంగా ఇద్దరి చేతులూ ఒకే తునకపై పడేవి (మస్నద్ అహ్మద్).

ఒకసారి ఒక ఈరానీ పొరుగు వ్యక్తి ఆయన(స)ను విందుకు ఆహ్వానించారు. ''ఆయిషా (రజి) కూడా రావచ్చా?'' అని ఆయన అడగ్గా 'లేదు' అని జవాబిచ్చాడు పొరుగు వ్యక్తి. అలా అయితే ఈ ఆతిథ్యాన్ని నేనంగీకరించను'' అన్నారు దైవప్రవక్త (స). ఆతిధ్యమిచ్చేవాడు మరోసారి వచ్చాడు. ఇద్దరిమధ్య ప్రశ్నోత్తరాలు జరిగాయి. అతను వెళ్ళిపోయాడు. తిరిగి మూడోసారి వచ్చాడు. ''ఆయిషా (రజి) క్కూడా ఆతిథ్యముందా? అని ఆయన(సఅసం) అడిగారు. అతను ''అవును'' అని చెప్పాడు. ఆ తర్వాతే ఆయన (సఅసం) ఆయిషా (రజి)తో అతడి ఇంటికి వెళ్ళారు.★

## ప్రయాణంలో...

ప్రయాణంలో దైవప్రవక్త (సఅసం) వెంట సతీమణులందరూ వుండజాలరు కదా, అలాగని ఎవరో ఒకర్ని ప్రత్యేకించి తీసుకెళ్ళడము కూడా న్యాయం కాదు. అందుచేత ఆయన (సఅసం) చీటీలు వేసి ఎవరి పేరు వస్తే వారికి తనవెంట

---

★ హదీసు వేత్తల ప్రకారం, ఈ సంఘటన హిజ్రీ మొదటి సం. ఆరంభంలో జరిగి వుండవచ్చు. ఆయన (సఅసం) ఆతిథ్యానికి అంగీకరించక పోవడానిక్కారణం ఆరోజుల్లో దైవప్రవక్త (సఅసం) ఇంట్లో పస్తులు నడుస్తున్నాయి. అందుచేత సంక్లిష్టమైన ఆ పరిస్థితిలో ఇంట్లో ఆకలితో ఉన్న అర్ధాంగిని వదలి తాను సుష్టుగా భోంచేయడం మర్యాద కాదని ఆయన (సఅసం) భావించారు. ఆతిథ్యమిచ్చిన వ్యక్తి దగ్గర సంబరాలు ఒక్క మనిషికి సరిపడినన్ని మాత్రమే ఉండటంచేత రెండుసార్లు తిరస్కరించారు. మూడోసారి మరి కాసిని వస్తు సంబరాలు సమకూర్చుకున్న తర్వాత మళ్ళీ వచ్చాడు, ఫికహ్ వేత్తలు ఈ హదీసు ద్వారా నిర్మొహమాటస్తులయిన మిత్రుల ఆతిథ్యాన్ని తిరస్కరించడంగానీ, ఆతిథ్యంలో మరికొందర్ని చేర్చుకోవలసిందిగా కోరడంగానీ ధర్మసమ్మతమే నన్న అభిప్రాయానికి వచ్చారు.

ప్రయాణించే అవకాశం ఇచ్చేవారు. హ్జ్రత్ ఆయిషా (రజి) కూడా ఎన్నో ప్రయాణాలలో ఆయన (సఅసం) వెంట వున్నారు. (సహీహ్‌బుఖారీ).

## పరుగు

ఆయన (సఅసం) గుర్రపు స్వారీ, విలువిద్యలపట్ల మక్కువ చూపేవారు. సహాబా (రజి)ను కూడా ఇందుకు ప్రోత్సహించేవారు. స్వయంగా తనతోపాటు వారిచేత కూడా అభ్యాసం చేయించేవారు. ఒక యుద్ధంలో హ్జ్రత్ ఆయిషా (రజి) కూడా వెంటవున్నారు. సహచరులందర్నీ పరుగు తీయించారు. ఆయిషా (రజి)తో, ''రా. పరుగెడదాం. ఎవరు ముందు వెళతారో?'' అంటూ పరుగుతీశారు. అప్పటికి ఆయిషా (రజి) సన్నగా బక్కపలుచగా వుండేవారు. అందుచేత ఆమె పరుగులో ముందు వచ్చారు. కొన్ని ఏళ్ళ తర్వాత అటువంటి సందర్భమే మరోసారి వచ్చినపుడు హ్జ్రత్ ఆయిషా (రజి) ఓడిపోయారు. ''అప్పుడు నేను కొద్దిగా లావెక్కడం చేత దైవ ప్రవక్త(స) ముందు వచ్చారు'' అని హ్జ్రత్ ఆయిషా (రజి) తెలియచేస్తున్నారు. ''ఆయిషా! గుర్తుందా ఇది ఆనాటి ఓటమికి ప్రతీకారం'' అని ఆయన చమత్కరించారు.

## గారాలు

హొయలు, వయ్యారాలు స్త్రీ స్వభావంలో పుష్కలంగా ఉంటాయి. హదీసులలో ప్రస్తావించబడిన ఇటువంటి విషయాలు విమర్శించదగ్గవని ప్రజలు భావిస్తారు. సాక్షాత్తూ ఒక ప్రవక్తను పట్టుకొని అనుచరురాలు ఇంత సూటిగా మాట్లాడుతుందేమిటా అని ఆలోచిస్తారే తప్ప ఒక భార్య తన భర్తతో ముచ్చటిస్తుందని అనుకోరే?!

కాబట్టి ప్రామాణిక హదీసు గ్రంథాలలో ప్రస్తావనకు వచ్చిన ఇటువంటి కొన్ని సంఘటనలు ఈ కోవకే చెందుతాయి. వీటిని ఈ దృష్టితోనే చదవాలి, అర్థం చేసుకోవాలి. ఆయిషా (రజి) సెలవిస్తున్నారు: ''ఏ స్త్రీ అయినా తనంతట తానుగా దైవ ప్రవక్తకు అంకితమయిపోతే (అంటే 'మహర్' సొమ్మును క్షమించి దాంపత్యబంధంలో ప్రవేశిస్తే) అది ధర్మసమ్మతమే'' అన్న ఆదేశం అవతరించినపుడు ''అసలు ఏ ఆడదయినా ఇలా చేస్తుందా? అని నాకు ఉక్రోషం కలిగింది.'' కాని, దైవప్రవక్త తాను ఇష్టపడిన భార్యను తనవద్దకు పిలిపించుకోవచ్చు, లేదా ఆమెవద్ద రాత్రి గడపవచ్చు. ఇంకా తాను వద్దనుకున్న భార్యను పిలవకపోవచ్చు అన్న ఆయత్ అవతరించినపుడు ''చూస్తున్నా! చూస్తున్నా! మీ దేవుడు మీరు కోరిన ప్రతి కోరికనూ వెంటనే తీర్చేస్తున్నాడు'' అని ఆమె స్పందించారు.

(సహీహ్ బుఖారీ).

హజ్రత్ ఆయిషా (రజి) గారి ఈ అభిప్రాయంలోని అంతర్యం సమస్యలను ఉత్పన్నం చేయడం కాదు (దైవం మన్నించుగాక!). ఇది భార్య యొక్క ప్రేమపూరితమైన గారం మాత్రమే. ఉమ్మత్‌లోని పెద్దల దృష్టిలో ఈ మాటకు వేరే అర్థం ఉంది - అల్లాహ్ తన ప్రియతమ దైవప్రవక్త కోరికల్ని తప్పక తీరుస్తాడు. తద్వారా ఆయన (సఅసం) మనస్సు కుదుట పడుతుంది. మనసు కుదుటపడితే అతడు తన కర్తవ్యాన్ని సజావుగా నిర్వర్తించగలుగుతాడు. కాని ఈ రకంగా దైవం అనుమతించిన తర్వాత కూడా ప్రతిరోజూ దైవప్రవక్త (సఅసం) తన సతీమణులతో 'వంతు' విషయంలో సంప్రతించి వారి అనుమతి పొందుతుండేవారు.

(సహీహ్ బుఖారీ)

ఆయన (సఅసం) తరచూ ఖదీజా (రజి)ను గుర్తు చేసుకునేవారు. అది ఇతర భార్యలకు ఇబ్బందికరం అయ్యేది. ఒకసారి ఇలాగే ఆయన (సఅసం) ఖదీజా ప్రస్తావన తీసుకొచ్చారు: ''దైవ ప్రవక్తా! పొద్దస్తమానం ఆ ముసలామె ప్రసక్తే తీసుకొస్తారేంటి? దైవం మీకు అంతకంటే మంచి భార్యలనిచ్చాడు గదా!'' అని హజ్రత్ ఆయిషా (రజి) అందుకున్నారు. ''కాని దైవం నాకు ఆమె ద్వారానే బిడ్డలనిచ్చాడు'' అని ఆయన (సఅసం) బదులిచ్చారు (సహీహ్ బుఖారీ).

ఈ ఉల్లేఖనమే ముస్నద్ ఇబ్నె హంబల్‌లో ఇలా ఉంది - ఒకసారి దైవప్రవక్త (సఅసం) హజ్రత్ ఖదీజా (రజి)ను పొగడసాగారు. చాలా సేపటివరకు పొగడుతూనే ఉన్నారు. హజ్రత్ ఆయిషా (రజి) దీనిపై స్పందిస్తూ నాకు అది చూసి ఈర్ష్య కలిగింది. దైవప్రవక్త (సఅసం)ను అడిగాను, ''దైవప్రవక్తా! ఖురైష్ ముసలమ్మల్లో పెదవులు ఎర్రగా ఉన్న ముసలమ్మను - ఆమె గతించి కూడా చాలా కాలం అయిపోయినా - ఇంత సేపట్నించీ అంత ఇదిగా పొగిడేస్తున్నారు, తమరికి అంతకన్నా గొప్ప భార్యల్ని దైవం ఇచ్చాడు''. ఇది విన్న దైవ ప్రవక్త (సఅసం) వదనంలో రంగులు మారాయి. ఆయన ఇలా అన్నారు. ''ప్రజలు నన్ను తిరస్కరించిన రోజుల్లో ఆమె నన్ను విశ్వసించింది. ప్రజలు నన్ను ఎదిరించిన రోజుల్లో ఆమె నన్ను ధృవపర్చింది. ఇంకా ప్రజలు నాకు సాయం చేయడం మానివేసినప్పుడు ఆమె తన సొమ్ముతో నన్ను ఆదుకుంది. ఆమె ద్వారా దైవం నాకు పిల్లలనిచ్చాడు. మిగతా భార్యాల ద్వారా నాకు సంతాన ప్రాప్తికలగలేదు'' (ముస్నద్ ఇబ్నె హంబల్).

ఒకసారి హజ్రత్ ఆయిషా (రజి)కు తలనొప్పి వచ్చింది. దైవప్రవక్త (సఅసం)కు ప్రాణాంతక వ్యాధి మొదలయింది. ఆయన (సఅసం) సెలవిచ్చారు. ''ఒకవేళ నీవు నాకంటే ముందు చనిపోతే నేను స్వయంగా నీ గుసుల్ చేయిస్తాను. నా చేతుల మీదుగా అంత్య క్రియలు జరిపిస్తాను. నీకోసం దుఆ చేస్తాను.'' దీనికి జవాబుగా ఆమె ''దైవప్రవక్తా! ఒకవేళ అదే గనక జరిగితే మీరు ఈ గదిలోనే మరో కొత్త

భార్యను తెచ్చి ఉంచుతారు!'' అని హజ్రత్ ఆయిషా (రజి) అన్నారు. దైవప్రవక్త (సఅసం) ఇది విని చిరునవ్వు నవ్వారు. (సహీహ్ బుఖారీ).

ఒక ఖైదీని ఎక్కడ్నుంచో అరెస్టు చేసి తీసుకురావటం జరిగింది. అతడ్ని హజ్రత్ ఆయిషా (రజి) నివసించు గదిలోనే బంధించారు. ఈమెగారు ఇటు స్త్రీలతో ముచ్చట్లు చెప్పుకుంటుండగానే అతడు వీళ్ళను ఏమార్చి పారిపోయాడు. ఆయన (సఅసం) తిరిగి వచ్చి చూస్తే ఖైదీ లేడు! విచారిస్తే అసలు విషయం తెలిసింది. కోపంతో దైవప్రవక్త (స) ''మీ చేతులు విరిగిపోను!'' అంటూ బయటకు వచ్చి సహచరులకు తెలియచేశారు. అతడ్ని తిరిగి అరెస్టుచేసి తెచ్చారు. దైవప్రవక్త (సఅసం) మరలి లోనికి వచ్చేసరికి హజ్రత్ ఆయిషా (రజి) తన చేతుల్ని అటు ఇటు త్రిప్పి చూసుకొంటున్నారు. ''ఆయిషా! ఏం చేస్తున్నావు?'' అని ప్రశ్నించగా ''ఆ ఏం లేదు. ఏ చెయ్యి విరుగుతుందా అని చూస్తున్నా''. ఆయన (సఅసం) నొచ్చుకుని దుఆ కోసం చేతులు పైకెత్తారు (ముస్నద్).

ఒకరోజు సందర్భవశాత్తూ ప్రశ్నించారు; ''దైవప్రవక్తా! రెండు పచ్చిక బీళ్ళు వున్నాయనుకోండి. ఒకటి మేయబడకుండా ఉంది. మరోటి మేయబడింది. వీటిలో దేనిలో మీరు ఒంటెను మేపడానికి ఇష్టపడతారు?'' అని ఆమె ప్రశ్నించగా ''మొదటి దానిలో'' అని ఆయన (స) జవాబిచ్చారు. భార్యలలో హజ్రత్ ఆయిషా (రజి) మాత్రమే కుమారి (మిగతా భార్యలు పునర్వివాహితులు) అన్న విషయాన్ని ఇది సూచిస్తోంది.

ఆయన (స) ఒకసారి తన ధర్మ పత్నితో ''ఆయిషా! నీవు నాపట్ల ఎప్పుడు సంతోషంగా ఉంటావో, ఎప్పుడు కోపంగా ఉంటావో నాకు తెలిసిపోతుంది'' అని అన్నారు. ''ఎలా?'' అని ఆమె అడిగితే ఆయన ఇలా తెలిపారు: ''నామీద కోపంగా ఉన్నపుడు 'ఇబ్రాహీం ప్రభువు సాక్షిగా అంటావు . సంతోషంగా వుంటే 'ముహమ్మద్ (సఅసం) ప్రభువు సాక్షిగా' అని ఒట్టేసి చెబుతుంటావు.''

''అవును దైవప్రవక్తా! (ఆ సమయంలో) కేవలం మీ పేరు చెప్పటం మానివేస్తాను సుమండీ'' అని ఆమె ఒప్పుకున్నారు (సహీహ్ బుఖారీ).

## సేవా తత్పరత

ఇంట్లో పని మనిషి ఉన్నప్పటికీ హజ్రత్ ఆయిషా (రజి) ఆయన (స)కు స్వయంగా సేవలు చేసేవారు (అదబుల్ ముఫ్రద్). పిండి స్వయంగా విసరేవారు (సహీహ్ బుఖారీ). అన్నం స్వయంగా వండేవారు (సహీహ్ బుఖారీ). తన స్వహస్తాలతో దుప్పటి పరచేవారు (షిమాయిలె తిర్మిజీ),వుజూ కోసం స్వయంగా

https://teluguislam.net

నీరు తెచ్చి పెట్టేవారు (మస్నద్). అప్పుడప్పుడూ దైవప్రవక్త (సఅసం) తలను తానే దువ్వేవారు (సహీహ్‌బుఖారీ). ఆయన (సఅసం) దివ్య శరీరంపై అత్తరు పూసేవారు (సహీహ్ బుఖారీ). ఆయన (సఅసం) బట్టల్ని స్వయంగా ఉతికేవారు (సహీహ్ బుఖారీ). నిద్రించినపుడు మిస్వాక్ పుల్లను, నీళ్ళను తలవైపు వుంచేవారు (మస్నద్ అహ్మద్). మిస్వాక్‌ను శుభ్రపరచి కడిగేవారు (అబూదావూద్). ఇంటికి ఆయన (సఅసం) అతిథి ఎవరైనా వస్తే, అతిథి సత్కారం చేసేవారు. హజ్రత్ ఖైస్ గిఫ్ఫారి (రజి) అనే సహచరుడు సుప్ప వారిలో (అరుగువాళ్ళు) ఒకరు. ఆయన ఇలా తెలియచేస్తున్నారు: ''ఒకరోజు దైవప్రవక్త (సఅసం) మాతో ''రండి, ఆయిషా (రజి) యింటికి పదండి'' అని అన్నారు. ఆమె గదికి వెళ్ళి ''ఆయిషా మాకు భోజనం పెట్టు'' అని కోరారు. ఆమె ఉప్మాలాంటి వంటకం వడ్డించారు. ఆయన (సఅసం) ఇంకా ఏదయినా తెమ్మన్నారు. ఆమె ఖర్జూరపు పాయసం వడ్డించారు. తర్వాత త్రాగడానికి ఏమన్నా కావాలంటే ఒక పెద్ద పాత్రలో పాలు, చిన్న పాత్రలో నీళ్ళు తెచ్చి ఇచ్చారు (అబూదావూద్).

## విధేయత, ఆజ్ఞాపాలన

భర్తకు విధేయురాలుగా ఉంటూ అతడి ఆజ్ఞల్ని తు.చ. తప్పకుండా పాటించడమే ఉత్తమ ఇల్లాలి లక్షణం. హజ్రత్ ఆయిషా (రజి) తొమ్మిది సంవత్సరాల దాంపత్య జీవితంలో ఆయన (సఅసం) యొక్క ఏ ఆజ్ఞనూ జవదాటలేదు. పైగా ఆయన (సఅసం) ధోరణివల్లగానీ, ఆయన సూచన వల్లగాని సహించరాని విషయమేదైనా ఉంటే వెంటనే దాన్ని త్యజించేవారు. ఒకసారి హజ్రత్ ఆయిషా (రజి) ఎంతో ఆసక్తితో ఒక చిత్తరువుగల కర్టెన్‌ను ద్వారానికి అలంకరించారు. దైవప్రవక్త (స) లోనికి అడుగు పెడుతూ పరదా వంక చూశారు. వెంటనే దైవప్రవక్త భృకుటి ముడిపడింది. హజ్రత్ ఆయిషా (రజి) ఇది చూసి బిక్కచచ్చి ''దైవ ప్రవక్తా (సఅసం)! క్షంతవ్యురాల్ని. నావల్ల అపరాధం ఏదయినా జరిగిందా?'' అని అడిగారు. ఆయన (సఅసం) సెలవిచ్చారు; ''ఏ యింట్లో చిత్తరువులు (ఫోటోలు) ఉంటాయో ఆ యింట్లోకి దైవదూతలు ప్రవేశించరు.'' ఇది విన్న ఆయిషా వెంటనే ఆ పరదాను తీసివేసి దాన్ని మరో పనికి వినియోగించారు (సహీహ్ బుఖారీ). ఒక సహాబీ వలీమా విందు చేయవలసి వుంది. కాని అతడి యింట్లో సంబారాలు లేవు. ఆయన (సఅసం) అన్నారు; ''ఆయిషా ఇంటికి వెళ్ళి, ఆహార వస్తువుల తట్టపంపమని చెప్పు''. అతడు ఈ విషయం హజ్రత్ ఆయిషా (రజి)కు చేరవేశాడు. అప్పటికప్పుడే ఆయిషా (రజి) గంప మొత్తాన్ని ఇచ్చి పంపారు. ఆ రోజు రాత్రి తినడానికి ఆమెవద్ద ఏమీ లేకుండా పోయింది.

https://teluguislam.net

భర్త జీవించి వుండగా బహుశా చాలామంది స్త్రీలు ఈ విషయంలో హజ్రత్ ఆయిషా (రజి) కు సాటిగా నిలిచారేమో కాని బంధాలు తెగిపోయిన తర్వాత కూడా విధేయత ఆమెను కట్టి పడవేయటం విశేషం. అంటే ఆయన యొక్క ఒక్కొక్క ఆజ్ఞను ఆయన బ్రతికి వున్న రోజులలో ఏవిధంగా అమలు పర్చారో భర్త వియోగానంతరం కూడా అదే విధంగా అమలు పర్చారామె.

ఆయన (సఅసం) హజ్రత్ ఆయిషా (రజి)కు దాతృత్వపు శిక్షణ నిచ్చారని లోగడ చదివాము. దాని ప్రభావంవల్ల ఆవిడ జీవితాంతం ఈ బాధ్యతను విస్మరించలేదు. ఆమెగారు జిహాద్‌లో పాల్గొనాలన్న ఆకాంక్ష వ్యక్తం చేయగా ''హజ్ చేయటమే స్త్రీల జిహాద్'' అని ఆయన (సఅసం) సెలవిచ్చారనీ మనం చదివి ఉన్నాం, ఈ ఆజ్ఞను విన్నాక ఆమె ఏ సంవత్సరమూ హజ్ చేయకుండా వుండలేదు. అంత కట్టుదిట్టంగా ఆ ఆజ్ఞను అమలు పర్చారామె. ఒకసారి ఒక వ్యక్తి కొంత పైకాన్ని కొంత వస్త్రాన్నీ ఆమెకు బహూకరించాడు. మొదట ఆమె తిరస్కరించి కొంత సేపటికి తిరిగి వాటిని తెప్పించుకున్నారు. ''ఆయన (స) బోధించిన ఒక విషయం జ్ఞప్తికి వచ్చింది'' అన్నారామె. ఒకసారి అరఫరోజు (అంటే అరఫాత్ మైదానంలో విడిది చేసే రోజు) ఉపవాసం పాటించారు. కాని భరించరాని ఎండవేడిని తట్టుకోడానికి నెత్తిపై నీళ్ళు చల్లుకోసాగారు. అది చూసిన ఒక వ్యక్తి ''ఉపవాసం విరమించవచ్చు గదా!'' అని సలహా ఇవ్వగా ''అరఫ రోజున ఉపవాసం ఉంటే సంవత్సరంలోని పాపాలన్నీ పరిహరించ బడతాయని దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చినపుడు నేను ఉపవాసం ఎలా విరమించను?'' అని ఆమె గతాన్ని నెమరు వేసుకున్నారు (ముస్నద్).

ఒకసారి ఒక స్త్రీ వచ్చి ''ఉమ్ముల్ మోమినీన్! గోరింటాకు పెట్టుకోవచ్చా?'' అని అడిగింది ''నా ప్రియతమునికి (సఅసం) దాని రంగు ఇష్టమే అయినా దాని వాసన పడేది కాదు. అది హరాం కాదనుకో. నువ్వు కావాలంటే పెట్టుకోవచ్చు'' అని ఆమె బదులిచ్చారు.

## పరస్పర ధార్మిక జీవితం

హజ్రత్ ఆయిషా నివాస గృహం ఒక ప్రవక్త యొక్క విశ్రాంతి గృహం. అందులో సిరి సంపదలుగానీ, భోగ భాగ్యాల సరంజామాగానీ లేదు. ఆ దంపతులకు దానిపట్ల ఆపేక్షా లేదు. ఇస్లాం ధార్మిక, ప్రాపంచిక విషయాలు సమగ్ర రూపం. గత పేజీలలో సంతోష సమయాల దృశ్యాలను మీరు తిలకించారు. అయితే అవి కేవలం మానవ నైజం వాంఛించే కొన్ని సన్నివేశాలు మాత్రమే.

https://teluguislam.net

ప్రవక్తగారి ఏకాంత మందిరాన్ని ఈక్రింది సంఘటనల వెలుగులో చూడండి - హజ్రత్ ఆయిషా (రజి) కథనం ప్రకారం ఆయన (సఅసం) ఇంట్లో ప్రవేశించేటప్పుడు మంద స్వరంలో ఇలా పలకడం రివాజు:

> ''ఆదం పుత్రుని ఆస్తిలో సిరిసంపదలతో నిండిన రెండు మైదానాలే గనక ఉంటే అతడు మూడో దాని కోసం ఆశపడతాడు. పేరాశతో కూడిన అతడి నోటిని మట్టి మాత్రమే నింపగలుగుతుంది.'' దైవం సెలవిస్తున్నాడు : ''మేము సిరి సంపదల్ని వొసగినది మా ఉనికిని గుర్తించేందుకు, నిరాధారులకు సాయపడేందుకు మాత్రమే! ఎవరైనా దైవం వైపు మరలితే దైవం కూడా అతడివైపుకు మరలుతాడు''.
>
> (ముస్నద్)

ఈ పదాలను ప్రతిరోజా వల్లెవేయడంలోని ముఖ్యోద్దేశ్యం, ప్రపంచం అస్థిరమైందనీ, సిరిసింపదలు తుచ్ఛమైనవనీ దుష్టశిక్షణ, శిష్టరక్షణకు నడుము బిగించినవారు గుర్తెరగాలన్నదే!

ఇషా నమాజ్ చేశాక ఆయన (సఅసం) తన గదిలో ప్రవేశించి మిస్వాక్‌తో పల్లుతోమిన వెంటనే నిద్రించేవారు. చివరి ఝాము న మేల్కొని, తహజ్జుద్ నమాజ్ చేసేవారు (మస్నద్). రాత్రి పూర్తయ్యే సమయంలో హజ్రత్ ఆయిషా (రజి)ను మేల్కొల్పేవారు. ఆమె కూడా ఆయన (సఅసం) వెంట నమాజ్‌లో పాల్గొనేవారు. వితర్ నమాజ్ చేసేవారు. తొలి పొడుపులోని తెలుపు ప్రస్ఫుటం అయినప్పుడు ఆయన (సఅసం) ప్రాతఃకాలపు సున్నత్ నమాజ్ చేసి ప్రక్కకు ఒత్తిగిలి పడుకునేవారు. హజ్రత్ ఆయిషా (రజి)తో కబుర్లు చెప్పేవారు (సహీహ్ ముస్లిం). తరువాత కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్ళేవారు. ఒక్కోసారి ఆమె, దైవప్రవక్త (సఅసం)తో పాటుగా రాత్రంతా దైవారాధనలో నిమగ్నులయ్యేవారు. దైవప్రవక్త (సఅసం) ఇమామ్ అయితే ఆమె ముఖ్తదీ అయ్యేవారు. దైవప్రవక్త (సఅసం) అల్‌బఖరహ్, ఆలి ఇమ్రాన్, అన్‌నిసా వంటి పెద్ద సూరాలను పఠించేవారు. ఈ పఠనంలో దేవుని హెచ్చరికలు వచ్చినప్పుడల్లా దైవాన్ని శరణుకోరేవారు. శుభవార్తగల ఆయత్‌లు వచ్చినప్పుడు వాటిపట్ల ఉత్సుకత చూపేవారు. ఇటువంటి ప్రభావ పూరిత ఆధ్యాత్మిక దృశ్యం రాత్రంతా నెలకొని ఉండేది. ప్రత్యేక సమయాలలో అంటే గ్రహణాలు వగయిరా పరిస్థితుల్లో ఆయన (సఅసం) నమాజ్ కోసం నిలబడినప్పుడు ఈవిడగారు కూడ వెంట నిలబడేవారు. దైవ ప్రవక్త (సఅసం) మస్జిద్‌లో జమాఅత్‌కు నాయకత్వం వహించి నమాజ్ చేసేటప్పుడు ఈమె తన గదిలో నిలబడి నమాజ్‌ను అనుసరించేవారు. (సహీహ్ బుఖారీ)

ఐదు పూటల నమాజ్ మరియు తహజ్జుద్ నమాజ్ మాత్రమే కాక దైవప్రవక్త (సఅసం) చేయడం చూసి ఆమె 'చాష్త్' నమాజ్ కూడ చేసేవారు (మస్నద్). తరచూ ఉపవాసాలు పాటించేవారు. ఒక్కోసారి దైవప్రవక్త (సఅసం), హజ్రత్ ఆయిషా (రజి) ఇద్దరూ కలసి ఒకేసారి ఉపవాస వ్రతం పాటించేవారు. రమజాన్ మాసం చివరి పదిరోజులలో దైవప్రవక్త (సఅసం) మస్జిద్‌లో 'ఏతెకాఫ్' పాటించేవారు. అప్పుడప్పుడు హజ్రత్ ఆయిషా (రజి) కూడా ఈ విధిలో పాలు పంచుకునేవారు. మస్జిద్ ప్రాంగణంలో ఒక డేరా ఏర్పాటు చేసేవారు. ఉదయం నమాజ్ తర్వాత దైవప్రవక్త (సఅసం) కూడా అక్కడికి వచ్చి కొంతసేపు గడిపేవారు. (సహీహ్ బుఖారీ) ఒకసారి హజ్ యాత్రలో కూడ హజ్రత్ ఆయిషా (రజి) ఆయనవెంట ఉన్నారు. హజ్ మరియు ఉమ్రా రెండూ చేయాలని సంకల్పం చేసుకున్నారు. కాని స్త్రీ సంబంధమైన అవరోధం మూలంగా ఆమె ప్రదక్షిణ (తవాఫ్) చేయలేకపోయారు. అందువల్ల ఆమెకు అమిత దుఃఖం కలిగి ఏడ్వసాగారు. దైవప్రవక్త (సఅసం) వచ్చి కారణం అడిగారు. ఆమెను ఊరడించి సందేహ నివృత్తి చేశారు. తర్వాత ఆమె తన సోదరుడు అబ్దుర్రహ్మాన్ బిన్ అబీబక్ర్ (రజి) వెంటవెళ్ళి మిగిలిన విధులు నెరవేర్చారు (సహీహ్ బుఖారీ).

## ఇంట్లో ఉన్నప్పుడూ ప్రవక్త పదవీ బాధ్యతలు

ఈ పుణ్యదంపతుల పరస్పర ప్రేమానురాగాలను గురించి పైన వివరించడం జరిగింది. ఒక కుత్సిత బుద్ధిగలవాడు గనక వాటిని చదివితే దైవప్రవక్త (సఅసం) ఇంట్లో ఉన్నప్పుడు ప్రవక్త పదవీ బాధ్యతల్ని విస్మరించారని భావించవచ్చు. కాని హజ్రత్ ఆయిషా (రజి) స్వయంగా ఏమని సెలవిచ్చారో మీరు చదివారు గదా! ''ఆయన (సఅసం) మాట్లాడుతూ ఉన్న సమయంలో అజాన్ పిలుపు గనక వినవస్తే ఆయన (సఅసం) మమ్మల్ని ఎరగనే ఎరగనట్లు లేచి వెళ్ళిపోయేవారు.''

ఆయన (సఅసం) తబూక్ యుద్ధాన్నుండి విజేతగా తిరిగి వచ్చిన సందర్భంలో హజ్రత్ ఆయిషా (రజి) సంతోషంతో స్వాగత సూచకంగా అందమైన చిత్తరువు గల పరదాను వ్రేలాడగట్టారు. దైవప్రవక్త (సఅసం) గుమ్మంలో అడుగు పెట్టగానే ఉగ్రులయ్యారు. ''దైవ ప్రవక్తా! క్షంతవ్యురాల్ని. నావల్ల జరిగిన అపరాధం ఏమిటో!'' అని హజ్రత్ ఆయిషా (రజి) దర్యాప్తు చేశారు. ''ఆయిషా! దైవం మనకు సంపదలిచ్చింది ఇటుకల్ని మట్టిని అలంకరించేందుకు కాదు'' అని ఆ నిరాడంబర జీవి వివరించారు.

ఒకరాత్రి ఆయన (సఅసం) హజ్రత్ ఆయిషా (రజి) ఇంటికి వచ్చారు. మరి వెంటనే లేచి ఒకవైపుగా బయలుదేరారు. హజ్రత్ ఆయిషా (రజి) కూడా నక్కుతూ

ఆయన్ని వెంబడించారు. ఆయన (సఅసం) బఖీ అనే కబరస్థాన్‌లో ప్రవేశించారు. చేతులెత్తి ప్రార్థనలో నిమగ్నులయ్యారు. హజ్రత్ ఆయిషా (రజి) నిలబడి దాక్కున్నారు. తిరిగి వచ్చేటప్పుడు ఆయన (సఅసం) చూసేశారు. హజ్రత్ ఆయిషా (రజి) పరుగున వెళ్లి తన గదిలో ప్రవేశించారు. ''ఆయిషా! ఇదేమిటి? ఇది నిఘా క్రిందకు వస్తుంది తెలుసా?! ఇలాంటిది (నిఘా) నిషిద్ధం సుమా!'' అని చెప్పగా ''నా తల్లిదండ్రుల్ని అర్పింతుగాక!'' అని ఆమె అంటూ జరిగిందంతా వివరించారు (నిసాయి). ఈ సంఘటనే స్వల్పమైన తేడాలతో మరికొన్ని హదీసు గ్రంథాలలోనూ పేర్కొనబడింది).

ఒకసారి ఒక యూదుడు దైవప్రవక్త (సఅసం)ను 'చావు మూడుగాక! అంటూ శాపనార్థాలు పెట్టాడు'. హజ్రత్ ఆయిషా (రజి) కోపం పట్టలేక అతడికి పరుషంగా జవాబిచ్చారు. అది చూసిన కారుణ్యమూర్తి (సఅసం) ''ఆయిషా! దేవుడు మృదు స్వభావి. ఆయన మృదుత్వాన్ని ఇష్టపడతాడు. కఠినత్వంతో ఇవ్వని దాన్ని, మృదుత్వం ద్వారా ఇస్తాడు. ఇది తప్ప మరేవిధంగానూ కటాక్షించడు'' అని ఉపదేశించారు (సహీహ్ ముస్లిం).

పట్టు వస్త్రాలను, బంగారు నగలను స్త్రీలు ఉపయోగించడం ఇస్లాంలో సబబే అయినా ప్రాపంచిక సుఖభోగాలపట్ల, అలంకారాలపట్ల ఆయన (సఅసం)కు అయిష్టత ఉండేది. ఆ కారణం చేత ఇంట్లో అటువంటి ఆడంబరాన్ని ప్రదర్శించడం కూడా అయిష్టకరమే. ఒకసారి హజ్రత్ ఆయిషా (రజి) బంగారు గాజులు ధరించారు. అదిచూసి దైవప్రవక్త (సఅసం) ఇలా అన్నారు: ''నీకింత కంటే మేలయిన ఉపాయం చెప్పనా? నువ్వీ గాజుల్ని తీసేసి వెండితో రెండు గాజులు చేయించుకుని వాటికి సింధూరపు రంగు ఎక్కించుకో.''

హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖిస్తున్నారు. 'ఆయన (సఅసం) ఐదు వస్తువుల వినియోగాన్ని మా కొరకు (ప్రవక్త ఇంటివాళ్ళ కొరకు) నిషేధించారు. పట్టుబట్టలు, బంగారు నగలు, వెండి, బంగారుపాత్రలు, ఎర్రని, మెత్తని పరుపులు, జరీ నేయబడిన పట్టువస్త్రాలు. ''దైవ ప్రవక్తా! బంగారం కస్తూరి ఉంచడానికి కావలసిన కొద్ది పరిమాణంలో వుంటే అభ్యంతరకరమా!'' అని నేనడిగితే ''వద్దు వెండినే కాస్త సింధూరంలో రంగరించుకోవచ్చు'' అని ఆయన (సఅసం) అన్నారు. (మస్నద్)

ఇంట్లో ఎల్లపుడూ - సందర్భానుసారం - నైతిక బోధనలు గరిపేవారు. అటువంటి ఉదాహరణలెన్నో ఇంతకు ముందువచ్చాయి. ఒకసారి హజ్రత్ ఆయిషా (రజి) స్వయంగా పిండి విసిరి దాంతో లడ్డూలు చేశారు. ఆయన (సఅసం) బయటినుంచి వచ్చి రావటంతోనే నమాజ్‌లో లీనమయ్యారు. ఈమెగారి కళ్ళు

https://teluguislam.net

మూతలు పడ్డాయి. ఇంతలో పొరుగువారి మేక వచ్చి అవన్నీ తినివేసింది. హజ్రత్ ఆయిషా (రజి) పరుగెత్తి దాని కొట్టబోయారు. మహాప్రవక్త (సఅసం) ఆమెను ఆపి, ''ఆయిషా! పొరుగు వారిని బాధించకు'' అని చెప్పారు.

(అదబుల్ ముఫ్రద్)

అరబ్బు దేశాలు అలవాటుగా తినే ఒక పశువు మాంసాన్ని ఎవరో ఆయన (సఅసం)కు కానుకగా పంపారు. కాని ఆయన (సఅసం)కు అదంటే ఇష్టంలేదు. అందుచేత ఆయన దాన్ని తినలేదు.

''ప్రవక్తా! మరి దీన్ని అగత్యపరులకు ఇవ్వనా?'' అని హజ్రత్ ఆయిషా అడిగారు. ''దేన్నయితే స్వయంగా నీవు తినడానికి ఇష్టపడవో దాన్ని ఇతరులకూ తినిపించకు'' అని ఆయన (స) ఉపదేశించారు.

* * *

https://teluguislam.net

# సవతులతో వ్యవహారణ

స్త్రీకి ఈ ప్రపంచంలో అతి చేదయిన విషయం తనకు సవతి ఉండటం. సవతిపోరు అని ఊరికే అన్నారా? హజ్రత్ ఆయిషా (రజి) ఒకరిద్దరూ కాదు, ఎనమండుగురు సవతులతో కలసి ఉన్నారు. అయినా ప్రవక్త సాంగత్య భాగ్యం లభించిన ఈ దర్పణాలు ఎటువంటి మాలిన్యం అంటక స్వచ్ఛంగా తళ తళ లాడాయి.

హజ్రత్ ఖదీజా (రజి) తర్వాత ఆయన (స) అనేక కారణాల దృష్ట్యా వివిధ సందర్భాలలో పది వివాహాలు చేసుకున్నారు. వారిలో దీనులమాత హజ్రత్ జైనబ్ (రజి) ఒకరు. ఈమె నికాహ్ హిజ్ర్ 3వ ఏట జరిగింది. పెండ్లి అయ్యాక ఆమె కేవలం మూడు మాసాలు మాత్రమే బ్రతికారు. మిగతా భార్యలందరూ ఆయన (సఅసం) పరమ పదించేవరకూ బ్రతికేవున్నారు. ఈ క్రింది సంవత్సరాలలో వీరి నికాహ్ జరిగింది. దీన్నిబట్టి హజ్రత్ ఆయిషా (రజి)కు ఏ సంవత్సరంలో ఎందరు సవతులుండేవారో తెలుస్తుంది.

| క్రమ సంఖ్య | పేరు | వివాహం జరిగిన సంవత్సరం |
|---|---|---|
| 1. | హజ్రత్ సౌదా (రజి) (జమా కుమార్తె) | ప్రవక్త పదవి లభించిన 10వ సంవత్సరం. |
| 2. | హజ్రత్ హఫ్స (రజి) (హజ్రత్ ఉమర్ కుమార్తె) | హిజ్రీ 3వ సంవత్సరం |
| 3. | హజ్రత్ ఉమ్మెసల్మా (రజి) | హిజ్రీ 4వ సంవత్సరం |
| 4. | హజ్రత్ జువేరియా (రజి) (ముస్తలఖ్ తెగనాయకుని కుమార్తె) | హిజ్రీ 5వ సంవత్సరం. |
| 5. | హజ్రత్ జైనబ్ (జహష్ కూతురు) | హిజ్రీ 5వ సంవత్సరం. |
| 6. | హజ్రత్ ఉమ్మె హబీబ (రజి) (అబీసుఫ్యాన్ కుమార్తె) | హిజ్రీ 6వ సంవత్సరం. |
| 7. | హజ్రత్ మైమూనా (రజి) | హిజ్రీ 7వ సంవత్సరం. |
| 8. | హజ్రత్ సఫియ (రజి) (ఖైబర్‌ప్రాంత వాసి) | హిజ్రీ 7వ సంవత్సరం. |

https://teluguislam.net

హజ్రత్ ఖదీజా (రజి) హజ్రత్ ఆయిషా (రజి) నికాహ్‌కు పూర్వమే గతించారు. అయినా దైవప్రవక్త (సఅసం) హృదయంలో ఆమె జ్ఞాపకాలు సజీవంగా నిలిచిపోయాయి. హజ్రత్ ఆయిషా (రజి) ముందు తరచుగా ఆమె గురించి మెచ్చుకోలుగా ప్రస్తావించేవారు. స్వయంగా హజ్రత్ ఆయిషా (రజి) ఇలా అంటున్నారు: ''నాకు హజ్రత్ ఖదీజా(రజి)పై కలిగినంత అసూయ మరే భార్యపైనా కలిగేది కాదు. ఎందుకంటే ఆయన (సఅసం) ఆమెను ఎంతగానో గుర్తు చేసుకునేవారు.

ఇంకా ప్రతిసంవత్సరం దైవప్రవక్త ఆమె పేరున ఖుర్బానీ ఇచ్చేవారు. ఆమె స్నేహితురాళ్ళందరికీ బహుమానాలు పంపేవారు. ఏ రకంగానూ ఆమె ఘనతా గౌరవాలపట్ల హజ్రత్ ఆయిషా(రజి)కు తిరస్కారభావం లేదు. హజ్రత్ ఆయిషా (రజి) సెలవిచ్చారు, ''దేవుడు తనప్రవక్త (సఅసం) ద్వారా ఆమెకు బెంగ విచారం లేని స్వర్గలోకపు శుభవార్త తెలిపాడు'' (సహీహ్‌బుఖారి). హజ్రత్ ఖదీజా(రజి) ఇస్లాం ఆరంభకాలానికి సంబంధించిన ముఖ్య సందర్భాల్లో-అంటే దైవప్రవక్త (సఅసం)కు ఊరట కలిగించడంలోనైతేనేమీ, కష్టాల్లో సహచారిణిగా వుండటంలోనైతేనేమీ, బాధల్లో ఓదార్చటంలోనైతేనేమీ ముఖ్యపాత్రను పోషించారు. ఆమె చేసిన అపూర్వ త్యాగాలు హజ్రత్ ఆయిషా(రజి) ద్వారానే ఉల్లేఖించబడ్డాయి. అదీ విశేషం!

హజ్రత్ ఆయిషా(రజి), హజ్రత్ సౌద(రజి) కాస్త ముందు వెనుకగా ఇద్దరూ ఒకేసారి ప్రవక్తగారి దాంపత్య బంధంలోకి వచ్చారు. కాని హజ్రత్ ఆయిషా నికాహ్ అయిన తర్వాత మూడున్నర ఏళ్ళు పుట్టింట్లోనే వున్నారు. అంటే ఈ వ్యవధిలో హజ్రత్ సౌదా(రజి) ఒక్కరే దైవప్రవక్త (సఅసం) వెంట వున్నారు. హిజ్రీ మొదటి సంవత్సరంలో హజ్రత్ ఆయిషా(రజి) కాపురానికి వచ్చినపుడు సవతిగా హజ్రత్ సౌద(రజి) వున్నారు. అటువంటి పరిస్థితుల్లో సర్వసాధారణంగా ఒకర్నొకరు తమ హక్కులకు భంగం కలిగించేవారుగా భావించడం సర్వసాధారణమే. కాని స్త్రీ స్వభావాన్ని బట్టి ఊహిస్తే ఫలితాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. వీరిద్దరి మధ్య జరిగిన సంఘటనలు పరస్పర సంఘీ భావానికీ, కలుపుగోలు తనానికి తార్కాణంగా నిలుస్తాయి. హజ్రత్ ఆయిషా(రజి)కు తరచూ ఆమె సలహాదారుగా, వ్యక్తిగత వ్యవహారాలలో స్నేహితురాలుగా వ్యవహరించేవారు. మూడు నాలుగేళ్ళ తర్వాత ఆమె ముసలి వారైపోయారు. అందుచేత తనకు దైవప్రవక్త (సఅసం) విడాకులిచ్చేస్తారేమో దైవప్రవక్త (సఅసం) సాంగత్యభాగ్యం తనకు కాకుండా పోతుందేమోనని ఆమె తలపోశారు. అందుచేత ఆమె తన 'వంతు'ను (అంటే దాంపత్య

https://teluguislam.net

హక్కుగా దైవప్రవక్త (సఅసం) భార్యలందరి దగ్గర వంతులవారీగా నివసించేవారు) హజ్రత్ ఆయిషా(రజి)కి ఇచ్చివేశారు. హజ్రత్ ఆయిషా(రజి) సంతోషంగా స్వీకరించారు. హజ్రత్ సౌద(రజి) అంటే ఆమెకు ఎంతో గౌరవం. ''ఆమె హృదయంలో నా ఆత్మ ఉంది. మరో స్త్రీని చూచినప్పుడు నాకు ఈ ఆలోచన రాదు'' అని హజ్రత్ ఆయిషా (రజి) చెప్పేవారు. కాకపోతే హజ్రత్ సౌద స్వభావంలో కాస్తంత దురుసుతనం ఉండేది. అది వేరే విషయం.

హజ్రత్ హఫ్సా(రజి) హిజ్రీ 3వ సంవత్సరంలో సతీమణులలో స్థానం పొందారు. ఆ విధంగా దాదాపు ఎనిమిదేళ్ళు హజ్రత్ ఆయిషా(రజి) వెంట ఉన్నారు. వారిద్దరిలో ఒకరు హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(రజి) ముద్దులపట్టి అయితే మరొకరు ఫారూఖె ఆజమ్ (హజ్రత్ ఉమర్ - రజి) కంటి చలువ. ఇద్దరి మధ్యా ఎంతో ప్రేమాభిమానాలు ఉండేవి. కుటుంబ వ్యవహారాలన్నింటిలో వీరిద్దరిదీ ఒకేమాట, ఒకే అభిప్రాయం. ఇరువురూ తరచూ సమాలోచన జరిపేవారు. ఇతర భార్యల కన్నా వీరిద్దరు ఒకరికొకరు చేదోడుగా ఉండేవారు (సహీహ్ ముస్లిం). అయినప్పటికీన్నీ సవతులవటం చేత ఒండొకరి మధ్య అప్పుడప్పుడూ కొద్దిపాటి ఉద్రిక్తత చోటు చేసుకోవటం సహజమే కదా!

ఒకసారి ప్రయాణంలో వీరిద్దరూ దైవప్రవక్త(స) వెంట ఉన్నారు. రాత్రిళ్ళు ఆయన (సఅసం) హజ్రత్ ఆయిషా(రజి) పల్లకిలోకి విచ్చేసేవారు. ఒకనాడు హజ్రత్ హఫ్సా(రజి) ఆయిషా (రజి)తో, 'మనిద్దరం ఒంటెలను మార్చుకుందామా' అన్నారు. ఈమె త్యాగ భావంతో అందుకు ఒప్పుకున్నారు. మరి ఆ రాత్రి దైవప్రవక్త (సఅసం) తన పల్లకిలోకి రాకపోయేసరికి మానవ సహజమైన బలహీనత మూలంగా ఆమె ఎంతో అసహనానికి, అశాంతికి లోనయ్యారు. (సహీహ్ బుఖారీ)

విజ్ఞత, వివేచనలలో హజ్రత్ ఆయిషా(రజి) తర్వాత హజ్రత్ ఉమ్మె సల్మా (రజి) - మిగతా భార్యలకన్నా - గొప్పవారు. హుదైబియా ఒడంబడిక జరిగినపుడు ఖుర్బానీ సందర్భంగా ఆమె దైవప్రవక్త (సఅసం)కు ఇచ్చిన సలహా మహిళా చరిత్రలోనే చిరస్థాయిగా జ్ఞాపకం ఉండిపోతుంది. ధర్మసందేహాలు, ధార్మిక తీర్పుల విషయంలో కూడా హజ్రత్ ఆయిషా(రజి) తర్వాత స్థానం ఆమెదే. అందుచేతనే ఆమె వృద్ధాప్యానికి చేరువయినప్పటికీ దైవ ప్రవక్త (సఅసం) ఆమెను ఎంతో గౌరవ దృష్టితో చూసేవారు. ఈ కారణాల చేత ఆమె ఆయిషా(రజి)కు సమానురాలయ్యారు. యాదృచ్ఛికంగా జరిగిన ఒక సంఘటన తప్ప వీరిద్దరి మధ్య విభేదాన్ని సూచించే అంశం ఏదీ ప్రస్తావనకు రాలేదు. ఆ సంఘటన ఏమంటే కొందరు భార్యలు ఆమెను దైవప్రవక్త (సఅసం) వద్దకు దూతగా పంపి, దైవప్రవక్త (సఅసం) ఏ భార్య దగ్గర ఉంటే అక్కడికే కానుకలు పంపబడాలనీ, ఆయిషా

https://teluguislam.net

(రజి) వంతు నాటికే అవి ప్రత్యేకించబడ కూడదని ఆయన(సఅసం) కు చెప్పేందుకు అభ్యర్థించారు. ఈవిడగారు ఆ సందేశాన్ని తీసుకుని హజ్రత్ ఆయిషా (రజి) గదికి వచ్చారు. ఎంతో గంభీరంగా సందేశాన్ని వినిపించారు. మహాప్రవక్త (సఅసం) దానికి జవాబిచ్చారు. ఆమెగారు మౌనం దాల్చారు. హజ్రత్ ఆయిషా (రజి) కూడా ఈ సంభాషణను విన్నారు. కాని ఎటువంటి అసంతృప్తినీ వెల్లడించలేదు.

(సహీహ్ బుఖారీ)

హజ్రత్ జువేరియా(రజి) మరియు హజ్రత్ ఆయిషా(రజి)ల మధ్య కూడా ఎటువంటి విభేదం పొడసూపలేదు. అయితే ఆమె ఈవిడగారి అందచందాలు చూసి హజ్రత్ ఆయిషా(రజి) ముందు తన హోదా తగ్గిపోతుందేమోనని మొదట్లో భయపడ్డారు. కాని చివరికి ఆమె ఊహ తప్పు అని తేలిపోయింది. ఆవిడ గౌరవాదరణలకు కారణాలే వేరనీ, బాహ్య సౌందర్యంతో దానికి సంబంధం లేదనీ రుజువయ్యింది.

హజ్రత్ జైనబ్ బిన్తె జహష్ దైవప్రవక్త (సఅసం) మేనత్త కూతురు. అభిమానవతి. స్వభావంలో కాస్త దూకుడు హెచ్చు. ఆ కారణంచేతనే ఆమె మొదటి భర్త ఆమెకు విడాకులు ఇచ్చారు. అంతేకాక బంధుత్వంలో మిగతా భార్యలకన్నా ఆమె దైవప్రవక్త(స) కు దగ్గరి బంధువు. ఆ కారణంచేత తాను మిగతా వారందరికన్నా గౌరవానికి ఎక్కువ అర్హురాలని ఆమె తలపోసేది. మిగతా భార్యలందరికన్నా ఈమె నాతో తరచూ పోటీ పడేదని హజ్రత్ ఆయిషా(రజి) తెలియజేస్తున్నారు. హజ్రత్ ఉమ్మె సల్మా(రజి) మౌనం వహించిన తర్వాత కొందరు భార్యలు ఈమెచేత (జైనబ్) దైవప్రవక్త(సఅసం) సమక్షానికి రాయబారం పంపారు. ఈమె ధైర్యంగా వచ్చి ప్రవక్త సమక్షంలో ఉపన్యాసం మొదలెట్టారు. హజ్రత్ ఆయిషా(రజి) నిశ్శబ్దంగా ఆమె మాటలు వింటూ ఓరచూపుతో ఆయన (సఅసం) వంక చూడసాగారు. హజ్రత్ జైనబ్(రజి) చెప్పడం ముగించాక దైవప్రవక్త (సఅసం) అంగీకారం పొంది హజ్రత్ ఆయిషా(రజి) కూడా తన వాదనను వినిపించసాగారు. ఆ వాదన ఎంత సహేతుకంగా, మరెంత సజావుగా ఉందంటే, దానికి హజ్రత్ జైనబ్ అవాక్కయి, చేష్టలుడిగి చూస్తూ నిలబడిపొయ్యారు. దైవప్రవక్త(సఅసం) ముసిముసిగా నవ్వుతూ, ''ఎంతైనా అబూబకర్ (రజి) కూతురు కదా!'' అని వ్యాఖ్యానించారు.

రమజాన్ మాసం ఆఖరి దశకంలో దైవప్రవక్త(స) ఏతెకాఫ్ పాటిస్తూ మస్జిదె నబవీలోనే ఉండేవారు. హజ్రత్ ఆయిషా(రజి) మస్జిద్ ఆవరణలో గుడారం వేయించి తాను కూడ ఏతెకాఫ్ పాటించేవారు. ప్రతిరోజూ ఉదయం ఆయన(సఅసం) ఏదన్నా పని ఉంటే అక్కడకు వచ్చేవారు. ఒక సంవత్సరం ఏం జరిగిందంటే

https://teluguislam.net

ఆనవాయితీగా ఆమె దైవప్రవక్త (సఅసం) అనుమతితో గుడారం నిర్మించారు. హజ్రత్ హఫ్స(రజి) కూడా అనుమతి కోరారు. హజ్రత్ జైనబ్(రజి)కు ఇది తెలిసి ఆమె కూడ ప్రక్కనే ఒక గుడారం నిర్మించారు. ఉదయం ఆయన(సఅసం) చూసేటప్పటికి అనేక గుడారాలు మస్జిద్ ఆవరణలో కనబడ్డాయి. ''వీళ్ళంతా చిత్తశుద్ధితో, సదుద్దేశ్యంతోనే ఇలా చేశారా?'' అంటూ గుడారాలన్నింటినీ తీసి వేయించారు. (సహీహ్ బుఖారీ)

ఒక రాత్రి హజ్రత్ జైనబ్(రజి) హజ్రత్ ఆయిషా (రజి) ఇంటికి వచ్చారు. (ఆ రోజుల్లో ఇళ్ళలో దీపాలు వెలిగేవి కావు) అదే సమయంలో దైవప్రవక్త (సఅసం) విచ్చేశారు. తిన్నగా ఒకవైపు నడిచారు. ''అక్కడ జైనబ్(రజి) ఉన్నారు'' అని హజ్రత్ ఆయిషా(రజి) అన్నారు. ఆమెకు కోపం వచ్చి ఏదో జవాబిచ్చారు. హజ్రత్ ఆయిషా(రజి) కూడా దీటుగా సమాధానం చెప్పారు. ఆ సమయంలో బయట మస్జిదె నబవీలో హజ్రత్ అబూబకర్ (రజి) ఉన్నారు. ఏదో గొడవ జరుగుతోందని పసిగట్టిన అబూబకర్(రజి) దైవప్రవక్త (సఅసం)ను బయటకు రమ్మని కేకేశారు. తండ్రి కినుక వహించడం చూచి ఆయిషా(రజి) బిత్తరపోయారు. నమాజ్ ముగించుకొని హజ్రత్ అబూబకర్(రజి) కూతురి దగ్గరకు వచ్చారు. తప్పు ఆమెది కాకపోయినా కూతురిని మందలించి వెళ్ళారు. (సహీహ్ ముస్లిం)

ఈ సంఘటనల ఆధారంగా వారి హృదయాలు పరస్పరం నిర్మలమయినవి కావు అనే నిర్ణయానికి రాకూడదు. ఇందరు మనుష్యులు ఒకేచోట ఉన్నప్పుడు ఎలాగైనా సరే వారిలో ఏకాభిప్రాయమూ, కలివిడితనం ఉండి తీరాలంటే అది కష్టసాధ్యమే. సంఘ జీవితంలో క్షణికావేశాలు చోటు చేసుకుంటుంటాయి. తాత్కాలికంగా ఏదో ఒక కారణంపై కలతలు వస్తుంటాయి. అందునా నలుగురు స్త్రీలు ఒకచోట చేరినప్పుడు, అదీ సవతులున్న చోట అవాంఛనీయమైన సంఘటనలు ఉత్పన్నం కావటం, తద్వారా అసంతృప్తి చెలరేగడం సహజం. సద్వర్తనుల సహచర్యం మనిషిని అత్యున్నత వ్యక్తిగా తీర్చి దిద్దుతుందన్న సంగతి నిజమే గాని అది అతడి నైజాన్ని మాత్రం మార్చజాలదు. ఒక స్త్రీ దేన్నయినా సహిస్తానంటుంది గాని తనకు దక్కవలసిన ప్రేమలో మరొకరు వచ్చి భాగస్వాములు కావటాన్ని సహించదు. ఆమె అలా కోరుకోవటం సహజం కూడా. ఇక్కడ జరిగిందీ అదే. మోహనుడేమో ఒక్కడే, కాని మోహితులు అనేకులు. అందరి హృదయాల్లో వెలిగేది ఒకే ప్రేమ దీపం. అయినా యాదృచ్ఛికంగానో, తాత్కాలికంగానో ఉత్పన్నమైన అడపాదడపా అవాంఛనీయ ఘటనలను ప్రక్కన పెడితే సవతులందరి మధ్య సౌమనస్యం వెల్లివిరిసిందనేది వాస్తవం. వాళ్ళు ఒండొకరి గౌరవ మర్యాదలను గుర్తెరిగి మరీ మసలుకునేవారు.

https://teluguislam.net

మరి ఈ జైనబ్‌గారే సతీమణుల జాబితాలో వచ్చి చేరినపుడు హజ్రత్ ఆయిషా(రజి) ఆమెకు శుభాకాంక్షలు అందజేశారు (సహీహ్‌బుఖారీ). అలాగే మదీనాలోని కపటులు కొందరు హజ్రత్ ఆయిషా(రజి)పై అపవాదు వేసినపుడు సోదరి మీదగల ప్రేమతో హజ్రత్ జైనబ్(రజి) సోదరి అయిన హుమ్నా బింతె జహష్ కూడా ఈ కుట్రలో చేరిపోయింది. కాని హజ్రత్ జైనబ్(రజి) అడుగులు మాత్రం ధర్మ మార్గంలో తడబడలేదు. దైవప్రవక్త (సఅసం) ఆమెను హజ్రత్ ఆయిషా(రజి) గురించి దర్యాప్తు చేసినపుడు ఆమె స్పష్టంగా ''ఆమెలో మంచి తప్ప మరేదీ నేను ఎరుగను'' అని సాక్ష్యమిచ్చారు. నిజాయితీ అంటే అది.

ఆమె తల్చుకుంటే ఒకే ఒక్క మాటతో తన ప్రత్యర్థిని చిత్తు చేయగలదు. కాని దైవప్రవక్త (సఅసం) సాంగత్య భాగ్యం అటువంటి బలహీనతలకు ఆమెను అతీతురాల్ని చేసింది. హజ్రత్ ఆయిషా (రజి) ఆమె చేసిన మేలును, చూపిన మంచితనాన్ని కృతజ్ఞతతో ఎల్లప్పుడూ గుర్తు చేసుకునేవారు. (సహీహ్ బుఖారీ)

ఒకసారి హజ్రత్ జైనబ్(రజి) హజ్రత్ సఫియా (రజి)ను ఏదో విషయమై, ఒసే యూదురాలా! అని అన్నారు. అందుకు దైవప్రవక్త (సఅసం) ఆమె పట్ల కినుక వహించారు. రెండు నెలలపాటు ఆమెతో మాట్లాడటం మానేశారు. చివరకు ఆమె హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరకు వచ్చి, ''నువ్వు కాస్త మధ్యవర్తిగా ఉండి నా తప్పుకు క్షమాభిక్ష పెట్టించు'' అని కోరారు. ఇప్పుడు అదే అవకాశం హజ్రత్ ఆయిషా(రజి)కు లభించింది. కాని ఆమె ప్రత్యేకించి సర్దుబాటు చేసే ఉద్దేశ్యంతోనే చక్కగా అలంకరించుకున్నారు. ఆయన (సఅసం) ఇంటికి రాగానే ఎంతో చక్కని రీతిలో చర్చించి ఎట్టకేలకు కథ సుఖాంతమయ్యేలా చేశారు.

(ముస్నద్ ఇబ్నెహంబల్)

ఎవరైనా మరణించిన తర్వాత వారిలోని మంచి గుణాలను గురించి చెప్పుకుంటే అది ఆ మృతుల నైతిక జీవనానికి అమరత్వం సిద్ధింపచేస్తుంది. హజ్రత్ ఆయిషా(రజి) తన ప్రత్యర్థిపై ఈ అమృత వర్షాన్ని కూడ కురిపించారు. ఆమె ఇలా తెలియజేశారు, ''దైవప్రవక్త (సఅసం) తన జీవితకాలంలో ఒకసారి తన భార్యలందరినీ సంబోధించి పలికారు : 'మీలో ఎవరి చెయ్యి పొడవుగా వుంటుందో వారు ముందుగా వచ్చి నన్ను చేరతారు.' మేమందరం మా చేతుల్ని కొలుచుకునేవాళ్లం. కాని అందరి కంటే ముందుగా హజ్రత్ జైనబ్(రజి) పరమపదించేసరికి చేతులు బారుగా ఉండటం యొక్క 'అసలు అర్థం' తెలిసొచ్చింది.'' చేతుల బారుగా ఉండటం అంటే ఆయన (సఅసం) ఉద్దేశ్యం దాతృత్వం, ధర్మగుణం. ఆమె(రజి) చేతి పనులు చేసేవారు. అలా సంపాదించిన ఆదాయాన్ని ధర్మం చేసేవారు. (అరబీ భాషలో విస్తృతంగా దాన ధర్మాలు

https://teluguislam.net

చేసేవారిని బారు చేతుల వాడని అంటారు) ఈ సంఘటనను చెప్పుకోవటం ద్వారా హ(జత్ ఆయిషా(రజి) తన సవతికి సిసలయిన శ్రద్ధాంజలి ఘటించారు.

హ(జత్ జైనబ్ (రజి) హ(జత్ ఆయిషా(రజి)ల మధ్య ఒక విషయంలో తీవ్రస్థాయిలో మాటామాటా పెరిగిన విషయం లోగడ చదివి ఉన్నాం. హ(జత్ ఆయిషా(రజి) ఈ విషయాన్ని పునరుక్తం చేసేవారు. కాని ఆమె సంకల్పంలోని చక్కదనం, పవిత్రత చూడండి, ఆ సంఘటనతో పాటు ఆమెను పొగిడేవారు కూడా. ఏమన్నారో చూడండి, ''ఆ తర్వాత జైనబ్ బిన్తె జహష్(రజి) వచ్చారు. భార్యలందరిలోకెల్లా తానే నాకు సమానురాలుగా భావించేవారు. జైనబ్(రజి) కంటే ఎక్కువ ధర్మపరాయణురాలు, నిష్ఠాపరురాలు, సూటిగా మాట్లాడేవారు, దాతృత్వ గుణం కలవారు, సాధు గుణం కలవారు, దైవ సామీప్యత కోసం కృషిచేసే ఏ స్త్రీనీ నేను చూడలేదు. కాకపోతే కాస్త దూకుడు స్వభావం ఉండేది. తన ధోరణిపై ఆమె బాధ కూడా పడుతుండేది.'' (సహీహ్‌ముస్లిం)

హ(జత్ ఉమ్మెహబీబా(రజి)తో హ(జత్ ఆయిషా(రజి)కు అనుకూలంగాగానీ, ప్రతికూలంగాగానీ జరిగిన సంఘటన ఏదీ హదీసులలో ప్రస్తావనకు రాలేదు. మరణశయ్యపై ఉండి ఒకసారి హ(జత్ ఉమ్మె హబీబా హ(జత్ ఆయిషా(రజి)ను పిలువ నంపారు. ఆమె వచ్చారు. ''సవతులన్నాక వారిలో ఎప్పుడో ఒకసారి ఏదో ఒకటి జరిగిపోతుంటుంది. ఒకవేళ ఏదయినా మన మధ్య జరిగి వుంటే దైవం మనిద్దర్నీ క్షమించుగాక!'' అని ఉమ్మె హబీబా అభిప్రాయపడ్డారు. దానికి సమాధానంగా హ(జత్ ఆయిషా (రజి) ''దైవం అందర్నీ మన్నించుగాక! మిమ్మల్ని విముక్తురాలు చేయుగాక!'' అని చెప్పారు. ''ఈ మాట చెప్పి నీవు నన్ను సంతోషపెట్టావు. దైవం నిన్ను కూడా సంతోషపెట్టుగాక!'' అన్నారు హ(జత్ ఉమ్మెహబీబా (రజి) (ఇబ్నెసాద్).

హ(జత్ మైమునా (రజి) గురించి కూడా ఎటువంటి ప్రస్తావనా రాలేదు. ఆమె మరణించినపుడు ఆమెను గురించి హ(జత్ ఆయిషా (రజి) ఇలా వ్యాఖ్యానించారు: ''ఆమె మాలో అందరికన్నా నిష్ఠాపరురాలు.''

హ(జత్ సఫియ (రజి) కేవలం మూడు సంవత్సరాలు దైవప్రవక్త (సఅసం) సహచర్యంలో వున్నారు. ప్రవక్తగారి ఇతర సతీమణులను గురించి ఆమెకు అంతగా తెలీదు కూడా. ఎందుకంటే ఆమె ఖైబర్ ప్రాంతవాసి. యూదుల ఇంట పుట్టిన స్త్రీ. ఖైబర్‌లోనే ఆమెతో దైవప్రవక్త(సఅసం) నికాహ్ జరిగింది. తిరుగు ప్రయాణంలో ఆమె దైవప్రవక్త (సఅసం) వెంటవచ్చారు. ఆమె ఒంటె అంబారీలో వుండగా (మదీనా సమీపంలో) త్రాడు తెగి ఆ అంబారీ క్రిందపడింది. ఈ వార్త విని మదీనా నుంచి చాలామంది స్త్రీలు చూడడానికి వచ్చారు.

https://teluguislam.net

సఫియ (రజి) రాకను దరిద్రంగా భావించి కాబోలు వాళ్ళు ఆమెను తిట్టిపోశారు (సహీహ్ ముస్లిం). మదీనా చేరాక ఆయన (సఅసం) ఆమెను ఒక అన్సారీ స్త్రీ ఇంట దిగబెట్టారు. వివిధ కారణాలుగా ఆమె రాక ప్రత్యేకత సంతరించుకుంది. చాలామంది స్త్రీలు ఆమెను చూసేందుకు వెళ్ళారు. హజ్రత్ ఆయిషా (రజి) కూడా ముసుగు కప్పుకొని గుంపులో నిలబడ్డారు. కాని రహస్యం దాగలేదు. దైవప్రవక్త (సఅసం) ఆమెను గుర్తు పట్టేశారు. ఆమె సిగ్గుపడి వెనక్కి మరలే సరికి దైవప్రవక్త (సఅసం) కూడా ఆమె వెనకే నడిచారు. ఆమెను సమీపించి "ఆయిషా! ఆమె గురించి నీ అభిప్రాయం ఏమిటీ?" అని అడిగితే, "చాల్లెండి. అదొక యూద స్త్రీ" అని చెప్పారామె. "అలా అనకు, ఆమె ముస్లిం అయిపోయింది" అని మహాప్రవక్త (స) ఆయిషా ధోరణిని సరిదిద్దారు.

హజ్రత్ సఫియ (రజి) వంట చేయడంలో ఫస్టు. హజ్రత్ ఆయిషా (రజి) స్వయంగా ఆమె వంటను మెచ్చుకుంటూ, "ఆమె కన్నా బాగా వండేవాళ్ళను నేను చూడలేదు" అని చెప్పేవారు. ఒకరోజు వీరిద్దరూ దైవప్రవక్త (సఅసం) కోసం వంట చేశారు. హజ్రత్ సఫియ (రజి) వంట త్వరగా తయారయింది. దైవప్రవక్త (సఅసం) హజ్రత్ ఆయిషా (రజి) గదిలో ఉన్నారు. హజ్రత్ సఫియ (రజి) భోజనాన్ని ఒక సేవకురాలి చేత అక్కడికే పంపారు. హజ్రత్ ఆయిషా (రజి) తన భాగ్యాన్ని ఎవ్వరో కొల్లగొట్టుకు పోయారన్నంతగా బాధపడ్డారు. కోపావేశంతో గింజుకుంటూ చేయి విదిలించేసరికి సేవకురాలి చేతిలోని పాత్ర కాస్తా జారి క్రిందపడి ముక్కచెక్కలయింది. దైవప్రవక్త (సఅసం) మారు మాట్లాడకుండా ఆ ముక్కల్ని ఏరివేశారు. సేవకురాలితో "మీ అమ్మగారికి కోపం వచ్చినట్టుంది" అని చెప్పారంతే. కొంత సేపయిన తర్వాత ఆయిషా (రజి) తాను చేసిన పనికి నొచ్చుకున్నారు. దైవప్రవక్త (సఅసం)తో "ఈ నేరానికి కఫ్ఫారా (పరిహారం) ఏమిటి దైవప్రవక్తా!" అని అడిగారు. "అటువంటి పాత్ర, అటువంటి భోజనమే" అన్నారు ప్రియప్రవక్త (సఅసం). కాబట్టి కొత్త పాత్రను హజ్రత్ సఫియాకు వాపసు చేశారు.

హజ్రత్ సఫియ (రజి) కాస్త పొట్టిగా ఉండేవారు. ఒకనాడు దైవప్రవక్త ఆమెను మెచ్చుకొంటూ ఉండగా హజ్రత్ ఆయిషా జోక్యం చేసుకొని "దైవప్రవక్తా! చాల్లెండి. చూడబోతే సఫియా ఇంతుంది ( పొట్టిది)" అని అన్నారు. దానికి ఆయన "ఆయిషా! నువ్వన్నమాట ఎంత కల్మషంతో కూడుకుందో తెలుసా! దాన్ని గనక సముద్రంలో కలిపితే ఆ నీరంతా చెడిపోతుంది" అని అప్రసన్నతను వ్యక్తం చేశారు. "ఓ దైవప్రవక్తా! నేను ఒక వ్యక్తి గురించి ఉన్నదున్నట్టు చెప్పాను. అంతేగా!" అని ఆమె అంటే, "నాకు అమితంగా అనుగ్రహించబడినప్పటికీ నేను ఒకరిని గురించి మరీ ఇంత విశృంఖలంగా మాట్లాడను" అని దైవప్రవక్త (స) చెప్పారు.

ఇలాంటివన్నీ తాత్కాలికమైనవి. ఇలాంటి చిన్నపాటి సంఘటనలు సతీమణుల సహజీవనంలో అడ్డంకిగా నిలిచేవి కావు. సర్వసాధారణంగా హజ్రత్ సఫియా హజ్రత్ ఆయిషాలిద్దరూ కలసిమెలసి ఉండేవారు. ఒండొరులు సహాయకులుగా మసలేవారు.

హజ్రత్ ఆయిషా (రజి) తన సవతులతో ఎంత మర్యాదగా, మరెంత న్యాయంగా, ఇంకా ఎంత ఆసక్తికరంగా వ్యవహరించేవారో మీరు పరికించారు. ఎప్పుడైనా మానవ సహజమైన బలహీనత మూలంగా - తన సవతుల గురించి అతిగా మాట్లాడినా వెంటనే తన తప్పును గ్రహించి పశ్చాత్తాపం చెందేవారామె. అనవసరంగా ఒకరి జోలికి పోయేవారు కాదు. ఎవరయినా తన జోలికి వస్తే ఊరుకునేవారు కూడా కాదు. దీటుగా సమాధానం చెప్పేవారు. అలా అని సవతులలోని సుగుణాలను మెచ్చుకోకుండా ఉండలేకపోయేవారు.

## సవతి సంతానంతో...

హజ్రత్ ఖదీజా వలన హజ్రత్ ఆయిషా (రజి)కు నలుగురు సవతి కుమార్తెలు ఉన్నారు. (1) హజ్రత్ జైనబ్ (రజి) (2) హజ్రత్ రుఖియ (రజి) (3) హజ్రత్ ఉమ్మెకుల్సూమ్ (రజి) (4) హజ్రత్ ఫాతిమా జొహరా (రజి). కాని హజ్రత్ ఆయిషా (రజి) కాపురానికి వచ్చేనాటికి హజ్రత్ ఫాతిమా (రజి) తప్ప మిగతా ముగ్గురూ తమ తమ అత్తగారిండ్లకు వెళ్ళిపోయి ఉన్నారు. వారిలో హజ్రత్ రుఖియ (రజి) హజ్రత్ ఆయిషా (రజి) కాపురానికి వచ్చి ఏడాది తిరిగే సరికే కన్నుమూశారు. హజ్రత్ జైనబ్ (రజి) మరియు హజ్రత్ ఉమ్మెకుల్సూమ్ (రజి) గారలు వరుసగా హిజ్రీ 8వ, హిజ్రీ 9వ సంవత్సరాలలో కాలధర్మం చెందారు. అంటే హజ్రత్ ఆయిషా (రజి) కళ్ళెదుట 7,8 సంవత్సరాలు జీవించి వున్నారు. అయినా వాళ్ళతో గొడవలేవీ చోటు చేసుకున్న దాఖలాలు లేవు.

దైవప్రవక్త (సఅసం) గారి పెద్ద కుమార్తె హజ్రత్ జైనబ్ (రజి) దైవమార్గంలో అమరగతులయ్యారు. ఆమెను గురించిన దైవప్రవక్త (సఅసం) పలుకులను హజ్రత్ ఆయిషా (రజి) ఉటంకించారు: ''ఆమె నా కుమార్తె లందరిలోనూ ఉత్తమురాలు, నా పట్ల గల ప్రేమ కారణంగా ఆమె బాధించబడింది.'' హజ్రత్ జైనబ్ (రజి)కు ఒక కూతురు ఉంది. పేరు ఉమామా. ఆయన (సఅసం) ఆమెను ఎంతగానో ప్రేమించేవారు. ఆమెను ఒళ్లో పెట్టుకొని మస్జిద్‌కు వెళ్ళేవారు. భుజాల కెక్కించుకునేవారు ''ఆ పిల్ల అంటే దైవప్రవక్త (సఅసం)కు పంచ ప్రాణాలు'' అని హజ్రత్ ఆయిషా (రజి) తెలియచేస్తున్నారు. ఎవరో ఒక హారం పంపితే అది ఆయిషా (రజి)కే దక్కుతుందని అందరూ భావించారు. కాని ఆయన (సఅసం) దాన్ని ఉమామాకు బహూకరించారు. (ముస్నద్)

https://teluguislam.net

హజ్రత్ ఆయిషా (రజి) కాపురానికి వచ్చే నాటికి (సవతి కూతురు) హజ్రత్ ఫాతిమా (రజి) కుమారియే. అయినా వయస్సులో మాత్రం ఆయిషా కన్నా అయిదారేళ్ళు పెద్ద. దాదాపు ఒక సంవత్సరంపాటు ఈ తల్లికూతుళ్ళు ఒకేచోట ఉన్నారు. హిజ్రీ రెండవ సంవత్సరంలో ఫాతిమా వివాహం హజ్రత్ అలీ ముర్తుజా (రజి)తో జరిగింది.

పెళ్ళికోసం కావలసిన సామగ్రిని తీర్చిదిద్దిన తల్లులలో హజ్రత్ ఆయిషా (రజి) కూడా వున్నారు. దైవప్రవక్త (సఅసం) ఆజ్ఞాపించగానే ఆమె ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు చేశారు. ఇల్లు అలికారు. ప్రక్క వేశారు. స్వహస్తాలతో ఖర్జూరపు బెరడుతో దిండ్లు తయారుచేశారు. ఖర్జూరాలు, ఎండుద్రాక్ష విందులో వడ్డించారు. నీళ్ళతిత్తి, బట్టలు వ్రేలాడగట్టడానికి కొయ్యతో ఒక వంకీ తయారు చేశారు.

''ఫాతిమా వివాహం కన్నా మంచి వివాహాన్ని నేనెక్కడా చూడలేదు'' అని ఆమె స్వయంగా అన్నారు. వివాహానంతరం బీబీ ఫాతిమా (రజి) హజ్రత్ ఆయిషా (రజి) గది ప్రక్కనే ఉన్న యింటిలో కాపురం పెట్టారు. ఇద్దరికీ అడ్డుగా ఒక గోడ మాత్రమే వుంది. దానికి ఒక కిటికీ ఉంది. ఆ కిటికీలోంచి యిద్దరూ అప్పుడప్పుడూ సంభాషించుకునేవారు.

కూతుర్ని మెచ్చుకుంటూ హజ్రత్ ఆయిషా (రజి) అన్నారు: ''నేను ఫాతిమా (రజి) కంటే (ఆమె తండ్రి తప్ప) మరే మంచి మనిషిని చూడలేదు.'' దైవప్రవక్త (సఅసం)కు అత్యంత ప్రియతములు ఎవరు? అని ఒక శిష్యుడు ప్రశ్నించగా ''ఫాతిమా'' అని ఆమె బదులిచ్చారు. ఆమె ఇంకా ఇలా వివరించారు. సమావేశం అవడం, సెలవు తీసుకోవటం, నడక - ఇత్యాది విషయాల్లో హజ్రత్ ఫాతిమా (రజి)వి అచ్చు తండ్రి పోలికలే. ఆమె తప్ప అలా చేసేవారిని నేను చూడలేదు. దైవప్రవక్త (సఅసం) సమక్షంలో ఆమె వచ్చినపుడు ఆయన (సఅసం) లేచి నిలబడి కూతురి నుదురు చుంబించేవారు. తన స్థానంలో కూర్చోబెట్టేవారు. అదేవిధంగా ఆమె యింటికి ఆయన (సఅసం) వెళితే ఆమె కూడా లేచి నిలబడి తండ్రిని ముద్దాడి తన స్థానంలో కూర్చుండబెట్టేవారు.''

''ఒకరోజు భార్యలందరూ ఆయన (సఅసం) సమక్షంలో కూర్చుని ఉండగా ఫాతిమా (రజి) అక్కడకు వచ్చారు. అచ్చం తండ్రి నడకలాగే వుంది ఆమె నడక. ఏ మాత్రం తేడా లేదు. ఆయన (సఅసం) కూతుర్ని ఎంతో ఆదరంగా పిలిచి కూర్చో పెట్టుకున్నారు. మెల్లిగా ఆమె చెవిలో ఏదో చెప్పగానే ఆమె రోదించసాగారు. ఆమె ఆందోళనను గమనించి మళ్ళీ చెవిలో ఏదో చెప్పేసరికి ఆమె నవ్వసాగారు. ''ఫాతిమా! భార్యలందర్నీ వదలి దైవప్రవక్త (సఅసం) ప్రత్యేకంగా రహస్య విషయాలు నీకు తెల్పుతుంటే ఎందుకేడుస్తావు?'' అని నేను ఓదార్చాను

https://teluguislam.net

మరి ఆయన (సఅసం) లేచి వెళ్ళిపోయిన తర్వాత నేను విషయమేమిటని అడిగాను. ''అది తండ్రిగారి రహస్యం. దాన్ని నేను బహిర్గతం చేయను'' అని ఆమె చెప్పింది. ఆయన (సఅసం) గతించిన తర్వాత నేను మరోసారి, ''ఫాతిమా! నీపై నాకున్న హక్కును బట్టి అడుగుతున్నాను. ఆ రోజు ఆయన (సఅసం) ఏం చెప్పారు?'' అని అడిగాను. దానికి, ''అవును. ఇప్పుడు చెప్పవచ్చు. ఆ రోజు నేను ఏడ్వడానికి కారణం తాను (సఅసం) త్వరలోనే ఈ లోకాన్ని వీడనున్నారని తెలియచేశారు. ''ఫాతిమా! నీవు ప్రపంచ మహిళలందరికీ నాయకురాలివి కావడం నీకిష్టం లేదా?'' అని అడిగేసరికి నాకు నవ్వొచ్చింది'' అని వివరించారు.

(సహీ ముస్లిం, సహీ బుఖారీ)

* * *

https://teluguislam.net

# అపనింద

మదీనా చేరుకున్నాక ముస్లింలు ఎదుర్కొన్న సమస్యలు, మక్కాలోని సమస్యల కంటే భిన్నమైనవి. మదీనాలో కపటుల ముఠా ఒకటి తయారయింది. ఎప్పుడు చూసినా ఇస్లాంకు వ్యతిరేకంగా కుట్రలు పన్నడమే ఆ వంచకుల ముఠా పని. మనిషికి అత్యంత విలువైనవి మాన మర్యాదలు. వాటిపై దాడి చేయడం నీచుడయిన శత్రువు చేసే పని. కాని ఇక్కడ మదీనాలో ఇస్లాంకు చిత్తశుద్ధి కలవారు, విశ్వాసపాత్రులు, ప్రేమించే మిత్రులూ లభించినట్లే, కాపట్యరోగులూ, విరోధ స్వభావులూ, ద్రోహులు అయిన శత్రువులూ తారసిల్లారు. నిష్కళంకమైన వ్యక్తిత్వాలపై నీలాపనిందలు మోపడం, అంతఃకలహాల సృష్టికి కావలసిన సరంజామాను సమకూర్చటం ఈ వంచకులకు అలవాటు. దైవసహాయం గనక సమయానికి తోడ్పడి ఉండకపోతే, వీళ్ళు విచ్ఛిన్న కార్యకలాపాల మూలంగా లోగడే ఎన్నోసార్లు ప్రవక్త సహచరుల మధ్య చిచ్చురేగి, రక్తపుటేరులు ప్రవహించి ఉండేవేమో! (కాని దైవ కృపవల్ల ఈ వంచకుల కుట్రలెన్నో భగ్నం అయ్యాయి.)

వాళ్ళ ప్రయత్నాలలో అతి హేయమైన ఉదాహరణ : ''ఇఫ్క్'' (అపనింద). అంటే హజ్రత్ ఆయిషా (రజి)పై అపవాదు వేసిన సంఘటన. ఈ కపటుల మూకకు అందరికంటే బద్ధ శత్రువులు హజ్రత్ అబూబకర్ (రజి) మరియు హజ్రత్ ఉమర్ (రజి) అని వాళ్ళకు తెలుసు. ఆ కారణం చేత దైవప్రవక్త (సఅసం) అంతఃపుర రాణులు అంటే హజ్రత్ ఆయిషా (రజి) మరియు హజ్రత్ హఫ్స (రజి)లన అపఖ్యాతి పాల్జేయడానికి వాళ్ళు ఎన్నో విఫలయత్నాలు చేశారు. వాటి దృష్టాంతాల కూడా లోగడ వచ్చాయి. మరికొన్ని మునుముందు రానున్నాయి.

నజద్ సమీపంలో బనీ ముస్తలఖ్ తెగవారి చెలమ ఒకటి వుండేది. హిజ్రీ 5. సంవత్సరం షాబాన్‌నెలలో ముస్లింలు ఈ చెలమ దగ్గరే వారితో తలపడ్డారు. రక్తపాత జరిగేటంత గొప్పయుద్ధం ఇక్కడ జరగదని తెలిసి కపటులు పెద్ద సంఖ్యలో సైన్యంలో చేరారు. ఇబ్నెసాద్ ఉల్లేఖనంలో ఉంది :

> ''మరే యుద్ధంలోనూ పాల్గొననంత పెద్ద సంఖ్యలో కపటులు ఈ యుద్ధంలో పాల్గొన్నారు.''

https://teluguislam.net

దైవప్రవక్త (సఅసం) ప్రయాణం చేయవలసి వచ్చినపుడు భార్యలపేర్లు చీటీలమీద రాసి వాటిల్లో ఒక చీటీ తీసేవారు. దానిలో ఎవరిపేరు వస్తే వారికి ప్రయాణంలో వెంట తీసుకెళ్ళడం ఆయన (సఅసం) ఆనవాయితీ. ఆ ప్రకారంగా ఈసారి హజ్రత్ ఆయిషా (రజి) ప్రయాణంలో వెంట వున్నారు. వెళ్ళేముందు ఆమె తన సోదరి అస్మా దగ్గర ఒక హారాన్ని చేబదులుగా అడిగి తీసుకుని దాన్ని మెడలో వేసుకున్నారు. హారంలోని మాలలు వదులుగా వుండి మాటిమాటికీ తెగిపోతుండేవి. అప్పటికి హజ్రత్ ఆయిషా (రజి) వయస్సు 14 ఏళ్ళు. ఈ వయసులో అతి సాధారణ ఆభరణాన్ని కూడా అత్యంత విలువయినదిగా భావించడం స్త్రీ సహజం. దానికోసం ఎటువంటి ప్రయాసకయినా ఆడవాళ్ళు సిద్ధంగా ఉంటారు.

ప్రయాణంలో హజ్రత్ ఆయిషా (రజి) తన అంబారీలో వున్నారు. ఒంటెలను తోలేవాళ్ళే అంబారీని ఒంటె పైకి ఎక్కించేవారు. పయన బృందం సాగిపోయింది. అప్పటికి ఆమె పిన్నవయస్కురాలే, సరైన పోషకాహారం దొరకని కారణంగా హజ్రత్ ఆయిషా (రజి) ఎంత సన్నగా బక్కపలచగా ఉండేవారంటే, అంబారీ మోసేవాళ్ళకి అందులో ఎవరయినా ఉన్నారో, లేదో కూడా తెలుసుకోవడం గగనమైపోయేది.

తిరుగు ప్రయాణంలో కపటులు ఎన్నోసార్లు తుంటరి పనులు చేశారు. ఒకసారయితే ముహాజిర్లు, అన్సారులు కత్తులు దూసి ఒకర్నొకరు చంపుకునేంత విషమ పరిస్థితి ఏర్పడింది. ఇస్లాంకు ఆర్థిక సాయం ఆపివేయవలసిందిగా ఆ తుంటరులు అన్సారులకు నూరిపోశారు. వారి నాయకుడయిన అబ్దుల్లా బిన్ ఉబై బహిరంగంగా ఇలా అన్నాడు :

> ''మనం మదీనాకు తిరిగి వెళ్ళగానే గౌరవనీయులు (అన్సార్లు) ఈ నీచుల్ని (ముహాజిర్లను) మదీనా నుండి వెళ్ళగొడ్తారు''
> (మునాఫికూన్ : 7).

దైవప్రవక్త (సఅసం) అన్సారులను సమావేశపరచి ఈ విషయాన్ని గురించి దర్యాప్తు చేయగా వాళ్ళు ఈ నేరంలో భాగస్థులు కారని తేలింది. అయినా వారు ఈ పరిణామానికి సిగ్గుపడి, బాధతో కుంచించుకుపోయారు. దీని వెనుక ''కథానాయకుడు'' ఎవరో వారికి తెలుసు. అబ్దుల్లా బిన్ ఉబై పట్ల ప్రజల్లో ఏహ్యత ఏర్పడింది. ఎవరో కాదు స్వయానా అతని కన్నకొడుకే తండ్రి గుర్రపు కళ్ళాన్ని పట్టుకొని, ''నువ్వే నీచుడవనీ, ముహమ్మద్ (సఅసం) గారు గౌరవనీయులనీ ఒప్పుకునేవరకూ నేను నిన్ను విడిచిపెట్టను'' అని నిలదీశాడు.

(సూరయె మునాఫికూన్ వివరణ: సహీహ్ బుఖారీ)

https://teluguislam.net

బిడారు రాత్రిపూట ఒకచోట మజిలీ చేసింది. ఆఖరు జాములో తిరుగు ప్రయాణానికి సన్నాహాలు మొదలయ్యాయి. హజ్రత్ ఆయిషా (రజి) కాలకృత్యాలు తీర్చుకోవడానికి బృందానికి దూరంగా చాటు ప్రదేశానికి వెళ్ళారు. తిరిగి వచ్చేటప్పుడు అనుకోకుండా మెడమీదికి చేయి వెళ్ళింది. హారం చూస్తే కనబడలేదు. చిన్నవయసు, అదీగాక ఒకరి దగ్గర బదులు తీసుకున్న వస్తువు. అందుచేత గాభరాపడుతూ అక్కడే వెతకసాగారు. ప్రయాణానుభవం అంతగా లేనందువల్ల, బిడారు తిరిగి వెళ్ళేలోపే హారం వెతుక్కుని వెళ్ళిపోవచ్చులే అని భావించడంవల్ల ఈ విషయాన్ని ఇతరులకు తెలియపర్చడం కానీ, ఒంటెలను తోలేవాళ్ళని తాను వచ్చేవరకూ నిరీక్షించమని ఆజ్ఞాపించడంగానీ చేయలేక పోయారు. ఒంటెలు తోలేవాళ్ళు మామూలుగానే అంబారీని ఒంటెలపై కెక్కించి బిడారు వెంట ప్రయాణమయ్యారు. కాస్సేపు వెదికిన తర్వాత హారం అయితే దొరికింది. గాని బిడారు వెళ్ళిపోయింది. మజిలీ చేసిన చోటికి వచ్చేసరికి నిర్మానుష్యంగా కన్పించింది.

చేసేది లేక దుప్పటి కప్పుకొని అక్కడే కూలబడ్డారు. తాను అంబారీలో లేని విషయం తెలుసుకుని వాళ్ళే తనను తీసుకుపోయేందుకు వస్తారులే అని అనుకున్నారు. సఫ్వాన్ (రజి) బిన్ ముఅత్తల్ అనే ఒక సహాబి (రియర్ గార్డ్) ఉండేవారు. తమ సైనికుల నుండి చేజారిన వస్తువులను సమీకరించేందుకు సైన్యం వెనక ఉండటం ఆయన విధి. ఆయన బిడారును చేరుకున్నప్పుడు దూరాన ఒక మనిషికనిపించారు. పరదా ఆజ్ఞ వెలువడక మునుపు ఆ సహచరుడు హజ్రత్ ఆయిషా (రజి)ను చూసి ఉన్నారు. ఆమెను వెంటనే గుర్తుపట్టారు. దగ్గరగా వచ్చి, ''ఇన్నాలిల్లాహ్...'' పఠించారు. ఆ చప్పుడు విని హజ్రత్ ఆయిషా (రజి) నిద్రనుండి ఉలిక్కిపడి లేచారు. సఫ్వాన్ తన ఒంటెను కూర్చుండబెట్టారు. ఆమె ఒంటె ఎక్కగానే ఆ తర్వాతి మజిలీవైపుకు నడిచారు ఆ సహాబి. బిడారు మధ్యాహ్నం వేళ ఒకచోట మజిలీ చేస్తుండగా ఎదురుగా అంబారీ కనబడింది. సఫ్వాన్ చేతిలో ఒంటె త్రాడు వుంది. అంబారీలో హజ్రత్ ఆయిషా (రజి) వున్నారు. ఇది అతి మామూలు విషయం. ప్రయాణాలలో తరచుగా జరిగేదే.

హిందువులలో సీతపై, ఇస్రాయీల్ వంశీయుల్లో హజ్రత్ మరియమ్ (అలై) పై వచ్చిన అపవాదుల్లాగే ఇస్లాంలో కూడ ఈ నింద పునరావృతమయింది. పగ చల్లారని మనసు కల అబ్దుల్లా బిన్ ఉబై (కపటుల నాయకుడు) ఈ సంఘటనను అవకాశంగా తీసుకున్నాడు. ఇప్పుడామె శీలవతి కాదన్న (దైవం మన్నించుగాక!) అపవాదును ప్రచారం చేశాడు. వెళ్ళిన చోటల్లా ఈ విషయాన్ని వ్యాపింపచేశాడు. సహృదయులయిన ముస్లింలు ఈ అపవాదు విని చెవులు మూసుకుని, ''అల్లాహ్

https://teluguislam.net

పవిత్రుడు. ఇదైతే గొప్ప అపవాదు మాత్రమే'' అని పలికారు. హజ్రత్ అబూ అయ్యూబ్ (రజి) తన భార్యతో, ''ఉమ్మె అయ్యూబ్! ఒకవేళ ఎవరయినా నీకీ విషయం చెబితే నమ్ముతావా?'' అని అడగ్గా ''అస్తగ్‌ఫిరుల్లాహ్! (దైవం క్షమించుగాక!) మర్యాదస్తుడెవడైనా ఈ పని చేస్తాడా?'' అని అబ్బురం చెందారు. ''హజ్రత్ ఆయిషా (రజి) నీకన్నా ఎక్కువ గౌరవనీయురాలు. ఆమెవల్ల జరిగే పనేనా ఇది!'' అని అబూ అయూబ్ ఆశ్చర్యపోయారు. అబ్దుల్లా బిన్ ఉబైతోపాటు మరోముగ్గురు మదీనాలో ఈ కుట్రలో పాలుపంచుకున్నారు. హసాన్ బిన్ సాబిత్ (రజి), హుమ్నా బిన్తె జహష్ మరియు ముస్తహ్ బిన్ అసాస. వాస్తవానికి వీరిలో మొదటి ఇద్దరూ అసలు ఈ ప్రయాణంలో పాలుపంచుకోనే లేదు. హజ్రత్ హసాన్ (రజి) (అల్లాహ్ క్షమించుగాక!)కు అసలు సంఘటనపై అంతగా ఆసక్తి లేదు. సఫ్వాన్ పట్లగల ఈర్ష్యవల్ల సఫ్వాన్ పరువు పోయినందుకే సంతోషం కలిగింది ఈయనకు.

హుమ్నా : ఈమె ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ జైనబ్ బిన్తె జహష్ (రజి)గారి చెల్లెలు. ఈమెగారేమో హజ్రత్ ఆయిషా (రజి)ను అణగదొక్కి, తన అక్క కీర్తి ప్రతిష్ఠలను పెంచి వేసేందుకు ఇదే మంచి అవకాశం అని భావించింది. కాని ముస్తహ్ కూడ ఈ కుట్రలో పాలుపంచుకోవడం ఆశ్చర్యకరం. ఎందుకంటే అతను హజ్రత్ అబూబకర్ (రజి)కు బంధువు. అంతేకాదు, అబూ బకర్ (రజి) గారి ఆర్థికసాయంతోనే అతని ఇంట పొయ్యి వెలిగేది.

ప్రపంచంలో మానాభిమానాలకన్నా సున్నితమైన వస్తువు మరేదీ లేదు. అది రాయి విసిరితే పగలడం గాకుండా రాయి విసరాలన్న తలంపుకే నుజ్జు నుజ్జు అయ్యే అద్దం లాంటిది. ఆత్మాభిమానం గల పుణ్యాత్ముడికి వ్యతిరేకంగా ఒక తుంటరి ఎటువంటి తప్పుడు మాటను అన్నా ఆ పెద్దమనిషి సిగ్గుతో కుంచించుకుపోతాడు. లేదా ఆగ్రహంతో అగ్గిమీద గుగ్గిలం అవుతాడు. బయట ఇంత జరుగుతున్నా సుశీలయగు హజ్రత్ ఆయిషా (రజి)కు తన చుట్టూ జరుగుతున్నదేమిటో తెలిసిరాలేదు. అనుకోకుండా ఒకరోజు రాత్రి ముస్తహ్ తల్లివెంట ఆమె బహిర్భూమికి - జనవాసాలకు దూరంగా - వెళుతుండగా ముస్తహ్ తల్లికి ఎదురు దెబ్బ తగిలింది. తక్షణం ఆమె తన కొడుక్కి శాపనార్థాలు పెట్టింది. హజ్రత్ ఆయిషా (రజి) ఆశ్చర్యచకితురాలై ''అయ్యో! ప్రవక్త (సఅసం) ప్రత్యక్ష సహచరుని తిడుతున్నావేమిటి'' అని అడిగారు. ముస్తహ్ తల్లి, అంతకు ముందు జరిగినదంతా వివరించేసరికి, ఆమె పాదాలకింద నేల కంపించింది. నవనాడులూ స్తంభించి పోయిన ఆమె వచ్చిన పని మర్చిపోయి అలానే వెనక్కి మరలారు. ఇంతపెద్ద మాట వినవస్తుందని ఎన్నడూ ఊహించనయినా లేదు. తిన్నగా పుట్టింటికి వచ్చి

https://teluguislam.net

తల్లిని అడిగితే ఆమె ఓదార్పు మాటలు చెప్పింది. ఇంతలో ఒక అన్సారీ స్త్రీ వచ్చింది. ఆమె కథంతా పూసగుచ్చినట్లు వివరించింది. వినగానే స్పృహ తప్పి పడిపోయారు హజ్రత్ ఆయిషా (రజి). తల్లి దండ్రులు సముదాయించి ఇంటికి పంపారు. ఇక్కడికి చేరాక తీవ్రమయిన జ్వరం, వణుకు ఆరంభమయ్యాయి. అటువంటి పరిస్థితిలో మనిషికి రకరకాల ఆలోచనలు వస్తాయి. ప్రతి చిన్న విషయానికి కుశంక కలుగుతుంది. ఆయన (సఅసం) బయటి నుండి వచ్చి నిల్చున్నపళంగా ''ఆమెకు ఇప్పుడెలా వుంది?'' అని అడిగేవారు. తనకు జ్వరం వచ్చినందున మహాప్రవక్త ఏదో కుశల ప్రశ్నలు వేస్తున్నారే తప్ప మనస్ఫూర్తిగా తనపై ప్రేమ చూపటం లేదన్న అనుమానం ఆమెకు వచ్చింది. దాంతో మరింతగా కృంగిపోయారు. భర్త అనుమతి పొంది ఆమె తిరిగి పుట్టింటికి వచ్చేశారు. రాత్రింబవళ్ళు కంటికి మంటికి ఏకధారగా కన్నీరు కార్చారు. ఆ కన్నీరు ఆగలేదు. కంటికి నిద్రా లేదు. 'ఏడ్చి ఏడ్చి గుండె పగులుతుందేమో ఏడవకు తల్లీ' అని బుజ్జగించేవారు కన్నతండ్రి. ''అమ్మా! భర్తకు ప్రియాతి ప్రియమైన ఏ భార్యయినా ఇలాంటి క్షోభకు గురి కావాల్సి వస్తుందే'' అంటూ కన్నతల్లి ధైర్యం నూరిపోసేది. ఒకసారి అవమాన భారంతో బావిలో దూకి ప్రాణత్యాగం చేద్దామన్న తలంపు కూడా వచ్చిందామెకు.

సఫ్వాన్‌కు హజ్రత్ హసాన్ ధోరణి తెలిసి ఆవేశంతో ఊగిపోయారు: ''దైవసాక్షి! నేనిప్పటి వరకూ ఏ స్త్రీనీ తాకనయినా లేదు'' అని ప్రమాణం చేయడమేగాక కోపంతో కరవాలం చేబూని హసాన్ (రజి) అన్వేషణలో బయలుదేరారు.

ఆయన్ని పట్టి దైవప్రవక్త (సఅసం) సమక్షంలో తెచ్చారు. దైవప్రవక్త (సఅసం) ఆయన తప్పిదాన్ని మన్నింపచేశారు. పరిహారంగా హజ్రత్ హస్సాన్ (రజ)కు ఆస్తి ఇప్పించారు.

ఉమ్ముల్‌మోమినీన్ నిరపరాధి అన్నది నిర్వివాదాంశం అయినప్పటికీ దుష్టశక్తుల నోరు మూయించడానికి విచారణ అవసరం అయింది. అందుచేత దైవప్రవక్త (సఅసం) హజ్రత్ అలీ (రజి), హజ్రత్ ఉసామా (రజి)లను సంప్రదించారు. హజ్రత్ ఉసామా (రజి) సాంత్వన వచనాలు పలికారు. హజ్రత్ ఆయిషా (రజి) నిర్దోషి అని సమర్థించారు. హజ్రత్ అలీ (రజి)గారు, ''ప్రపంచంలో స్త్రీలే కరువయ్యారా?! (అంటే లోకులు ఆడిపోసుకుంటారనుకుంటే దీనికి తల ఒగ్గి విడాకులిచ్చేయండి) సేవకురాలిని అడగండి. ఆమె ఉన్నదున్నట్లు చెప్పేస్తుంది'' అని అభిప్రాయపడ్డారు. సూచనప్రాయంగా అడిగితే ఆమెకు ఏమీ అర్థం కానేలేదు. సాధారణ పరిస్థితులను గురించి ఎంక్వారీ చేస్తున్నారనుకొని, ''ఆమెలో ఏ లోపమూ లేదు. కాని చిన్నతనం కదా! పడుకుందంటే మేక వచ్చి పిండి తినేసిపోతుంది'' అని

https://teluguislam.net

జవాబిచ్చింది సేవకురాలు. చివరకు ఆమెతో స్పష్టంగా ప్రశ్నిస్తే ఆమె ఇలా బదులిచ్చింది:

''సుబ్‌హానల్లాహ్! దైవం సాక్షి! కంసాలి మేలిమి బంగారాన్ని ఎరిగినట్లే నేను ఆమెను ఎరుగుదును. (ఆమె పవిత్రురాలు).''

కొన్ని ఉల్లేఖనాలలో 'హ(జత్ అలీ (రజి) సేవకురాలిని కొట్టారు' అని కూడా వుంది. హ(జత్ అలీ (రజి) యొక్క ఈ నిర్దాక్షిణ్య ధోరణి చూచి ఆయిషా (రజి)కు క్షోభ కలిగి వుంటుందని ప్రజలు భావించారు. బనూ ఉమయ్యా తన పరిపాలనా కాలంలో హ(జత్ అలీ (రజి)పై చేసిన ఆరోపణల్లో ఇదికూడా ఒకటి. కాని సమయోచితంగా ఇమామ్ జుహ్రీ ఎంతో ధైర్యంగా దీన్ని ఖండించారు : అది వేరే సంగతి. సవతులలో హ(జత్ జైనబ్ (రజి) హ(జత్ ఆయిషా (రజి)కు సమానురాలినని చెప్పుకునేవారు. ఆమె సోదరి హమ్నా ఈ కుట్రలో పాలు కూడ పంచుకుంది. అందుచేత దైవప్రవక్త (సఅసం) జైనబ్ అభిప్రాయం కూడా తీసుకున్నారు. ఆమె చెవులు మూసుకుంటూ, ''ఆయిషా (రజి)లో మేలు తప్ప మరేదీ నేను చూడలేదు'' అని సాక్ష్యమిచ్చారామె. ఆ తర్వాత ఆయన (సఅసం) మస్జిద్‌లో సహచరులందర్నీ సమావేశపర్చి ప్రసంగించారు. ప్రవక్త (సఅసం) గృహం యొక్క పవిత్రతను, అబ్దుల్లా బిన్ ఉబై యొక్క నీచత్వాన్ని ప్రస్తావించారు. ఆయన (సఅసం) ఇంకా ఇలా పలికారు :

''ముసల్మానులారా! దీక్షాపరులయిన వారిపై ఒక తుంటరి అభాండాలు వేస్తున్నాడని తెలిసింది. నా తరఫున ఆ తుంటరిని శిక్షించేవారెవరు?'' ఔస్ తెగ నాయకుడైన హ(జత్ సాద్‌బిన్ మాజ్ (రజి) లేచి నిలబడి, 'దైవప్రవక్తా! నేను ఆ పని చేస్తాను. ఒకవేళ ఆ దుర్మార్గుడు మా తెగకు చెందినవాడే అయితే ఇప్పుడే వాడి తల తెగి కిందపడుతుంది. ఒకవేళ అతను మా సహోదర ఖజ్‌రజ్ తెగకు చెందిన వాడయితే తమరు ఆజ్ఞాపించండి. మేము మీ ఆజ్ఞను శిరసావహించేందుకు సిద్ధంగా ఉన్నాము' అని అన్నారు.

ఔస్, ఖజ్‌రజ్ తెగల మధ్య తరతరాలుగా వైషమ్యం కొనసాగుతూ వస్తోంది. ఇస్లాం ఆవిర్భవించిన తరువాత ఈ పీడను అణచివేసింది. కాని ఆ అగ్నికణం బూడిద క్రింద ఇంకా అణగి ఉంది. ఏ కొద్దిగా విసరినా అది తిరిగి రాజుకునేలా ఉంది. ఖజ్‌రజ్ నాయకుడు సాద్ బిన్ ఉబాదా (రజి) ఈ విషయంలో వెంటనే కల్పించుకుని, 'ఆయన తన తెగకు సంబంధించినంత వరకు తన ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు. కాని ఇతర తెగల వ్యవహారాలలో తలదూర్చే అధికారం ఆయన కెక్కడిది? ఆయన తన తెగకు సంబంధించినంత వరకు దైవప్రవక్త (సఅసం) సమక్షంలో స్వయంగా చెప్పుకోవచ్చు' అనన్నారు. వాస్తవానికి తుంటరులు ఆ తెగకు

https://teluguislam.net

సంబంధించినవారే. ఇంతకు ముందే హసాన్ సంఘటన పరిణామం ఏమైందో అందరికీ తెలిసిందే. ఆయన సాద్ బిన్ మాజ్ (రజి)ని ఉద్దేశ్యించి, 'నువ్వయితే ప్రాణాలు తియ్యలేవు. నీలో అంత దమ్ము ఎక్కడిది?' అని రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడారు. ఇబ్నెమాజ్ బాబాయి కొడుకు ఉసైద్ బిన్ హుజైర్ (రజి) వెంటనే కల్పించుకుని, ''సాద్! ఏమిటీ కపట వైఖరి? కపటులను వెనకేసుకొస్తున్నావా?'' అని విసురుగా జవాబిచ్చారు. వ్యవహారం ముదిరేటట్లు ఉంది. రెండు తెగలవారూ కత్తులు దూసుకుని ముందుకు రాబోయేంతలో దైవప్రవక్త (సఅసం) వాళ్ళని శాంతపర్చారు. గొడవ సద్దుమణిగింది.

ఆయన (సఅసం) అక్కణ్ణుంచి బయలుదేరి హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరకొచ్చారు. ఆమె వ్యాధితో మంచాన పడ్డారు. ఆమె కళ్ళు చెమర్చి ఉన్నాయి. తల్లిదండ్రులు సపర్యలు చేస్తూ కనబడ్డారు. దైవప్రవక్త (సఅసం) ఆమె దగ్గరగా వెళ్ళి కూర్చున్నారు. ''ఆయిషా! నీవు అపరాధివి అయితే పశ్చాత్తాప పడు. దేవుడు మన్నిస్తాడు. ఒకవేళ నీవు నిరపరాధివైతే దైవమే స్వయంగా నీ పవిత్రత, పాతివ్రత్యాల గురించి సాక్ష్యమిస్తాడు'' అని సలహా ఇచ్చారు.

ఆయన (సఅసం)కు జవాబివ్వమని ఆమె తల్లిదండ్రులు ఆమెకు సైగ చేశారు. అంతకు మించి వాళ్లు ఏమీ చెప్పలేకపోయారు. హజ్రత్ ఆయిషా (రజి) తెలియజేస్తున్నారు, ''నా కళ్లల్లో నీరు ఇంకిపోయింది. కంట్లో ఒక్క చుక్క కూడా కన్నీరు లేకుండా పోయింది. కార్చేందుకు కన్నీళ్ళు కూడా కరవయ్యాయి. అయితే నేను నిర్దోషినన్న సంగతి నాకు బాగా తెలుసు. నేను నిర్దోషినే అన్న విషయం దైవం బాగా ఎరుగు. ఒకవేళ నేను నేరం ఒప్పేసుకుంటే పోతుందేమో అనుకుంటే ఈ అపనింద వాస్తవమేనేమో అన్న అనుమానం మిగిలిపోతుంది. లేదూ, ఒకవేళ తిరస్కరించానే అనుకుందాం, ఈ జనం నమ్మేదెప్పుడు?''

ఈ విధంగా ఆమె అంతరంగంలో మధనపడుతూ ఏమీతోచక మిన్నకుండిపోయారు. ఆమె అప్పటి తన పరిస్థితిని వివరిస్తూ అన్నారు, ''అప్పటి నా స్థితి హజ్రత్ యూసుఫ్ (అలై) తండ్రికి ఎదురయిన పరిస్థితి లాంటిది. (ఎంత ఆలోచించినా హజ్రత్ యాకూబ్ (అలై) పేరు ఆమెకు గుర్తుకు రాలేదు)

ఈ కలకలం రేపటంలో కపటుల ఉద్దేశ్యాలు వేరు.

1. (దైవం క్షమించుగాక!) దైవప్రవక్త (సఅసం) మరియు అబూబకర్ సిద్దీఖ్ (రజి) కుటుంబాలను అపఖ్యాతి పాల్జేయడం.

2. దైవప్రవక్త (సఅసం) కుటుంబంలో కలతలు రేపడం.

https://teluguislam.net

3. ఇస్లాం ప్రబోధించిన సోదర భావాన్ని భగ్నం చేసి, ముస్లిం సమాజంలోని సంఘటితత్వాన్ని నీరుగార్చటం. ఈ కుయుక్తుల్లో కపటులు చాలా వరకు సఫలీకృతులయ్యారు కూడా. అందుచేత అగోచర జ్ఞాని అయిన అల్లాహ్ సాక్ష్యమివ్వవలసిన తరుణం ఆసన్నమయింది. చివరకు అదే జరిగింది. హజ్రత్ ఆయిషా (రజి) తెలియజేస్తున్నారు! ''ఆయన (సఅసం) పై వహీ అవతరించిన సూచనలు ప్రస్ఫుటమయ్యాయి: ఆయన చిరునవ్వుతో తల పైకెత్తారు. నుదుట ఏర్పడ్డ చెమట బిందువులు ముత్యాల్లా రాలుతున్నాయి. ఆ సందర్భంగా ఆయన పారాయణం చేసిన దైవ వచనాల సారాంశం ఇది :

إِنَّ الَّذِينَ جَاءُو بِالْإِفْكِ عُصْبَةٌ مِّنكُمْ لَا تَحْسَبُوهُ
شَرًّا لَّكُم بَلْ هُوَ خَيْرٌ لَّكُمْ لِكُلِّ امْرِئٍ مِّنْهُم مَّا اكْتَسَبَ
مِنَ الْإِثْمِ وَالَّذِي تَوَلَّىٰ كِبْرَهُ مِنْهُمْ لَهُ عَذَابٌ
عَظِيمٌ ○

لَّوْلَا إِذْ سَمِعْتُمُوهُ ظَنَّ الْمُؤْمِنُونَ وَالْمُؤْمِنَٰتُ
بِأَنفُسِهِمْ خَيْرًا وَقَالُوا هَٰذَا إِفْكٌ مُّبِينٌ ○

لَّوْلَا جَاءُو عَلَيْهِ بِأَرْبَعَةِ شُهَدَاءَ فَإِذْ لَمْ يَأْتُوا
بِالشُّهَدَاءِ فَأُولَٰئِكَ عِندَ اللَّهِ هُمُ الْكَٰذِبُونَ ○
وَلَوْلَا فَضْلُ اللَّهِ عَلَيْكُمْ وَرَحْمَتُهُ فِي الدُّنْيَا وَ
الْآخِرَةِ لَمَسَّكُمْ فِي مَا أَفَضْتُمْ فِيهِ عَذَابٌ عَظِيمٌ ○
إِذْ تَلَقَّوْنَهُ بِأَلْسِنَتِكُمْ وَتَقُولُونَ بِأَفْوَاهِكُم مَّا لَيْسَ
لَكُم بِهِ عِلْمٌ وَتَحْسَبُونَهُ هَيِّنًا وَهُوَ عِندَ اللَّهِ
عَظِيمٌ ○
وَلَوْلَا إِذْ سَمِعْتُمُوهُ قُلْتُم مَّا يَكُونُ لَنَا أَن نَّتَكَلَّمَ
بِهَٰذَا سُبْحَٰنَكَ هَٰذَا بُهْتَٰنٌ عَظِيمٌ ○

يَعِظُكُمُ اللّٰهُ اَنْ تَعُوْدُوْا لِمِثْلِهٖٓ اَبَدًا اِنْ كُنْتُمْ مُّؤْمِنِيْنَ ۝

وَ يُبَيِّنُ اللّٰهُ لَكُمُ الْاٰيٰتِ وَاللّٰهُ عَلِيْمٌ حَكِيْمٌ ۝

اِنَّ الَّذِيْنَ يُحِبُّوْنَ اَنْ تَشِيْعَ الْفَاحِشَةُ فِي الَّذِيْنَ اٰمَنُوْا لَهُمْ عَذَابٌ اَلِيْمٌ فِي الدُّنْيَا وَالْاٰخِرَةِ وَاللّٰهُ يَعْلَمُ وَاَنْتُمْ لَا تَعْلَمُوْنَ ۝

''నిందారోపణ చేసినవారు మీలోని కొందరే. దాన్ని నీవు చెడుగా భావించకు. పైగా ఇందులో నీ శ్రేయమే ఉంది (అంటే ఈ సంఘటన ద్వారా విశ్వాసులు ఎవరో, కపటులు ఎవరో స్పష్టమైపోయింది). ఈ వ్యవహారంలో ఎవరు ఎంత భాగం పంచుకున్నారో అంతే పాపాన్ని మూటగట్టుకున్నారు. ఇందులోని ప్రముఖ పాత్రధారికయితే చాలా తీవ్రమయిన శిక్ష ఉంది. ఈ అపవాదును గురించి విన్నప్పుడే విశ్వాసులయిన స్త్రీలూ, పురుషులూ తమ సోదరీ సోదరులపట్ల సద్భావనను ఎందుకు ఏర్పరచుకోలేదు? ఇది పచ్చి అబద్ధం అని (అప్పుడే) ఎందుకు చెప్పలేకపోయారు?! మరి వాళ్ళు (కూడా తమ ఆరోపణకు ఆధారంగా) నలుగురు సాక్షుల్ని ఎందుకు తేలేదు? సాక్షుల్ని తేలేక పోయినందున వాళ్ళే అల్లాహ్ దృష్టిలో అబద్ధాల కోరులయ్యారు. ఇహపరాలలో మీపై దేవుని దయాదాక్షిణ్యాలే గనక ఉండక పోయినట్లయితే మీరు వ్యాపింపజేసిన వదంతులుకుగాను మీపై పెద్ద ఆపదే వచ్చిపడేది. (ఆ సమయంలో మీరు ఎంత పెద్ద తప్పు చేస్తూ పోయారో కాస్త ఆలోచించుకోండి) ఆ సమయంలో మీనోట వెలువడే మాటలకు, చిలువలు పలువలుగా మీరు చెప్పుకుపోయే వాటిని గురించి అసలు మీకు ఏమీ తెలియనే తెలీదు. మీరు దాన్నొక మామూలు విషయంగా తీసుకున్నారు. కాని అల్లాహ్ దృష్టిలో అది చాలా పెద్ద (తీవ్రమైన) విషయం. దాన్ని గురించి వినగానే మీరు ''ఇటువంటి మాటలు పలకడం మాకు శోభించదు. అల్లాహ్ పవిత్రుడు. ఇదైతే గొప్ప అపవాదు మాత్రమే'' అని ఎందుకు చెప్పలేదు? మీరే గనక విశ్వాసులయితే ఇక ముందెప్పుడూ ఇలాంటి పనులు చేయవద్దని అల్లాహ్ మిమ్మల్ని ఉపదేశిస్తున్నాడు. ఇంకా

అల్లాహ్ మీకు స్పష్టమయిన సూచనలిస్తున్నాడు: ఆయన సర్వజ్ఞాని మరియు వివేకి. విశ్వసించిన వారిలో నీతి బాహ్యత వ్యాపించాలని కోరుకునేవారు ఇహ, పరలోకాలలో బాధాకరమైన శిక్షకు అర్హులు. అల్లాహ్ సర్వం ఎరిగినవాడు, కాని మీకు ఏమీ తెలీదు'' (నూర్ 11-20).

إِنَّ الَّذِينَ يَرْمُونَ الْمُحْصَنَاتِ الْغَافِلَاتِ الْمُؤْمِنَاتِ لُعِنُوا فِي الدُّنْيَا وَالْآخِرَةِ وَلَهُمْ عَذَابٌ عَظِيمٌ

يَوْمَ تَشْهَدُ عَلَيْهِمْ أَلْسِنَتُهُمْ وَأَيْدِيهِمْ وَأَرْجُلُهُمْ بِمَا كَانُوا يَعْمَلُونَ

సౌశీల్యవతులు, అమాయకులైన ముస్లిం స్త్రీలపై అపనిందలు వేసేవారు, ప్రాపంచికంగానూ, పరలోక పరంగానూ ధూత్కరించబడ్డారు. వారికొరకు అతి బాధాకరమైన యాతన వుంది. ఏరోజైతే స్వయంగా వారి నాలుకలు, వారి కాళ్ళు చేతులూ వారి కర్మలను గురించి సాక్ష్యం పలుకుతాయో ఆరోజును వారు మరువరాదు (నూర్: 23,24).

సందేహం తీరిపోయింది. అనుమానాలన్నీ పటాపంచలైపోయాయి. హజ్రత్ ఆయిషా (రజి) పవిత్రతను గురించి స్వయంగా దేవుడు ధృవీకరించాడు.

''అమ్మా! లే. నీ భర్తకు కృతజ్ఞతలు తెలుపుకో'' అని తల్లిగారు చెబితే, స్త్రీ సహజమైన గర్వాతిశయంతో హజ్రత్ ఆయిషా, ''నేను కేవలం నా ప్రభువుకే తప్ప మరెవ్వరికీ కృతజ్ఞురాల్ని కాను'' అని జవాబిచ్చారు. ఆ తర్వాత, చట్టప్రకారం ముగ్గురు అపరాధులకూ ఎనభైయ్యేసి చొప్పున కొరడా దెబ్బల శిక్ష విధించబడింది. (సహీహ్ ముస్లిం, సహీహ్ బుఖారీ)

## సర్ విలియం మ్యూర్ వక్రీకరణ

''లైఫ్ ఆఫ్ ముహమ్మద్'' గ్రంథంలో సర్ విలియం మ్యూర్ పై సంఘటనను వివరించడంలో చారిత్రకంగానూ, సాహిత్యపరంగానూ శృతి మించిపోయాడు. ఆయనగారు చేసిన తప్పుల్లో ఒకటి మచ్చుకి వివరిస్తున్నాము. ఆయన ఇలా వ్రాశాడు:

''బనీ ముస్తలఖ్ తెగపైకి పంపబడిన బృందం మదీనా తిరిగి వచ్చినప్పుడు, హ(జత్ ఆయిషా (రజి) అంబారీ ఆయన (సఅసం) గుమ్మం దగ్గర - మస్జిద్ ప్రక్కన - దింపబడింది. కాని దాన్ని విప్పినప్పుడు అది ఖాళీగా వుంది. కొంతసేపటికి ముహాజిర్ అయిన సఫ్వాన్ కనబడ్డారు. ఒంటె మీద హ(జత్ ఆయిషా (రజి) వున్నారు. సఫ్వాన్ ముందు నడుస్తున్నారు.''

ఇంకా ఇలా వ్రాశాడు:

''సఫ్వాన్ వడివడిగా నడిచినప్పటికీ, సైన్యాన్ని అందుకోవటంలో కృతకృత్యుడు కాలేదు. మనుష్యులు దిగి గుడారం నిలిపాక ఆయిషా (రజి), సఫ్వాన్ మార్గదర్శకత్వంలో ప్రజల సమక్షంలో నగరప్రవేశం చేశారు.''

ఈ రెండు కథనాలూ హదీసు మరియు జీవిత చరిత్ర పుస్తకాలన్నింటికీ విరుద్ధమైనవే. ఈ చిత్రీకరణ వెనుక మ్యూర్ ఉద్దేశ్యమల్లా ఒక్కటే - పరిస్థితిని వీలైనంత అనుమానాస్పదంగా, తీవ్రాతి తీవ్రంగా మలచటం. వాస్తవానికి సఫ్వాన్ కొన్ని గంటలు గడిచిన మీదట మధ్యాహ్నం పూట తదుపరి మజిలీలో - సైన్యాన్ని చేరుకున్నారు. అసలు ఇది మదీనాలో సంభవించిన సంఘటనే కాదు.

## 'తయమ్ముమ్' ఆజ్ఞ

మరొక ప్రయాణంలో హ(జత్ ఆయిషా (రజి) దైవప్రవక్త (సఅసం) వెంట వున్నారు. అదే హారం మెడలో వుంది. తిరుగు ప్రయాణంలో ఒకచోట చేరుకునే సరికి హారం తెగి క్రిందపడింది. గతంలో జరిగిన సంఘటన ఆమెకు గుణపాఠం నేర్పింది. ఈసారి వెంటనే విషయాన్ని దైవప్రవక్త (సఅసం)కు తెలియచేశారు. ఉదయానికి ముందే ఆయన (స) విడిది చేశారు. హారాన్ని వెదికేందుకు ఒక మనిషిని పంపారు. సైన్యం విడిది చేసినచోట చూస్తే నీరు అస్సలు లేవు. నమాజ్‌కు వేళవుతోంది. బృందంలోని వాళ్ళంతా కంగారుగా హ(జత్ అబూబకర్ (రజి) దగ్గర కెళ్ళి హ(జత్ ఆయిషా (రజి) తమను ఎటువంటి చిక్కుల్లో పడవేశారో చూడమని మొత్తుకున్నారు. ఆయన తిన్నగా హ(జత్ ఆయిషా (రజి) ఉన్న చోటికి వెళ్ళారు. అక్కడేమో దైవప్రవక్త (సఅసం) ఆమె మోకాళ్ళపై తలవుంచి విశ్రాంతి తీసుకుంటున్నారు. కూతురి నుద్దేశ్యించి ''నువ్వు రోజుకో కొత్త సమస్య అందరి నెత్తినా తెచ్చి పెడుతుంటావు'' అంటూ కోపంగా ఆమెను గిల్లారు. దైవప్రవక్త (సఅసం) విశ్రాంతికి ఎక్కడ భంగం కలుగుతుందోనన్న ఉద్దేశ్యంతో ఆమె కదలకుండా, మెదలకుండా అలాగే ఉండిపోయారు.

https://teluguislam.net

దైవప్రవక్త (సఅసం) తెలతెల వారుతుండగా మేల్కొన్న తర్వాత జరిగిన విషయం తెలిసింది. ఇస్లామీయ ఆజ్ఞల ప్రత్యేకత ఏమంటే అవి ఎప్పుడూ తత్సంబంధిత సంఘటనలు తారసిల్లినపుడే అవతరించాయి. ఇస్లాంలో నమాజ్ కోసం వుజూ చేయడం తప్పనిసరి. కాని నీళ్ళు దొరకని సందర్భాలు కోకొల్లలు. ఈ సందర్భం కూడా ఆ కోవకు చెందినదే. అందుచేత ఈ సందర్భంగా పవిత్ర ఖుర్ఆన్‌లోని ఈ వాక్యం అవతరించింది.

وَاِنْ كُنْتُمْ مَّرْضٰٓى اَوْ عَلٰى سَفَرٍ اَوْ جَآءَ اَحَدٌ مِّنْكُمْ مِّنَ
الْغَآئِطِ اَوْ لٰمَسْتُمُ النِّسَآءَ فَلَمْ تَجِدُوْا مَآءً فَتَيَمَّمُوْا
صَعِيْدًا طَيِّبًا فَامْسَحُوْا بِوُجُوْهِكُمْ وَاَيْدِيْكُمْ مِّنْهُ

"మీరు ఎప్పుడయినా రోగగ్రస్తులయినా, ప్రయాణంలో వున్నా లేక కాలకృత్యాలు తీర్చుకున్నా లేక స్త్రీలతో సంగమించినా మీకు నీరు దొరకని పక్షంలో పరిశుభ్రమైన (పొడి) మట్టిని ఉపయోగించండి. దాంతో మీ ముఖాలను, చేతుల్ని స్పృశించండి.

(అల్‌మాయిద : 6)

అప్పటిదాకా చిక్కుల్లో పడి కొట్టుమిట్టాడుతున్న యోధుల సమూహం ఈ కారుణ్య మేఘాన్ని చూసి సంతోష సాగరంలో మునిగి తేలింది. ఇస్లాం అనుయాయులు తమ మాతృమూర్తి (ఉమ్ముల్ మోమినీన్) కోసం చేతులెత్తి దుఆ చేశారు. హ(జత్ ఉసైద్ బిన్ హుజైర్ (రజి) అనే ప్రఖ్యాత సహాబీ సంతోషాతిశయంతో "ఓ సిద్దీఖ్ (రజి) ఇంటివారలారా! ఇస్లాంలో మీ ద్వారా లభించిన అనుగ్రహాలలో ఇది మొట్టమొదటిది" అని ప్రకటించారు. అప్పటివరకూ తన కుమార్తెవల్ల ఎదురవుతున్న ఇబ్బందులతో విసుగెత్తిపోయిన హ(జత్ అబూబకర్ సగర్వంగా పుత్రికా రత్నాన్ని సంబోధించి, "బంగారు తల్లీ! నీవింతటి శుభకరమైన దానివని నాకు తెలియదమ్మా! నీ ద్వారా దేవుడు ముస్లింలకు ఎంతటి సౌలభ్యాన్ని ప్రసాదించాడు!" అని పలికారు.

తీరా ప్రయాణం కొనసాగించేందుకు సిద్ధమయి, ఒంటెను పైకి లేపగానే అక్కడే - దానిక్రిందే - హారం పడివుంది.

https://teluguislam.net

# మూడు ముఖ్య సంఘటనలు

## (తహ్‌రీమ్, ఈలా, తఖ్‌యీర్)

### 1. తహ్‌రీమ్ సంఘటన

ప్రియప్రవక్త ( సఅసం) సతీమణుల్లో రెండు బృందాలు ఉండేవి. ఒక బృందంలో హజ్రత్ ఆయిషా (రజి), హజ్రత్ హఫ్సా (రజి), హజ్రత్ సౌదా (రజి) హజ్రత్ సఫియ (రజి) ఉన్నారు. రెండో దాంట్లో హజ్రత్ జైనబ్ (రజి) ఇంకా మిగతా భార్యలు ఉన్నారు.

అస్ర్ నమాజ్ తర్వాత భార్యలందరి దగ్గరకు పోయి కొద్ది కొద్ది సేపు కూర్చోవడం ఆయన (సఅసం) కు అలవాటు. సాధ్యమైనంత వరకూ దైవప్రవక్త(స) ఎవరి పట్లా ఎటువంటి మొగ్గూ చూపకుండా ఖచ్చితమైన న్యాయం పాటించేవారు. కాని అనుకోకుండా హజ్రత్ జైనబ్(రజి) ఇంట కొన్నాళ్లు మామూలుకంటే కొంచెం ఎక్కువ సేపు గడప సాగారు. అందుచేత నిర్ణీత వేళల్లో ఆయన (సఅసం) రాక కోసం భార్యలందరూ ఎదురు చూసేవారు. హజ్రత్ ఆయిషా(రజి) ఈ ఆలస్యానికి కారణం ఆరా తీయగా, హజ్రత్ జైనబ్ (రజి) బంధువు ఎవరో తేనె పంపించారనీ, ఆయన (సఅసం)కు తేనె అంటే మక్కువ కాబట్టి ఆమె రోజూ ఆయన (సఅసం)కు తేనె సమర్పిస్తున్నారనీ, ఆయనగారేమో ఆవిడగారి చిత్తశుద్ధికి సంతోషించి ఆ తేనెను తిరస్కరించేవారు కాదనీ ఈ కారణం చేతనే రోజు వారీ దిన చర్యలో కాస్త మార్పు వచ్చిందనీ తెలియవచ్చింది.

హజ్రత్ ఆయిషా (రజి)గారు తన సవతులైన హజ్రత్ హఫ్సా (రజి), హజ్రత్ సౌద (రజి)లతో సంప్రదించి దీనికేదన్నా ఉపాయం ఆలోచించాలన్న నిర్ణయాని కొచ్చారు. దైవ ప్రవక్త (సఅసం) పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. ఏకాస్త వాసన వేసినా ఆయన (సఅసం) కు భరించరానిదయేది. తేనెటీగలు ఏపూలపై వాలి తేనెను కూడబెడతాయో, ఆ తేనెలో కూడా అదే విధమైన వాసన, రుచి ఉంటాయి. అరేబియాలో 'ముగాఫీర్' అనే పూలు పూస్తాయి. ఆ పూవులో ఒక విధమైన ఘాటైన వాసన వుంటుంది.

హజ్రత్ ఆయిషా (రజి) మిగతా యిద్దరికీ నూరిపోశారు. దైవ ప్రవక్త (సఅసం) వారి దగ్గరకు విచ్చేసినపుడు, ''ఓ దైవప్రవక్తా (సఅసం) ! మీ నోట అదో రకమైన వాసన వస్తుందేమిటీ?'' అని అడగాలి. ''తేనె సేవించాను'' అని అంటే ''బహుశా ముగాఫిర్ పూల తేనె కాబోలు'' అని అనాలి. ఆ ప్రకారంగానే జరిగింది. ఆయన (సఅసం)కు తేనె పట్ల అయిష్టత ఏర్పడింది. ఇక ఎన్నడూ తేనె సేవించకూడదని ప్రతిన బూనారు.

ఇది సామాన్యజనుల విషయంలో జరిగిన సంఘటన అయితే అదో విశేషం కాజాలదు. కాని ఇదొక గొప్ప నాయక శిఖామణి పట్ల జరిగిన వ్యవహారం. ఆయన పలికే ఒక్కో మాట పెద్ద పెద్ద చట్టాలకు ప్రాతిపదికయి పోతుంది. అందుకే పరమప్రభువు తన సందేశహరుని ధోరణికి కోపగించుకున్నాడు. ఈ నేపథ్యంలోనే సూరయె తహ్రీమ్ యొక్క ప్రారంభవాక్యాలు అవతరించాయి.

يَآَيُّهَا النَّبِيُّ لِمَ تُحَرِّمُ مَآ اَحَلَّ اللّٰهُ لَكَ ۚ تَبْتَغِيْ
مَرْضَاتَ اَزْوَاجِكَ ۗ وَاللّٰهُ غَفُوْرٌ رَّحِيْمٌ ○
قَدْ فَرَضَ اللّٰهُ لَكُمْ تَحِلَّةَ اَيْمَانِكُمْ ۚ وَاللّٰهُ مَوْلٰىكُمْ ۚ
وَهُوَ الْعَلِيْمُ الْحَكِيْمُ ○

ఓ ప్రవక్తా ! దైవం నీకోసం హలాల్ (ధర్మ సమ్మతం) చేసిన దానిని నీ భార్యల మెప్పు కోసం నీపై హరాం (నిషిద్ధం) ఎందుకు చేసుకుంటావు, అల్లాహ్ క్షమించేవాడూ, కరుణించే వాడూను. ఇంకా ఆయన మీ ప్రతిజ్ఞల నుండి మీరు బయటపడే పద్ధతిని నిర్ధారించాడు. అల్లాహ్యే మీ యజమానీ, ఆయనే సర్వజ్ఞాని మరియు వివేచనా శీలి.

(తహ్రీమ్ - 1,2)

ఆ రోజుల్లోనే దైవప్రవక్త (సఅసం) ఒక రహస్య విషయాన్ని హజ్రత్ హఫ్సా (రజి)కు చెప్పారు. ఆమెగారు దాన్ని కాస్తా హజ్రత్ ఆయిషా (రజి) చెవిన వేశారు. ఆ సందర్భంగానే దివ్య ఖుర్ఆన్లో ఈ ఆయత్లు అవతరించాయి.

https://teluguislam.net

وَإِذْ أَسَرَّ النَّبِيُّ إِلَىٰ بَعْضِ أَزْوَاجِهِ حَدِيثًا فَلَمَّا
نَبَّأَتْ بِهِ وَأَظْهَرَهُ اللَّهُ عَلَيْهِ عَرَّفَ بَعْضَهُ وَ
أَعْرَضَ عَنْ بَعْضٍ فَلَمَّا نَبَّأَهَا بِهِ قَالَتْ مَنْ
أَنْبَأَكَ هَٰذَا قَالَ نَبَّأَنِيَ الْعَلِيمُ الْخَبِيرُ ○

ఇంకా ప్రవక్త తన భార్యలలో ఒకరికి రహస్య విషయాన్ని తెలియ చేశారు. ఆమె మరొకరికి ఆ విషయాన్ని తెలియ పర్చింది. మరి దైవం తన ప్రవక్తకు (గుట్టురట్టయిన) సంగతి తెలియజేశాడు. దానిపై ప్రవక్త తన భార్యకు ఆమె తప్పిదాన్ని కొంత తెలిపాడు. కొంత తెలుప లేదు. ''మీకెవరు చెప్పారు ?'' అని ఆమె అడిగినపుడు, ''నాకు సర్వము ఎరిగిన వాడు, జ్ఞాని అయిన వాడు తెలిపాడు '' అని ప్రవక్త జవాబిచ్చారు. (తహ్రీమ్ : 3)

إِنْ تَتُوبَا إِلَى اللَّهِ فَقَدْ صَغَتْ قُلُوبُكُمَا وَإِنْ
تَظَاهَرَا عَلَيْهِ فَإِنَّ اللَّهَ هُوَ مَوْلَاهُ وَجِبْرِيلُ وَ
صَالِحُ الْمُؤْمِنِينَ وَالْمَلَائِكَةُ بَعْدَ ذَٰلِكَ ظَهِيرٌ ○

''ఒక వేళ (సతీమణులైన) మీరిద్దరూ పశ్చాత్తాపం చెందితే అదే మీకు శ్రేయస్కరం. ఎందుకంటే మీ హృదయాలు సన్మార్గంలో తడబడ్డాయి. ఒకవేళ దీనిపై మీరిద్దరూ మొండిగా వ్యవహరిస్తే అల్లాహ్‌యే తన ప్రవక్తకు సంరక్షకుడన్న సంగతిని మరువకండి. ఆ పైన జిబ్రయీల్, సద్వర్తనులైన సమస్త విశ్వాసులు, సకల దైవదూతలు ఆయనకు (ప్రవక్తకు) సహాయకులుగా నిలుస్తారు.''
(తహ్రీమ్ : 4)

## 2. ఈలా సంఘటన :

'తహ్రీమ్' సంఘటన తరువాత వెంటనే 'ఈలా' సంఘటన ఎదురయింది. ఇవి రెండూ హిజ్రీ 9 వ సంవత్సరంలో ఉత్పన్నమయ్యాయి. అప్పటికి అరేబియా

https://teluguislam.net

మొదలు సుదూర ప్రాంతాలు ఇస్లామీయ పతాక ఛాయలోకి వచ్చి చేరాయి. ఆ ప్రాంతాలనుంచి విజయధనం, వార్షిక తహసీళ్ళు, ఆహారధాన్యాలు - మదీనాకు వస్తుండేవి. అయితే మాత్రం ? దైవప్రవక్త (సఅసం) తమకున్న దాంట్లోనే సర్దుకుంటూ, ఉన్ననాడు తింటూ లేనినాడు పస్తులుంటూ నిష్ఠానియమాలతో జీవితం గడిపిన వైనం చూచాయగా గతంలో వచ్చింది.

ఖైబర్ విజయం తరువాత ప్రభుత్వ ఖజానాకు సిరిసంపదలు పుష్కలంగానే వచ్చాయి. అయితే ప్రవక్త (సఅసం) సతీమణుల కోసం కేటాయించబడ్డ ఆహార వస్తువుల పరిమాణం తక్కువే. అంటే దాతృత్వం, అడిగితే లేదనకుండా ఇచ్చే స్వభావాల కారణంగా ప్రవక్త సతీమణులు సంవత్సరం పొడవునా అతికష్టం మీద పొదుపుగా వాడగలిగేవారు. ఇంట్లో తరచుగా పస్తులు గడిచేవి. పవిత్ర సతీమణుల్లో పెద్దపెద్ద తెగల నాయకుల కుమార్తెలే గాక రాజకుమార్తెలు కూడ వున్నారు. వీరు గతంలో తమ యిళ్లలోను లేక తమ పూర్వ భర్తల యిళ్ళలోనూ విలాసవంతమైన జీవితం గడిపిన వారే కాబట్టి వాళ్ళు ఈ పరిమిత ఆర్థిక ఒనరుల్ని చూచి కాస్త దిగులు చెందారు. తమ సాలుసరి ఖర్చులకు ఇచ్చే మొత్తాన్ని పెంచమని భర్తగారిని కోరారు.

ఈ సంగతి తెలిసి హ(జత్ ఉమర్ (రజి) ఎంతో కలత చెంది, తమ కూతురికి, ''నీవు దైవప్రవక్త(సఅసం) ను ఖర్చుల కోసం నిలదీస్తున్నావా? నీకేమన్నా కావాలంటే నన్నడుగు. దైవంసాక్షి! దైవ ప్రవక్త (సఅసం) నా మొహం చూసి వూరుకున్నారు గాని లేకుంటే నీకు విడాకులు ఇచ్చేసి ఉండేవారు'' అని మందలించారు. ఆ తర్వాత హ(జత్ ఉమర్ సతీమణులందరి యిళ్ళకూ వెళ్ళి వారికీ నచ్చజెప్పారు. ''ఉమర్! మీరు ప్రతి విషయంలోనూ తల దూరుస్తూనే ఉంటారు గదా ! ఆఖరికి ఆయన (సఅసం) భార్యల విషయంలో కూడా జోక్యం చేసుకుంటున్నారా?'' అని హ(జత్ ఉమ్మెసల్మా (రజి) సూటిగా చెప్పేసరికి హ(జత్ ఉమర్ (రజి) ఖిన్నులయి మౌనం వహించారు. ఒకసారి హ(జత్ అబూబకర్ (రజి), హ(జత్ ఉమర్ (రజి) ఇద్దరూ దైవప్రవక్త (సఅసం) సమక్షంలో హాజరయ్యారు. అక్కడ చూస్తే దైవ ప్రవక్త (సఅసం), ఆయనకు చెరి ప్రక్కలా భార్యలూ కూర్చుని వున్నారు. వీళ్ళంతా ఖర్చులకై ఇచ్చే మొత్తాన్ని పెంచమని కోరుతున్నారు. వీళ్ళిద్దరూ తమ కూతుళ్లను కొట్టబోయారు. అయితే ఆయిషా (రజి), హఫ్సా (రజి) ఇద్దరూ ఇకపైన ఖర్చులకోసం దైవప్రవక్త (సఅసం) ను ఇబ్బంది పెట్టబోమని మాటిచ్చారు.

మిగతా భార్యలు మాత్రం తమ డిమాండ్లను వెనక్కి తీసుకోలేదు. ఆ రోజుల్లోనే అనుకోకుండా ఆయన (సఅసం) గుర్రంపై నుండి క్రింద పడ్డారు. భుజమ్మీద ఒక చెట్టు వేరు గీరుకు పోయింది. హ(జత్ ఆయిషా(రజి) ఇంటికి అనుకుని ఎత్తయిన

భాగం ఉంది. ఆ రోజుల్లో అది భోజనశాలగానూ, నిరీక్షణా స్థలంగానూ ఉపయోగపడేది. దైవప్రవక్త (సఅసం) అక్కడే వెళ్ళి బసచేశారు. ఒక నెల రోజుల వరకు సతీమణులను కలుసుకోకూడదని నిర్ణయించుకున్నారు. ఆయన (సఅసం) భార్యలందరికీ విడాకులిచ్చేశారని కపటులు ప్రచారం మొదలెట్టారు. సహాబా (రజి) అందరూ మస్జిద్‌లో సమావేశమయ్యారు. ఈ సంఘటన పెద్ద సంచలనమే సృష్టించింది. ఎవరినోట విన్నా ఈ చర్చే. ప్రవక్త (సఅసం) సతీమణులు దుఃఖంతో కుమిలిపోసాగారు. అసలేం జరిగిందో అడిగేందుకు ఎవరూ సాహసించ లేదు.

హజ్రత్ ఉమర్ (రజి) కు ఈ సంగతి తెలిసి మస్జిదె నబవీకి వచ్చారు. సహచరులందరూ విచారవదనాలతో నోట మాటల్లేక గుడ్లప్పగించి నిలబడి పోయారు. హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (సఅసం) ను కలుసుకునేందుకు అనుమతి కోరారు. కాని ఆయన (సఅసం) దగ్గరనుంచి రెండుసార్లు ఎటువంటి జవాబూ రాలేదు. ఆఖరికి మూడోసారి అనుమతి లభించింది. లోపలికి వెళ్లి చూస్తే ఏముంది, దైవప్రవక్త (సఅసం) ఒక నులక మంచంపై పడుకుని ఉన్నారు. పవిత్ర శరీరంపై నులకతాటిగుర్తులు ఉన్నాయి. తలపైకెత్తి అటూ ఇటూ చూశారు హజ్రత్ ఉమర్ (రజి). కారుణ్యమూర్తి (సఅసం) విశ్రాంతి గదిలో కొన్ని మట్టి పాత్రలు కొన్ని నీళ్ళతిత్తులూ తప్ప మరేమి లేవు. ఇది చూసిన ఉమర్ (రజి) కళ్ళలో నీళ్ళు నిలిచాయి. ''దైవప్రవక్తా! మీరు భార్యలకు విడాకులిచ్చారా ?'' అని ప్రశ్నించారు. ''లేదు'' అని జవాబు వచ్చింది. ''మరయితే ఈ విషయం ముస్లింలకు వెల్లడించమంటారా ?'' అని అడిగిఆయన (సఅసం) అనుమతితో బిగ్గరగా ''అల్లాహు అక్బర్'' అంటూ నినాదమిచ్చారు.

అది 29 రోజుల మాసం. హజ్రత్ ఆయిషా (రజి) ఇలా అంటున్నారు : ''నేను ఒక్కోరోజు లెక్క పెడుతూ ఉండేదాన్ని''. 29 రోజులయ్యాయి. అప్పుడు ఆయన (సఅసం) మిద్దె భాగంనుండి దిగివచ్చారు. అందరికన్నా ముందు ఆయన హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరకు వెళ్ళారు. ఆమె అడిగారు ''దైవప్రవక్తా (సఅసం)! మీరు నెల రోజుల నియమం పెట్టుకున్నారుగా. ఇవాల్టికి 29 రోజులే'' అని ఆమె కవ్వింపు ధోరణిలో చెప్పారు. దానికి ఆయన రెచ్చి పోలేదు (చంద్రమానం ప్రకారం) 29 రోజుల నెల కూడా వస్తుంది'' అని బదులిచ్చారు.

## 3. తఖ్‌యీర్

అటు ఒకవైపు కొందరు భార్యలు తమ భత్యాన్ని పెంచమని మాటిమాటికీ అడుగుతున్నారు. కాని దైవ ప్రవక్త కేవలం తన భార్యల మెప్పుకోసమని ఐహిక సుఖాల వ్యామోహానికి లోనుకాలేదు. ఈ సందర్భంగా 'తఖ్‌యీర్' ఆయత్‌లు అవతరించాయి. అంటే ఏ భార్య అయినా తాను కోరితే పస్తులతో కూడిన జీవితాన్ని

https://teluguislam.net

గడిపి ప్రవక్త సాంగత్య భాగ్యాన్ని పొందవచ్చు. తద్వారా పరలోక భాగ్యాన్ని పొందవచ్చు. లేదంటే వేర్పడిపోయి ప్రపంచ సుఖాల తృష్ణ తీర్చుకోవచ్చు. ఆయత్‌లో ఈ విధంగా చెప్పబడింది:

يَاأَيُّهَا النَّبِيُّ قُلْ لِأَزْوَاجِكَ إِنْ كُنْتُنَّ تُرِدْنَ الْحَيٰوةَ
الدُّنْيَا وَزِيْنَتَهَا فَتَعَالَيْنَ أُمَتِّعْكُنَّ وَأُسَرِّحْكُنَّ
سَرَاحًا جَمِيْلًا ○
وَإِنْ كُنْتُنَّ تُرِدْنَ اللهَ وَرَسُوْلَهٗ وَالدَّارَ الْاٰخِرَةَ
فَإِنَّ اللهَ أَعَدَّ لِلْمُحْسِنٰتِ مِنْكُنَّ أَجْرًا عَظِيْمًا ○

''ఓ ప్రవక్తా! మీ భార్యలకు చెప్పేయండి: ఒకవేళ మీకు ప్రాపంచిక జీవితం మరియు దాని పటాటోపాల తృష్ణ ఉంటే రండి, మీకు ఇవ్వవలసినదేదో ఇచ్చేసి వీడ్కోలు చెబుతాను. ఒకవేళ మీకు దైవం, దైవ ప్రవక్త మరియు పరలోకంపట్ల ఆపేక్ష ఉంటే మీలోని పుణ్యవతులకు అల్లాహ్ గొప్ప ప్రతిఫలం సిద్ధం చేసి ఉంచాడని తెలుసుకోండి''. (అహ్‌జాబ్ : 28, 29)

ఈ ఆదేశం అవతరించిన మీదట ఆయన (సఅసం) ముందుగా హ|జ్రత్ ఆయిషా (రజి) ఇంటికి వెళ్ళి, ''ఆయిషా! నీకొక విషయం చెబుతాను. దాని జవాబు నీ తల్లిదండ్రుల్ని సంప్రదించి ఇవ్వు'' అన్నారు. ఆమె (రజి) ''సెలవీయండి'' అన్నారు. ఆయన (సఅసం) పై ఆయత్‌ను చదివి వినిపించారు. దానికి ఆమె, ''దైవప్రవక్తా! ఏ విషయంలో నా తల్లిదండ్రుల్ని సంప్రదించమంటారు? నేను దేవుడు మరియు దైవప్రవక్తనే అనుసరిస్తాను'' అని తన తిరుగులేని నిర్ణయం ప్రకటించారు. ఈ జవాబు విని ఆయన (సఅసం) మోముపై సంతోషముతో కూడిన భావాలు ప్రస్ఫుటమయ్యాయి. అయితే హ|జ్రత్ ఆయిషా (రజి) ఈ సందర్భంగా ఒక కోరిక మాత్రం కోరారు. తాను గైకొన్న నిర్ణయం గురించి ఇతర భార్యలకు తెలియనీయవద్దని ఆమె కోరారు. అందుకు ప్రవక్త (సఅసం) ఏమని జవాబిచ్చారో తెలుసా?! ''నేను ప్రబోధకునిగా వచ్చానేగాని బలాత్కారిగా రాలేదు'' అని అన్నారాయన. (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం)

https://teluguislam.net

# వైధవ్యం

ఏ ఇల్లాలు కూడా వైధవ్యాన్ని కోరుకోదు. వైధవ్యం ఆమె కష్టాలు, కడగండ్లకు పరాకాష్ఠవంటిది. హజ్రత్ ఆయిషా (రజి) 18 ఏళ్ళ ప్రాయంలో ఉండగా దైవప్రవక్త (సఅసం) పరలోకానికి సాగిపోయారు. దైవ ప్రవక్త (సఅసం) మరియు హజ్రత్ ఆయిషా (రజి) మధ్యగల చిత్తశుద్ధి, ప్రేమ ప్రతిచోటా ప్రస్ఫుటం అవుతుంది. హిజ్రీ 11వ సంవత్సరం సఫర్ నెలకు పూర్వం ఒక రోజు దైవప్రవక్త (సఅసం) హజ్రత్ ఆయిషా (రజి) కుటీరంలో విచ్చేశారు. ఆమె విపరీతమైన తలనొప్పితో మూలుగుతున్నారు. ''నాకంటే ముందు నీవు చనిపోతే నా చేతులమీదే నీకు అంత్యక్రియలు జరిపించేవాణ్ణి'' అని దైవప్రవక్త (సఅసం) చెప్పారు. దానికి హజ్రత్ ఆయిషా (రజి) ఎటువంటి దాపరికం లేకుండా ''చాల్లెద్దురూ! అదే గనక జరిగితే మీరు ఈ కుటీరంలోకి మరో కొత్త భార్యను పెళ్ళాడి తెచ్చుకుంటారు. అంతేగా!'' అని బదులిచ్చారు. ఆయన (సఅసం) తన తలపై చెయ్యివేసుకుని ''అబ్బా, నా తల'' అన్నారు. ఆ క్షణం నుంచే ప్రారంభమయింది తలనొప్పి. హజ్రత్ మైమూన (రజి) ఇంటికి వెళ్ళి అక్కడే మంచం పట్టారు. అటువంటి పరిస్థితిలోనూ భార్యల బాగోగులు పట్టించుకోవడం మానలేదు. 'మామూలు' ప్రకారం ఒక్కో రోజు ఒక్కో కుటీరంలో విశ్రమించేవారు. కాని ప్రతిరోజు 'రేపు నేనెక్కడ ఉంటాను?' అని దర్యాప్తు చేసేవారు. భార్యలందరికీ ఆయన మనోగతం అర్థమయిపోయింది. హజ్రత్ ఆయిషా (రజి) ఇంట ఉండేందుకు అందరూ అనుమతినిచ్చారు. అప్పటి నుండి అంతిమ శ్వాస వరకూ ఆయన (సఅసం) హజ్రత్ ఆయిషా (రజి) కుటీరంలోనే నివసించారు.

అలా కోరడానికి కారణం బహుశా హజ్రత్ ఆయిషా (రజి) పట్ల గల ప్రేమ కావచ్చని సామాన్యులు భావిస్తారు. కాని లోగడ వివరించినట్లుగా దైవం హజ్రత్ ఆయిషా (రజి)కు అసాధారణమైన బుద్ధికుశలతను, జ్ఞాపకశక్తిని, విషయ అవగాహనను ప్రసాదించాడు. ఆ కారణంగా దైవ ప్రవక్త (సఅసం) ఆమె దగ్గర ఉండాలని నిర్ణయించుకున్నారు. తన చరమ దశలోని ఒక్కో ప్రవచనం, ఒక్కో ఆచరణ ప్రపంచంలో సురక్షితంగా ఉండగలందులకు ఆయన (స) ఈ నిర్ణయం తీసుకున్నారంటే ఆశ్చర్యం ఏముంది? ఆయన ఆశయం ఫలించింది.

https://teluguislam.net

ఆయన (సఅసం) మరణానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులు హెచ్చుతగ్గులు లేకుండా హజ్రత్ ఆయిషా (రజి) ద్వారానే ఉమ్మత్‌కు చేరాయి.

రోజురోజుకీ వ్యాధి తీవ్రత పెరుగుతూ పోతోంది. చివరకు మస్జిద్‌లో ఇమామత్ కోసం కూడా ఆయన(స) రాలేకపోయారు. భార్యలు శుశ్రూషలో నిమగ్నులయ్యారు. ఆయన(స) దగ్గరకు రోగులు వస్తే దుఆ చేసేవారు. అలాంటి కొన్ని దుఆలను దైవప్రవక్త సమక్షంలో హజ్రత్ ఆయిషా (రజి) పఠించేవారు.

ఫజ్ర్ నమాజ్‌కు ఆయన(స) కోసం జనులు ఎదురు చూశారు. ఎన్నోసార్లు ఆయన (సఅసం) లేవడానికి ప్రయత్నించారు. కాని లేచినప్పుడల్లా స్పృహ తప్పేది. చివరకు హజ్రత్ అబూబకర్ (రజి)కు ఇమామత్ చేయమని కబురంపించారు. హజ్రత్ ఆయిషా(రజి) ఇలా తెలియచేస్తున్నారు; "దైవప్రవక్త (సఅసం) స్థానంలో మరొకరు నిల్చుంటే అతన్ని ప్రజలు అపశకునంగా భావిస్తారేమో అన్న భావన నాలో కల్గింది. అందుచేత దైవప్రవక్త (సఅసం)ను కోరాను. 'ఓ దైవప్రవక్తా (సఅసం)! అబూబకర్ సున్నిత హృదయులు. ఈ పని ఆయన వల్లకాదు. ఆయన ఏడ్చేస్తారు★ మరెవరినయినా నియమించండి! ఆయన రెండో సారికూడా అదే ఆజ్ఞనిచ్చారు. హజ్రత్ ఆయిషా (రజి) హజ్రత్ హఫ్స(రజి)తో 'నీవైనా కాస్త చెప్పు' అని కోరగా ఆమె కూడా ఆ మేరకు అభ్యర్థించారు. దీనికి దైవప్రవక్త (స) తీవ్రంగా స్పందిస్తూ 'యూసుఫ్‌ను భ్రష్టు పట్టించాలని చూసింది మీ ఆడవాళ్ళే కదూ! అబూబకర్‌కు ఇమామత్ చేయమని (నమాజ్‌కు సారథ్యం వహించమని) చెప్పండి అని ఆదేశించారు. ఎట్టకేలకు ఆదేశాన్ని శిరసావహిస్తూ హజ్రత్ అబూబకర్ (రజి) ఇమామత్ చేశారు".

ఆయన (సఅసం) జబ్బు పడకపూర్వం కొన్ని బంగారు నాణాలు హజ్రత్ ఆయిషా (రజి) వద్ద వుంచి మర్చిపోయారు. గుర్తువచ్చి అడిగారు: "ఆయిషా! (రజి) ఆ బంగారు నాణాలు ఎక్కడ? వాటిని దైవమార్గంలో ఖర్చుచేసేయి. ముహమ్మద్ అనుమానితుడుగా దైవాన్ని కలుసుకుంటాడా?" కాబట్టి వాటిని వెంటనే దానం చేయడం జరిగింది.

ఇక అంతిమ సమయం ఆసన్నమైంది. హజ్రత్ ఆయిషా (రజి) ఆయన (స) తలగడ వద్ద కూర్చున్నారు. దైవప్రవక్త (సఅసం) ఆమె ఎదపై తల ఆనించి కూర్చున్నారు. ఇంతలో హజ్రత్ ఆయిషా (రజి) సోదరుడు హజ్రత్ అబ్దుర్రహ్మాన్

---

★ హజ్రత్ అబూబకర్ నమాజ్‌లో విలపిస్తూండేవారు. ఆ కారణంచేత సామూహిక నమాజ్ సారథ్యానికి ఆయన తగినవారు కారన్న ఉద్దేశ్యంతో ఆమె అలా చెప్పిఉంటారు. అంతేగాని తండ్రి దక్షతను శంకించడం ఆమె ఉద్దేశ్యం ఎంత మాత్రం కాదు.

https://teluguislam.net

మిస్వాక్ (పసుదోము) పుల్లతో లోనికి వచ్చారు. ఆయన (సఅసం) మిస్వాక్ వంక చూశారు. ఆయన (సఅసం) ఉద్దేశ్యాన్ని పసిగట్టిన ఆయిషా (రజి) తమ్ముడి వద్ద నుంచి మిస్వాక్ తీసుకొని తన దంతాలతో నమిలి మెత్తగా చేసి ఆయన (స)కు ఇవ్వగా ఆయన సంపూర్ణ ఆరోగ్యవంతునిలాగే మిస్వాక్ చేశారు. ఆ విషయాన్నే హజ్రత్ ఆయిషా (రజి) సగర్వంగా చెప్పుకునేవారు - ''చివరి ఘడియల్లో కూడా ఆయన (స) నా ఎంగిలిని నోట్లో పెట్టుకున్నారు. భార్యలందరిలోనూ నా ఒక్కదానికే ఈ భాగ్యం దక్కింది'' అని.

హజ్రత్ ఆయిషా (రజి) ఆయన (స) ఆరోగ్యం కోసం దుఆ చేస్తున్నారు. అప్పటి వరకూ ఆమె చేతిలోనున్న తన చేతిని ఆయన (స) లాక్కున్నారు. ఇలా పలికారు, ''అల్లాహ్ యే మహోన్నతుడయిన నేస్తం''. హజ్రత్ ఆయిషా (రజి) ఇలా అంటున్నారు, ''ప్రవక్తకు అంతిమ ఘడియల్లో ఇహపరలోకాల్లో ఏదో ఒకదాన్ని స్వీకరించే అనుమతి ఇవ్వబడుతుందని ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఆయన (స) చెబుతుండేవారు. ఆ మాటలు విని నేను ఉలిక్కిపడ్డాను. దైవప్రవక్త (సఅసం) మానుండి వేరవటానికే ఇష్టపడ్డారన్నమాట'' అయినా అప్పటికి ఆమె పిన్నవయస్కురాలు. ఎవరినీ చనిపోతుండగా కళ్ళారా చూసి యెరుగరు. ''ఓ ప్రవక్తా! మీకు చాలా బాధగా ఉందా?'' అని అడిగారామె.

అప్పటివరకు హజ్రత్ ఆయిషా (రజి) ఆయన (స)ను కనిపెడుతూ కూర్చున్నారు. కొంత సేపటికి ఆయన (స) శరీరం బరువు తగ్గినట్లు అనిపించింది. కళ్ళవైపు చూశారు. కళ్ళు చెదరి ఉన్నాయి. మెల్లిగా ఆయన (స) తలను దిండుకు ఆనించి ఏడ్వసాగారు. ఆయన (సఅసం) మరణానంతరం ఆమె కుటీరానికి విశ్వనాయకుని (సఅసం) సమాధిగా అయ్యే భాగ్యం లభించిందీ అంటే అది ఆమె ఉత్తమ గుణగణాల కారణంగానే. ఇది హజ్రత్ ఆయిషా (రజి) గుణ గణాల చరిత్రలో సువర్ణాధ్యాయం. ఆ కుటీరంలోనే ఒక మూలగా దైవప్రవక్త (సఅసం) పవిత్ర దేహాన్ని ఖననం చేయడం జరిగింది. (ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్).

మూడు చంద్రబింబాలు తెగి తన కుటీరంపై పడుతున్నట్లు హజ్రత్ ఆయిషా (రజి)కు కల వచ్చింది.

దాని గురించి ఆమె దైవప్రవక్త (సఅసం) అదే కుటీరంలో ఖననం చేయబడినప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి)తో ప్రస్తావించారు. 'ఆ మూడు చంద్ర బింబాల్లో ఈయన ఒకరు. ఆ ముగ్గురిలోనూ ఉన్నతులు' అని హజ్రత్ అబూబకర్ (రజి) సెలవిచ్చారు. తరువాతి సంఘటనల్లో మిగతా రెండు చంద్ర బింబాలు అబూబకర్ సిద్దీఖ్ మరియు ఫారూఖె ఆజమ్ (హజ్రత్ ఉమర్) అని రుజువు అయింది.

హజ్రత్ ఆయిషా (రజి) వితంతువు అయ్యారు. బ్రతికున్నంత కాలం ఆ పవిత్ర సమాధికే సేవలు చేశారు. అక్కడే నిద్రించేవారు. ఒకరోజు ఆయన (సఅసం)ను స్వప్నంలో వీక్షించారు. అప్పటి నుండి అక్కడ నిద్రించడం మానుకొన్నారు.

పదమూడేళ్ళవరకు - అంటే హజ్రత్ ఉమర్ (రజి) అక్కడే ఖననం చేయబడేంత వరకూ హజ్రత్ ఆయిషా ఎటువంటి తడబాటు లేకుండా పరదా పాటించకుండానే రాకపోకలు సాగించేవారు. ఎందుకంటే అక్కడ వున్నది తన భర్తా, తన తండ్రిగారలే కాబట్టి పరదా పాటించ నక్కరలేదు. ఆ తర్వాత హజ్రత్ ఉమరె ఫారూక్ అంత్యక్రియలు కూడా అక్కడే జరిగాక అక్కడకు పరదా లేకుండా రావడానికి సిగ్గేస్తుందని చెప్పారు హజ్రత్ ఆయిషా (రజి). దేవుడు తన ప్రవక్త (సఅసం) సతీమణులకు పునర్వివాహాన్ని నిషేధించాడు. అరేబియాకు చెందిన ఒక ధనికుడు, దైవప్రవక్త (సఅసం) తదనంతరం హజ్రత్ ఆయిషా (రజి)ను వివాహమాడతానని చెప్పుకున్నాడు. ఈ పని ధార్మిక, రాజకీయ పరమార్థాల పరంగానూ, ప్రవక్త ఘనతకూ భంగకరం. అందుచేత పరమ ప్రభువు ఈ విధంగా సెలవిచ్చాడు:-

اَلنَّبِيُّ اَوْلٰى بِالْمُؤْمِنِيْنَ مِنْ اَنْفُسِهِمْ وَاَزْوَاجُهٗٓ اُمَّهٰتُهُمْ

1. ప్రవక్త ముస్లింలకు వారి ప్రాణాలకన్నా అత్యంత చేరువలో ఉన్నాడు. మరియు ఆయన భార్యలు వారికి తల్లులు.

(అహ్ జాబ్. 6)

وَمَا كَانَ لَكُمْ اَنْ تُؤْذُوْا رَسُوْلَ اللّٰهِ وَلَآ اَنْ تَنْكِحُوْٓا اَزْوَاجَهٗ مِنْۢ بَعْدِهٖٓ اَبَدًا ۭ اِنَّ ذٰلِكُمْ كَانَ عِنْدَ اللّٰهِ عَظِيْمًا ○

2. దైవ ప్రవక్త మనసు నొప్పించటంగాని, ఇంకా ఆయన తదనంతరం ఆయన భార్యల్ని వివాహమాడటంగానీ, మీకు ఎంతమాత్రం

https://teluguislam.net

సమ్మతం కాదు. దేవుని దృష్టిలో ఇది చాలా తీవ్రమైన విషయం.
(అహ్‌జాబ్ : 53)

వాస్తవమేమంటే, ప్రవక్త సతీమణులు (రజి) కొంతకాలంవరకే ప్రవక్త దాంపత్యంలో వున్నారు. మరి వారి శేషజీవితం పవిత్రుడయిన భర్త (దైవప్రవక్త) బోధనలను, జనబాహుళ్యంలో ప్రచారం చేయడంలోనే గడచిపోవాలి. దైవం ఆశించింది, దైవప్రవక్త కోరుకునేది కూడా ఇదే. వారి జీవితంలోని ప్రతి క్షణం ఈ బాధ్యతా నిర్వహణలోనే ఖర్చవ్వాలి. వారు ముస్లింలకు తల్లులు. వారి బాధ్యత కేవలం బిడ్డల విద్యాశిక్షణ మాత్రమే. వారి బాధ్యతల్ని ఎవరోకాదు, స్వయంగా దైవమే నిర్ణయించాడు:

يٰنِسَآءَ النَّبِيِّ مَنْ يَّاْتِ مِنْكُنَّ بِفَاحِشَةٍ مُّبَيِّنَةٍ
يُّضٰعَفْ لَهَا الْعَذَابُ ضِعْفَيْنِ ۗ وَكَانَ ذٰلِكَ عَلَى
اللّٰهِ يَسِيْرًا ○

وَمَنْ يَّقْنُتْ مِنْكُنَّ لِلّٰهِ وَرَسُوْلِهٖ وَتَعْمَلْ صَالِحًا
نُّؤْتِهَآ اَجْرَهَا مَرَّتَيْنِ ۙ وَاَعْتَدْنَا لَهَا رِزْقًا كَرِيْمًا ○
يٰنِسَآءَ النَّبِيِّ لَسْتُنَّ كَاَحَدٍ مِّنَ النِّسَآءِ اِنِ اتَّقَيْتُنَّ
فَلَا تَخْضَعْنَ بِالْقَوْلِ فَيَطْمَعَ الَّذِيْ فِيْ قَلْبِهٖ مَرَضٌ
وَّقُلْنَ قَوْلًا مَّعْرُوْفًا ○

وَقَرْنَ فِيْ بُيُوْتِكُنَّ وَلَا تَبَرَّجْنَ تَبَرُّجَ الْجَاهِلِيَّةِ
الْاُوْلٰى وَاَقِمْنَ الصَّلٰوةَ وَاٰتِيْنَ الزَّكٰوةَ وَاَطِعْنَ
اللّٰهَ وَرَسُوْلَهٗ ۗ اِنَّمَا يُرِيْدُ اللّٰهُ لِيُذْهِبَ عَنْكُمُ
الرِّجْسَ اَهْلَ الْبَيْتِ وَيُطَهِّرَكُمْ تَطْهِيْرًا ○

https://teluguislam.net

وَاذْكُرْنَ مَا يُتْلَىٰ فِي بُيُوتِكُنَّ مِنْ آيَاتِ اللَّهِ وَالْحِكْمَةِ
إِنَّ اللَّهَ كَانَ لَطِيفًا خَبِيرًا

''ఓ ప్రవక్త సతీమణులారా! మీలో ఎవరైనాసరే నీతి బాహ్యమైన చేష్టకు పాల్పడితే వారికి రెట్టింపు శిక్ష లభిస్తుంది. ఈ పని (చేయడం) అల్లాహ్‌కు ఎంతో సులభం. ఇంకా మీలో దైవానికీ దైవప్రవక్తకూ విధేయురాలయి సత్కార్యాలు చేసే స్త్రీకి అందుకు రెట్టింపు పుణ్య ఫలమూ లభిస్తుంది. ఇంకా (తుది దినంనాడు) ఆమె కోసం పవిత్రమైన మంచి ఆహారం సిద్ధం చేశాము. ఓ ప్రవక్త సతీమణులారా! మీరు సామాన్య స్త్రీల వంటి వారు కారు. మీరు అల్లాహ్‌కు భయపడేవారలే అయినట్లయితే అణగి మణిగిన విధంగా మాట్లాడకండి. దానివల్ల మనోరుగ్మతకు లోనైన వ్యక్తి (మీ విషయంలో) దురాశకు గురికావచ్చు సుమా! మాట్లాడితే సముచితమైన రీతిలోనే మాట్లాడండి. మీరు మీ ఇంటి పట్టునే (గౌరవప్రదంగా) ఉండండి. అజ్ఞాన కాలంలో అలంకరించుకుని సింగారాన్ని ప్రదర్శిస్తూ తిరిగినట్లుగా తిరక్కండి. నియమం ప్రకారం నమాజ్ చేయండి. జకాత్ చెల్లించండి. దైవానికీ, దైవప్రవక్తకూ విధేయులై వుండండి. ప్రవక్త కుటుంబీకులైన మీ నుండి మాలిన్యాన్ని దూరం చేసి మిమ్మల్ని అత్యంత పవిత్రుల్ని చేయగోర్తున్నాడు అల్లాహ్. ఇంకా మీ ఇళ్లలో పఠించబడే దైవవాక్యాలు, వినిపించబడే మర్మ హేతువుల్నీ మననం చేసుకోండి. అల్లాహ్ సూక్ష్మగ్రాహీ, సర్వజ్ఞాని అన్న సంగతిని విస్మరించకండి.
(అహ్‌జాబ్: 30-34)

హజ్రత్ ఆయిషా (రజి) శేషజీవితమంతా పై ఆదేశాన్ని తుచ తప్పకుండా పాటించారు.

https://teluguislam.net

# ఆనాటి స్థితిగతులు

## సిద్దీఖీ యుగం:

హజ్రత్ ఆయిషా (రజి) పితామహులు (అబూబకర్ సిద్దీఖ్) ఖలీఫాగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. దైవప్రవక్త (సఅసం)కు అంతిమ సంస్కారం జరిగి ఖలీఫాపై విశ్వాస ప్రకటన (బయత్) కూడా జరిగాక ప్రవక్త (సఅసం) సతీమణులు హజ్రత్ ఉస్మాన్ (రజి)ను హజ్రత్ అబూబకర్ (రజి) దగ్గరకు రాయబారిగా పంపి వారసత్వపు వాటా అడగాలనుకున్నారు. కాని దైవప్రవక్త (సఅసం) జీవితకాలంలో, ''నాకు ప్రత్యేక వారసులు ఎవరూ వుండుకు రాకూడదు. నా వస్తువులన్నీ సదఖా (దానం) అయిపోతాయి'' అని సెలవిచ్చిన విషయాన్ని హజ్రత్ ఆయిషా (రజి) గుర్తుచేయడంతో అందరూ మిన్నకుండి పోయారు. (సహీహ్ బుఖారీ)

అసలు విషయానికొస్తే ఈ రాజాధిరాజు (సఅసం) తదనంతరం ఆస్తి పాస్తులు పంచేందుకు తన జీవిత కాలంలో ఏమి మిగిల్చారనీ! ఆయన (సఅసం) దిర్హమ్‌లుగానీ, దీనార్లుగానీ, పాడి పశువులుగానీ, బానిసలు సేవకురాళ్ళుగానీ ఆస్తిగా ఏమీ మిగల్చలేదు. అయితే ప్రజోపయోగ కార్యక్రమాలకు ఉద్దేశించిన కొన్ని తోటలు ఆయన(స) ఆధీనంలో ఉండేవి. వాటిద్వారా వచ్చే ఆదాయాన్ని దైవప్రవక్త తన జీవిత కాలంలో ఏ విధంగా, ఏయే పద్దుల్లో ఖర్చు చేసేవారో నలుగురు ఖలీఫాల హయాంలో కూడా ఆ విధంగానే ఖర్చు చేయడం జరిగింది. మహా ప్రవక్త తన జీవిత కాలంలో సతీమణులకు ఇవ్వవలసిన సాలీనా ఖర్చులను వీటి నుండే ఇచ్చేవారు. హజ్రత్ అబూబకర్ (రజి) తన హయాంలో కూడా యథాతథంగా ఆ పద్దుల్ని అమల్లో ఉంచారు.

## పితృ వియోగం:

ఖలీఫాగా అబూబకర్ సిద్దీఖ్ రెండు సంవత్సరాలు మాత్రమే ఉన్నారు. హిజ్రీ 13వ సంవత్సరంలో హజ్రత్ అబూబకర్ (రజి) పరమపదించారు. అంతిమ ఘడియల్లో కుమార్తె ఆయన చెంతనే వున్నారు. తండ్రి కొంత ఆస్తిని కుమార్తెకు ఇచ్చారు. ఇక మిగిలిన సంతానానిక్కూడా ఇవ్వాల్సివుంది. ''ప్రియ

పుత్రికా! ఆస్తిని నీ సోదర, సోదరీమణులకు అప్పజెపుతావా?'' అని అడిగారు. ''తమరి ఆజ్ఞ శిరసావహిస్తాను'' అన్నారు ఆమె.

''దైవప్రవక్త (సఅసం) కఫన్‌లో ఎన్ని వస్త్రాలున్నాయమ్మా''.

''మూడు తెల్లని వస్త్రాలు నాన్నా.''

''ఆయన (స) ఏ రోజున పరమపదించారు?''

''సోమవారం నాడు.''

''అయితే ఈ రోజు రాత్రికి నేను కూడా సాగిపోవలసిందే!'' ఆయన తన దుప్పటివంక చూసుకున్నారు. దానికి కుంకుమ పువ్వు మరకలు ఉన్నాయి.

''ఈ దుప్పటినే ఉతికి దానిపై మరో రెండు వస్త్రాలు కలిపి నాకు కఫన్‌గా ఉపయోగించాలి'' అని కూతురుకి సూచనను జారీ చేశారు. ''ఈ దుప్పటి పాతది గదా నాన్నగారూ?'' అని ఆమె అంటే ''కొత్త బట్టల అవసరం మృతులకంటే సజీవులకే ఎక్కువ ఉంటుంది తల్లీ!'' అన్నారు. (సహీహ్ బుఖారీ)

ఆ తర్వాత అదే రోజు రాత్రి (మంగళవారం) హజ్రత్ అబూబకర్ (రజి) పరమపదించారు. (ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్). హజ్రత్ ఆయిషా (రజి) కుటీరం లోనే, దైవప్రవక్త (సఅసం) సమాధికి కాస్త ఎడంగా ఖననం చేయబడ్డారు. హజ్రత్ ఆయిషా (రజి) అంత చిన్న వయస్సులో పితంతువు కావడంతోపాటు అనాథ కూడ అయిపోయారు.

## ఫారూఖీ హయాం:

హజ్రత్ ఫారూఖె ఆజం (హజ్రత్ ఉమర్) ఖలీఫాగా పరిపాలించిన కాలం క్రమశిక్షణకు పెట్టిందిపేరు. ఆయన ముస్లింలందరికీ నగదు పెన్షన్లు నిర్ణయించారు. ఒక ఉల్లేఖనం ప్రకారం - ద్వితీయ ఖలీఫా ప్రవక్త సతీమణులందరికీ సాలీనా ఒక్కొక్కరికి పన్నెండేసి వేల చొప్పున ఇచ్చేవారు. మరో ఉల్లేఖనం ప్రకారం మిగతా భార్యలందరికీ తలా పదేసి వేల చొప్పున, హజ్రత్ ఆయిషా (రజి)కు మాత్రం పన్నెండు వేలు పెన్షన్ ఉండేదని తెలుస్తోంది. ఈ ప్రాధాన్యతకు కారణం స్వయంగా హజ్రత్ ఉమర్ (రజి) వివరించారు:

> ''ఆమె దైవ ప్రవక్త (సఅసం)కు ప్రియమైన వారు కాబట్టి రెండు వేలు ఎక్కువగా ఇస్తున్నాను.''

పవిత్ర సతీమతల్లుల (రజి) సంఖ్యను బట్టి హజ్రత్ ఉమర్ (రజి) తొమ్మిది పాత్రలు చేయించారు. ఏదయినా వస్తువు (బహుమతిగా) వస్తే ఒక్కో పాత్రలో

https://teluguislam.net

వేసి, ఒక్కో మాత దగ్గరకు పంపేవారు. బహుమానాల పంపకంలో ఎంత శ్రద్ధ వహించేవారంటే; ఏదయినా జంతువు జిబహ్ చేయబడితే తలకాయ, కాళ్ళు కూడా తమ వద్దకు పంపేవారని హజ్రత్ ఆయిషా (రజి) చెప్పారు. ఇరాక్ విజయాల సందర్భంగా ముత్యాల పేటిక ఒకటి విజయప్రాప్తిగా వచ్చింది. అది కూడా ఖలీఫా సమక్షంలోకి పంపబడింది. ముత్యాలు పంపకం చేయడం ఎలాగో ఎవరికీ అర్థంకాలేదు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ''మీరంతా అనుమతిస్తే నేను ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా (రజి)కు పంపదలచుకున్నాను, ఎందుకంటే ఆమె దైవ ప్రవక్త (సఅసం)కు ప్రియతమురాలు'' అని అన్నారు. అందరూ సంతోషంగా ఒప్పుకున్నారు. అంచేత ఆ భరిణెను హజ్రత్ ఆయిషా (రజి)కు పంపటం జరిగింది. భరిణ తెరచి చూసి హజ్రత్ ఆయిషా (రజి) సెలవిచ్చారు; ''దైవప్రవక్త (సఅసం) వియోగానంతరం ఖత్తాబ్ పుత్రుడు (ఉమర్) నాకు పెద్ద పెద్ద ఉపకారాలు చేశారు. దేవా! ఇకపైన ఆయన బహుమతుల కోసం నన్ను బ్రతికించి వుంచకు.'' (హాకిమ్)

తాను కూడా హజ్రత్ ఆయిషా (రజి) కుటీరంలో దైవ ప్రవక్త (సఅసం) పాదాల చెంత ఖననం చేయబడాలన్న కోరిక ఉండేది హజ్రత్ ఉమర్‌కి. కాని వినయం కొద్దీ నోరు తెరచి హజ్రత్ ఆయిషాకు చెప్పలేకపోయారు. మరణ సమయంలో ఈ విషయమై తల్లడిల్లి పోయారు. చివరకు తన కొడుకును పంపిస్తూ, ''ఉమ్ముల్ మోమినీన్‌కు నా సలాం తెలియజేయి. మిత్రుల చెంత ఖననం చేయబడాలన్నది ఉమర్ తుది వాంఛ అని తెలియపర్చు'' అని చెప్పారు. దానికి హజ్రత్ ఆయిషా (రజి), ''ఆ స్థలం నాకోసం అట్టేపెట్టుకున్నాను. కాని ఉమర్ కోసం సంతోషంగా ఈ మాత్రం త్యాగం చేయగలను'' అన్నారు.

ఈ అనుమతి పొందిన తర్వాత కూడా హజ్రత్ ఉమర్ ఇలా తాకీదు చేశారు: 'నా జనాజాను ఆ స్థానం వరకు తీసుకు వెళ్ళి మరొకసారి ఆమె అనుమతి కోరండి. ఉమ్ముల్ మోమినీన్ గనక అనుమతి ఇస్తేనే అక్కడ ఖననం చేయండి, లేకుంటే సాధారణంగా ముస్లింలను ఖననం చేసే కబరస్తాన్‌లోనే ఖననం చేయండి.'

ఆయన చెప్పినట్లే చేశారు. హజ్రత్ ఆయిషా (రజి) నుండి మరోసారి అనుమతి పొందాక జనాజాను లోనికి తీసుకెళ్ళి ఖననం చేశారు. చివరకు పవిత్రమైన ఆ కుటీరంలోనే ఖిలాఫత్ యొక్క రెండవ చంద్రుడు కూడా కనుమరుగయ్యాడు.

## హజ్రత్ ఉస్మాన్ (రజి) హయాం:

హజ్రత్ ఉస్మాన్ 12 ఏండ్లు ఖలీఫాగా ఉన్నారు. ఆయన ఖలీఫాగా పాలించిన కాలంలోని సగభాగం సంతృప్తికరంగా, ప్రశాంతంగా గడిచిపోయింది. ఆ తర్వాత

https://teluguislam.net

అసంతృప్తి మొదలయ్యింది. కొంతమంది ఆయన గురించి ఫిర్యాదులు చేయనారంభించారు. ''ఒక వేళ దేవుడు నీకు ఖిలాఫత్ తొడుగు తొడిగిస్తే దాన్ని నీవు నీ సంతోషం కోసం విడు వద్దని'' దైవప్రవక్త (సఅసం) హజ్రత్ ఉస్మాన్‌కు వసీయతు (బోధ) చేశారని హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖించారు.

(మస్నద్ అహ్మద్)

హజ్రత్ ఆయిషా (రజి)కు ముస్లిం ప్రజానీకంలో గొప్ప ఆదరణ ఉండేది. దైవాజ్ఞ ప్రకారం ఆమె ముస్లింలందరికీ తల్లి. అందుచేత హిజాజ్, ఇరాక్, సిరియా, ఈజిప్టు తదితర ప్రాంతాల్లో ఆమె అందరికీ తల్లిగా చెలామణీ అయ్యేవారు. ప్రజలు తండోపతండాలుగా ఆమె వద్దకు వచ్చి తమ సమస్యలను చెప్పుకొనేవారు. ఆమె వాళ్ళను ఓదార్చేవారు.

హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలం మరియు హజ్రత్ ఉస్మాన్ (రజి) కాలంలోని ప్రథమార్థం వరకు పెద్దపెద్ద సహాబాలు (రజి), సలహాదార్లు జీవించి ఉన్నారు. వ్యవహారాలన్నింటిలో వారి సలహా సంప్రదింపులు లభిస్తుండేవి. అప్పట్లో వారే తమ దక్షతను, అర్హతల్ని బట్టి పేరు పొందారు. మతాధికార్లు న్యాయవ్యవస్థను ఎంత న్యాయబద్ధంగా తీర్చిదిద్దారంటే త్రాసు కొంచెం కూడా అటూ ఇటూ మొగ్గు చూపేది కాదు. తత్ఫలితంగా దేశ వ్యాప్తంగా శాంతి భద్రతలు నెలకొన్నాయి. అగ్రశ్రేణి సహాబాలలో ఏ ఒక్కరికీ ఎలాంటి ఫిర్యాదు చేసే అవకాశమే లభించలేదు. యువకుల్లో సమర్థులయిన వారంతా (ఉదాహరణకు: అబ్దుల్లా ఇబ్నె జుబైర్ (రజి), ముహమ్మద్ బిన్ అబీ బకర్ (రజి), మర్వాన్ బిన్ హకమ్,ముహమ్మద్ బిన్ అబీ హుజయిఫ, సయీద్ బిన్ ఆస్‌లు) కూడా ధర్మ పాలకులైన ఖలీఫాల ముందు తలఒగ్గేవారు. ఖలీఫా మరియు అమీర్‌లను వారు తమ కన్నా ఎంతో ఉన్నతులుగా భావించి గౌరవించేవారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) సిద్దీఖ్ (రజి) మనుమలు. దైవప్రవక్త (సఅసం)కు బంధువు కూడా. ఆ రకంగా ఆయన ఖలీఫా పదవికి అందరికన్నా తానే ఎక్కువ అర్హుడినని భావించేవారు.

ముహమ్మద్ బిన్ అబీబకర్, హజ్రత్ అబూబకర్‌గారి చిన్న కుమారుడు. హజ్రత్ ఆయిషా (రజి)కు సవతి సోదరుడు. ఈయన తల్లి హజ్రత్ అబూబకర్ (రజి) మరణానంతరం హజ్రత్ అలీ (రజి) నికాహ్‌లోకి వచ్చారు. అందుచేత హజ్రత్ అలీ (రజి) దగ్గరే ఆయన శిక్షణ పొందారు. హజ్రత్ అలీ (రజి) కూడ ఆయన్ని కన్నకొడుకులాగే ప్రేమగా చూసుకునేవారు.

https://teluguislam.net

ముహమ్మద్ బిన్ అబీ హుజైఫ, హజ్రత్ ఉస్మాన్ (రజి) పెంపకంలో పెద్దవారయ్యారు. యుక్త వయస్సు వచ్చాక ఈయన పెద్ద హోదాను ఆశించారు. కాని హజ్రత్ ఉస్మాన్ (రజి)కు అలా చేయడం భావ్యం కాదనిపించింది. ఈయనగారు అసంతృప్తితో ఈజిప్టుకు వెళ్ళిపోయారు.

మర్వాన్ మరియు సయీద్‌బిన్ ఆస్‌లు యిద్దరూ బనూ ఉమయ్యా తెగకు చెందినవారే. ఇరువురూ యువకులే. ముహాజిర్ నాయకులు మరణించిన తర్వాత వారి కుమారులు, వారి ప్రతినిధులు గత కాలంలోని అర్హతలనుబట్టి తమ హక్కులు, హోదాలను డిమాండు చేయడంలో వీరు అందరికంటే ముందు ముందు ఉండేవారు. హజ్రత్ ఉస్మాన్(రజి)బనూ ఉమయ్యా తెగవారే. ఆయనకు తమ తెగవారిపైనే నమ్మకం ఉండేది. ఈ కారణం చేత బనూ ఉమయ్యా యువకులు పదవులకు ముందుగా ఎంపిక అయ్యేవారు. ఆ విధంగా మర్వాన్, సయీద్ బిన్ ఆస్ ఇద్దరూ పెద్దపెద్ద హోదాలతో సత్కరించబడ్డారు. ఇది చూసి ఖురైష్ తెగలోని ఔత్సాహిక యువకులు రెచ్చిపోయారు. అందుచేతనే ముహమ్మద్ బిన్ అబీబకర్, ముహమ్మద్ బిన్ అబీ హుజైఫ- లిద్దరూ హజ్రత్ ఉస్మాన్(రజి)కు వ్యతిరేకంగా జరిగిన కుట్రలో కీలక పాత్ర పోషించారు. అంతేకాకుండా పెద్ద పెద్ద సహాబాలలో (రజి) వున్న న్యాయదృష్టి, ఔదార్యం, సమయస్ఫూర్తి, అమానతుదారీ, భయభక్తులు వంటి సుగుణాలు ఆ యువకుల్లో ఒకింత తక్కువే.

అన్నింటికీ మించి - అరబ్బులు ఆదినుంచీ అరబ్బేతరులకు పాలితులుగా ఉండడాన్ని అవమానకరంగా భావించేవారు. వాళ్ళు స్వేచ్ఛాయుత వాతావరణంలో పుట్టి పెరిగారు. ఇస్లాం ఆచరణలోకి వచ్చాక అది వారి ఈ స్వేచ్ఛాకాంక్షను మరింతగాఉసిగొల్పి అరబ్బు తెగలందర్నీ ఒక్క త్రాటిపై నిలిపింది. ఇస్లామీయ శిక్షణలకు ప్రతిరూపాలయిన పెద్దపెద్ద సహాబా - ఈ విషయాన్ని ఎల్లప్పుడూ దృష్టిలో పెట్టుకునేవారు. వారి తర్వాతి తరంలోని యువకులూ, అధికార్లలో అంతటి ఔదార్యం లేకపోయింది. తమ సభల్లో దర్బారుల్లో, తమ ఇష్టారాజ్యాన్ని, వంశగౌరవాన్ని బహిరంగంగా చాటుకోసాగారు. ఇతర అరబ్బు తెగలకు ఈ ధోరణి సహించరానిదయింది. ఎందుకంటే దైవప్రవక్త (సఅసం) తదనంతరం ఈరాన్, సిరియా, ఈజిప్టు, ఆఫ్రికాల విజయాలు తమ వల్లనే సాధించబడ్డాయి కాబట్టి తమకూ సమాన హక్కు లభించాలన్నది వారి వాదన. అరబ్బేతర నవ ముస్లిములు బనూ ఉమయ్యా తెగవారు, ఖురైషులు మాత్రమే కాక జాతి యావత్తూ అరబ్బుల ప్రభుత్వం పట్ల సహజంగానే ఏవగింపు కలిగివున్నారు. అందుచేత ఇటువంటి తిరుగుబాటు ఎక్కడ పొడసూపినా అందులో పాల్గొనడం తమ బాధ్యతగా భావించసాగారు.

https://teluguislam.net

అరబ్బులు - అరబ్బేతర కూటముల కలహాలకు 'కూఫా' కేంద్ర స్థానమయింది. ఉపద్రవానికి నాంది ఇక్కడ్నుంచే జరిగింది. కూఫా అరబ్బు తెగలకు అతి పెద్ద శిబిరం. సయీద్‌బిన్ ఆస్ కూఫా పాలకుడు. రాత్రివేళల్లో తరచుగా అరబ్బు సర్దారులు ఇతడి దర్బారులోనే సమావేశమయ్యేవారు. అరబ్బుల యుద్ధ సంఘటనలు, అరబ్ తెగల వంశ పరంపరకు సంబంధించిన చర్చలే వాళ్ళ సమావేశాల్లో చోటు చేసుకునేవి. ఇందులో ప్రతి తెగా ఇతర తెగలకంటే తాను తక్కువదేం కాదని వాదించేది. సమావేశం తిట్లు, సిగపట్లతో ముగిసేది. ముఖ్యంగా ఈ సందర్భంగా సయీద్ నోట వెలువడే మాటలు అగ్నికి ఆజ్యం పోసినట్లుండేవి. 'మీరెన్ని ప్రగల్భాలు పలికినా మా కురైషులతో ఎవరూ సరితూగలేరయ్యా' అని సయీద్ అంటుండేవాడు. అతడి ఈ ధోరణి అరబ్బు తెగల సర్దారుల్లో మరిన్ని ఫిర్యాదులకు ఆస్కారం కలిగించింది. రానురాను అదొక ఉపద్రవంగా రూపొందింది.

ఆ కాలంలోనే ఇబ్నె సబా అనే యూదుడు ఇస్లాం స్వీకరించాడు. యూదులు తమ శత్రువులతో శత్రుత్వం వహించి పగతీర్చుకోలేమని భావిస్తే, ఆ శత్రుత్వాన్ని పక్కకుపెట్టి శత్రువుతో చెలిమి చేస్తారు. అత్యంత ఆప్తులుగా మారి మెల్లిమెల్లిగా రహస్యంగా కుట్రలు పన్ని శత్రువును అంతమొందిస్తారు. అంటే శత్రుత్వం వహించి సాధించలేని దానిని మిత్రత్వం వహించి సాధిస్తారు. అది వారి విధానం. యూదులు తమ శక్తి యుక్తులతో దైవప్రవక్త ఈసా(ఏసుక్రీస్తు) సందేశాన్ని నిష్ప్రభావితం చేయలేమని తలంచగానే, వారిలో పాలుస్ అనే యూదుడు క్రైస్తవునిగా మారి ఏసుక్రీస్తు బోధనల అసలు సారాన్ని నిష్ప్రభావితం చేశాడు.

హజ్రత్ అలీ(రజి) మహాప్రవక్త (సఅసం)కు యోగ్యుడయిన వారసుడని, వసియ్యత్ (మరణ శాసనం) పొందిన వాడని అంటే మహాప్రవక్త (సఅసం) ఆయన్ని ఖలీఫాగా వసీయతు చేశారని అతగాడు ప్రచారం చేయసాగాడు. అతడు యూదుడుగా ఉండే రోజుల్లో కూడా హజ్రత్ హారూన్(అ) గురించి ఈ విశ్వాసాన్ని కలిగియుండేవాడు. ఈ బిద్అత్ (కొత్తపోకడ)ను ప్రచారం చేయడంలో అతడు శక్తివంచన లేకుండా పాటుపడ్డాడు. అన్నిచోట్లా తిరిగి, ఆనాటి రాజకీయ వైముఖ్య ధోరణిని ఆసరాగా చేసుకొని తన ఎత్తుగడలో చాలావరకు కృతకృత్యుడయ్యాడు. అతడు రాజ్యమంతా తిరిగాడు. పెద్దపెద్ద సైనిక శిబిరాలకు నిలయమైన కూఫా, బస్రా, ఈజిప్టులలో విప్లవకారులు కొందరయినా ఉన్నారు. అతడు ఈజిప్టును విప్లవకారుల కేంద్రస్థానంగా చేసి చెల్లాచెదురుగా వున్న విప్లవకారులందర్నీ ఒక (అసంతృప్త) వర్గంగా నిలబెట్టాడు. సబా అనే వ్యక్తి మాయోపాయాలకు ప్రభావితమైన అసంతృప్త వర్గానికి చరిత్రకారులు 'సబాయియా వర్గం' అని పేరుపెట్టారు.

https://teluguislam.net

హజ్రత్ ఉస్మాన్(రజి) కాలంలో అల్జీరియా, రోము, ఆఫ్రికాలలో యుద్ధాలు జరుగుతుండేవి. అందువల్ల సైన్యంలో అధికభాగం అటువైపే వుండేది. యుద్ధంలో పాల్గొనే సాకుతో ముహమ్మద్ బిన్ అబీబకర్, ముహమ్మద్ బిన్ అబీహుజైఫాలు సిపాయిలను తరచూ కలుసుకునేవారు. వారిని రెచ్చగొట్టేవారు. తత్ఫలితంగా ఈజిప్టు ఆ కుట్రకు కేంద్ర స్థానమయ్యింది. అప్పట్లో అబ్దుల్లా బిన్ అబీ సరహ్ ఈజిప్టు గవర్నరుగా ఉండవారు. ముహమ్మద్ బిన్ అబీబకర్, ముహమ్మద్ బిన్ అబీ హుజైఫా తదితరులు అబ్దుల్లా బిన్ సరహ్ మరియు హజ్రత్ ఉస్మాన్ (రజి) లకు వ్యతిరేకంగా బహిరంగంగా ఉద్యమం ఆరంభించి ఈజిప్టులో నూతన రాజకీయ వర్గానికి నాయకులుగా అవతరించారు.

కాకతాళీయంగా అది హజ్ కాలం కావటాన పరస్పర సంప్రతింపులతో కూఫా, బస్రా, ఈజిప్టులనుండి ఒక్కో వేయిమంది చొప్పున హజ్ నెపంతో హిజాజ్ వైపుకు సాగిపోయారు. మదీనా సమీపానికి చేరుకొని గుడారాలు వేశారు. హజ్రత్ అలీ(రజి) తదితర పెద్దపెద్ద సహచరులు వారికి నచ్చచెప్పి వాపసు పంపారు. వీళ్ళు కొంత దూరం వెళ్ళినట్లే వెళ్ళి మళ్ళీ తిరిగి వచ్చారు. ఈజిప్టు గవర్నరు పేర వ్రాసి ఉన్న ఒక లేఖను తెచ్చి ఇచ్చారు. ఆ లేఖ సారాంశం ఇది :

''ఈజిప్టు తిరుగుబాటుదార్ల మనుషులను ఈజిప్టు చేరగానే వధించండి లేదా ఖైదు చేయండి'' అది మర్వాన్ వ్రాసిన ఉత్తరమని వీళ్ళు భావించి అందరూ కలిసి ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ ( రజి) ఇంటిని ముట్టడించారు. రెండు షరతులను ఆయనకు విధించారు. అవేమంటే (1) మర్వాన్‌ను మాకు అప్పగించండి లేదా (2) ఖలీఫా పదవిని పరిత్యజించండి.

హజ్రత్ ఉస్మాన్ ఈ రెండు షరతులనూ త్రోసి పుచ్చారు. హజ్రత్ ఆయిషా (రజి) తన సోదరుడయిన ముహమ్మద్ బిన్ అబూబకర్‌ను పిలిచి, మంకు పట్టు విడనాడమని నచ్చచెప్పారు. కాని ఆయన ససేమిరా అన్నారు. ఆనవాయితీగా హజ్రత్ ఆయిషా(రజి) (ఆ కాలంలోనే) హజ్ సంకల్పంతో మక్కాకు వెళ్ళిపోయారు. ముహమ్మద్ బిన్ అబూబకర్‌ను కూడా తీసుకు పోవాలనుకున్నారు. కాని ఆయన అంగీకరించలేదు. ఆ తర్వాత హజ్రత్ ఉస్మాన్ రెండు మూడు వారాల దాకా దిగ్బంధంలో వుండిపోయారు. చివరకు తిరుగుబాటు దారుల చేతిలో ఆయన అమరగతులయ్యారు.

''ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్''.

ఇక కాబోయే ఖలీఫా ఎవరు? అన్నది ప్రశ్న : అందరి దృష్టి నలుగురు పెద్దలపై పడింది. హజ్రత్ తల్హా(రజి), హజ్రత్ జుబైర్(రజి), హజ్రత్ సాద్ బిన్ అబీ

https://teluguislam.net

వఖాస్(రజి) మరియు హజ్రత్ అలీ(రజి). వీరిలో హజ్రత్ సాద్ రంగం నుంచి నిష్క్రమించారు. బస్రావాసులు హజ్రత్ తల్హా(రజి) పక్షం వహించారు. కుఫా వాసులు హజ్రత్ జుబైర్‌కు మద్దతు పలికారు. కాని ఈజిప్టు వాసులు ఇంకా తిరుగుబాటు దారుల్లో అధిక సంఖ్యాకులు హజ్రత్ అలీ(రజి)ని సమర్థించే వారున్నారు. వారిలో అమ్మార్ బిన్ యాసిర్, ముహమ్మద్ బిన్ అబూబకర్ తదితర ప్రముఖులు కూడా ఉన్నారు. కొందరు రెండవ ఖలీఫా కుమారులయిన హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) పేరును ప్రతిపాదించారు. బనూ ఉమయ్యా తెగవారు మూడవ ఖలీఫా కుమారుడయిన అబాన్ పేరు సూచించారు. మొదటి ఖలీఫా పెద్ద కుమారులయిన హజ్రత్ అబ్దు ర్రహ్మాన్ ఇబ్నె అబీబకర్ (రజి) పేరు కూడ వినవచ్చింది. మూడు రోజుల తర్జన భర్జనల తర్వాత విప్లవవాదుల మదీనా వాసుల్లో అధిక సంఖ్యాకుల మనోభీష్టం ప్రకారం హజ్రత్ అలీ(రజి) ఖలీఫా పీఠాన్ని అధిరోహించారు.

ఇటు హిజాజ్‌లో ఈ విభేదాలు ఇలా వుండగా అటు సిరియాలో అమీర్ ముఆవియ(రజి) స్వయంప్రతిపత్తిని గురించి కలలు గంటున్నారు. అదే సమయంలో ఈజిప్టులో ముహమ్మద్ బిన్ అబీహుజైఫా తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. దీన్ని ఇలా ఉంచితే ప్రవక్త అనుయాయి, ముసల్మానుల ఇమామ్‌ను ప్రవక్త మస్జిద్‌లోనే - అందునా నిషిద్ధమాసం(జిల్‌హజ్జ)లోనే ముస్లిములే హత్య చేయడం ఎంత ఘోరమైన విషయం? ఈ సంఘటన ముస్లింల హృదయాలను కలచివేసింది. ఈ సంఘటనతో హజ్రత్ ఆయిషా(రజి)కు కూడా సంబంధం ఉందని కొందరు శత్రువులు పుకారు లేవదీశారు. హజ్రత్ ఆయిషా(రజి) సవతి తమ్ముడయిన ముహమ్మద్ బిన్ అబీబకర్ ఆ అరాచకవాదులలో ఒకడయినందున అనుమానించేవారికి అనుమానం కలుగటంలో ఆశ్చర్యం ఏముంది? కాని ఇంతకు ముందు చదివాం - హజ్రత్ ఆయిషా(రజి) అతడిని ఈ గొడవలకు దూరంగా ఉండమని కోరినా అతడు వినలేదు. హజ్రత్ ఉస్మాన్(రజి) హత్యోదంతం ప్రస్తావనకు వచ్చినపుడు హజ్రత్ ఆయిషా(రజి) అన్నారు, "దైవసాక్షిగా నేనేనాడూ హజ్రత్ ఉస్మాన్(రజి) అవమానించబడాలని కోరుకోలేదు. అలా నేనెప్పుడయినా అభిలషించి ఉంటే నాకూ అదే జరగాలి. ఆయన హత్యగావించ బడాలని నేను ఎన్నటికీ కోరలేదు. ఒకవేళ నేనే గనక అలా కోరి వుంటే నేను కూడా హత్య చేయబడతాను."

ఈ ప్రకటన తర్వాత ఆ పుకారు అసత్యమైందని తేలిపోయింది.

https://teluguislam.net

## హజ్రత్ అలీ(రజి) ముర్తుజా హయాం :

ఏది ఏమయినా ముస్లిం ప్రపంచం ఆ నాటికి అల్లకల్లోలంగా తయారయింది. మహా ప్రవక్త ప్రియతమ సహచరుల్లోని ఒక చిన్న వర్గం తాము తమ రక్తమాంసాలు ధారపోసి సాగుచేసిన ఉద్యానవనం తమ కళ్ళముందే ఛిద్రమయి పోవడాన్ని చూడలేక సంస్కరణా కార్యక్రమం చేపట్టారు. ఆ వర్గంలో ప్రముఖ సభ్యులు ఎవరో తెలుసా? హజ్రత్ తల్హా(రజి), హజ్రత్ జుబైర్(రజి) మరియు హజ్రత్ ఆయిషా(రజి) గారలే.

### హజ్రత్ తల్హా (రజి) :

ఈయన ఖురైష్ వంశీయులు. ఇస్లాం స్వీకరించిన ప్రథమ శ్రేణి సహచరులలో ఒకరు. దైవప్రవక్త (సఅసం) హయాంలో యుద్ధాలకు నాయకత్వం వహించి విజయాలు సాధించి పెట్టిన యోధుడు. మొదటి ఖలీఫాకు అల్లుడు.

### హజ్రత్ జుబైర్ (రజి) :

ఇస్లాం యోధులు, గొప్ప పరాక్రమ శాలురలో ఒకరు. దైవప్రవక్త (సఅసం) దూతగా బిరుదు పొందిన వారు. దైవప్రవక్త (సఅసం) మేనత్త కొడుకు. తోడల్లుడు కూడా. ప్రథమ ఖలీఫాకు అల్లుడు. వీరిద్దరూ హజ్రత్ ఉమర్(రజి) సూచించిన ప్రతినిధి వర్గ సభ్యులు.

హజ్రత్ ఉస్మాన్(రజి) ముట్టడికి గురైవున్న రోజుల్లోనే హజ్రత్ ఆయిషా(రజి) ఆనవాయితీ ప్రకారం హజ్ నిమిత్తం వెళ్ళారని మనం చదువుకొన్నాం. ఆమె తిరిగి వస్తుండగా విద్రోహుల చేతుల్లో హజ్రత్ ఉస్మాన్(రజి) అమరగతులయ్యారన్న వార్త ఆమెకు చేరింది. ముందుకు సాగుతుండగా మదీనా నుండి పారిపోయి వస్తున్న హజ్రత్ తల్హా(రజి), హజ్రత్ జుబైర్(రజి) ఎదురయ్యారు: ''మేము మదీనా నుండి - మూర్ఖత్వం ఆవరించిన జన సమూహం నుండి - పారిపోయి వస్తున్నాము. చూడబోతే మతి చలించిన వారులా వున్నారు. ధర్మాన్ని గుర్తించలేని, అధర్మాన్ని తిరస్కరించలేని (నికృష్ట) స్థితిలో వున్నారు. ఆత్మరక్షణ చేసుకోజాలకున్నారు" అని అన్నారు. (తారీఖె తిబ్రి)

''ఇప్పుడేం చేయాలో ఆలోచించండి'' అంటూ ఆమె ఈ కవిత చదివారు

> ''నా జాతి సర్దారులే(నాయకులు) గనక నా మాట వింటే నేను
> వారిని ఈ ఆపద నుండి గట్టెక్కించగలను.''

ఆ తర్వాత ఆమె మక్కాకు వెనుదిరిగారు. ప్రజలందరికీ ఈ విషయం తెలిసిపోయింది. అన్ని వైపుల నుండీ గుంపులు గుంపులుగా ఆమె వద్దకు రాసాగారు.

https://teluguislam.net

ఆమె ''సంస్కరణ'' కోసం పిలుపునిచ్చారు. ఆమె ఇలా అన్నారు: "ఈ ఆదేశాన్ని విస్మరించిన జాతికన్నా దౌర్భాగ్య జాతి మరొకటి ఉండబోదు'' (అంటూ దివ్య ఖుర్ఆన్‌లోని ఈ వచనాన్ని ఉదాహరించారు).

''ఒక వేళ రెండు ముస్లిం వర్గాలు తగవుపడుతుంటే ఆ రెంటి మధ్య రాజీ కుదర్చండి. అయినా వారు ఒండొకరిపై దౌర్జన్యానికి ఒడిగట్టే పక్షంలో, దౌర్జన్యం చేసే వర్గంతో అది దైవాజ్ఞ వైపుకు మరలి వచ్చే వరకూ పోరాడండి. మరి అది దారికి రాగానే ఉభయ వర్గాల మధ్య సంధి కుదర్చండి."

(హుజ్రాత్ : 9)

* * *

https://teluguislam.net

# సంస్కరణకోసం పిలుపు

## ముస్లిం స్త్రీ బాధ్యతలు :

దైవ ప్రవక్త (సఅసం) కాలంలో ఒక సహాబీ తన కుమార్తె వివాహం ఆమెను అడుగకుండానే ఎవరికో ఇచ్చి చేశారు. ఆ అమ్మాయి దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి ఫిర్యాదు చేసింది. ఆయన (సఅసం) ఆమె తండ్రిని పిలిపించి ఈ సంబంధాన్ని రద్దు చేయాలని భావించారు. కాని ఆ అమ్మాయే ఇలా అభ్యర్థించింది, ''దైవ ప్రవక్తా! ఇప్పుడు నేనీ వివాహానికి ఒప్పుకుంటున్నాను. ఇలా చేయడంలో నా ఉద్దేశ్యమల్లా నా తోటి స్త్రీల హక్కును స్పష్టం చెయ్యడమే''!

మరి ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా(రజి) రాజకీయ వేదిక పైకి వచ్చారంటే ముస్లిం స్త్రీల హక్కుల పరిధి అందరూ భావిస్తున్నట్లుగా పరిమితమైంది కాదని చెప్పటమే ఆమె ఉద్దేశ్యమని తెలుస్తోంది.

హజ్రత్ ఆయిషా(రజి) తాను బ్రతికి ఉండగానే సంభవించిన ఈ పరిణామాలు విన్నాక ఎటువంటి క్షోభకు గురిఅయ్యారో అర్థం చేసుకోవచ్చు. ముసల్మానులను ఇంతటి పతనావస్థలో చూసిన ఆ తల్లి మనసు ఎంతగా తల్లడిల్లి పోయిందో!! అందునా ఈ చిక్కులకు కారకులు ఎవరో అన్యులు కారు. అందరూ విశ్వసించినవారే కావడం చూసిన ఆమె తీవ్ర వ్యాకులతకు గురయ్యారు. సహజ సిద్ధంగా ఆమె ఎంతో సమర్థురాలు. ధైర్య సాహసాలు గల వనిత. అంతకుముందే ఆమె జిహాద్‌లో పాల్గొనేందుకు దైవప్రవక్త(సఅసం)ను అనుమతి కోరారు. దానికి ఆయన(సఅసం), ''స్త్రీల జిహాద్ హజ్ మాత్రమే'' (సహీహ్ బుఖారీ) అని సెలవిచ్చారు. పరదా ఆజ్ఞలు వెలువడక పూర్వం - హజ్రత్ ఆయిషా(రజి) కొన్ని యుద్ధాలలో పాల్గొని యున్నారు. ఒక ఉల్లేఖనం ప్రకారం ఆమె బద్ర్ యుద్ధంలో పాల్గొన్నారు. ఉహద్ యుద్ధంలో ముస్లింలు ఇబ్బందుల్లో పడ్డారు. గొప్పగొప్ప శూరులు, యోధాగ్రేసరులు గాయపడుతుంటే హజ్రత్ ఆయిషా తోలుతిత్తిని భుజాన వేసుకొని పరుగులు తీస్తూ క్షతగాత్రులకు నీరు త్రాపించారు. కందక యుద్ధంలో ముస్లింలు చుట్టుముట్టబడుతున్నప్పుడు హజ్రత్ ఆయిషా(రజి) కోట నుండి బయటకు వచ్చి యుద్ధ పరిస్థితుల్ని అవలోకనం చేసి వున్నారు.

https://teluguislam.net

స్త్రీల శారీరక స్వభావం కారణంగా నాయకత్వ బాధ్యతను నిర్వర్తించ లేరన్నది వాస్తవం. ఇస్లాం ఇమామ్ (నాయకుని) కోసం విధించిన ముఖ్య షరతుల్లో కోమలాంగులు నెగ్గుకు రాలేరు. అందుచేత ప్రజలకు నాయకత్వం, దైవ ప్రాతినిధ్య బాధ్యతల నుండి వారిని తప్పించడం జరిగింది. అంత మాత్రాన ఏ ముస్లిం స్త్రీ అయినా ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు రాజకీయ, సైనిక నాయకత్వం వహించడం ధర్మ సమ్మతం (జాయెజ్) కాదన్న నిర్ధారణకు రావడం కూడా సరికాదు. ముఖ్యంగా సమాజం మొత్తంలో కలహాగ్ని ప్రజ్వరిల్లినపుడు, ముస్లింలలో ఎవరూ ఆ అగ్నిని చల్లార్చే యత్నం చేయనప్పుడు స్త్రీకి నాయకత్వం, న్యాయాధిపత్యాల హోదా ఇవ్వవచ్చు. ఇమామ్ మాలిక్, ఇమామ్ తిబ్రీ, మరొక ఉల్లేఖనం ప్రకారం ఇమాం అబూహనీఫా ఇంకా ఇతర ఇమాములు కూడా దీనితో ఏకీభవించారు. హజ్రత్ ఉమర్(రజి) తన హయాంలో మార్కెట్ వ్యవహారాలను ఒక మహిళా మణికి అప్పగించారు. అంతెందుకూ, హజ్రత్ ఆయిషా(రజి) స్త్రీల సమూహంలో ఉన్నప్పుడు నమాజ్ వేళ అయితే మధ్యలో ఇమామ్‌గా నిలబడేవారు.

మొత్తానికి అది హజ్ కాలం. హజ్ ప్రకటన వెలువడగానే కేవలం 6వేల మంది హజ్ యాత్రకు సంసిద్ధులయ్యారు. ఇబ్నె ఆమిర్, ఇబ్నె బను అరబ్ తెగలకు చెందిన యిద్దరు సంపన్నులు కొన్ని లక్షల ద్విర్హములు, ప్రయాణానికి కావలసిన ఒంటెల్ని ఏర్పాటు చేశారు. సైన్యం ప్రయాణించ వలసిన మార్గం నిర్ణయించేందుకు హజ్రత్ ఆయిషా(రజి) ఇంట సమావేశం జరిగింది.

అసమ్మతి వాదులూ, తిరుగుబాటు దారులూ మదీనాలోనే ఉండటం వల్ల అటుగానే వెళ్ళాలన్నది హజ్రత్ ఆయిషా అభిప్రాయం. అదే గనక జరిగి ఉంటే వ్యవహారం మరో విధంగా ఉండేదేమో! కాని కాస్సేపు తర్జన భర్జన జరిగిన తర్వాత ''బస్రా'' వైపుకు పురోగమించటం సముచితంగా ఉంటుందని భావించ బడింది. హజ్రత్ ఆయిషా(రజి) బిడారు వెంట 'బస్రా'కు ప్రయాణమయ్యారు. మాతృమూర్తి (రజి)తోపాటు సాధారణ పౌరులు చాలాదూరం నడిచి వచ్చారు. ప్రజలు ఆమె వెంట నడుస్తూ కన్నీరు కార్చారు. ఈనాడు ఇస్లాంకు ఎటువంటి దుర్దశ దాపురించిందే! అని విలపించారు. అన్నదమ్ములు పరస్పరం కత్తులు దూసుకుంటున్నారే! ముస్లిముల మాత తన బిడ్డలపైగల వాత్సల్యం కొద్దీ ఇల్లు వదలి బయలు దేరవలసి వచ్చిందే! అని బాధపడసాగారు.

అదే సమయంలో బనూ ఉమయ్యా యువకుల ఆలోచనలు మరోవిధంగా వున్నాయి. తమ ఉద్దేశ్యాలను నెరవేర్చుకోవడానికి వారికి ఇంతకన్నా మంచి అవకాశం చిక్కదు. ఇప్పటి వరకూ వాళ్ళు పలాయనవాదాన్ని అనుసరించి మక్కాలోని కాబా ప్రాంగణంలో ఆశ్రయం పొందేవాళ్ళు, తప్పించుకు తిరిగేవాళ్ళు. ఇప్పుడు

https://teluguislam.net

ఈ సంస్కరణోద్యమంలో అలాంటి అవకాశవాదులు, విచ్ఛిన్నకరశక్తులు పాదరసంలా ప్రవేశించారు. ముస్లిముల మాత ఈ సైన్యానికి సారథ్యం వహిస్తున్నారని తెలిసి దారిలో చాలామంది వచ్చి అమితోత్సాహంతో వీరితో చేరిపోయారు. అలా అలా ఈ సమూహం సంఖ్య మూడు వేలకు చేరుకొంది.

సంస్కరణోద్యమాన్ని విజయవంతం చేయడం కాక, హజ్రత్ అలీ(రజి)కి ఎదురయ్యే చిక్కుల్ని అధికం చేయడమే బనూ ఉమయ్యా వారి అసలు ఉద్దేశ్యం. హజ్రత్ ఆయిషా(రజి) నాయకత్వంలో తృతీయశక్తి మరొకటి ఆవిర్భవించి తమకు మరో శత్రువుగా పరిణమిస్తుందేమోనన్న శంకతో వాళ్ళు సైన్యంలో రహస్యంగా కుట్రలు పన్నసాగారు. ఈ సైన్యంలో పదవీ వ్యామోహపరులకు కూడా ఎటువంటి కొదవ లేదు. విజయానంతరం హజ్రత్ త్ల్హా(రజి), హజ్రత్ జుబైర్(రజి)లలో ఎవరు ఖలీఫా కాగలరు? అన్న ప్రశ్న చర్చకు వచ్చింది. హజ్రత్ ఆయిషా(రజి)కు ఈ విషయం తెలిసి ఆమె ఈ కుట్రను అంతం చేశారు. అంతలోనే నమాజ్‌కు ఎవరు సారథ్యం వహించాలన్న సమస్య ఎదురైంది. త్ల్హా(రజి) మరియు జుబైర్(రజి)ల కుమారులకు ఒక్కో రోజు వంతుల వారీగా నిర్ణయించారు హజ్రత్ ఆయిషా(రజి).

దారిలో జువాబ్ చెరువు తారసపడింది. ఇంత పెద్ద గుంపును చూసి కుక్కలు మొరగసాగాయి. హజ్రత్ ఆయిషా (రజి) కు దైవప్రవక్త (సఅసం) తెలిపిన భవిష్యవాణి గుర్తుకు వచ్చింది. ఆయన (సఅసం) ఒకసారి తమ భార్యలను సంబోధించి ఇలా అన్నారు: ''మీలో ఎవరిపై జువాబ్ కుక్కలు మొరుగుతాయో దైవానికెరుక''. ఈ విషయం గుర్తుకు రాగానే హజ్రత్ ఆయిషా(రజి) తాను వెనక్కి మరలాలని నిర్ణయించుకున్నారు. కొన్నాళ్ళ పాటు బిడారు అక్కడే ఆగిపోయింది. చివరకు అదే గ్రామానికి చెందిన యాభైమంది ఇది జువాబ్ ప్రాంతం కాదు అని సాక్ష్యమిచ్చాక హజ్రత్ ఆయిషా మనసు కుదుటపడింది.

ఈ సైన్యం కదలికలను గురించి తెలుసుకున్న హజ్రత్ అలీ(రజి) మదీనా నుండి బస్రాకు బయల్దేరారు. ఈ బిడారులోని వాళ్ళు వెనుక నుంచి అలీ(రజి) సైన్యం వస్తోంది, పదపదమంటూ గోల చేయసాగారు. తిబ్రి వగయిరా చారిత్రక గ్రంథాలలోని ఉల్లేఖనం ఇది. ముస్నద్ ఇబ్నె హంబల్‌లో ఈ సంఘటన హజ్రత్ ఆయిషా(రజి) చెప్పినట్లుగా సవివరంగా పేర్కొనబడింది.

> జువాబ్ ప్రాంతానికి వచ్చేసరికి కుక్కలు మొరగటం నేను విన్నాను. ఇప్పుడయితే నేను వెనక్కి పోవటం మంచిదనుకుంటున్నాను. ఆయన (సఅసం) ఒకసారి మాతో ''మీలో ఎవరిపై జువాబ్ కుక్కలు

మెరుగుతాయో!'' అని అన్నారు. ఇది విన్న జుబైర్(రజి), ''మీరు తిరిగి వెళతారా? బహుశా దైవం మీ కారణంగా ప్రజలలో సంధి చేయిస్తాడేమో!'' అని అన్నారు.

మరో ఉల్లేఖనంలో ఈ విధంగా ఉంది: ఆమె సహచరుల్లో నుండి ఎవరో చెప్పారు, ''ముస్లిములు మిమ్మల్ని చూడగలిగేలా మీరు ముందుకు సాగండి. బహుశా దైవం వారి మధ్య సంధి కుదురుస్తాడేమో!''

ఈ ఉల్లేఖనాల ద్వారా ఈ పురోగమనం, ఈ వ్యవస్థీకరణల ఉద్దేశ్యం సంస్కరణ మరియు సంధి తప్ప మరేమీ కాదని స్పష్టమవుతోంది.

ఘనతగల మక్కా పట్టణం, కాంతులీనే మదీనాపురం, బస్రా పట్టణాల తర్వాత అరేబియాలో అన్నింటికన్నా పెద్ద పట్టణం కూఫా. హజ్రత్ అబూమూసా అష్అరీ(రజి) ఇక్కడి అమీరుగా ఉన్నారు. ఇరుపక్షాల వకీళ్ళు తమతమ కక్షిదారుల గురించిన వాస్తవాలను గురించి వాదిస్తున్నారు. హజ్రత్ అబూమూసా అష్అరీ(రజి) దీనిని ఒక ఉపద్రవంగా భావించారు. తన శక్తి యుక్తులన్నింటినీ ఉపయోగించి ప్రజలను ఈ కల్లోలానికి దూరంగా వుండమని హితవు చెప్పారు. హజ్రత్ ఆయిషా(రజి) కూఫా సర్దారులకు లేఖలు పంపారు. హజ్రత్ అలీ(రజి) తరపున అమ్మార్‌బిన్ యాసిర్, ఇమామ్ హసన్(రజి)లు ఇక్కడకు విందులో పాల్గొనేందుకు పంపబడ్డారు. హజ్రత్ అమ్మార్ (రజి) కూఫాలోని జామా మసీదులో వర్తమాన రాజకీయ పరిస్థితులను సమీక్షించారు. ఆ సందర్భంగా ఆయన హజ్రత్ ఆయిషా(రజి) కార్యదీక్షను శ్లాఘించారు. అయితే ఆయన ఇలా అన్నారు: ''ఇదంతా నిజమే. కాని ఇంతా జరిగాక మీరు సత్యాసత్యాల విచక్షణ చేయగలరో లేదోనని దైవం మిమ్మల్ని పరీక్షిస్తున్నాడు.''

ఈ ఉపన్యాసానికి కొన్ని వేలమంది ప్రభావితులయ్యారు. ఆయనతో ఏకీభవించారు. అయినా సాధారణ ప్రజల సందేహాలు నివృత్తి కాలేదు. ఒకవైపు దైవప్రవక్త(సఅసం) సతీమణి - మరోవైపు దైవప్రవక్త(సఅసం) అల్లుడు వున్నారు. ఈ ఇద్దరిలో ఎవరిని సమర్థించాలి? అన్నది పెద్ద ప్రశ్నగా మిగిలింది. హజ్రత్ ఆయిషా(రజి) బస్రా సమీపానికి చేరుకోగానే కొందరు మనుషుల్ని విషయం తెలియ పర్చేందుకు బస్రాకు పంపారు. నగరంలోని అరబ్ సర్దారులకు లేఖలు వ్రాశారు. బస్రా చేరుకొని కొందరు పెద్దల ఇండ్లకు వెళ్ళారు. తెగ నాయకుడొకరు విముఖంగా ఉండగా ఆయన్ని స్వయంగా కలుసుకొని విషయం వివరించారు. చివరకు అతడు ఇలా అన్నాడు: ''నేను నా తల్లిమాటను శిరసావహించలేక పోతున్నందుకు సిగ్గుపడుతున్నాను.''

హ(జత్ అలీ(రజి) తరఫునుండి హ(జత్ ఉస్మాన్ బిన్ హనీఫ్ బ(స్రా పాలకుడుగా వున్నారు. ఆయన ఇమ్రాన్, అబుల్ అస్వద్‌లను పరిస్థితుల్ని బేరీజు వేసేందుకు పంపారు. వాళ్ళు హ(జత్ ఆయిషా(రజి) సమక్షంలో హాజరయి పాలకుని తరఫున ఆమెగారి రాకకు కారణం దర్యాప్తు చేశారు. హ(జత్ ఆయిషా(రజి) అందుకు జవాబుగా ఇలా ప్రసంగించారు:

> ''దైవం సాక్షి! నా స్థాయికి చెందిన వారెవరూ దాపరికంతో ఇంటినుండి బయల్దేరలేదు. అలా అని ఏ తల్లీ వాస్తవాన్ని తన బిడ్డలకు గోప్యంగా ఉంచజాలదు. విషయమేమిటంటే, తెగలోని కొందరు దుష్ట జనులు పవిత్రమైన మదీనాపురంపై దాడి చేశారు. అక్కడ కల్లోలం రేకెత్తించిందిగాక, కల్లోల జనకులకు ఆశ్రయమిచ్చారు. ఈ కారణంగా వారు దైవం మరియు దైవప్రవక్తల ధూత్కారానికి అర్హులయ్యారు. అంతేకాక వారు నిరపరాధి అయిన ముస్లింల ఖలీఫాను హత్యచేశారు. అమాయకుల రక్తాన్ని చిందించారు. ఏ సొమ్ము కబళించడం వారికి ధర్మసమ్మతం కాదో ఆ సొమ్మును లూటీ చేశారు. ప్రవక్త పట్టణాన్ని పరిహసించారు. పవిత్ర హజ్ మాసాన్ని హేళన చేశారు. ప్రజల మానమర్యాదల్ని కొల్లగొట్టారు. నిరపరాధులయిన ముస్లింలను విచక్షణా రహితంగా కొట్టారు. వారి నివాస గృహంలో బలవంతంగా జొరబడ్డారు. పుణ్యాత్ములయిన ముస్లింలు వీరి బారినుండి తప్పించుకోనూ లేరు. వారి బారి నుండి సురక్షితంగా ఉండనూ లేరు. నా వెనుక వదలి వచ్చిన ముస్లింలకు దుండగుల వల్ల ఎటువంటి నష్టం వాటిల్లుతుందో, ఏయే నేరాలూ, ఘోరాలూ వారు చేశారో ప్రజలకు తెలియచెప్పేందుకే, నేను ముస్లింలను వెంట బెట్టుకు వచ్చాను.''

ఈ ఇద్దరు వ్యక్తులూ అక్కణ్ణుంచి లేచి హ(జత్ తల్హా(రజి) హ(జత్ జుబైర్(రజి) దగ్గరకు వెళ్ళారు. తిరిగివెళుతూ మరోసారి హ(జత్ ఆయిషా(రజి) దగ్గరకు వచ్చారు. హ(జత్ ఆయిషా(రజి) వారిలో ఒకరిని ఉద్దేశించి ''అబూ అల్ అస్వద్! నీ ఆత్మ నిన్ను నరకం వైపుకు గొనిపోకుండా చూసుకో'' అన్నారు. తర్వాత ఈ ఆయత్ చదివారు: ''కూనూ ఖవ్వామీన లిల్లాహి షుహదా బిల్‌ఖిస్తి''.

''దైవ కార్యం కోసం సన్నద్ధుడవయి ఉండు. న్యాయానికి సాక్షిగా నిలబడు.''

ఈ ప్రసంగ పర్యవసానంగా బృందంలోని ఒక సభ్యుడయిన ఇమ్రాన్ యుద్ధ సంకల్పాన్ని ఉపసంహరించుకున్నాడు. బ(స్రా పాలకునికి కూడా ఇదే సలహా ఇచ్చాడు.

https://teluguislam.net

కాని అతడు ఒప్పుకోలేదు. శుక్రవారం వచ్చేసరికి అతడు ఒక మనిషిని ముందుగానే సిద్ధం చేసి మస్జిద్లో కూర్చోపెట్టాడు. ప్రజలు సమావేశమవగానే ఉపన్యాసం మొదలుపెట్టాడు ఆ వ్యక్తి:

''సభాసదులారా! నా పేరు ఖైస్. బయట విడిదిచేసి ఉన్నవారు మీనుండి సహాయం కోరుతున్నారు. వారు దుష్టుల బారినుండి పారిపోయి వచ్చినప్పటికీ మీ సహాయం కోరటం సమంజసం కాదు. ఎందుకంటే వీళ్లు మక్కానుండి వచ్చారు. వీళ్ళని ఎవరూ ముట్టుకోనైనా లేదు. ఒకవేళ వీరు హ॥జత్ ఉస్మాన్(రజి) హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలని వచ్చిఉంటే మనం ఉస్మాన్ హంతకులమూ కాదు. నా మాట వినండి. వాళ్ళు ఎక్కడ్నుంచి వచ్చారో అక్కడికే వాపసు పంపండి.''

ఉపన్యాసకుడి అతిశయభరితమైన తార్కికవాదం ప్రభావం చూపింది. మరొకడు పంక్తిలోంచి నిలబడి ఘోషించాడు:

''ఉస్మాన్ హంతకులం మనమేనని వీళ్ళంటున్నారా? మనం కాదుగదా! ఉస్మాన్(రజి) హంతకులను శిక్షించడానికి వారికి మన అండదండలు అవసరమైనాయా?! అదే నిజమైతే నువ్వన్నట్లు వీళ్ళు ఇళ్ళనుండి తరమబడితే పట్టణంలో వీళ్ళ భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారు?''

ఈ ప్రసంగంలోని వ్యంగ్యధోరణి కారణంగా ఇది మొదటి ప్రసంగానికేమీ తీసిపోలేదు.

ఇటు ఈ సమూహంలో ఈ ఉపన్యాసాలు కొనసాగుతుండగా అటు హ॥జత్ ఆయిషా(రజి) హ॥జత్ తల్హా (రజి) హ॥జత్ జుబైర్(రజి)లు తమతమ మద్దతు దారులతో మైదానంలోకి వచ్చేశారు. మొదట హ॥జత్ తల్హా(రజి) హ॥జత్ జుబైర్(రజి)లు ప్రజలను ఉద్దేశించి ఉపన్యసించారు. ఈ ప్రసంగాలు అనుకూల, ప్రతికూల తరంగాలను వ్యాపింపచేశాయి. ఇది గమనించిన హ॥జత్ ఆయిషా(రజి) గంభీరంగా ఉచ్చస్వరంలో ఉద్ఘాటించారు.

ఆమె పలికిన పలుకులు ఇవి:

> ''ప్రజలు ఉస్మాన్(రజి) ధోరణిని తూలనాడేవారు. ఆయన అధికారులలోని చెడుల్ని ఎత్తి చూపేవారు. వినయంగా వచ్చి మా సలహాలు కోరేవారు. మేము వారికి సంధీ సంప్రతింపుల సలహాలు ఇచ్చేవారము. ఉస్మాన్(రజి) గురించి పిడివాదాలు చేసేవారు. ఫిర్యాదులు చేసేవారు. వాటిని పరిశీలించి మేము ఉస్మాన్(రజి)ను నిరపరాధిగా ధర్మనిష్ఠ కలవానిగా, సూటిగా మాట్లాడేవానిగానూ,

https://teluguislam.net

ఆ కలకలం రేపేవారిని నేరస్థులుగా, అసమ్మతి వాదులుగానూ గుర్తించావు. వారి మనస్సుల్లో ఉన్నదొకటి, వారు చెప్పేది మరొకటి. వారి సంఖ్య పెరిగిపోగానే అనవసరంగా ఏ తప్పూ చేయకపోయినా హజ్రత్ ఉస్మాన్ యింట జొరబడ్డారు. ఏ రక్తాన్ని చిందించడం ధర్మ సమ్మతం కాదో ఆ రక్తాన్ని చిందించారు. ఏ సొమ్మును తీసుకోవడం సబబుకాదో ఆ సొమ్మును లూటీ చేశారు. ఏ భూభాగాన్ని గౌరవించటం వారి విద్యుక్త ధర్మమెా ఆ భూభాగాన్ని అగౌరవపర్చారు.

దైవం సెలవిస్తున్నాడు:

أَلَمْ تَرَ إِلَى الَّذِينَ أُوتُوا نَصِيبًا مِّنَ الْكِتَابِ يُدْعَوْنَ
إِلَىٰ كِتَابِ اللَّهِ لِيَحْكُمَ بَيْنَهُمْ ثُمَّ يَتَوَلَّىٰ فَرِيقٌ مِّنْهُمْ وَ
هُم مُّعْرِضُونَ ﴿٢٣﴾

''గ్రంథ జ్ఞానంలోని కొంత భాగం పొందినవారి పరిస్థితి ఎలా ఉందో నీవు గమనించలేదా? దైవగ్రంథం వారి మధ్య పరిష్కారం చేయడానికి, వారిని దానివైపు ఆహ్వానించినపుడు వారిలోని ఒక వర్గం వారు జారుకుంటారు. ఆ తీర్పు పట్ల వైముఖ్యం చూపుతారు.'' (ఆలి ఇమ్రాన్: 23)

కొన్ని గ్రంథాలలో ఈ సందర్భంగా మరో ప్రసంగం హజ్రత్ ఆయిషా(రజి) చేసినట్లు పేర్కొనబడింది. అది వాగ్ధోరణిలో, నుడికారాల సొంపులలో ఇంతకంటే ఉత్తమంగా ఉంది.

''ప్రజలారా! నిశ్శబ్దం! నిశ్శబ్దం!!!

ఈ మాట వినగానే నలువైపులా ఉన్న వారి మాట పడిపోయిందా అన్నంత నిశ్శబ్దం ఆవరించింది. హజ్రత్ ఆయిషా(రజి) తన ప్రసంగాన్ని కొనసాగించారు.

''మీపై నాకు ఒక తల్లికి వుండవలసిన హక్కు వుంది. నాకు హితబోధ చేయదగ్గ యోగ్యత ఉంది. తన ప్రభువుకు విధేయుడు కానివాడు మాత్రమే నాపై అపవాదు వేయగలడు. దైవప్రవక్త(సఅసం) నా గుండెలపై తల ఆన్చి ప్రాణం విడిచారు.

https://teluguislam.net

నేను ఆయన (సలసం)కు అత్యంత ప్రియతమ భార్యలలో ఒకర్తెను. దైవం నన్ను ఇతరుల నుండి అన్ని విధాలా సురక్షితంగా వుంచాడు. నా వ్యక్తిత్వం వల్ల విశ్వాసి-కపటిలో విచక్షణ కలిగింది. నా మూలంగానే దైవం మీపై 'తయమ్ముమ్' ఆజ్ఞను అవతరింపచేసి మహోపకారం చేశాడు.

''ఇంకా నా తండ్రి ప్రపంచంలో మూడవ ముస్లిం. హిరా గుహలో ఉన్న ఇద్దరిలో నా తండ్రి రెండవవారు. సిద్దీఖ్ (సత్యవంతుడు) అనే బిరుదుతో సంబోధించబడ్డ మొదటి వ్యక్తి ఆయనే. మహాప్రవక్త (సలసం) పరమపదించాక, నాతండ్రి పట్ల సంతృప్తితో ఆయునకు ఖిలాఫత్ (ఖలీఫా పదవి) బాధ్యత అప్పగించబడింది. ఆ తర్వాత ఇస్లాం ధర్మం ఒడిదుడుకులకు గురయితే నా తండ్రియే దాన్ని అన్ని విధాలా ఆదుకున్నారు. కాపట్యానికి కళ్ళెం వేసి మతభ్రష్టత్వానికి అడ్డుకట్ట వేసిందీ ఆయనే. ఆయనే యూదులు రగిల్చిన చిచ్చును ఎదుర్కొన్నారు. అప్పుడు మీరు కళ్ళు మూసుకొని తిరుగుబాటు, అరాచకం కోసం ఎదురుచూశారు. అల్లర్లు ప్రబలినపుడు హాహాకారాలు చేశారు. ఆయన చీలికను అరికట్టారు. పనికి మాలినదాన్ని సవరించారు. పడిపోతున్నవారికి చేయూతనిచ్చి నిలిపారు. మనస్సుల్లో తిష్టవేసివున్న రోగాల్ని నయం చేశారు. దాహంతో ఉన్న వారిని ఒడ్డుదాకా తీసుకువచ్చారు. ఒకసారి నీరు త్రాగిన వారికి మరలా త్రాపించారు. ఆయన కాపట్యాన్ని కకావికలం చేశారు. షిర్క్ కోసం చెలరేగిన వారిని చీల్చి చెండాడారు. మీ అస్థిరత్వానికి ఒక నిలకడను ఇచ్చి, మీరు సగౌరవంగా తలెత్తుకునే స్థితికి చేరాక దైవం ఆయన్ని పిలుచుకున్నాడు.

''తదనంతరం ఆయన ఎటువంటి వ్యక్తిని తన వారసుడుగా చేశారంటే ఆ వ్యక్తి తనవైపు మొగ్గిన వారికి సంరక్షుడయ్యేవారు. మదీనాలోని రెండు పర్వత ప్రాంతాలు ఎంత దూరంగా వున్నాయో, ఆయన మార్గ విహీనతకు అంత దూరంగా ఉండేవారు. శత్రువుల చెవులు పిండేవారు. అజ్ఞానులకు క్షమాభిక్ష పెట్టేవారు. ఇస్లాం బాగోగుల కోసం రాత్రిళ్ళు మేల్కొనేవారు. తన మార్గదర్శకుల అడుగుజాడలలో నడిచారు. కల్లోల స్థావరాలను కూల్చివేశారు. దివ్య ఖుర్ఆన్‌ను అక్షరాలా ఆచరణలోకి తెచ్చారు.

https://teluguislam.net

''నిజమే, ఈ రోజు అందరూ నన్నే నిలదీస్తారు. సైన్యంతో బయల్దేరడం ఎందుకని అందరూ ప్రశ్నిస్తున్నారు. ఇందులో నా ఉద్దేశ్యం పాపాన్ని తవ్వటం, కలహ కారణాలను శోధించడం ఎంత మాత్రం కాదు. వాటిని నిర్మూలించాలన్నదే నా అభిమతం. నేను చెప్పేదంతా సత్యం, న్యాయాల ప్రకారమే చెబుతున్నాను. దైవం నాపై మోపిన బాధ్యతను నిర్వర్తిస్తూ, చెడుల గురించి హెచ్చరిక చేయడానికి మాత్రమే వచ్చాను. దైవం తన ప్రవక్త అయిన ముహమ్మద్‌పై దరూద్‌ను అవతరింప చేయమని, ఆయన వారసుడ్ని ప్రవక్తల వారసత్వంతో మీపై నియమించమని ప్రార్థిస్తున్నాను.''

ఈ ప్రసంగం అమితంగా ప్రభావితం చేసిన కారణంగా ప్రజలందరూ సావధానులయి విన్నారు. ప్రసంగంలోని ఒక్కొక్క పదం శత్రువుల గుండెల్లో గునపంలా గుచ్చుకోసాగింది. అప్రయత్నంగా ''దైవం సాక్షి ఈమెగారు చెబుతున్నది సత్యం'' అంటూ ముక్త కంఠంతో పలికారు వారంతా. ఇంకా వారు తమ పంక్తుల నుండి, బయటకు వచ్చి సంస్కరణాభిలాషుల సైన్యం వరుసలోకి వచ్చి చేరారు. సందేహాలతో ఊగిసలాడుతున్న వాళ్ళు దీనిపై అభ్యంతరం తెలుపగా ఇతరులు వాళ్ళకు జవాబిచ్చారు.

ఈ విధంగా ఇరుపక్షాలలో ప్రశ్నలూ సమాధానాలూ మొదలయ్యాయి. చివరకు వాదోపవాదాలు చిలికి చిలికి వ్యవహారం చేయి దాటి పోయింది. ఇది చూసిన హజ్రత్ ఆయిషా(రజి) తన సైన్యాన్ని వెనక్కి మరలమని ఆజ్ఞాపించారు. తొలుత బస్రా పాలకుని పక్షాన వుండి హజ్రత్ ఆయిషా(రజి) ప్రసంగం విని తమ అభిప్రాయాన్ని మార్చుకున్నవారు కూడా సైనిక శిబిరంలోకి వచ్చేశారు.

మరునాడు ఇరుపక్షాల సైనికులు యుద్ధ సన్నద్ధులయి మైదానంలోకి వచ్చారు. హకీం అనే పేరుగల వ్యక్తి శత్రు సైన్యాధికారిగా ఉన్నాడు. అతడే ముందుగా యుద్ధానికి కాలు దువ్వాడు. సంస్కరణాభిలాషుల సైన్యం అప్పటి వరకు ఈటెలు చేతబూని నిశ్శబ్దంగా నిలబడి వుంది. హజ్రత్ ఆయిషా(రజి) వారిని ఓర్పుతో, సంయమనంతో మెలగమని హెచ్చరిస్తూనే వున్నారు. కాని హకీం ఏమాత్రం ఓర్పు చూపలేదు. చివరకు దాడి చేసే తీరాడు. సంస్కరణాభిలాషులు అప్పటికీ పోరుకు తలపడలేదు. హకీం తన రౌతులను రెచ్చగొట్టాడు. ''వీళ్ళు ఖురైషులు. వీళ్ళ చేతకానితనమే చివరకు వీళ్ళను మృత్యుఒడిలోకి తీసుకెళుతుంది'' అంటూ తనవారిని ఉసిగొల్పాడు. సందు మలుపుల్లో ప్రజలు నిలబడ్డారు. పై కప్పుల మీదా డాబాల పైనా నిలబడి ఇరుపక్షాల వారి మద్దతుదారులు పరస్పరం రాళ్ళు

https://teluguislam.net

రువ్వుకోసాగారు. చివరకు వ్యవహారం ముదిరి రక్తపాతం వరకూ వెళ్ళింది. హ(జత్ అయిషా(రజి) ఇది గమనించి తన సైన్యాన్ని వెనక్కి తీసుకుని మరో మైదానంలోకి వెళ్ళిపోయారు. శత్రువులు అంతటితో వూరుకోక వారి జాడ కనుక్కొని అక్కడికీ చేరుకున్నారు. దాడికి తలపడ్డారు. కాని రాత్రి అయినందువల్ల తిరిగి వెళ్ళి పోయారు.

ఏదో ఒక విధంగా వ్యవహారం సద్దుమణిగి సంధి కుదరాలని కోరుకున్నవారూ లేకపోలేదు. అబుల్ బహ్రా తమీమి హ(జత్ ఆయిషా తదితరులతో చర్చించారు. అందరూ ఆయన సలహాను ఆమోదించారు. అక్కణ్ణుంచి కూడా సైన్యాన్ని తరలించి మరో చోటికి చేర్చారు. తెల్లవారేసరికి బ(స్రా పాలకుని సైన్యం తిరిగి ఎదురు నిల్చింది. హకీం దారెంబడిపోతూ కోపంతో హ(జత్ ఆయిషా(రజి) పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయసాగాడు. ''ఈ మాటలు ఎవరిని ఉద్దేశించి అంటున్నావు?'' అని ఒక వ్యక్తి అడిగాడు. ''ఆయిషాని ఉద్దేశించి'' అని ఆ పశు హృదయుడు చెప్పాడు. అతడు కోపం పట్టలేక ''ఓరి దుర్మార్గుడా! ఉమ్ముల్ మోమినీన్‌ను అంతేసి మాటలంటావురా'' అని బదులిచ్చాడు. హకీం అతడ్ని ఈటెతో పొడిచాడు. అది అతడి గుండెల్ని చీల్చింది. ముందుకు వెళ్ళగా మరో స్త్రీ ఇదే ప్రశ్న వేసింది. ఆమెకు కూడా ఈటెతోనే సమాధానమిచ్చాడు. హకీం యొక్క ఈ ధోరణి గిట్టని అబ్దుల్ ఖైస్ తెగవారు అతడితో తెగతెంపులు చేసుకున్నారు.

వ్యతిరేకులు ఇక పూర్తిగా కయ్యానికి సంసిద్ధులయ్యారు. విచ్చలవిడిగా దాడులు చేయసాగారు. హ(జత్ ఆయిషా(రజి) తరపునుండి ఒక మనిషి ఎలుగెత్తి ప్రమాణాలు చేస్తూ దాడి నివారించడానికి ప్రయత్నించాడు. కాని ఆ ప్రయత్నాలేవీ ఫలించలేదు. పోరు మొదలయ్యింది. దాడి చేసిన వారి శవాలు గుట్టగుట్టలుగా పడసాగాయి. ఇది చూసి 'శాంతి శాంతి' అన్న అరుపులు మిన్ను ముట్టాయి. కడకు ఉభయ వర్గాలవారు ఒక షరతుపై రాజీకి వచ్చారు. దాని ప్రకారం ఒక దూత ఖలీఫా వద్దకు పంపబడతాడు. హ(జత్ త్ల్హా(రజి), హ(జత్ జుబైర్(రజి)లు హ(జత్ అలీ(రజి) నేతృత్వాన్ని ఇష్టపూర్వకంగా సమర్థించారా? లేక వారిని బలవంతంగా ఇందుకు ఒప్పించారా? అన్న విషయం ప్రజల ముందు విచారించాలనీ, మొదటి విషయం నిజం అయిన పక్షంలో బ(స్రా వారికి అప్పగించబడుతుందనిన్నీ లేకుంటే వారు బ(స్రా విడిచి వెళ్ళిపోవాలన్న షరతుపై యుద్ధ విరమణ జరిగింది.

రాయబారి మదీనాకు చేరుకునేసరికి కాకతాళీయంగా ఆ రోజు శుక్రవారం కావటాన సహాబాలందరూ, సాధారణ ముస్లింలు మస్జిదె నబవీలో సమావేశమయి వున్నారు. రాయబారి వారందర్నీ ఉద్దేశించి ''మదీనా వాసులారా! నేను బ(స్రా నుండి రాయబారిగా వచ్చాను. ఆ పెద్దలిద్దరూ (హ(జత్ త్ల్హా, హ(జత్ జుబైర్(రజి)లు)

https://teluguislam.net

తమ ఇష్టపూర్వకంగా ఖలీఫాను సమర్థించారా లేక అందుకోసం వారిని బలవంతంగా ఒప్పించడం జరిగిందా?'' అని అడిగాడు. సమావేశంలో నిశ్శబ్దం రాజ్యమేలింది. ఎవరూ పెదవి విప్పలేదు. నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఉసామాబిన్ జైద్(రజి) ఇలా పలికారు: ''వారిద్దరూ మనస్ఫూర్తిగా సమర్థించలేదు. ఒత్తిడికి లొంగి సమర్థించారు.'' హజ్రత్ అలీకి ఇస్లామీ సోదరుడు అయిన హజ్రత్ సుహైల్ బిన్ హనీఫ్ అన్సారీ ఎగిరి ఉసామాను పట్టుకున్నారు. హజ్రత్ సుహైబ్, హజ్రత్ అబూ అయ్యూబ్(రజి), హజ్రత్ ముహమ్మద్ బిన్ మసల్లమా తదితర సహచరులు కూడా, ''దేవా! ఇది నిజం'' అని సాక్ష్యమిచ్చారు. సుహైబ్ హజ్రత్ ఉసామా(రజి)ని విడిపించి ఇంటికి చేర్చారు. ఆయన ఉసామాని మేమంతా మౌనంగా ఉన్నాం కదా, నువ్వు అలా ఎందుకు చేయలేదు? అని అడిగారు.

దారిలో హజ్రత్ అలీ(రజి)కి సంధి షరతులు తెలిశాయి. ఆయన బస్రా పాలకుడికి లేఖ వ్రాశారు. ''ఒకవేళ వారితో బలవంతంగా ఓటు వేయించినా అది కేవలం ముస్లింలలో చీలికను నివారించడానికే అలా చేయడం జరిగింది'' అన్నది లేఖలోని సారాంశం.

బస్రా రాయబారి తిరిగి వచ్చి మదీనా సంగతులు వివరించాడు. వ్యతిరేక వర్గం వారు దానికి ప్రతిగా హజ్రత్ అలీ(రజి) లేఖను చూపెట్టారు. ఈ సంభాషణలు ఇలా జరుగుతుండగానే అనుకోకుండా ఒక సంఘటన జరిగింది. యుద్ధ విరమణ వ్యవధిలో ఇరువర్గాల వారూ ఒకే చోట, ఒకే మస్జిద్‌లో ఒకే ఇమామ్ వెనుక నమాజ్ చేసేవారు. దైవికంగా జరిగిందో, కావాలని చేశారో తెలీదుగాని ఇటువైపు వారు తమ మనిషి ఒకర్ని ఇమామ్‌గా చేసి నమాజ్ ఆరంభించారు. నలభయిమంది అరబ్బేతరులు కత్తులు దూసి వారిపై విరుచుకుపడ్డారు. అటునుంచి కూడ ప్రతిదాడి జరిగింది. పాలకుడ్ని బంధించడమూ జరిగింది. ఇది హజ్రత్ ఆయిషా(రజి)కు తెలిసి ఆమె అతడ్ని విడుదల చేశారు. హజ్రత్ ఉస్మాన్ హంతకులను తప్ప ఎవ్వరినీ ఆటంకపర్చరాదని, సాధారణ పౌరులు ఆయుధాలు విసర్జించాలని సైన్యంలో బహిరంగ ప్రకటన చేయబడింది. కాని హకీం ఆ ప్రకటనను లెఖ్క చేయలేదు. యుద్ధాన్ని యథాతథంగా కొనసాగించాడు. ఒక దళం రాత్రి పూట అదను చూసుకొని చాటుగా హజ్రత్ ఆయిషా(రజి) ఇంట్లో చొరబడి ఆమెను అంతం చేయాలని భావించింది. ఆ దళం గుమ్మం దాకా వచ్చేసరికి రహస్యం బట్టబయలైపోయింది. చిట్ట చివరకు సంస్కరణాభిలాషుల విజయంతో యుద్ధ విరమణ జరిగింది. బస్రా స్వాధీనం చేసుకోబడింది. బస్రా పౌరుల్లో చాలామంది విధేయులయ్యారు. బస్రా ఖజానా నుండి సైనికులకు వేతనాలు పంపిణీ చేయబడ్డాయి. కూఫా, డెమాస్కస్, మదీనా తదితర పట్టణాలకు విజయపత్రాలు పంపబడ్డాయి.

https://teluguislam.net

# జమల్ యుద్ధం

హజ్రత్ అలీ(రజి) మదీనా నుండి 700 మందితో బయలు దేరారు. కూఫా నుండి 7000 మంది వచ్చి చేరారు. బస్రా చేరుకునేసరికి అనుయాయుల సంఖ్య 20వేలకు చేరుకుంది. హజ్రత్ ఆయిషా(రజి) పక్షాన ముప్పయి వేల మంది ఉన్నారు. ఇరుపక్షాల సైన్యం ఎదురెదురుగా యుద్ధ మైదానంలో గుడారాలు వేశారు. ఈజిప్టు వారికెదురుగా ఈజిప్షియన్లు, యమన్ వారి కెదురుగా యమనీయులు ఇలా ప్రతి తెగా తన తెగకు ప్రత్యర్థి అయ్యింది. అంతకంటే బాధాకరమైన విషయం ఏమంటే, హృదయాలు బాధతో ప్రేమతో తపించిపోయినా తమ రాజకీయ విశ్వాసానికనుగుణంగా ఒక తల్లి బిడ్డలు ఒకరు అటు మరొకరు ఇటు అయిపోయారు. తాము ఉన్న పక్షాన్నే ధర్మబద్ధమైనదిగా ఇరువురూ భావించారు.

ఇరుసైన్యాలు ఎదురెదురుగా నిలిచాయి. నిన్నటి వరకూ ఏ కరవాలాలయితే శత్రువుల శిరచ్ఛేదం గావించాయో అవి ఈనాడు బంధు, హిత, మిత్రుల గుండెలను గాయపర్చ బోతున్నాయే! అని ప్రతి ముస్లిం హృదయం ఆక్రోశించింది. హజ్రత్ జుబైర్(రజి) ఈ దృశ్యం చూసి, ''అయ్యో! శక్తియుక్తుల రీత్యా ఒకప్పుడు కదలని కొండలా, చెరగని ముద్రలా నిలిచిన ముస్లింలు, పరస్పరం కలహించుకొని సర్వనాశనం కాగోరుతున్నారే!'' అని విలపించారు. పరస్పరం తామే సత్యంపై ఉన్నామన్న గట్టి నమ్మకం వారిలో ఉండినందువల్ల ఎవరూ తానున్న చోటునుండి ఒక్కడుగు కూడా వెనక్కి వేయడానికి ఇష్టపడటం లేదు. కూఫాకు చెందిన కొంతమంది పెద్దలు బస్రా తెగలవారి మస్జిదులకు వెళ్ళి వారిని ఈ విపత్తుకు దూరంగా ఉండమని ప్రాధేయపడ్డారు. దానికి వారు ముక్తకంఠంతో, ''ఉమ్ముల్ మోమినీన్(రజి)ను ఒంటరిగా వదిలివేయమంటారా?'' అని అడిగారు.

అయినా ఎవరికి వారు వ్యవహారం యుద్ధం దాకా పోదని, ఆఖరి క్షణంలోనయినా సంధి కుదరవచ్చని భావించారు. ఒక తెగ నాయకుడు హజ్రత్ అలీ(రజి)తో సంధి ప్రయత్నం కూడా చేశాడు. ఆయన తక్షణం తన అంగీకారాన్ని తెలిపారు. ఆ వ్యక్తి అక్కణ్ణించి లేచి హజ్రత్ తల్హా(రజి), హజ్రత్ జుబైర్(రజి), హజ్రత్ ఆయిషా(రజి)ల వద్దకు వచ్చి సంప్రదింపులు జరిపాడు.

''ఉమ్ముల్ మోమినీన్ (విశ్వాసుల మాతా!) ఈ ఉద్యమం వెనుక మీ లక్ష్యం ఏమిటి?''

''ఉస్మాన్(రజి) హంతకులకు శిక్షపడేలా చేయటం, ముస్లిం సమాజంలో సంస్కరణకు పిలుపునివ్వడం'' - బదులిచ్చారామె.

https://teluguislam.net

''ఉమ్ముల్‌మోమినీన్! కాస్త ఆలోచించండి. ఐదు వందల మందిని శిక్షించడానికి ఐదువేల మంది రక్తం చిందించడం, ఐదువేలమంది కోసం వేలాది మంది రక్తం చిందించాల్సి వుంటుంది. ఇది సంస్కరణ అనిపించుకుంటుందా?''

అతని ఉపన్యాస ధోరణికి అందరూ మంత్ర ముగ్ధులయ్యారు. ఎవరూ ఏమీ జవాబివ్వలేదు. అందరూ సంధికి సమ్మతిని ప్రకటించారు. అందరూ కలిసి ఒక నిర్ణయానికొచ్చారు.

ఉభయ పక్షాలవారూ సంతృప్తి చెందారు. యుద్ధ మేఘాలు తొలగినట్లే అనిపించింది. అందరికీ ఆమోదయోగ్యమయిన పరిష్కారం లభించడంలో ఎటువంటి అనుమానానికీ ఆస్కారం లేకుండా పోయింది. కాని ఉస్మాన్(రజి) హంతకులకు ఇది మింగుడు పడలేదు. వాస్తవంలో నిర్యుద్ధసంధి అంటూ జరిగితే తమకు భద్రత ఉండదనీ, ఏళ్ళ తరబడి తాము పడిన శ్రమ అంతా వృధా అయిపోతుందని వాళ్ళు భావించారు. సబాయి తెగకు చెందినవారు అత్యధికులు హజ్రత్ అలీ(రజి) వెంట వున్నారు. ఇరుపక్షాలవారు రాత్రి చివరి జామున ఆదమరచి నిద్రిస్తున్న సమయంలో సబాయీలు భేరీ మ్రోగించారు. మరికొందరు దుండగులు రంగప్రవేశం చేసి నలువైపులా నిప్పు అంటించారు. హజ్రత్ అలీ (రజి) జనాన్ని అదుపు చేయడానికి ఎంతో ప్రయత్నించారు. కాని ఎవరూ మాట వినేట్లు లేరు. ప్రతి వ్యక్తీ భయవిహ్వలుడై ఆయుధం వైపుకు పరుగు తీస్తున్నాడు. ఎవరికి వారు ప్రత్యర్థి అదును చూసి దెబ్బతీశాడని భావించ సాగారు.

ఈ గందరగోళ పరిస్థితి తెల్లవారే వరకూ కొనసాగింది. అరుపులు కేకలు విని హజ్రత్ ఆయిషా(రజి) ఏమయిందని అడిగారు. ప్రజలు మరల యుద్ధం మొదలెట్టారని తెలిసింది. బస్రా ఖాజీ కాబ్ బిన్ సూర్ వచ్చి హజ్రత్ ఆయిషా(రజి)ను ''మీరు బయలుదేరండి, బహుశా మీ మధ్యవర్తిత్వం వల్ల ప్రజలు సంధి చేసుకోవచ్చు.'' అన్నారు. ఆమె ఇనుప పంజరంలో ఒంటెపై ఎక్కి వచ్చి తన సైన్యం మధ్యలో నిలబడ్డారు. హజ్రత్ అలీ(రజి) గారు హజ్రత్ తల్హా(రజి) మరియు హజ్రత్ జుబైర్(రజి)లను పంపారు. ముగ్గురూ గుర్రాలనెక్కి ఒకచోట కలిసి నిలబడ్డారు. ఆహా! ఎంతటి కమనీయదృశ్యం! బద్ర్, ఉహద్ యుద్ధ హీరోలు ఇప్పుడు ఒకేచోట వచ్చి నిలబడ్డారు. హజ్రత్ అలీ(రజి) దైవప్రవక్త (సఅసం) యొక్క భవిష్యవాణి ఒకదాన్ని గుర్తుచేశారు. ఆ యిద్దరు యోధులకూ తాము మర్చిపోయిన స్వప్నం జ్ఞప్తికి వచ్చింది. తక్షణం హజ్రత్ జుబైర్(రజి) గుర్రం దిశను మళ్ళించారు. కదన రంగం నుండి బయటపడి మదీనావైపుకు ప్రయాణమయ్యారు. ఈ హఠాత్పరిణామానికి ఆశ్చర్యచకితుడయిన ఇబ్నె హర్మూజ్ అనే సబాయి హజ్రత్ జుబైర్(రజి)ను వెంబడించాడు. ఒకచోట నీడవున్న ప్రాంతంలో గుర్రం

https://teluguislam.net

దిగి హజ్రత్ జుబైర్(రజి) జొహర్ నమాజ్‌లో లీనమయ్యారు. సజ్‌దా స్థితిలో వుండగా ఈ దుష్టుడు కరవాలంతో ఒక్క వేటు వేశాడు. ఆ దెబ్బకు తల-మొండెం వేరయ్యాయి. హజ్రత్ జుబైర్ శిరస్సును, ఆయన ఖడ్గాన్ని తీసుకొని హజ్రత్ అలీ దగ్గరకు వచ్చాడు. హజ్రత్ అలీ దుఃఖంతో విలపిస్తూ ''ఎన్నోసార్లు దైవప్రవక్త (సఅసం) మోముపై ఆవరించిన విషాద ఛాయలను తొలగించిన కరవాలం ఇది'' అని హజ్రత్ జుబైర్(రజి)కి శ్రద్ధాంజలి ఘటించారు.

హజ్రత్ తల్హా (రజి) కూడా వెనక్కి వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. ఆయనపై మర్వాన్ ఉమవీ కన్ను పడింది. తమ వంశానికి అతడి జీవితం అడ్డుగోడలాంటిదని భావించి విషం పూసిన ఈటెను ఆయనపై చాటునుండి విసిరాడు. అది వెళ్ళి హజ్రత్ తల్హా (రజి) మోకాలిలో గుచ్చుకొంది. రక్తం ధారలుగా కారింది. ఏవిధంగా ప్రయత్నించినా రక్తస్రావం ఆగలేదు. చివరకు అదే స్థితిలో ఆయన ప్రాణాలు విడిచారు. హజ్రత్ ఆయిషా (రజి) కాబ్‌బిన్ సౌర్‌ను పిలిచి ప్రజలకు దీన్ని చూపించి సంధికి ఆహ్వానించమని ఆజ్ఞాపించారు. ఆయన దివ్య ఖుర్‌ఆన్‌ను తెరచి రెండు సైన్యాలకు మధ్యన నిలబడ్డారు. కాని విచ్ఛిన్నకర శక్తులు ప్రయోగించిన బాణం దెబ్బకు అక్కడే కుప్పకూలి పోయారు.

మధ్యాహ్నం అయింది. అకస్మాత్తుగా దాడి జరిగింది. మరోవైపు సైన్యాధికారులు ఈ ఉపద్రవం నుండి పక్కకు తప్పుకోవడంవల్ల హజ్రత్ ఆయిషా (రజి) సైన్యం బలహీనపడింది. యుద్ధం చేసేది ఎవరు? అన్నదమ్ములే. దాడిలో కాళ్ళు చేతులపైనే దెబ్బలు పడేవి. తల, రొమ్ము భాగాల జోలికి పోయేవారు కారు. ఇలా చేయడంలోని ఉద్దేశ్యం ఏమిటి? అనుకోకుండా ప్రజ్వరిల్లిన ఈ యుద్ధాన్ని ఆపాలన్నదే. ఎక్కడ చూసినా తెగిన కాళ్ళూ, చేతులూ గుట్టలుగా పడి వున్నాయి.

హజ్రత్ ఆయిషా (రజి) గనక తమకు చిక్కితే పరమ అసహ్యంగా ప్రవర్తించాలని సబాయి వర్గం వారు తలపోశారు. అందుచేత హజ్రత్ తల్హా (రజి) హజ్రత్ జుబైర్ (రజి)ల తర్వాత కూఫావాసులు కేవలం ఆమె మీదే దాడి చేసేందుకు ముందుకు సాగారు. ఆమె అనుచరులు అన్ని వైపుల నుండి ఆమెకు అడ్డుగోడలా నిలిచి రక్షణ కల్పించారు. ఈజిప్టు తెగవారయితే ఆవేశంతో ఊగిపోతున్నారు. ఒక వైపు నుంచి శత్రు సమూహం యుద్ధోన్మాదంతో ముందుకు దూసుకుపోతుంటే మరోవైపు హజ్రత్ ఆయిషా (రజి)కు కుడిప్రక్క బకర్ బిన్ వాయిల్, ఎడమవైపు అజ్దా, ఎదర బనూ నాజియలు ఉమ్ముల్ మోమినీన్ గౌరవ మర్యాదలకు విఘాతం కలగకుండా తమ ప్రాణాలు అడ్డువేస్తున్నారు. ఒంటె తన స్థానంలో నిలబడి వుంది. హజ్రత్ ఆయిషా (రజి)కు కవచంలా వున్న ఇనుప పంజరం బాణాల పరంపరకు జల్లెడ అవసాగింది. శౌర్యవంతులయిన పుత్రులు ముందూ వెనుకా

https://teluguislam.net

అటూ ఇటూ నిలబడి శత్రువుల సమూహాన్ని వెనక్కి నెట్టడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. తల్లిప్రాణాల రక్షణ కోసం తాము 'డాలు'గా ఉపయోగ పడుతున్నందుకు వారిలో ఒకింత గర్వం తొణకిసలాడుతోంది. ఆనందంతో వారి అధరాలు కవితలను ఆలపించసాగాయి.

'ఆ ఒంటెను కూల్చేదాకా ఈ యుద్ధం ఆగదు' అని ప్రత్యర్థి వర్గం వైపు నుంచి అరుపులు వినవచ్చాయి. ఒక ఆగంతకుడు వెనుకనుండి వచ్చి ఒంటె కాలిమీద కత్తితో ఒక్కవేటు వేశాడు. అంతే ఒంటె కూలబడింది. హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) ముహమ్మద్ బిన్ అబీబకర్ (రజి) పరుగున వెళ్లి ఒంటె పై నున్న తొట్టెను పడకుండా కాపాడారు. ముహమ్మద్ బిన్ అబీ బకర్ చేతిని చాపి తన అక్క గారికి గాయాలేమయినా అయ్యాయేమో చూడాలనుకున్నారు. హజ్రత్ ఆయిషా (రజి) కోపంతో 'ఎవరీ దుష్టుడు?' అని అడిగారు. 'నీ తమ్ముడు ముహమ్మద్‌ని అక్కా! దెబ్బ లేమయినా తగిలాయా?' అని క్షేమం దర్యాప్తు చేశాడు ముహమ్మద్ బిన్ అబీబకర్. ''నీవు ముహమ్మద్ (ప్రశంసనీయుడు)వి కావు. నీవు ముజమ్మమ్ (నింద్యుడవు)వి'' అని వ్యాఖ్యానించారామె.

ఇంతలో హజ్రత్ అలీ (రజి) అక్కడకు చేరుకుని ''అమ్మా! మీరు క్షేమమే కదా!'' అని అడిగారు. ''నేను బాగానే వున్నాను'' అని హజ్రత్ ఆయిషా (రజి) బదులిచ్చారు.

హజ్రత్ అలీ (రజి) ఆమెను ఆమె పక్షం వాడైన బస్రా పెద్దమనిషి ఇంట దిగబెట్టారు. హజ్రత్ ఆయిషా (రజి) సైన్యంలో గాయపడ్డవారంతా ఆ యింట్లోనే ఒక భాగంలో ఆశ్రయం పొందారు. ఆ తర్వాత హజ్రత్ అలీ (రజి), ఇబ్నుఅబ్బాస్ (రజి) తదితరులు కలుసుకునేందుకు వచ్చారు. ఆ యింట్లో క్షతగాత్రులందరూ ఆశ్రయం పొందారని హజ్రత్ అలీ (రజి)కి స్పష్టమయింది. కాని ఆయన ఎవరినీ, ఏ విధంగానూ ఆక్షేపించలేదు. ఆ తర్వాత ముహమ్మద్ బిన్ అబీబకర్ పర్యవేక్షణలో నలభైమంది గౌరవ మహిళలు వెంటరాగా ఆమెను హిజాజ్ వైపుకు పంపారు. అనేకమంది ముస్లింలు, స్వయంగా హజ్రత్ అలీ (రజి) చాలా దూరం వరకు ఆ బృందం వెంట నడిచారు. ఇమామ్ హసన్ (రజి) గారైతే కొన్ని మైళ్ళ దూరం దాకా వెంటవెళ్ళారు. వెళ్ళేముందు అందర్నీ ఉద్దేశించి హజ్రత్ ఆయిషా (రజి) అన్న మాటలు గమనార్హమైనవి - ''నాకు హజ్రత్ అలీ (రజి) పట్ల ఎప్పుడూ ద్వేషం లేదు. ఇప్పుడూ లేదు. కాకపోతే అత్తా అల్లుళ్ళ మధ్య ఎప్పుడయినా ఏదయినా మాట పెరగవచ్చు. దాన్ని నేను కాదనటం లేదు'' అని ఆమె అభిప్రాయపడ్డారు.

హజ్రత్ అలీ (రజి) కూడ ఇంచుమించు ఈ ధోరణిలోనే మాట్లాడారు. ఆ తర్వాత అభిమానధనుల బృందం హిజాజ్ వైపు ప్రయాణమయిపోయింది.

https://teluguislam.net

మరికొన్ని నెలల్లోనే హజ్ సీజన్ మొదలవుతుంది. అప్పటివరకు హజ్రత్ ఆయిషా (రజి) మక్కాలోనే గడిపారు. ఆ తర్వాత ఆమె యథాప్రకారంగా ప్రవక్త (సఅసం) సమాధికి సేవకురాలయ్యారు. సంస్కరణ కోసం తాను అవలంబించిన విధానం సక్రమమైంది కాదన్న భావన ఆమెను జీవితాంతం పీడించేది.

నిత్య జీవితంలోని సమస్యలకు ధర్మశాస్త్రాల అన్వయింపులో తన వల్ల జరిగిన పొరబాటుపై నిత్యం కుమిలిపోతూ, ''అయ్యో! నేను చెట్టునో, రాయినో, ఇటుకనో అయినా బాగుండేదే! అయ్యో! నేను నామరూపాల్లేకుండా పోయినా బాగుండేదే!'' అని చెప్పుకునే వారామె. ఆమెగారిలోని రుజువర్తనకు, గొప్పతనానికి మచ్చుతునక వంటిది ఈ పశ్చాత్తాప భావన!

మరణ ఘడియలు సమీపించినప్పుడు ఆమె ఇలా వసీయతు చేశారు: ''నన్ను ప్రవక్త (సఅసం) సమాధి ప్రక్కన గాక జన్నతుల్ బఖీ (స్మశాన వాటిక)లో ప్రవక్త సతీమణుల (రజి) ప్రక్కనే ఖననం చేయండి (సహీహ్ బుఖారి). ఎందుకంటే ఆయన (సఅసం) తదినంతరం నేనొక అపరాధం చేశాను.'' ఇబ్నె సాద్ గ్రంథంలో ఇలా వుంది :

''ఓ ప్రవక్త సతీమణులారా! మీరు మీ ఇంటి పట్టునే ఉండండి''.

(అహ్జాబ్ సురా : 33)

అనే దివ్య వచనం పఠించినపుడల్లా భోరున ఏడ్చేసేవారు. కన్నీటితో కొంగు తడిసిపోయేది.

## హజ్రత్ అలీ (రజి)తో అభిప్రాయభేదమా?

గతంలో ఆమెపై అపనింద మోపబడినప్పుడు హజ్రత్ అలీ (రజి) దైవప్రవక్త (సఅసం)కు ''మీరు కోరుకుంటే ఆమెను వేరుగా వుంచవచ్చని'' సలహా యిచ్చారనీ, ఇది విని హజ్రత్ ఆయిషా (రజి) తీవ్రంగా కలత చెందారనీ, దానికి ప్రతీకారం తీర్చుకునే ఉద్దేశ్యంతోనే ఆమె ఈ యుద్ధంలో పాల్గొన్నారని కొంతమంది వక్రబుద్ధి కలవారు ప్రచారం చేశారు. కాని యుద్ధానికి సంబంధించిన పూర్వాపరాలన్నీ మీ ముందు వున్నాయి. హజ్రత్ ఆయిషా గారు యుద్ధకాలంలో వ్రాసిన లేఖలు, ఉపన్యాసాలను కూడా ఉదహరించాము. వాటిలో ఎక్కడా హజ్రత్ అలీ (రజి)పై వ్యక్తిగత పగ చోటు చేసుకోలేదు. యుద్ధం కాకతాళీయంగా చెలరేగి జరగరానిది జరిగిపోయింది. అంతేగాని ఇరువర్గాలవారూ అందులో నిరపరాధులే.

https://teluguislam.net

ఈ సంఘటనను బట్టి దైవప్రవక్త (సఅసం) అవసాన దశలో హజ్రత్ అలీ (రజి)ని ఖలీఫా చేయమని కోరినట్లు సబాయీ వర్గంవారు చేస్తున్న వాదనను ఆమె తిరస్కరించారన్నది మాత్రం వాస్తవమే. ఆమె ఇలా అన్నారు: ''దైవప్రవక్త (సఅసం) నా ఒడిలో తలపెట్టి ప్రాణాలు విడిచారు. మరి ఆయన తుదివాంఛ ఎవరిముందు వెలిబుచ్చినట్లు?'' ఇది ఒక సంఘటనకు సంబంధించిన చారిత్రక వివరణ. ఒక వ్యక్తి హజ్రత్ ఆయిషా (రజి)ను ఈ ఆయత్ భావం ఏమిటని అడిగాడు -

ثُمَّ أَوْرَثْنَا الْكِتَابَ الَّذِينَ اصْطَفَيْنَا مِنْ عِبَادِنَا ۖ
فَمِنْهُمْ ظَالِمٌ لِنَفْسِهِ وَمِنْهُمْ مُقْتَصِدٌ وَمِنْهُمْ
سَابِقٌ بِالْخَيْرَاتِ بِإِذْنِ اللَّهِ

> ''మరి మేము మా దాసుల్లోంచి ఎన్నుకున్న వారిని ఈ గ్రంధానికి వారసులుగా చేశాము. వీళ్ళలో కొందరు తమ ఆత్మలపై అన్యాయానికి ఒడిగట్టగా, మరికొందరు మధ్యేమార్గం అవలంబిస్తారు. ఇంకా కొందరు సత్కార్యాలలో అందరికన్నా ముందు ఉంటారు.'' (ఫాతిర్ : 32)

ఆమె సెలవిచ్చారు; ''నాయనా! ఈ మూడు వర్గాలూ స్వర్గంలో ప్రవేశిస్తాయి. అయితే సత్కార్యాలలో ముందంజ వేసేవారు ఎవరంటావేమో! వారు మహాప్రవక్త (సఅసం) కాలంలో గతించిన సహచరులు. ఆ మేరకు ఆయన (సఅసం) వారికి శుభవార్త కూడా విన్పించారు. 'మధ్యేమార్గం' అవలంబించే వారెవరంటే నాలాంటి వారు, నీలాంటివారే.''

హజ్రత్ అలీ (రజి) పక్షం వారయిన హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్, అష్తర్ నఖీ (వీరిద్దరూ ఆ యుద్ధంలో ప్రముఖపాత్ర వహించిన వారు) హజ్రత్ ఆయిషా (రజి) యింటికి వచ్చారు. హజ్రత్ అమ్మార్ ఆమెను ''అమ్మా!'' అని పిలిచారు. ''నేను మీ అమ్మను కాను'' అని విసురుగా బదులిచ్చారామె. ''మీరు ఎంతగా ఈసడించుకున్నా మా అమ్మే'' అని సముదాయించారు అమ్మార్ బిన్ యాసిర్. ''నీవెంట ఎవరొచ్చారు?'' అని ఆమె అడిగితే, అష్తర్ నఖయీ వచ్చారని తెలుపగా ఆయన్ని ఉద్దేశించి, ''నీవేనా మా మేనల్లుణ్ణి చంపాలనుకున్నావు?'' అని ప్రశ్నించారు. ''ఆయన నన్ను చంపజూశాడు. నేను ఆయన్ని

https://teluguislam.net

చంపాలనుకున్నాను'' అని బదులిచ్చారు. ''ఒకవేళ అలా చేసివుంటే ఎన్నటికీ సాఫల్యం పొందేవాడివి కావు'' అని హజ్రత్ ఆయిషా (రజి) అన్నారు. ఆ తర్వాత ఆమె ఇలా అన్నారు, ''దైవప్రవక్త (సఅసం) చెబుతుండగా నేను విన్నాను. మూడు కారణాలపై తప్ప ఏ విశ్వాసి రక్తాన్నయినా చిందించడం హలాల్ (ధర్మసమ్మతం) కాదు. (1) అతడు ధర్మభ్రష్టుడయితే (2) లేదా అతడు వ్యభిచారానికి ఒడిగడితే (3) లేక ఎవరినయినా అన్యాయంగా హత్య చేస్తే తప్ప''.

ఈ హదీసును ఉటంకించడం ద్వారా అప్పుడు సైన్యంతో బయల్దేరడంలో హజ్రత్ ఆయిషా (రజి) ఉద్దేశ్యం రక్తపాతం సృష్టించడం ఎంతమాత్రం కాదు అని రుజువవుతోంది.

అంతిమ దశలో హజ్రత్ అబ్బాస్ (రజి), హజ్రత్ అలీ (రజి) చేయూతనిచ్చి దైవప్రవక్త (సఅసం)ను హజ్రత్ ఆయిషా (రజి) కుటీరంలోకి తీసుకువచ్చారు. హజ్రత్ ఆయిషా (రజి) ఆ సంఘటనని వివరించినపుడు - 'ఆయన (సఅసం) హజ్రత్ అబ్బాస్ (రజి)తో పాటు మరో మనిషి సహకారంతో వచ్చారు' అని చెప్పేవారు. కొందరు అనుమానాల అయ్యలు దీన్ని సాకుగా తీసుకొని అయిష్టత కారణంగానే హజ్రత్ ఆయిషా (రజి) హజ్రత్ అలీ (రజి) పేరెత్తలేదు అని వక్రభాష్యం చేశారు. వాస్తవంలో జరిగిందేమంటే ఒకవైపు చేయూతనిచ్చి హజ్రత్ అబ్బాస్ (రజి) తీసుకువచ్చారు. రెండోవైపు హజ్రత్ అలీ కొంచెం దూరం; మరికొంతదూరం హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) తెచ్చారు. ఈ కారణంచేత ఆవిడ హజ్రత్ అబ్బాస్ పేరైతే ప్రస్తావించారు గాని రెండో మనిషిగురించి నిర్ధారణ చేయలేకనో లేక ముక్తసరిగా చెప్పడంవల్లనో 'మరో మనిషి' అన్నారు.

ఇలా పరస్పర అభిప్రాయభేదాల ఖండన తిర్మిజీ ఉల్లేఖనం ద్వారా కూడా విశదమవుతోంది. అందులో హజ్రత్ ఆయిషా (రజి) హజ్రత్ అలీ (రజి) ఇద్దరూ తమ మనస్సుల్లోని యదార్థాన్ని ప్రజల ఎదుట స్పష్టం చేసిన తీరు వివరించబడింది. హదీసులలో ఎన్నో ఉల్లేఖనాలు ఉన్నాయి. వాటిలో హజ్రత్ ఆయిషా (రజి) హజ్రత్ అలీ (రజి) పరోక్షంలో చేసిన వ్యాఖ్యాలున్నాయి. ఒక వ్యక్తి హజ్రత్ ఆయిషా (రజి)ను ''దైవ ప్రవక్త (సఅసం)కు అత్యంత ప్రియతములు ఎవరు?'' అని దర్యాప్తు చేయగా, 'ఫాతిమా' అని జవాబిచ్చారు ఆమె. ''పురుషులలో ఎక్కువ ప్రియతములు ఎవరు?'' అని అడగ్గా, ''అధికంగా నమాజ్‌లు చేసే, ఎక్కువగా ఉపవాసాలుండే ఆమె భర్త'' (అలీ) అని చెప్పారు ఆమె.

## హజ్రత్ ముఆవియా కాలం

హజ్రత్ అలీ (రజి) పరిపాలనా కాలం నాలుగు సంవత్సరాలు మాత్రమే. ఆ తర్వాత అమీర్ ముఆవియా (రజి) పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత

https://teluguislam.net

దాదాపు 20 సంవత్సరాలు.ఆయన ముస్లిం జగత్తుకు పాలకునిగా ఉన్నారు. ఆయన పరిపాలనా కాలం చివరి భాగంలో - రెండేళ్ళు ముందు - హ(జత్ ఆయిషా (రజి) పరమపదించారు. దీనిప్రకారం హ(జత్ అమీర్ ముఆవియా పరిపాలనలో ఆమె 18 ఏళ్ళు జీవించి ఉన్నారు. ఈ కాలాన్నంతా ఆమె - ఏకొద్ది సమయాల్లోనో తప్ప - మౌనంగా గడిపారు.

ఒకసారి అమీర్ ముఆవియా (రజి) మదీనా వచ్చిన సందర్భంగా హ(జత్ ఆయిషా (రజి)ను కలుసుకునేందుకు వచ్చారు. ''నీవింత నిర్భయంగా ఒంటరిగా నా యింటికి వచ్చావు. నేనెవరినయినా దాచివుంచి, రాగానే నీతల నరికేస్తేనో!?'' అని హ(జత్ ఆయిషా (రజి) ప్రశ్నించారు. దానికి అమీర్ ముఆవియా, ''ఇది దారుల్అమాన్(శాంతి నిలయం). మీరలా చేయలేరు" అని అన్నారు. ''హఠాత్తుగా చేసే హత్యకు విశ్వాసం గొలుసు లాంటిది అని దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చారు సుమా!'' తిరిగి ఆయన ''మీపట్ల నా ప్రవర్తన ఎలావుంది?'' అని ప్రశ్నించారు.

''బాగానే వుంది'' అన్నారామె.

''ఇక వారితో (బనూ హాషిమ్) నా వ్యవహారం అంటారా? దాన్ని వదిలేయండి. అది దైవ సమక్షంలో తేలుతుంది'' అని అభిప్రాయ పడ్డారు అమీర్ ముఆవియా.

ఇరాక్, ఈజిప్టు ప్రజలు హ(జత్ ఉస్మాన్ (రజి)ను తూలనాడుతుంటారు. సిరియన్లు హ(జత్ అలీ (రజి) విషయంలో విపరీతంగా మాట్లాడుతారు. బయటి తెగలవాళ్ళు ఈ ఇద్దర్నీ చెడ్డవాళ్ళంటారు. హ(జత్ ఆయిషా (రజి)కు ఈ తెగల ధోరణి గురించి తెలిసింది. ఆమె ఇలా అన్నారు, ''ఖుర్ఆన్లో నయితే దైవప్రవక్త (సఅసం) అనుచరుల కారుణ్యం, మన్నింపుల కోసం ప్రార్థించమని దైవం సెలవిచ్చాడు. కాగా వాళ్ళేమో ఈ మహనీయుల్ని దూషిస్తున్నారా?!''

ఒకసారి అమీర్ ముఆవియా (రజి) ఆమెకు ఓ లేఖ రాస్తూ, ''నాకు క్లుప్తంగా ఏదన్నా హితబోధ చేయండ''ని కోరారు. హ(జత్ ఆయిషా (రజి) జవాబుగా వ్రాశారు. ''అస్సలాము అలైకుం. అమ్మాబాద్, నేను దైవప్రవక్త (సఅసం) చెబుతుండగా విన్నాను. ఏ వ్యక్తి సాటి మానవుల అయిష్టతను లెఖ్ఖ చేయకుండా దైవాన్ని ప్రసన్నుణ్ణి చేయగోర్తాడో అతడ్ని దైవం మానవుల అయిష్టత యొక్క వైపరీత్యాల నుండి సురక్షితంగా ఉంచుతాడు. మరెవరైతే దైవాన్ని అప్రసన్నుణ్ణి చేసి ప్రజల అసమ్మతిని కోరతాడో, అతడ్ని దైవం మానవులకే అప్పగించేస్తాడు. వస్సలాము అలైక్.'' వాస్తవానికి హ(జత్ ము ఆవియా జీవిత పరిస్థితులకు హ(జత్ ఆయిషా (రజి) హితబోధలోని ఈ వాక్యాలు అతికినట్లే సరిపోతాయి.

https://teluguislam.net

అమీర్ ముఆవియా (రజి) తన తదనంతరం యజీద్‌ను తన వారసుడిగా చేయాలనుకున్నాడు. మర్వాన్ మదీనాకు అతడిచే గవర్నర్‌గా నియమింపబడ్డాడు. ప్రజా సమూహంలో అతడు యజీద్ పేరును ప్రతిపాదించాడు. హ(జత్ ఆయిషా (రజి) సోదరుడు అబ్దుర్రహ్మాన్ లేచి అందుకు అభ్యంతరం తెలిపారు. మర్వాన్ ఆయన్ని బంధించజూశాడు. ఆయన పరుగెత్తికెళ్ళి హ(జత్ ఆయిషా (రజి) యింట శరణు పొందారు. మర్వాన్ లోపలికి వెళ్ళేందుకు సాహసించ లేకపోయాడు. మర్వాన్ కోపితుడయి ''ఎవరి గురించి ప్రత్యేకంగా దైవం తన వచనాన్ని అవతరింప జేశాడో, ఆ ఇల్లురా బాబూ ఇది!!'' అని చెప్పాడు.

హ(జత్ ఆయిషా (రజి) చాటున నిలబడి ''మా గొప్పదనం చాటుతూ అల్లాహ్ ఎటువంటి ఆయత్‌నూ అవతరింప చేయలేదు. కాకపోతే అల్లాహ్ నా నిర్దోషిత్వాన్ని తెలియపరచి నన్ను విముక్తురాల్ని చేశాడు'' అని చెప్పారు. యజీద్ వారసత్వం పట్ల ఆమె సుముఖంగా లేరనడానికి ఇదొక మచ్చు తునక.

## మరణం

అమీర్ ముఆవియా పరిపాలన చివరిభాగం హ(జత్ ఆయిషా (రజి) జీవితంలోని చరమాంకం. అప్పటికామె వయస్సు 67 సంవత్సరాలు. హి(జీ 58వ ఏట రమజాన్ నెలలో వ్యాధిగ్రస్తురాలయ్యారు. కొన్నాళ్ళపాటు మంచం పట్టారు. ఎవరన్నా వచ్చి క్షేమం అడిగితే ''నేను బాగానే ఉన్నాను'' అని చెప్పేవారు. పరామర్శకు వచ్చినవారు శుభవార్త వినిపిస్తే, ''అయ్యో నేను రాయినో అడివిలోని మానునో అయితే బాగుండేది'' అని పలికేవారు. హ(జత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఆమె ఇంటికి వచ్చి లోనికి ప్రవేశించేందుకు అనుమతి కోరగా, ఆయన వచ్చి ప్రశంసలు కురిపించడు గదా అన్న అనుమానం హ(జత్ ఆయిషా (రజి)కు వచ్చింది. మేనల్లుళ్ళ సిఫారసుపై అనుమతించారు.

ఇబ్నె అబ్బాస్ అంత పనీ చేశారు - ''మీ పేరు ఆది నుండే ఉమ్ముల్ మోమినీన్! (విశ్వాసుల మాత). దైవప్రవక్త (సఅసం)కు అందరికంటే ప్రియతమురాలైన సతీమణి మీరు. సహచరులను కలిసేందుకు మీకు ఎంతో సమయం లేదు. ఆత్మ దేహం నుండి ఉత్థానం చెందేటంత వ్యవధి మాత్రమే వుంది. దైవం మీ ద్వారానే 'తయమ్ముమ్' సౌలభ్యం ఇచ్చాడు. మిమ్మల్ని ప్రశంసిస్తూ దైవం ఖుర్ఆన్‌లో ఆయత్‌లను అవతరింప చేశాడు. అవి ఇప్పుడు ప్రతి మస్జిద్‌లోనూ రాత్రింబవళ్ళు పఠించబడుతున్నాయి...''

''ఇబ్నె అబ్బాస్! నన్ను ప్రశంసలకు అతీతంగా వుంచండి. నాకా యోగ్యత లేదు'' అని తన అణకువని వ్యక్తపరచారామె. చనిపోయేముందు మరణ వాంగ్మూలం

https://teluguislam.net

యిస్తూ, ''ఈ గదిలో దైవప్రవక్త (సఅసం) ప్రక్కన నన్ను ఖననం చేయకండి. నాకు ఆ అర్హత లేదు. నేనొక తప్పు చేశాను. నన్ను మిగతా సతీమణులతోపాటు ''జన్నతుల్ బఖీ'' (స్మశాన వాటిక)లో ఖననం చేయండి (బుఖారీ). రాత్రికి రాత్రి అంత్యక్రియలు పూర్తి చేయండి. ఉదయం వరకు వేచియుండకండి'' అన్నారు. అది హిజ్రీ 58వ సంవత్సరం, రమజాన్ నెల 17వ తారీకు. (క్రీ.శ. 678 జూన్ నెల) రాత్రిపూట - వితర్ నమాజ్ తర్వాత - పరమ పదించారు. ఏడ్పులు విని అన్సారులు తమ యిళ్ళనుండి బయటకు వచ్చారు. 'జనాజా' వెంట అశేష జనవాహిని కనబడింది. రాత్రివేళ అంతమంది అంత్యక్రియల్లో పాల్గొనడం అంతకు ముందెన్నడూ చూడలేదని జనం చెప్పుకున్నారు. కొన్ని ఉల్లేఖనాలలో, ''స్త్రీల సమూహాన్ని చూసి పండుగనాటి జనసందోహం అన్న భ్రాంతి కలిగింది'' అని పేర్కొనబడింది. హజ్రత్ ఉమ్మెసల్మా ఏడ్పులూ శోకగీతాలు విని, ''ఆయిషా (రజి) దైవప్రవక్త (సఅసం)కు ప్రియ సతీమణి అవటంచేత ఆమెకు స్వర్గంలో స్థానం ఖాయం'' అని వ్యాఖ్యానించారు.

హజ్రత్ అబూ హురైరా (రజి) ఆ రోజుల్లో మదీనాకు ఆపద్ధర్మ పాలకునిగా ఉన్నారు. ఆయనే జనాజా నమాజ్‌కు సారథ్యం వహించారు. ఖాసిం బిన్ ముహమ్మద్ బిన్ అబీబకర్ (రజి), అబ్దుల్లా బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబీబకర్ (రజి), అబ్దుల్లాబిన్ అతీఖ్, ఉర్వ బిన్ జుబైర్, ఇంకా అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) తదితర సోదరుని పుత్రులు, సోదరీ పుత్రులు ఆమెను గోరీలోకి దించారు. ఆమె కోరినట్లుగానే ''జన్నతుల్ బఖీ'' (స్మశాన వాటిక)లో ఖననం చెందారు. మదీనాలో ప్రవక్త ప్రాంగణానికి చెందిన మరొక జ్యోతి ఆరిపోయిందని మదీనా అంతటా హాహాకారాలు మిన్నుముట్టాయి. నగరం దుఃఖసాగరంలో మునిగి పోయింది. ఒక మదీనా వాసితో దివంగతురాలయిన హజ్రత్ ఆయిషా (రజి) పట్ల మదీనా వాసులు ఎంతటి శోకం ప్రదర్శించారని ప్రజలు అడగ్గా అతను ఇలా జవాబిచ్చాడు, ''ఎవరెవరికి ఆమె తల్లో (అంటే ముస్లింలందరూ) వారంతా శోకం పాటించారు.''

## పెంపుడు తల్లి

హజ్రత్ ఆయిషా (రజి)కు సంతానం కలుగలేదు. కాని ఆమె జీవిత కాలంలో స్త్రీలు తమ పేరుతో కాక తమ సంతానం పేరుతో ఫలానా వాని తల్లిగా పిలువబడే ఆచారం అమల్లో వుంది. గౌరవనీయుల్ని వారి పేరుతో కాక వారి సంతానం పేర ఫలానా వాడి తల్లి, ఫలానా పిల్ల తల్లిగా పిలువబడేవారు. హజ్రత్ ఆయిషా (రజి) ఒకసారి, ''ఓ దైవప్రవక్తా! మీ భార్యలందరూ తమ పూర్వభర్తల సంతానం పేరు

https://teluguislam.net

పిలువబడుతున్నారుకదా! మరి నేను ఎవరిపేర పిలువబడాలి?" అని ప్రశ్నించారు. అందుకు ఆయన (సఅసం), ''నీవు కూడా నీ కుమారుడు 'అబ్దుల్లా' పేరుతో పిలువబడవచ్చు'' అని సలహా ఇచ్చారు.

అబ్దుల్లా అంటే హ[జత్ ఆయిషా (రజి) అక్క కుమారుడు అయిన హ[జత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి). ఈయన అస్మాబిన్తె అబీబకర్ కుమారుడు. హి[జత్ తర్వాత ముస్లింలలో మొట్టమొదట పుట్టినది ఆయనే. దైవతిరస్కారులు ముస్లిం స్త్రీలు ఇక్కడకు వచ్చిన తర్వాత గొడ్రాళ్ళయి పోయారని చెప్పుకునేవారు. ఈయన పుట్టాక ముస్లింలకు చెప్పలేనంత సంతోషం కలిగింది. దైవప్రవక్త (సఅసం) స్వయంగా తమ పవిత్ర హస్తాలతో అతడి మాడుపైన ఖర్జూరంతోపాటు తమ లాలాజలాన్ని పూసారు. హ[జత్ ఆయిషా (రజి) అతడ్ని తమ కుమారుడుగా చేసుకున్నారు. అతడ్ని ప్రాణ సమానంగా చూసుకునేవారు. అతడు కూడ కన్నతల్లికంటే మిక్కుటంగా ఆమెను ఆదరించేవాడు. ఇతడితోపాటు ఇంకా ఎందరో పిల్లల్ని తమ శిక్షణలో వుంచుకొని పోషించారు. దైవప్రవక్త (సఅసం) జీవితకాలంలో ఆమె ఒక అన్సారియా బాలికను పెంచుకొని పెళ్ళి చేశారన్న ప్రస్తావన హదీసులలో వుంది (ముస్నద్ అహ్మద్). మ[స్రూఖ్ బిన్ అజ్దా, అమ్రబిన్తె ఆయిషా, బిన్తె తల్హా, అమ్రబిన్తె అబ్దుర్రహ్మాన్ అన్సారియా, అస్మా బిన్తె అబ్దుర్రహ్మాన్ బిన్ అబీబకర్ సిద్దీఖ్, ఉర్వబిన్ జుబైర్, ఖాసిమ్ బిన్ ముహమ్మద్ మరియు అబ్దుల్లా బిన్ యజీద్ మొదలయిన వారు హ[జత్ ఆయిషా (రజి) చేతుల్లో పెరిగారు. ముహమ్మద్ బిన్ అబీబకర్ కుమార్తెలను కూడా ఆమె సాకారు. వారి పెళ్ళిళ్ళు కూడా ఆమే చేశారు.

## రూప లావణ్యాలు

హ[జత్ ఆయిషా (రజి) శారీరకంగా త్వరితగతిన ఎదిగే బాలికల కోవకు చెందుతారు. తొమ్మిది పది ఏళ్ళ వయస్సుకే ప్రాజ్ఞత చెందారు. బాల్యంలో ఆమె బక్కపలచగా ఉండేవారు. వయస్సు పెరిగాక కాస్త ఒళ్ళు చేశారు. బంగారు మేని ఛాయ కలవారు. చక్కని ముఖవర్చస్సు గల సౌందర్యరాశి.

ధర్మనిష్ఠ, ఉన్నదానితో తృప్తిపడే స్వభావం వల్ల ఒకే పావడా ఉంచుకొని దాన్నే ఉతికి ధరించేవారు. ఒక కుర్తా ఉండేది. దాని ఖరీదు ఐదు దిర్హములు. ఇది ఆ రోజుల్లో అత్యంత విలువైనదిగా భావించబడేది. శుభకార్యాలలో, పెళ్ళి కుమార్తె కోసం బదులుగా కోరబడేది. అప్పుడప్పుడు జాఫ్రాన్ రంగుతో రంగరించబడిన దుస్తులు ధరించేవారు. అరుదుగా నగలు కూడా ధరించేవారు. మెడలో యమన్‌లో తయారయిన పూసల హారం ఉండేది. వేళ్ళకు బంగారు ఉంగరాలు ధరించేవారు. (సహీహ్ బుఖారీ)

https://teluguislam.net

# నీతీ నడవడికలు

ఉమ్ముల్‌మోమినీన్ హజ్రత్ ఆయిషా (రజి అల్లాహు తఆలా అన్హా) బాల్యం నుండి యవ్వనం వరకు, ప్రపంచంలో ఉదార గుణాన్ని పరిపూర్ణం చేయడానికి అరుదెంచిన అత్యుత్తమ సర్వశ్రేష్ఠుని (మహాప్రవక్త) సహచర్యంతో గడిపారు. ఆధ్యాత్మిక శిక్షణా కేంద్రమైన ప్రవక్త కుటీరం ఆమెను మానవత్వపు ఆధ్యాత్మిక పురోగతికి ఆఖరి మెట్టు వరకూ తీసుకెళ్ళింది. అందుచేత హజ్రత్ ఆయిషా (రజి) యొక్క నైతికస్థాయి అత్యంత ఉన్నతమైంది. ఆమె ఎంతో సౌమనస్యం, దాతృత్వ గుణాలు కలవారు. దయార్ద్ర హృదయురాలు, ఆధ్యాత్మిక గుణసంపన్నురాలు. స్త్రీ - ఉన్నదాంతో సంతృప్తి పడే గుణం ఈ రెండూ పరస్పరం భిన్న విషయాలు. సహీహ్ హదీసులో దైవప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు: ''నేను నరకంలో అధికంగా స్త్రీలే వుండటం చూశాను.'' కారణం ఏమిటని వారిని విచారిస్తే ''భర్తల పట్ల కృతఘ్నతయే అందుకు కారణం'' అన్నారు. కాని హజ్రత్ ఆయిషా (రజి) విషయం వేరు. ఆమె తన దాంపత్య జీవితంలో ఎటువంటి ఔదార్యం కనబర్చారో, పస్తులతో ఎలా గడిపారో వెనుకటి పుటలలో మీరు చదివారు. ఏనాడూ ఎటువంటి అసంతృప్తి ఆమె పెదవి దాటి రాలేదు. ఆడంబరపు దుస్తులు, విలువైన నగలు, వైభవోపేత భవనం, స్వాదిష్టమైన భోజన పదార్థాలు - వీటిలో ఏ ఒక్కటీ ఆమెకు భర్త యింటిలో లభించలేదు. విజయాల సందర్భంగా విలువైన వస్తువుల వెల్లువ అటునుంచి రావడం ఇటునుంచి పోవడం ఆమె చూస్తూనే వున్నారు. అయినా వాటిపట్ల కోరిక, ఆపేక్ష కూడా ఆమెలో కలగలేదు. దైవప్రవక్త (సఅసం) నిర్యాణం తర్వాత ఒకసారి ఆమె భోజనం కోరారు. తిరిగి అన్నారు, ''కాని ఎప్పుడూ కడుపునిండా భోజనం చేయను, అలా చేస్తే కళ్ళలో నీళ్ళు రాకుండా పోతాయేమోనని నాకు భయమేస్తోంది.''

''ఎందుకని?'' అని ఆమె శిష్యుడు అడిగితే ''ఆయన (సఅసం) ఇహలోకాన్ని వీడినప్పటి పరిస్థితి జ్ఞప్తికి వస్తోంది. దైవం సాక్షి! ఒకే రోజు రెండుసార్లు ఆయన (సఅసం) కడుపునిండా భోంచేయడం నేనెరుగను'' అని చెప్పారామె (తిర్మిజీ).

దైవం సంతాన భాగ్యం ఇవ్వకపోయినా ముస్లింల పిల్లలను దగ్గరకు తీసుకుని వారికి ఉత్తమ తర్ఫీదు నిచ్చేవారు. వారికి విద్యాబుద్ధులు గరపేవారు. ఇంకా వారి వివాహ బాధ్యతలు నిర్వర్తించేవారు (ఇమామ్ మాలిక్).

## తోటి స్త్రీలకు సహాయం

దైవం ఆమెను దైవదౌత్య కోశాగారానికి సామ్రాజ్ఞిని చేశాడు. కాగా ఈ బాధ్యతను ఆమె ఎంతో చక్కగా నిర్వర్తించారు. దైవప్రవక్త (సఅసం) సమక్షంలో ఏ స్త్రీలు వచ్చి తమ అక్కరను వెళ్ళబోసుకున్నా కాదనక తరచూ వారికి సహాయపడేవారు. వారికి సహాయపడమని దైవప్రవక్త వద్ద సిఫారసు చేసేవారు (మస్నద్).

## భర్తకు విధేయత

దైవప్రవక్త (సఅసం) పట్ల విధేయత, ఆజ్ఞాపాలనలో లోటు రానిచ్చేవారు కాదు. ఇంకా ఆయన (సఅసం) ప్రసన్నత, సంతోషాలకై రాత్రింబవళ్ళు నిమగ్నులయ్యేవారు. దైవప్రవక్త (సఅసం) వదనంలో విచారం, వ్యాకులతలు, కోపం కనిపిస్తే ఎంతో ఆందోళన చెందేవారు (మస్నద్). దైవప్రవక్త (సఅసం) బంధువర్గం వారి మాటను జవదాటేవారు కాదు. వారిని ఎంతో గౌరవంగా చూసుకొనేవారు. ఒకసారి అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) పట్ల కోపం వచ్చి అతడ్ని పలుకరించకూడదని ఒట్టేసుకున్నారు. కాని ఆయన (సఅసం) చుట్టాలు వచ్చి సిఫారసు చేసే సరికి వారి మాటను తిరస్కరించలేక పోయారు. ఆయన (సఅసం) మిత్రులపట్ల కూడా అంతే గౌరవం ప్రదర్శించేవారు. వారి ఏ మాటనూ తీసివేసేవారు కాదు.

## పరోక్ష నిందలకు, దూషణలకు దూరంగా....

ఆమె ఎప్పుడూ ఎవరికీ చెరుపు చేసేవారు కాదు. ఆమె ఉల్లేఖనాలు వేల సంఖ్యలో ఉన్నాయి. వాటిలో ఆమె ఏ వ్యక్తినీ అవమానించే, అనుమానానికి లోను చేసే పదం ఏదీ ప్రయోగించలేదు. సవతుల గురించి చెడుగా చెప్పుకోవడం స్త్రీల ప్రత్యేకత. కాని ఆమె తన సవతుల సుగుణాల్ని ప్రస్తావించడం, వారు చేసిన మేళ్ళను వివరించడం గురించి ఇంతకుముందు చదువుకున్నాం. హజ్రత్ హస్సాన్ (రజి) మూలంగా ('ఇఫ్క్' సంఘటనలో) ఆమెకు అమితమైన క్షోభ కలిగింది. అయినా తన సమావేశంలో ఆయన వస్తే ఎంతో సంతోషంగా చోటు చూపించేవారు. ఒకసారి హజ్రత్ హస్సాన్ (రజి) వచ్చి కవితలు వినిపించసాగారు. అందులో ఒక చరణానికి భావం - తాను 'అమాయకురాండ్రయిన స్త్రీలపై అభాండాలు వేసేవాణ్ణి కాను' అని వస్తుంది. తక్షణం హజ్రత్ ఆయిషా (రజి)కు 'ఇఫ్క్' సంఘటన జ్ఞప్తికి వచ్చి, ''కాని మీ ధోరణి మాత్రం తద్భిన్నంగా ఉంటుందే!'' అంటూ చురక అంటించారు. 'ఇఫ్క్' సంఘటనలో హజ్రత్ హస్సాన్ (రజి) వ్యతిరేకంగా వ్యవహరించిన కారణంగా హజ్రత్ ఆయిషా (రజి) సమక్షంలో ఆయనకు చివాట్లు పెట్టాలని ఆమె అప్తులు కొందరు ప్రయత్నించగా ఆమె గట్టిగా వారించారు. ''ఆయన్ని నిందించకండి''

https://teluguislam.net

ఆయన దైవప్రవక్త (సఅసం) తరఫున అవిశ్వాస కవులకు దీటుగా జవాబిచ్చేవారు'' అని చెప్పారు.

## ఉపకారాన్ని స్వీకరించడం

ఎవరన్నా ఉపకారం చేయబోతే చాలా తక్కువ సందర్భాలలో ఉపకారం పొందేవారు. ఒకవేళ ఉపకారం పొందినా ప్రత్యుపకారం తప్పక చేసేవారు. ఇరాక్ విజయాల సందర్భంగా వచ్చిన కానుకలలో ముత్యాలు ఉన్న ఒక డబ్బీ వచ్చింది. ప్రజల అంగీకారంతో హ|జత్ ఉమర్ (రజి) దానిని హ|జత్ ఆయిషా (రజి)కు కానుకగా పంపారు. ఆమె ఆ డబ్బీని తెరచి చూడగానే ''ఓ ప్రభూ! ఇబ్నె ఖత్తాబ్ ఉపకారం పొందటానికి ఇక నన్ను బ్రతికించి ఉంచకు'' అన్నారు. ఇరుగుపొరుగు దేశాల నుండి ఆమెకు కానుకలు, గురుదక్షిణలు వస్తుండేవి. ప్రతి బహుమతికీ ప్రతిఫలం తప్పక పంపాలని ఆజ్ఞాపించారామె. అబ్దుల్లా బిన్ ఆమిల్ అనే అరబ్ ధనికుడు ఒకసారి డబ్బు, వస్త్రాలు పంపారు. ''మేము ఎవరి వస్తువులనూ స్వీకరించం'' అని చెప్పి వాటిని వాపసు చేయాలనుకున్నారు. కాని దైవప్రవక్త (సఅసం)గారి ఉపదేశం ఒకటి గుర్తుకు రావడంతో ఊరుకున్నారు.

## ఆత్మ స్తుతి అంటే గిట్టదు

తనను తాను పొగడుకోవటం ఆమెకు ఇష్టం లేదు. అంతిమ దశలో హ|జత్ ఇబ్నె అబ్బాస్ (రజి) పరామర్శకు రాగోరారు. కాని ఆయన వచ్చి తనను పొగడుతారని గ్రహించి ఆమె అనుమతి ఇవ్వడంలో జాప్యం చేశారు. బంధువుల ప్రోద్బలంపై అంగీకరించారు. తీరా ఆయన వచ్చి పొగడ్త ప్రారంభించే సరికి, అది విన్న ఆయిషా (రజి) ''నేను పుట్టకపోయినా బాగుండేది'' అని అభిప్రాయపడ్డారు.

## పౌరుషం

అణకువ, వినమ్రతలతోపాటు ఆమెకు ఆత్మాభిమానం కూడా ఎక్కువే. ఒక్కోసారి ఈ ఆత్మాభిమానం ఇతరులపట్ల సంకుచిత స్వభావంగా కూడా పరిణమిస్తున్నట్లుండేది. ప్రవక్త (సఅసం) పట్ల అయితే అది ప్రేయసి గారం చేయడం వంటిదే! మీకు గుర్తుండే ఉంటుంది. 'ఇఫ్క్' సంఘటన సందర్భంగా దైవం ఆమెను శ్లాఘిస్తూ అవతరింపచేసిన ఆయత్‌లను దైవప్రవక్త (సఅసం) చదివి విన్పించగా ఆమె తల్లి, ''అమ్మా భర్తకు కృతజ్ఞతలు తెలియజేయి'' అన్నారు. అందుకు ఆయిషా రోషంతో ''నేను కేవలం దైవానికే కృతజ్ఞతలు తెలియజేస్తాను. ఆయనే నాకు సౌశీల్యం, పవిత్రతల గౌరవం ప్రసాదించాడు'' అని పలికారు. దైవప్రవక్త (సఅసం)పై అలుక వహించి ఉన్నప్పుడు ఆయన (సఅసం) పేరుతో ప్రమాణం

https://teluguislam.net

చేసేవారు కాదు అని కూడా మీరు గత పేజీలలో చదివారు. ఇవన్నీ ప్రేమతో నయగారంతో అన్నమాటలే. వాటిని భార్యాభర్తల వ్యవహారంగా మాత్రమే పరిగణించాలి సుమా!

హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) తరచుగా తన పిన్నికి కానుకలు అవీ ఇస్తుండేవారు. అయితే ఆమె దాతృత్వగుణం కారణంగా వాటిని ఇతరులకు ఇచ్చేస్తుండేవారు. ఇబ్నె జుబైర్ (రజి) విసిగిపోయి "లాభం లేదు. ఇకనయినా ఈమె చేతిని ఆపాల్సిందే'' అన్నారు. ఈ సంగతి హజ్రత్ ఆయిషా (రజి)కు తెల్సింది. ''ఇక అతని వస్తువు దేన్నీ ముట్టను గాక ముట్టను'' అని ప్రతిజ్ఞ చేశారామె. ఆ ప్రతిజ్ఞను ఉపసంహరించుకోమని ప్రజలు పెద్దపెద్ద సిఫారసులు తెచ్చారు. దైవప్రవక్త (సఅసం) ఆప్తులను మధ్యవర్తులుగా తెచ్చి ప్రాధేయపడేసరికి అప్పుడు దాన్ని ఉపసంహరించుకున్నారు.

సాధారణంగా పౌరుషవంతులయిన వారిలో న్యాయదృష్టి తక్కువగా కనబడుతూ ఉంటుంది. కాని దైవప్రవక్త (సఅసం) శిక్షణలో పెరిగిన వారిలో సతతం ఉన్నత గుణగణాలనే తప్ప మరొకటి ఆశించలేము. అబూబకర్ కుమార్తె ఆయిషా సిద్దీఖా (రజి)లో పౌరుషంతోపాటు న్యాయదృష్టి కూడా ఉండేది.

హజ్రత్ ఆయిషా (రజి) ఎంతో ధైర్యస్తురాలు. రాత్రుళ్ళు లేచి ఒంటరిగా ఖనన వాటికకు వెళ్ళేవారు. నిర్భయంగా యుద్ధమైదానంలో వచ్చి నిలబడేవారు. ఉహద్ యుద్ధంలో ముస్లింల సహనం సన్నగిల్లినపుడు వీపున నీళ్ళతిత్తి మోస్తూ క్షతగాత్రులకు నీరు త్రాపించారు. కందక పోరాటంలో శత్రువులు నలువైపుల నుండి ముట్టడించారు. నగరంపై యూదులు దాడి చేస్తారన్న భయం ఉన్నప్పటికీ ఆమె నిర్భయంగా తన కోట వెలుపలికి వచ్చి ముస్లింల యుద్ధ వ్యూహాన్ని పర్యవేక్షించారు. దైవప్రవక్త (సఅసం)తో యుద్ధాలలో పాల్గొనేందుకు అనుమతి కోరారు కూడా. కాని అనుమతి లభించలేదు. జమల్ యుద్ధంలో ఆమె సైన్యాన్ని తీసుకు వచ్చిన వైనం ఆమెలోని శూరత్వానికి ప్రబల తార్కాణం.

## దాతృత్వం

హజ్రత్ ఆయిషా (రజి) గుణగణాలలో ప్రముఖంగా చెప్పుకోదగ్గది ఆమెలోని దాతృత్వగుణం. హజ్రత్ ఆయిషా (రజి), హజ్రత్ అస్మా (రజి) అక్కాచెల్లెళ్ళిద్దరూ ఉదార స్వభావులే. ''దానం, దయాగుణంలో వాళ్ళిద్దర్నీ మించిన వారెవరినీ నేను చూడలేదు'' అని అబ్దుల్లా ఇబ్నె జుబైర్ (రజి) అంటుండేవారు.

దానం ఇచ్చేటప్పుడు అది కొంచెం ఉందా ఎక్కువ ఉందా అని చూసేవారు కాదు. అప్పటికి ఉన్నదాన్నంతా అడిగిన వారికి ఇచ్చేసేవారు. ఒకసారి ఒక స్త్రీ రెండు

https://teluguislam.net

దానం అడిగింది. ఆమె ఒళ్ళో ఇద్దరు చిన్నారులున్నారు. కాకతాళీయంగా ఆ రోజు ఇంట్లో ఏమీ లేదు. కేవలం ఒక్క ఖర్జూరం మాత్రమే ఉంది. దాన్ని రెండు ముక్కలు చేసి ఇద్దరు పిల్లలకు పంచారు. దైవప్రవక్త (సఅసం) బయటనుండి వచ్చాక జరిగినదంతా వివరించారు. ఒకసారి ఒక యాచకుడు వచ్చినపుడు ఆమె వద్ద నాలుగైదు ద్రాక్ష పళ్ళు ఉన్నాయి. ఒక పండు అతనికి దానం చేశారు. అతడు దాన్ని ఆశ్చర్యంతో చూసి, ''ఎవరయినా ఒక్కపండు ఇస్తారా?'' అన్నాడు. ''దాన్లో ఎన్ని అణువులు వున్నాయో చూడు'' అని ఆమె అన్నారు. ఆమె సమాధానం దివ్యఖుర్‌ఆన్ లోని క్రింది వచనానికి తార్కాణం లాంటిది -

''ఎవరయినా అణువంత పుణ్యం చేసుకున్నా దాన్ని కళ్ళారా చూస్తాడు.''
(జిల్‌జాల్ సూరా :......)

హ|జత్ ఉర్వ (రజి) ఉల్లేఖించారు, ''ఒకసారి హ|జత్ ఆయిషా (రజి) నా ఎదుట 70వేల రొఖ్ఖం దైవమార్గంలో అర్పించి, కొంగు దులుపుకున్నారు.''

అమీరు ము ఆవియా (రజి) లక్ష దిర్హములను పంపారు. సాయంత్రానికి చిల్లిగవ్వ కూడా మిగలకుండా అంత సొమ్మూ అగత్యపరులకు పంచిపెట్టేశారు. అనుకోకుండా ఆ రోజు ఉపవాసం ఉన్నారు. ''ఇఫ్తార్ (ఉపవాస విరమణ) కోసమైనా కొంత మొత్తం మిగల్చాల్సింది.'' అని సేవకురాలు చెబితే, ''ఆ విషయం నువ్వు అప్పుడే గుర్తు చేసి ఉండాల్సింది'' అని చెప్పారు. ఇటువంటి సంఘటనే మరొకటి జరిగింది. ఒకసారి హ|జత్ ఇబ్నె జుబైర్ (రజి) రెండు సంచుల నిండా లక్ష దిర్హములు కుక్కి పంపారు. ఆమె ఒక ట్రేలో ఈ సొమ్ము ఉంచుకొని పంచిపెట్టడం ప్రారంభించారు. ఆ రోజు కూడా ఆమె ఉపవాసం ఉన్నారు. సాయంత్రం అయ్యాక సేవకురాల్ని 'ఇఫ్తార్' కోసం ఏదన్నా తెమ్మన్నారు. దానికి సేవకురాలు, ''అమ్మా! ఆ డబ్బుతో ఇఫ్తార్ కోసం కొంత మాంసం అన్నా తెప్పించక పోతిరి!'' అంది. ''సరేలే ఇప్పుడు చింతించి ఏం లాభం? అప్పుడే ఎందుకు గుర్తు చేయలేదు?'' అని మాత్రం చెప్పి ఊరుకున్నారు.

ఇటువంటి సంఘటనే ఇంకోసారి ఎదురైంది. ఆ రోజు ఆమె ఉపవాసం ఉన్నారు. ఇంట్లో ఒక రొట్టె తప్ప మరేమీ లేక పోయింది. ఇంతలో ఒక భిక్షగాడు యాచించాడు: ''ఆ ఒక్క రొట్టెనూ అతడికిచ్చి వేయుమ''ని సేవకురాల్ని ఆజ్ఞాపించారు. సాయంత్రం ఇఫ్తార్‌లో ఏం తింటారు? అని సేవకురాలు ప్రశ్న వేసింది. ''నువ్విచ్చేయి'' అన్నారామె. సాయంత్రం అయ్యేసరికి ఎవరో మేక మాంసం కూరను కానుకగా పంపారు. సేవకురాలితో, ''చూడు! రొట్టెకన్నా మేలయిన వస్తువును దైవం పంపాడు'' అని కృతజ్ఞతా పూర్వకంగా చెప్పారు. తాను ఉన్న

https://teluguislam.net

యింటిని సయితం అమీర్ ము ఆవియా ( రజి) ద్వారా అమ్మివేయించారు. వచ్చిన డబ్బంతా దైవమార్గంలో ఖర్చు చేసేశారు దానశీలి హజ్రత్ ఆయిషా ( రజి అన్హా).

అక్కగారి కొడుకు అయిన హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ అంటే పిన్నిగార్కి అమితమైన వాత్సల్యం. ఆయన గారు కూడా పిన్నికి బాగా సేవలు చేసేవారు. కాని పిన్నిగారి దాతృత్వగుణం చూసిచూసి ఆయన కూడ విసుగు చెందారు. ఒకసారి అతడి నోటివెంట, ''ఆమె చెయ్యి ఆపాలి'' అన్నమాటలు వెలువడ్డాయి. పిన్నికి ఈ విషయం తెలిసి ''వాడు నా చెయ్యి ఆపేటంతటి వాడయ్యాడా?'' ఇక ఎన్నడూ ఇబ్నె జుబైర్‌తో మాట్లాడను అని ఒట్టు పెట్టుకున్నారు. హజ్రత్ ఇబ్నె జుబైర్ చాలా కాలం వరకూ పశ్చాత్తాపంతో గడిపారు. ఎట్టకేలకు అతి కష్టంమీద అతడ్ని క్షమించారు హజ్రత్ ఆయిషా ( రజి).

ఆమె దైవభీతి పరాయణురాలు. దయార్ద్ర హృదయురాలు. ఆమెకు ఏడుపు త్వరగా వచ్చేది. హజ్జతుల్ విదా సందర్భంగా స్త్రీ సంబంధమైన బలహీనత కారణంగా హజ్ విధులు కొన్నింటిని నెరవేర్చడంలో ఆటంకం ఏర్పడింది. తన దురదృష్టానికి అదే పనిగా ఏడ్వసాగారు. చివరకు దైవప్రవక్త (సఅసం) ఊరడించిన మీదట శాంతించారు. ఒకసారి దజ్జాల్ ప్రసక్తి గుర్తుకు వచ్చి అమితమైన దుఃఖము కల్గి ఏడ్వసాగారు. జమల్ యుద్ధంలో పాల్గొన్న విషయం గుర్తుకు రాగానే కుమిలి కుమిలి ఏడ్చేవారు. మరణశయ్యపై ఉండగా స్వయం నిర్ణయంతో చేసిన తప్పులకు ఎంత గానో చింతిస్తూ, ''నేను సర్వనాశనం అయిపోయినా బాగుండేది'' అని పశ్చాత్తాప పడేవారు.

ఒకసారి ఏదో విషయమై ఒట్టు పెట్టుకున్నారు. ప్రజల కోరికపై ఒట్టు తీసి గట్టుమీద పెట్టవలసి వచ్చింది. అందుకు పరిహారంగా 40మంది బానిసల్ని విడుదల చేశారు. అయినా దాని ప్రభావం ఆమెపై ఎంతగా పడిందంటే, అది గుర్తు వచ్చినప్పుడల్లా ఏడ్చి ఏడ్చి కొంగు తడిసి ముద్దయ్యేది ( బుఖారీ). 'ఇఫ్క్' సంఘటన సందర్భంగా మీరు చదివియున్నారు - కపటులు ఆమెపై అపనింద మోపగా ఆమెకు తెలిసి ఏడుపు లంకించుకున్నారు. తల్లిదండ్రులు ఎంతగా ఓదార్చినా ఆమె కన్నీరు ఆగలేదు.

ఒక నాటి సంఘటన..... ఒక మహిళ ఆమె గుమ్మంలోకి వచ్చి యాచించింది. ఆమె వెంట ఇద్దరు చిన్న పిల్లలున్నారు. అప్పుడు ఇంట్లో ఏమీ లేకపోయేసరికి మూడు ఖర్జూరాలు ఆమెకు ఇచ్చారు. ఆ స్త్రీ పిల్లలిద్దరికీ చెరి ఒక ఖర్జూరాన్ని ఇచ్చి తానొకటి నోట్లో వేసుకుంది. పిల్లలు తమ తమ ఖర్జూరాన్ని తిని తల్లి వంక ఆశగా చూడ సాగారు. తల్లి తన నోటిలోని ఖర్జూరాన్ని బయటకు తీసి ఆ పిల్లలకు చెరి సగం యిచ్చి తాను ఏమీ తినకుండా ఉండిపోయింది. మాతృప్రేమ పొంగిపొరలిన

https://teluguislam.net

ఈ అపురూప సన్నివేశం చూసిన ఆయిషా (రజి)కు కళ్ళువెంబడి అశ్రుధారలు కురిశాయి.

## దైవారాధన

తరచూ దైవారాధనలో నిమగ్నమయ్యేవారు. 'చాష్త్' నమాజ్ చేసేవారు. ''నా తండ్రి గోరీ నుండి లేచివచ్చి వారించినా ఈ నమాజ్‌ను మానను'' అనేవారు. దైవప్రవక్త (సఅసం)తోపాటు రాత్రులందు లేచి తహజ్జుద్ నమాజ్‌లో పాల్గొనేవారు. ఆయన (సఅసం) తదనంతరం కూడా క్రమం తప్పక తహజ్జుద్ నమాజ్ చేసేవారు. ఒకవేళ ఎప్పుడయినా అనుకోకుండా నిద్రకు లోనయి సమయానికి తహజ్జుద్ నమాజ్ చేయలేకపోతే ఉదయాన్నే లేచి ఫజ్ర్ నమాజ్‌కు ముందు తహజ్జుద్ నమాజ్ చేసే వారు. ఒకసారి అటువంటి సందర్భంలోనే ఆమె మేనల్లుడు ఖాసిం వచ్చారు. ఆయన ఇది చూసి, ''అత్తయ్యా! ఇది ఏ నమాజ్?'' అని అడగ్గా, ''రాత్రి చేయలేకపోయాను. ఇప్పుడు దాన్ని విడువలేక పోయాను'' అన్నారు హజ్రత్ ఆయిషా (రజి). రమజాన్ మాసంలో తరావీహ్ నమాజ్‌ను ప్రత్యేక శ్రద్ధతో చేసేవారు.

హజ్రత్ ఆయిషా (రజి) తరచూ ఉపవాసం పాటించేవారు. ఎల్లప్పుడూ ఉపవాసం ఉండేవారని మరికొన్ని ఉల్లేఖనాలలో వుంది. ఒకసారి వేసవి దినాలలో అరఫా రోజున ఉపవాసం వున్నారు. ఎండవేడి, తీక్షణత భరింప శక్యంగా లేక తలపై నీరు చిలకరించబడేది. ఆమె సోదరుడు అబ్దుర్రహ్మాన్, ''ఇంత వేడిలో ఉపవాసం ఉండనక్కర లేదు. ఇఫ్తార్ చేసుకోండి'' అని అంటే 'అరఫా రోజున ఉపవాసం ఉంటే సంవత్సరం పాటు పాపాలు మన్నించబడతాయని దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చినపుడు నేను ఉపవాసం ఎలా విరమించగలను?'' అన్నారు హజ్రత్ ఆయిషా (రజి).

ప్రతి సంవత్సరం హజ్ చేసేవారు. ఆమె హజ్ చేయని సంవత్సరం చాలా అరుదు. హజ్రత్ ఉమర్ (రజి) తన హయాం చివరి రోజుల్లో హజ్రత్ ఉస్మాన్ (రజి), హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)లను ప్రవక్త (సఅసం) సతీమణుల వెంట హజ్ యాత్రకు పంపారు (బుఖారీ). హజ్‌లో ఆమె విడిది చేసే చోటు ముందుగానే నిర్ధారించబడేది. దైవప్రవక్త (సఅసం) అభిరుచిని బట్టి మొదట అరఫాత్ మైదానం చివరి సరిహద్దులో దిగేవారు. రానురాను ఇక్కడ జన సమూహం ఎక్కువ అవటంతో కాస్త అవతలకు జరిగి 'అరాక్'లో తన గుడారం వేయించే వారు. ఒక్కోసారి బసీర్ కొండ వాలులో వచ్చి ఆగేవారు. ఇక్కడ ఉన్నంతసేపు ఆమెతోపాటు ఆమె వెంట వచ్చిన వారంతా తక్బీర్ పఠించేవారు. ఇక్కడ్నుంచి బయలుదేరేటప్పుడు తక్బీర్ పఠనం చాలించేవారు.

https://teluguislam.net

## మామూలు విషయాలపట్ల శ్రద్ధ

వారించబడిన చిన్న చిన్న విషయాలకు కూడా దూరంగా ఉండేవారు. దారిలో ఉన్నపుడు గంటల శబ్దం వినవస్తే చెవుల్లో ఆ శబ్దం పడకూడదని ఆగిపోయేవారు. ఆమెకు చెందిన ఒక యింట్లో అద్దెకున్న వారు చదరంగం ఆడేవారు. మీరు ఆ ఆట మానకపోతే ఖాళీ చేయిస్తానని వారికి కబురు పంపారు.

ఒకసారి యింట్లో ఒక పాము వచ్చింది. దాన్ని చంపి వేశారు. ''మీరు తప్పు చేశారు. బహుశా ఆ పాము 'ముస్లిం జిన్' కావచ్చు కదా!'' అని ఎవరో అంటే ఒకవేళ అది ముస్లిం అయివుంటే ఉమ్మహాతుల్ మోమినీన్‌ల కుటీరాల్లోకి వచ్చియుండేది కాదు'' అన్నారు ఆమె. ''ఆ పాము వచ్చినపుడు మీ సతర్‌పై ఆచ్ఛాదన ఉందా?'' అని అతడు అడిగాడు. ఇది విన్న హజ్రత్ ఆయిషా ప్రభావితురాలయి అందుకు పరిహారంగా ఒక బానిసను విడుదల చేశారు.

## బానిసలపట్ల ప్రేమ

కేవలం ఒక ప్రతిజ్ఞను ఉపసంహరించుకున్నందుకే పరిహారంగా ఆమె నలభయి మంది బానిసలకు స్వాతంత్ర్యం ప్రసాదించారు. మొత్తమ్మీద ఆమె చేత 76 మంది బానిసలు విముక్తి గావించబడ్డారు. హతీం తెగకు చెందిన ఒక సేవకురాలు ఆమె వద్ద ఉండేది. దైవప్రవక్త (సఅసం) నోట, ''ఈ తెగకూడా హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం) సంతానంలోనిదే''నని విని యుండటం చేత ఆయన (సఅసం) సూచన మేరకు ఆమెకు కూడా విముక్తి ప్రసాదించారు (బుఖారీ). మదీనాలో బరీరహ్ పేరు గల బానిసరాలు ఉండేది. ఆమె యజమానులు నిర్ణీత ధనం నిర్ణయించి అంత మొత్తం చెల్లిస్తే నీకు విడుదల లభిస్తుందని ప్రకటించారు. ఆ ధనం కోసం ఆమె చందాలు అడిగింది. హజ్రత్ ఆయిషా (రజి) ఇది విని తన తరఫు నుండి పూర్తి మొత్తాన్ని చెల్లించి ఆమెను విముక్తురాల్ని చేశారు.

## యాచకుల స్థాయిని బట్టి సహాయం

ఫకీరులకు, అగత్యాపరులకు వారి స్థాయిని బట్టి సహాయం చేయాలి. అట్టడుగు శ్రేణికి చెందిన మనిషి మీ దగ్గరకు వచ్చినపుడు అతడి అవసరం తీరడమే అతడి బాధా నివారకం అవుతుంది. కాని అతడికంటే అధికస్థాయికి చెందిన వ్యక్తి వచ్చినపుడు అతడిపట్ల గౌరవ మర్యాదలతో మెలగవలసి వుంటుంది. హజ్రత్ ఆయిషా (రజి) ఎప్పుడూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకునేవారు. ఒకసారి ఒక సామాన్యుడు వస్తే అతడికి రొట్టెముక్క ఇస్తే తీసుకుని వెళ్ళిపోయాడు. ఆ తర్వాత మరో వ్యక్తి వచ్చాడు. అతడు ధరించిన దుస్తులను బట్టి మర్యాదస్తునిగా అగుపించాడు. అతన్ని కూర్చోబెట్టి భోజనం చేయించారు. ఈ యిద్దరు మనుషుల పట్ల రెండు రకాలుగా

https://teluguislam.net

వ్యవహరించడానికి కారణం ఏమిటి? అని ప్రజలు అడిగితే, "ప్రజలతో వారివారి స్థాయినిబట్టి వ్యవహరించవలసి వుంటుంది అని దైవప్రవక్త (సఅసం) ఉపదేశించారు కదా!'' అని ఆమె గుర్తు చేశారు.

## హజ్రత్ ఆయిషా విశిష్టత

సహీహ్ ముస్లింలోని కితాబుల్ ఫజాయల్ అధ్యాయంలో వుంది - మహాప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రబోధించారు:

''నేను మీ మధ్య రెండు మహత్తర వస్తువులను వదలి వెళుతున్నాను. ఒకటి: దైవగ్రంథం. రెండోది: నా అహలె బైత్ (కుటుంబీకులు).

దీని ఉద్దేశ్యమేమంటే దైవగ్రంథం తన విలక్షణమైన శైలి దృష్ట్యా సులభ గ్రాహ్యమైనదే. అయినప్పటికీ దాని నిగూఢార్థాలను విడమరచి చెప్పగలిగే, విజ్ఞానపరంగా, ఆచరణాత్మకంగా దాని పరమార్థాలను విశదీకరించ గలిగే వ్యక్తుల అవసరం ప్రపంచానికి ఎప్పుడూ వుంటుంది. ఆయన (సఅసం) తర్వాత అటువంటి వ్యక్తుల్ని ఆయన (సఅసం) కుటుంబీకుల్లో అన్వేషించడం మంచిది.

ఈ నేపథ్యంలో చూసినపుడు... హజ్రత్ ఆయిషా (రజి) కు ప్రత్యేకత ఉంది. దైవప్రవక్త (స)గారి శిక్షణా సాంగత్యాల దృష్ట్యాగానీ, స్వతహాగా ఆమెకు అబ్బిన ప్రజ్ఞా పాటవాల దృష్ట్యాగానీ ప్రవక్త కుటుంబీకులలో హజ్రత్ ఆయిషా (రజి) కు గల ప్రత్యేక స్థానాన్ని ఎవరూ కాదనలేరు. ఈ కారణం చేత దైవగ్రంథ వ్యాఖ్యాతగా, ప్రవక్త సంప్రదాయాన్ని జీర్ణం చేసుకున్న పరిజ్ఞానిగా ఇస్లామీయ సూత్రాల బోధకురాలిగా ఆమె కన్నా మేలయిన వారు మరెవరు కాగలరు? ప్రజలు దైవప్రవక్తను ఇంటి బయట మాత్రమే చూశారు. కాని ఆమె దైవప్రవక్త (సఅసం)ను ఇంటా బయటా కూడా చాలా దగ్గర నుంచి గమనించారు.

హజ్రత్ ఆయిషా పడక మీద తప్ప మరో ఉమ్ముల్ మోమినీన్ పడకమీద 'వహీ' అవతరించలేదు (సహీహ్ బుఖారీ). దైవదూతల్లోనే అగ్రజుడైన జిబ్రయీల్ (అ) ఆమె ఇంటికి 'సలామ్' పంపారు. రెండు సార్లు జిబ్రయీల్ (అలై)ను ఆమె తన చర్మచక్షువులతో వీక్షించగలిగారు. ఆమె పవిత్రతనూ, సౌశీల్యాన్ని గురించి స్వయంగా సర్వలోక ప్రభువే సాక్ష్యమిచ్చాడు. పరలోకంలో ఆమె దైవప్రవక్త (స) కు ప్రియతమ భార్యగా ఉంటారని దైవప్రవక్తకు స్వప్నంలో సంకేతం అందింది. ఒకసారి హజ్రత్ ఆయిషా (రజి) సెలవిచ్చారు, ''నేను గర్వించడం లేదు. కాని ఒక సంఘటనగా మీకు తెలియపరుస్తున్నాను, ''దైవం నాకు ప్రపంచంలో మరెవ్వరికీ ప్రసాదించబడని 9 విషయాలను ప్రసాదించాడు:

https://teluguislam.net

1. స్వప్నంలో దైవదూత దైవప్రవక్త (సఅసం) ఎదుట నా రూపాన్ని ఉంచారు.
2. నాకు ఏడేళ్ళు ఉన్నప్పుడు ఆయన (సఅసం) నన్ను పెళ్ళాడారు.
3. తొమ్మిదేళ్ళ వయసులో కాపురానికి వచ్చాను.
4. ఆయన (సఅసం)కు ఉన్న సతీమణులలో నేను తప్ప మరెవ్వరూ కన్య కారు.
5. ఆయన (స) నా ప్రక్కమీద ఉన్న సమయంలో కూడా 'వహీ' (దైవసందేశం) వచ్చేది.
6. నేను ఆయనకు ప్రియాతి ప్రియమైన భార్యగా ఉన్నాను.
7. నన్ను కొనియాడుతూ ఖుర్‌ఆన్ వాక్యాలు అవతరించాయి.
8. నేను జిబ్రయీల్ (అ)ను రెండు సార్లు నా కళ్ళారా చూశాను.
9. ఆయన (సఅసం) నా ఒళ్ళోనే తల ఉంచి పరమ పదించారు.''

## అపార నైపుణ్యం ఆమె స్వంతం

విద్యా విషయకంగా హజ్రత్ ఆయిషా (రజి)కు నాటి సాధారణ స్త్రీలపై, ఉమ్మహాతుల్ మోమినీన్ (విశ్వాసుల తల్లుల)పై ప్రత్యేక సహబీలలో కొందరు పెద్దలను తప్పించి మిగిలిన సహాబాలందరిపై ప్రత్యేక ఆధిక్యత ఉండేది.

సహీ తిర్మిజీ గ్రంథంలో హజ్రత్ అబూ మూసా అష్‌అరీ (ర.అ) ఉల్లేఖించారు:

> "ప్రవక్త సహచరులమైన మేము ఆయిషా (రజి)ను అడగని విషయం, ఇంకా ఆమె వద్ద నుంచి రాబట్టని క్లిష్టతరమైన విషయం ఏమీ లేదు.''

అతా ఇబ్నె అబీ రిబాహ్ అనే తాబయీ (ప్రశిష్యుని)కి అనేక సహాబా శిష్యరికం చేసిన గౌరవం దక్కింది. ఆయన అంటున్నారు:

> "హజ్రత్ ఆయిషా (రజి) అందరికన్నా గొప్ప ధర్మవేత్త. అందరికన్నా గొప్ప జ్ఞాని. ఇంకా ప్రజలలో అందరికన్నా మంచి అభిప్రాయం గలవారు.''

తాబయీన్ (ప్రశిష్యుల) నాయకుడయిన ఇమామ్ జుహరీ పెద్దపెద్ద సహాబా సాంగత్యంలో శిక్షణ పొందారు. ఆయన ఏమంటున్నారో చూడండి:

> ''హజ్రత్ ఆయిషా (రజి) ప్రజలందరిలోకెల్లా గొప్ప విద్వాంసురాలు. పెద్దపెద్ద సహాబా ఆమెను అడిగి తెలుసుకునే వారు.''

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) కుమారుడయిన అబూ సల్మా కూడ గొప్ప ప్రశిష్యుడే. ఆయన ఇలా అభిప్రాయపడ్డారు:

https://teluguislam.net

''దైవప్రవక్త (సఅసం) సున్నత్‌లను క్షుణ్ణంగా ఆకళింపు చేసుకోవటంలోనూ, సలహా తీసుకోవలసిన అవసరం వచ్చినపుడు ఆమెకన్నా - గొప్ప ఫిక్‌హ్‌వేత్తను, ఇంకా దివ్య వచనాల అవతరణ, విధ్యుక్త ధర్మాల విషయంలో పరిజ్ఞానం కలవారిలో హజ్రత్ ఆయిషా (రజి) కన్నా గొప్పవారిని నేను చూడలేదు.''

ఒక రోజు అమీర్ ము ఆవియా ''ప్రజలలో అందరికన్నా గొప్ప విద్వాంసులు ఎవరు?'' అని ఒక సభికుడ్ని అడిగారు. ''అమీరుల్‌మోమినీన్! మీరే'' అని అతడు జవాబిచ్చాడు. లేదు. నేను ప్రమాణం చేయించి అడుగుతున్నాను. దాపరికం లేకుండా నిజం చెప్పు అని నిలదీస్తే అతడు ''అలా అయితే అది ఆయిషా యే'' అని చెప్పాడు.

ఉర్వ బిన్ జుబైర్ (రజి) ఏమన్నారో చూడండి:

''ధర్మాధర్మాల విచక్షణలోగాని, విషయం లోతుల్లోకి పోవటంలో నైతేనేమీ, కవనంలో నైతేనేమీ, వైద్య విషయాల్లో నైతేనేమీ హజ్రత్ ఆయిషా (రజి)ను మించిన వారిని నేను ఎరుగను.''

ఒక వ్యక్తి హజ్రత్ ఆయిషా (రజి) వద్ద శిక్షణ పొందిన తాబయీతో ''హజ్రత్ ఆయిషా (రజి) ఫరాయజ్ (విధులు) సమస్యలను ఎరుగునా?'' అని ప్రశ్నించాడు. ఆయన జవాబిచ్చాడు:

''దైవం సాక్షి! పెద్దపెద్ద సహాబా ఆమెతో ఫరాయజ్ సమస్యల్ని చర్చిండం చూశాను.''

హదీసులను కంఠస్తం చేయడం, ప్రవక్త సంప్రదాయాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చే బాధ్యత తతిమ్మా సతీమణులు కూడా నిర్వర్తించారు. అయితే హజ్రత్ ఆయిషా (రజి) స్థాయికి ఎవరూ చేరలేక పోయారు.

మహమూద్ బిన్ లుబైద్ తెలియచేస్తున్నారు:

''ప్రవక్త (సఅసం) పవిత్ర సతీమణులు ఎన్నో హదీసులను కంఠస్థం చేసుకున్నారు. కాని, వాళ్ళు హజ్రత్ ఆయిషా (రజి), హజ్రత్ ఉమ్మె సల్మా (రజి)లకు సాటిరారు.''

ఇమామ్ జహరీ సాక్ష్యం:

''పురుషులందరి ధర్మ పరిజ్ఞానం పవిత్ర సతీమణుల ధర్మపరిజ్ఞానం ఒకచోట చేరిస్తే అందులో హజ్రత్ ఆయిషా (రజి) ధర్మ పరిజ్ఞానమే అధికం.''

కొందరు హదీసు వేత్తలు హజ్రత్ ఆయిషా (రజి) పాండిత్యం గురించి పేర్కొన్న హదీసులలో ఈ హదీసు కూడా వుంది. దాని ప్రకారం:

మహాప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు:

''మీ ధర్మం (దీన్) యొక్క ఒక భాగాన్ని ఆ ఎర్రని పిల్ల దగ్గర నేర్చుకోండి.''

https://teluguislam.net

# విజ్ఞాన ఖని

స్త్రీలలోనే కాకుండా పురుషుల్లో కూడా హజ్రత్ ఆయిషా (రజి)కు గల విశిష్ట తరమైన ప్రత్యేకతను చాటి చెప్పే భాగం యిది. దైవగ్రంథం పరిజ్ఞానం, సున్నత్; ఫికహ్ మరియు షరీయత్ సూత్రాల అన్వయింపులో ఆమె ఎంతో ఉన్నతురాలు. హజ్రత్ ఉమరె ఫారూఖ్, హజ్రత్ అలీ ముర్తుజా (రజి)లతో పాటు ఆమె పేరుకూడా నిస్సంకోచంగా పేర్కొనవచ్చు. ప్రాముఖ్యత దృష్ట్యా ఈ భాగాన్ని దైవగ్రంథంలో ఆరంభిస్తున్నాం.

## దివ్య ఖుర్ఆన్ అవగాహన

పవిత్ర ఖుర్ఆన్ 23 ఏండ్ల కాలంలో అవతరించబడిందన్న విషయం అందరకు తెలిసిందే. హజ్రత్ ఆయిషా (రజి) దైవదౌత్యం లేక ఖుర్ఆన్ అవతరణా కాలపు పధ్నాలుగో ఏట - 9 ఏళ్ళ వయసులో - దైవప్రవక్త (సఅసం) ఇంట కాలుమోపారు. అంటే దైవప్రవక్త (సఅసం)తో గడపిన కాలం దాదాపు పదేళ్ళు. దీన్నిబట్టి పవిత్ర ఖుర్ఆన్‌లో సగభాగాని కంటే ఎక్కువ భాగం ఆమె బాల్య దశకు పూర్వం అవతరించిందన్న విషయం సుస్పష్టం. కాని అసాధారణ ప్రజ్ఞా పాటవాలుగల ఈ మహిళామణి ఆ కాలాన్ని కూడా (అంటే బాల్య చాపల్యం, ఆటపాటల కాలాన్ని కూడా) వృధా పోనీయలేదు. దైవప్రవక్త (సఅసం) ప్రతి రోజూ నాగా లేకుండా హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) యింటికి వచ్చేవారు. హజ్రత్ సిద్దీఖ్ (రజి) తన యింట్లో ఒక భాగాన్ని మస్జిద్‌గా చేసుకున్నారు. ఆ భాగంలో కూర్చుని తదేక ధ్యానంలో మమేకమై పవిత్ర ఖుర్ఆన్ పారాయణం చేసేవారు (సహీబుఖారీ). అటువంటి అవకాశాల ద్వారా విశిష్ట ధారణ శక్తిగల ఆయిషా (రజి) ప్రయోజనం పొందకుండా ఎలా ఉంటారు?

بَلِ السَّاعَةُ مَوْعِدُهُمْ وَالسَّاعَةُ أَدْهَىٰ وَأَمَرُّ ○

https://teluguislam.net

వారి సంగతి చూసుకోవడానికి వాగ్దానం చేయబడిన
సిసలయిన ఘడియ ప్రళయ దినం మాత్రమే. ఆ ఘడియ
ఎంతో కఠినమూ, ఎంతో చేదైనదీను'' (ఖమర్:46)

పై ఆయత్ అవతరించినపుడు నేను ఆడుకొంటున్నాను (సహీహ్ బుఖారీ) అని ఆమె చెప్పారు.

హ॥జత్ ఆయిషా (రజి) కు పదమూడు పధ్నాలుగు సంవత్సరాల వయస్సు వరకు (హి॥జ్రీ 5వ సంవత్సరం వరకు) ఖుర్ఆన్ అంతగా కంఠస్థం కాలేదు. ఆమె స్వయంగా ఈ విషయాన్ని ఒప్పుకున్నారు.

అప్పటికి నేను పిన్న వయస్సుగ్రాల్ని. ఖుర్ఆన్‌లో
అధికభాగం చదివి యుండలేదు'' (బుఖారీ)

కాని ఈ స్థితిలో కూడా ఆమె ఖుర్ఆన్‌ను ఉదాహరించేవారు.

దైవప్రవక్త (సఅసం) పరమపదించే నాటికి ఖుర్ఆన్ దాదాపుగా వ్రాతపూర్వకంగా పుస్తకరూపం దాల్చలేదు. హ॥జత్ అబూబకర్ (రజి) తన హయాంలో కాగితంపై ఖుర్ఆన్ ను సంకలన పర్చారు. ఆ వ్యవధిలోనే ఇతర సహచరులు కూడా తాము ప్రతిరోజూ పఠించుకోడానికి ఖుర్ఆన్‌ను సంకలన పర్చుకున్నారు. ఆ సంకలనాలలో కొన్ని సూరాలు వరుసక్రమంలో ఏది ముందో ఏది వెనుక వచ్చిన సూరాయో అన్న విషయంలో భేదాభిప్రాయం ఉండింది.

అబూ యూనుస్ అనే ఆయన హ॥జత్ ఆయిషా (రజి) బానిసల్లో ఒకరు. చక్కని దస్తూరితో వ్రాసే కళ ఆయనకు అబ్బింది. హ॥జత్ ఆయిషా (రజి) ఆయన చేత తన ఖుర్ఆన్ ప్రతిని వ్రాయించుకున్నారు. అదీగాక ఆనాడు ఖుర్ఆన్ పారాయణం మరియు దాని ఉచ్చారణ విషయంలో కొన్ని స్వల్పమైన విభేదాలుండేవి. ఇరాక్‌కు చెందిన వ్యక్తి ఒకరు ఆమెను కలుసుకునేందుకు వచ్చి, ''అమ్మా! మీ ఖుర్ఆన్‌ను కాస్త నన్ను చూడనిస్తారా?'' అని ఆమెను అభ్యర్థించాడు (బుఖారీ). ఆమె అందుకు కారణం దర్యాప్తు చేయగా అతడు, ''మా వాళ్ళు ఇప్పటి వరకు దివ్య ఖుర్ఆన్‌ను సరయిన వరుసక్రమంలో పఠించలేదు. నా ఖుర్ఆన్ ప్రతిని మీ ప్రతితో సరిపోల్చుకుంటాను'' అని విన్నవించుకున్నాడు.

''సూరాలు ముందు వెనుక అయినంత మాత్రాన నష్టమేమీ లేదు'' అంటూ ఆమె తన ఖుర్ఆన్‌ను తెరచి ప్రతి సూరా యొక్క మొదటి ఆయత్ చదివి అతడి చేత వ్రాయించారు (బుఖారీ).

https://teluguislam.net

ఏ ఒక్క ఆయత్ ఆమెకు అర్థం కాకపోయినా, దైవప్రవక్త (సఅసం)ను అడిగి తెలుసుకోవడం ఆమె అలవాటు. అందువల్ల సహీహ్ హదీసులలో అనేక ఆయత్‌ల గురించి దైవప్రవక్త (సఅసం)ను ఆమె ప్రశ్నించడం గురించి పేర్కొనబడింది. ప్రవక్త సతీమణులకు దైవం తరపున అయిన ఆజ్ఞ ఇది:

> ''మీ గృహాలలో చదివి వినిపించ బడుతూన్న దైవ వచనాలను, వివేకంతో కూడుకున్న మాటలను కంఠస్థం చేసుకుంటూ ఉండండి'' (అహ్‌జాబ్: 34).

ఈ ఆజ్ఞను శిరసావహించడం అవసరం కాబట్టి దైవప్రవక్త (సఅసం) తహజ్జుద్ నమాజ్‌లో పవిత్ర ఖుర్‌ఆన్ లోని పెద్దపెద్ద సూరాలను ఎంతో ఏకాగ్రతతో, మరెంతో నింపాదిగా పఠించేవారు.

హజ్రత్ ఆయిషా (రజి) ఆ నమాజ్‌లలో ఆయన (సఅసం) వెనుక వుండేవారు. ఖుర్‌ఆన్ అవతరణ హజ్రత్ ఆయిషా తప్ప మరో భార్య ప్రక్కమీద జరగలేదు. ఖుర్‌ఆన్ అవతరించేటప్పుడు మొదటి శబ్దం ఆమెకే వినబడేది. సూరయె బఖరహ్, సూరయె నిసా అవతరించినపుడు నేను ఆయన (సఅసం) దగ్గరే వున్నాను'' అని ఆమె సెలవిచ్చారు. ఈ సందర్భాల్లో హజ్రత్ ఆయిషా (రజి)కు దివ్య ఖుర్‌ఆన్‌లోని ఆయత్‌ల పఠనా సరళి వాటి సారాంశం. వాటి పూర్వరంగం తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగింది. ఏ ధర్మసందేహం ఎదురయినా ఆమె మొదట పవిత్ర ఖుర్‌ఆన్‌లోనే దానికి సమాధానం అన్వేషించేవారు. విశ్వాసాలు, ధర్మశాస్త్రం, దైవాదేశమే కాక దైవప్రవక్త (సఅసం) నైతికత, ప్రవక్త జీవితం కూడా ఆమె కళ్ళెదుటి విషయాలే, అయినా అవి చరిత్రకూ వార్తకూ సంబంధించినవి కావడం చేత వాటిని ఖుర్‌ఆన్ పరం చేసేవారామె. ఒకసారి కొందరు వ్యక్తులు వచ్చి ''ఉమ్ముల్ మోమినీన్! దైవప్రవక్త (సఅసం) నడవడికల్ని వివరించండి'' అని అడగ్గా, ''ఏమిటి? మీరు ఖుర్‌ఆన్ చదవలేదా? ఆయన (సఅసం) నడవడిక ఆద్యంతమూ ఖుర్‌ఆనే కదా?'' అని ఆమె బదులిచ్చారు. ఆరాధనా విధానం ఎటువంటిది అని వారు తిరిగి ప్రశ్నిస్తే, ''సూరయె ముజమ్మిల్ చదవలేదా?'' అని అన్నారు.

ఆమెకు గల ధర్మ పరిజ్ఞానానికి మరికొన్ని మచ్చుతునకలు-

1. హజ్ సందర్భంగా - సఫా మర్వా కొండలమధ్య పరుగెత్తడం కూడా హజ్ క్రియల్లో ఒక భాగమే. పవిత్ర ఖుర్‌ఆన్‌లో దాని గురించి ఇలా వుంది:

https://teluguislam.net

إِنَّ الصَّفَا وَالْمَرْوَةَ مِنْ شَعَآئِرِ اللّٰهِ ۚ فَمَنْ حَجَّ
الْبَيْتَ اَوِ اعْتَمَرَ فَلَا جُنَاحَ عَلَيْهِ اَنْ يَّطَّوَّفَ
بِهِمَا ؕ

సఫా మర్వా కొండలు నిస్సందేహంగా అల్లాహ్ చిహ్నాలలోనివే. కాబట్టి కాబా గృహానికి, హజ్‌గాని ఉమరాగాని చేసేవారు వాటిమధ్య 'సయీా' చేస్తే అది దోషం ఎంత మాత్రమూ కాదు'' (అల్ బఖరహ్:158).

''పిన్నీ! ఎవరైనా ఒకవేళ 'ప్రదక్షిణం' చేయకపోయినా ఫర్వాలేదని దీని భావమా?'' అని ఉర్వా ప్రశ్నించగా, బాబూ! నీవు చెప్పింది సరికాదు. నీ వనుకొన్నదే నిజమై ఉంటే,

''ఒకవేళ వాటి ప్రదక్షిణ చేయకపోయినా అభ్యంతరం లేదు'' అని ఆయత్ అవతరించి ఉండేది. వాస్తవంలో ఈ ఆయత్ అన్సారులను ఉద్దేశించి అవతరించింది. ఇస్లాం స్వీకరణకు పూర్వం ఔస్, ఖజ్‌రజ్ తెగలు 'మనాత్‌కు జై' అనే నినాదాలు చేసేవారు. మనాత్ మరో చోట ప్రతిష్ఠించబడి ఉండేది. అందుచేత సఫా - మర్వాల మధ్య 'సయీా' చేయడం దోషమని వారు భావించే వారు. ఇస్లాం స్వీకరించాక వాళ్ళు దైవప్రవక్త (సఅసం)ను ''మేము ఇదివరలో అలా చేసేవారము. ఇప్పుడు ఏం చేయాలి?'' అని అడిగారు. ఈ నేపథ్యంలో ''సఫా మర్వాల ప్రదక్షిణం చేయండి, ఇందులో ఏ దోషమూ లేదు'' అని చెప్పబడింది. ''దైవప్రవక్త (సఅసం) సఫా మర్వాల మధ్య 'సయీా' చేశారు. ఇక ఇప్పుడు ఎవరికీ దాన్ని విడిచిపెట్టే హక్కు లేదు'' అని హజ్రత్ ఆయిషా (రజి) వివరించారు.

అబూబకర్ బిన్ అబ్దుర్రహ్మాన్ ఒక హదీసు వేత్త. ఆయనకు ఆయిషా (రజి) గారి వ్యాఖ్యానం తెలిసి ''విద్య అంటే యిదే"(సహీహ్ బుఖారీ) అని అభిప్రాయ పడ్డారు. కొన్ని పదాలలోనే హజ్రత్ ఆయిషా (రజి) వ్యాఖ్యాన సూత్రాలలోని ఒక పెద్ద చిక్కు ముడిని విప్పారు. ప్రతి వ్యాఖ్యానం లోనూ ఎప్పుడూ ఇదే సూత్రాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. అరేబియా నుడికారాలను బట్టి అరబ్బీ పదాలకు ఏ అర్థం వస్తుందో అదే ఖుర్‌ఆన్ యొక్క అసలు ఉద్దేశ్యంగా భావించాలి.

2. పవిత్ర ఖుర్‌ఆన్‌లో సూరయె యూసుఫ్‌లోని ఆయత్ ఇలా వుంది:

https://teluguislam.net

حَتّٰٓى اِذَا اسْتَيْـَٔسَ الرُّسُلُ وَظَنُّوْٓا اَنَّهُمْ قَدْ كُذِبُوْا
جَآءَهُمْ نَصْرُنَا ۙ

''చివరకు ప్రవక్తలు ప్రజల్ని గురించి నిరాశచెందినపుడు, తమకు అబద్ధం చెప్పబడిందని ప్రజలు కూడ భావించినపుడు, అకస్మాత్తుగా మా సహాయం ప్రవక్తలకు చేరిపోయింది''. (యూసుఫ్:110).

''దీని భావం అబద్ధం చెప్పబడింది లేక వారితో తప్పుడు వాగ్దానం చేయబడింది అనా, లేక వారు తిరస్కరించ బడ్డారనా?'' అని ఉర్వా ప్రశ్నించారు.

''తిరస్కరించ బడ్డారు'' - అన్నారామె.

వారు తిరస్కరించ బడ్డారని ఆయనకు బాగా తెలుసు. ఆయన తెగవారు ఆయన దైవ దౌత్యాన్ని ఎగతాళి చేశారు. ఇది అపోహ కాదు, భ్రమా కాదు. కాబట్టి ''తప్పుడు వాగ్దానం చేయబడింది'' అన్న భావమే కరక్టు అని ఉర్వా అంటే, ''దైవం మన్నించుగాక! దైవ సహాయానికి సంబంధించి, దేవుడు తమకు అబద్ధపు వాగ్దానం చేశాడని దైవప్రవక్తలు అపోహకు గురికారు'' అని ఆమె విశదీకరించారు.

''మరి ఈ ఆయత్‌లోని మతలబు ఏమిటి?'' అని అడగ్గా, హజ్రత్ ఆయిషా (రజి) ఇలా వివరించారు:

''ఇది ప్రవక్తల అనుచరులను ఉద్దేశించి చెప్పబడింది. వారు విశ్వసించి, దైవదౌత్యాన్ని ధృవీకరించినపుడు వారి తెగవారు వారిని బాధలు పెట్టారు. దైవ సహాయం వారికి సుదూరాన వున్నట్టు కనబడింది. చివరకు ప్రవక్తలు తమ జాతిలోని తిరస్కారులు విశ్వసిస్తారన్న ఆశ వదలుకున్నారు. బహుశా ఈ జాప్యం కారణంగా విశ్వాసులు కూడా తమను తిరస్కరిస్తారేమోనన్న శంక వారికి కలుగుతుంటుంది. అంతలోనే దైవ సహాయం వచ్చేస్తుంది'' (బుఖారీ).

3. నలుగురు భార్యల వరకూ చేసుకునేందుకు అనుమతించబడిన ఆయత్‌లోని పదాలు ఇవి:

وَاِنْ خِفْتُمْ اَلَّا تُقْسِطُوْا فِي الْيَتٰمٰى فَانْكِحُوْا مَا طَابَ
لَكُمْ مِّنَ النِّسَآءِ مَثْنٰى وَثُلٰثَ وَرُبٰعَ ۚ

https://teluguislam.net

''అనాథలకు న్యాయం చేయలేమనే భయం మీకు కలిగితే మీకు నచ్చిన స్త్రీలను ఇద్దరేసి, ముగ్గురేసి లేక నలుగురేసి వివాహం చేసుకోండి (అయితే వీరిమధ్య న్యాయం చేకూర్చలేమన్న సంశయం ఉంటే ఒకర్నే చేసుకోవాలి)''.

(నిసా :3)

ఈ ఆయత్‌లో మొదటి భాగానికీ, చివరి భాగానికీ పొంతన లేదనిపిస్తుంది. అనాథల హక్కులలో న్యాయ రాహిత్యానికి, నికాహ్ అనుమతికి సంబంధం ఏమిటి? అని ఒక శిష్యుడు సందేహపడగా ఆమె ఇలా వివరించారు:

''ఈ వాక్యం అవతరణా కాలంలో కొందరు అనాథ బాలికలకు సంరక్షకులుగా ఉండేవారు. తద్వారా వారితో వారసత్వ బంధుత్వం ఏర్పడేది. వారు తమ పెద్దరికపు బలంతో వారిని వివాహమాడి వారి ఆస్తుల్ని ఆక్రమించ జూసే వారు. అనాథలకు వత్తాసు పలికేవారు ఎవరూ లేని కారణంగా వారిని అన్ని విధాలా ఒత్తిడికి గురి చేసేవారు. అలాంటి సంరక్షకుల్ని ఉద్దేశించి దైవం సెలవిస్తున్నాడు, ''మీరు ఆ బాలికల విషయంలో న్యాయ సమ్మతంగా వ్యవహరించ లేక పోతే, వారిని తప్పించి ఇతర స్త్రీలను ఇద్దరినో, ముగ్గురినో, నలుగురినో నికాహ్ చేసుకోండి. ఆ అనాథ బాలికలను బలవంతంగా వివాహమాడి మీ స్వాధీనంలోకి తెచ్చుకోకండి''.

(సహీహ్ ముస్లిం)

4. ఈ సూరాలోనే మరో ఆయత్ ఇలా వుంది:

وَيَسْتَفْتُوْنَكَ فِي النِّسَآءِ ۖ قُلِ اللّٰهُ يُفْتِيْكُمْ فِيْهِنَّ ۙ وَ
مَا يُتْلٰى عَلَيْكُمْ فِي الْكِتٰبِ فِيْ يَتٰمَى النِّسَآءِ الّٰتِيْ لَا
تُؤْتُوْنَهُنَّ مَا كُتِبَ لَهُنَّ وَتَرْغَبُوْنَ اَنْ تَنْكِحُوْهُنَّ

''ప్రజలు మిమ్మల్ని స్త్రీల వ్యవహారంలో (ఫత్వా) తీర్పు అడుగుతున్నారు. వారితో చెప్పండి, వారి విషయంలో అల్లాహ్ మీకు ఫత్వా ఇస్తున్నాడు. దానితో పాటు పూర్వం నుండి మీకు ఈ గ్రంథంలో వినిపించ బడుతూ వచ్చిన ఆ ఉత్తరువుల్ని కూడా జ్ఞాపకం చేస్తున్నాడు - అంటే ఏ అనాథ బాలికలనయితే మీరు వివాహం చేసుకోవడానికి ఇష్టపడటం లేదో.'' (నిసా:127)

https://teluguislam.net

మొదట ప్రశ్నించిన వ్యక్తే మళ్ళీ ఈ ఆయత్ అర్థం ఏమిటని దర్యాప్తు చేయగా ఆమె ఈ విధంగా వివరించారు:

''ఖుర్ఆన్‌లో వారి గురించి అంతకు పూర్వం ఏదైతే చదివి వినిపించబడిందో; దాని ఉద్దేశ్యం ఆ మొదటి వచనమే. అనాథ బాలికలకు అందచందాలు లేవన్న సాకుతో తామూ పెళ్ళి చేసుకోకుండా, ఇతరులకిచ్చి చేస్తే వారి ఆస్తి ఎక్కడ చేయి దాటి పోతుందోనన్న దురాశతో ఆ అనాథలను ఇతరులకూ ఇచ్చి పెళ్ళి చేయకుండా వేధించే సంరక్షకులకు హెచ్చరికగా ఈ ఆదేశం ఇవ్వబడింది (సహీహ్ ముస్లిం).

5. స్త్రీకి తన భర్తపై ఫిర్యాదు గనక వుంటే...? ఆ నేపథ్యంలోని ఆదేశం ఇది:

وَاِنِ امْرَاَةٌ خَافَتْ مِنْۢ بَعْلِهَا نُشُوْزًا اَوْ اِعْرَاضًا
فَلَا جُنَاحَ عَلَيْهِمَآ اَنْ يُّصْلِحَا بَيْنَهُمَا صُلْحًا ؕ وَالصُّلْحُ
خَيْرٌ ؕ

''ఏ స్త్రీ అయినా తన భర్త తన పట్ల చెడుగా ప్రవర్తిస్తాడేమోనని, లేక నిరాదరణ చూపుతాడేమోనని భయపడితే భార్యాభర్త లిరువురూ (పరస్పరం ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో) సర్దుబాటు చేసుకుంటే అది దోషం కాదు. సర్దుబాటే ఉత్తమమయినది.'' (నిసా : 128)

''గొడవలను దూరం చేసుకునేందుకు ఇద్దరూ ఒక పరిష్కారానికి రావల్సిందే. ఇందుకోసం దైవం ప్రత్యేకంగా ఆదేశించవలసిన అవసరం ఏముంది?''

అలక్ష్యం చేసి సరిగా చూసుకోని భర్త యొక్క భార్య, లేక వయసు మళ్ళిన స్త్రీ, భర్త సేవకు యోగ్యురాలు కాని స్త్రీ గురించి ఈ ఆయత్ వివరిస్తోంది. అటువంటి అసాధారణ పరిస్థితులలో విడాకులకు ఒప్పుకోక - భార్యగా ఉంటూనే భర్తతో తన హక్కును వదలుకొనే పక్షంలో - పరస్పరం వారు ఒక అవగాహనకు రావటంలో తప్పులేదు. పూర్తిగా తెగతెంపులు చేసుకొనే బదులు ఈ ఒప్పందాలు శ్రేయస్కరం'' అని విశదీకరించారు హజ్రత్ ఆయిషా (రజి).

6. పవిత్ర ఖుర్ఆన్‌లో భీతి గొల్పే దృశ్యం వచ్చిన సందర్భాలలో వ్యాఖ్యాతలు సర్వసాధారణంగా దాన్ని ప్రళయ దినానికి సంబంధించిన విషయంగా తలపోస్తారు.

https://teluguislam.net

కాని ప్రవక్త సహచరులు ఒక్కో ఆయత్ యొక్క సందర్భాన్ని దాని పూర్వరంగాన్ని ఎరిగిన వారవడం చేత సరయిన విధంగా దాన్ని అన్వయించుకో గలిగేవారు. ఒక ఆయత్, "ఏ రోజయితే ఆకాశంలో పొగ కమ్ముకుంటుందో....." అని వచ్చింది. ఇది హిజ్రత్‌కు పూర్వం దైవప్రవక్త (సఅసం) మక్కాలో శపించినపుడు ఏర్పడిన కరువుకు సంబంధించినది అని హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజి) అంటారు (సహీహ్‌ముస్లిం). అలాగే మరో సందర్భంలో దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవీయబడింది:

إِذْ جَآءُوكُم مِّن فَوْقِكُمْ وَمِنْ أَسْفَلَ مِنكُمْ وَإِذْ
زَاغَتِ الْأَبْصَارُ وَبَلَغَتِ الْقُلُوبُ الْحَنَاجِرَ

"శత్రువులు మీ ముందు నుండి, మీ వెనుకనుండి దాడి
చేసినపుడు ఇంకా మీ (కళ్ళు) గ్రుడ్లు వెళ్ళబెట్టినపుడు,
గుండెలు గొంతుకలోకి వచ్చినపుడు.." (అహ్‌జాబ్ :10)

ఇది కందక యుద్ధపు సంఘటన అనీ (సహీహ్‌ముస్లిం), కందక యుద్ధంలో ముస్లింలు లోనయిన భయాందోళనలను, కఠిన పరీక్షను ఇది చిత్రిస్తోందని హజ్రత్ ఆయిషా (రజి) తెలిపారు.

7. పవిత్ర ఖుర్‌ఆన్‌లో నమాజ్ గురించిన ఆదేశం ఉంది:

حَٰفِظُوا۟ عَلَى ٱلصَّلَوَٰتِ وَٱلصَّلَوٰةِ ٱلْوُسْطَىٰ

"మీరు మీ నమాజుల పట్ల అత్యంత శ్రద్ధాసక్తులు కలిగి
ఉండండి. ముఖ్యంగా మధ్య నమాజుపట్ల".
(అల్ బఖర: 238)

"మధ్య నమాజ్" అంటే ఏమిటి? అనే విషయమై ప్రవక్త సహచరులలో భిన్నాభిప్రాయాలు వున్నాయి. ముస్నద్ అహ్మద్ గ్రంథంలో హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి), హజ్రత్ ఉసామా (రజి)లు దీని ఉద్దేశ్యం 'జుహ్ర్' నమాజ్ అన్నారు. కొందరు సహాబాలేమో 'ఫజ్ర్ నమాజ్' అన్నారు. 'మధ్య నమాజ్' అంటే అస్ర్ నమాజ్ అని హజ్రత్ ఆయిషా (రజి) అన్నారు. ఈ వ్యాఖ్యానంలోని ఔచిత్యం

https://teluguislam.net

పట్ల ఆమెకు ఎంతగా నమ్మకం ఉందంటే తను పుస్తక రూపమిచ్చిన వ్యాఖ్యానం వివరణలో ఆమె దాన్ని వ్రాయించారు కూడా (సహీహ్ బుఖారీ). ఈ వ్యాఖ్యానంలోని ప్రామాణికతను హజ్రత్ ఆలీ (రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజి), హజ్రత్ సమురహ్ బిన్ జున్దుబ్‌ల వంటి వారు కొనియాడారు (తిర్మిజి). మధ్య నమాజ్ అంటే పగటివేళ నమాజ్‌లలో మధ్యది అని అర్థం. అదే అస్ర్ నమాజ్. ఎందుకంటే అది జుహర్, మగ్రిబ్‌ల మధ్య వుంది కాబట్టి.

7. బఖరా సూరాలో వుంది:

وَإِنْ تُبْدُوا
مَا فِي أَنْفُسِكُمْ أَوْ تُخْفُوهُ يُحَاسِبْكُمْ بِهِ اللَّهُ فَيَغْفِرُ
لِمَنْ يَشَاءُ وَيُعَذِّبُ مَنْ يَشَاءُ

"మీరు మీ మనస్సుల్లో వున్న విషయాలను ప్రకటించినా లేక దాచిపెట్టినా వాటి గురించి ఎట్టకేలకు అల్లాహ్ లెఖ్ఖ తీసుకుంటాడు. ఇంకా తాను కోరిన వారిని క్షమించటానికి, తాను కోరిన వారిని శిక్షించడానికి ఆయనకు పూర్తి అధికారం వుంది". (బఖరహ్:284)

ఈ ఆయత్ ప్రకారం మనసులో సయితం కలిగే భావాలూ, అనుమానాలను కూడా దైవం లెఖ్ఖలోకి తీసుకుంటాడు, ఆ తర్వాత తాను కోరిన వారిని క్షమిస్తాడు, కోరిన వారిని శిక్షిస్తాడు అని తెలుస్తోంది. కాని అనుకోకుండా మనసులో కలిగే దుశ్శంకలూ, ఆలోచనల్ని కూడా దైవం లెఖ్ఖలోకి తీసుకుంటే మనిషి బ్రతకడమే దుర్లభ మవుతుంది.

హజ్రత్ అలీ (రజి) మరియు హజ్రత్ ఇబ్ను అబ్బాస్ (రజి) గారలు ఈ క్రింది ఆయత్ అవతరించిన్న మీదట మొదటి ఆదేశం రద్దయి పోయిందని అభిప్రాయపడ్డారు.

لَا يُكَلِّفُ اللَّهُ نَفْسًا إِلَّا وُسْعَهَا لَهَا مَا كَسَبَتْ وَعَلَيْهَا
مَا اكْتَسَبَتْ

https://teluguislam.net

"ఏ ప్రాణి పైనా అల్లాహ్ దాని శక్తి సామర్థ్యాలకు మించిన బరువు బాధ్యతలను మోపడు. తాను సంపాదించిన పుణ్యానికి సత్ఫలితం, తాను కూడబెట్టిన పాపానికి దుష్ఫలితం ప్రతి వ్యక్తీ అనుభవిస్తాడు".

(అల్ బఖరహ్ : 286)

హ|జత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) అభిప్రాయం కూడా ఇదే. కాని హ|జత్ ఆయిషా (రజి)ను ఎవరో పై ఆయత్ యొక్క భావం అడిగితే, దాంతోపాటే వచ్చిన సమానార్థం వచ్చే మరో ఆయత్‌ను ఆమె ఉదాహరించారు.

"ఎవరైనా సరే దుర్మార్గం చేస్తే దాని ఫలితం అనుభవిస్తాడు". (నిసా : 123)

పృచ్ఛకుడి (అడిగే వాడి) ఉద్దేశ్యంలో, ఒకవేళ ఇదే నిజమైతే, మన్నింపు, దైవ కారుణ్యాల ఘనత ఏమయింది? మోక్షానికి ఆస్కారమెక్కడ? ఈ సందేహాన్ని నివృత్తి చేస్తూ హ|జత్ ఆయిషా (రజి) ఇలా వివరించారు -

"ఈ ఆయత్ వ్యాఖ్యానాన్ని నేను దైవప్రవక్త (సఅసం)ను అడిగినప్పటి నుంచీ దాని గురించి నన్ను దర్యాప్తు చేసిన మొదటి వ్యక్తివి నువ్వే. దైవాదేశం సత్యమైనదే. కాని పరమప్రభువు తన దాసులను స్వల్పమైన ఆపదలు, కష్టాలకు గురిచేయడం ద్వారా వారి చిన్నచిన్న పాపాలను మన్నిస్తాడు. విశ్వాసి రోగపీడి తుడు అయినా లేక అతడిపై ఏదన్నా కష్టం వచ్చి పడినా, చివరకు జేబులో ఏదన్నా వస్తువు పెట్టుకుని మరచి పోయి, దాని అన్వేషణలో మనోవేదనకు గురికావడం వగయిరా - ఇలాంటి చిక్కుల్లో, కష్టాల్లో, అతడి కోసం మన్నింపు, కారుణ్యాల ద్వారం తెరుచు కుంటుంది. ఆ తర్వాత బంగారం అగ్నితో శుద్ధి అయి మేలిమి అయినట్లే, విశ్వాసి కూడా పవిత్రుడయి ప్రపంచాన్నుండి నిష్క్రమిస్తాడు" (తిర్మిజి).

ఈ ఆయత్‌ల వ్యాఖ్యానాలతో పాటు ఇంకా ఇతర ఆయత్‌ల వ్యాఖ్యానాలు కూడా ఆమె చేశారు.

ఈ ఉదాహరణల ద్వారా హ|జత్ ఆయిషా (రజి)కు గల విషయ పరిజ్ఞానం, హదీసు, ఫికహ్ మరియు ఖుర్‌ఆన్ అంశాలపై ఆమెకు గల నిశిత దృష్టి ఎటువంటివో అవగతమవుతుంది.

## హదీసు పరిజ్ఞానం

హదీసు విద్య మహాప్రవక్త (సఅసం) జీవితంతో ముడిపడినది. అందుచేత ఈ కళ ఆయన (సఅసం)కు అత్యంత సమీపంలో వున్నవారికే అందరి కన్నా హెచ్చుగా

https://teluguislam.net

అబ్బింది. హ|జత్ ఆయిషా (రజి)కు దైవవశాత్తూ ఇటువంటి అవకాశాలు ఎక్కువగా లభించేవి. హి|జత్‌కు మూడేళ్ళ ముందు దైవప్రవక్తతో ఆమె నికాహ్ జరిగింది. ఆ కాలంలో దైవప్రవక్త (సఅసం) ఆమె యింటికి ప్రతిరోజూ విచ్చేసేవారు. (సహీబుఖారీ)

అయితే హి|జత్ తర్వాత ఆరు నెలల వరకు మాత్రం దైవప్రవక్త (సఅసం) దర్శన భాగ్యం ఆమెకు కలుగలేదు. షవ్వాల్ మాసంలో కాపురానికి వచ్చి ప్రవక్త (సఅసం) కుటీరంలో కాలుమోపారు. అప్పటి నుండి అంతిమ క్షణాలవరకు దైవప్రవక్త (సఅసం) సమక్షంలో వున్నారు. ఇస్లాం ఆవిర్భవించే నాటికి ఆమె పిన్నవయస్కురాలయినప్పటికీ ఆమెగారికి గల అపార మేధాశక్తి, ధారణశక్తి ఆ లోటును పూడ్చాయి. పవిత్ర సతీమణులలో హ|జత్ సౌదా (రజి) ఆమెకన్నా కొన్ని నెలలు ఎక్కువ కాలమే దైవప్రవక్త (సఅసం)కు దగ్గరగా వున్నారు. అయినా విషయావగాహన, తెలివితేటలు, సూక్ష్మగ్రహణాశక్తి - ఇత్యాది విషయాలలో హ|జత్ ఆయిషాదే పై చేయి. అదీగాక సౌదా (రజి) వయసు మళ్ళినవారు (సహీహ్ ముస్లిం). ఆమె జవసత్వాలుడిగి పోయాయి. తద్భిన్నంగా హ|జత్ ఆయిషా (రజి) యువతి. యవ్వనం కారణంగా కూడా ఆమెలో నైతిక మానసిక శక్తులు దినదినాభివృద్ధి కావడం, దైవప్రవక్త (సఅసం) కడపటి దశ వరకు నిత్యం సేవలు చేసే భాగ్యం, సాంగత్య గౌరవం లభించడం వల్ల ఆమెకు దైవప్రవక్త (సఅసం) పరిస్థితులు, ఆదేశాల గురించి సరైన అవగాహన కలిగింది.

హ|జత్ సౌదా (రజి) తప్ప తతిమ్మా సతీమణులు - హ|జత్ ఆయిషా (రజి) కన్నా చాలా కాలం తర్వాత వివాహ బంధంలోకి వచ్చారు. అందులోనూ వారికి వారంలో ఒక రోజు తోడుండే భాగ్యం లభించేది. హ|జత్ (రజి) సౌద తన 'వంతు'ను హ|జత్ ఆయిషా (రజి)కు ఇచ్చివేయడం వల్ల హ|జత్ ఆయిషా (రజి)కు వారంలో రెండు రోజులు దైవప్రవక్త సాంగత్యంలో ఉండే భాగ్యం లభించేది. (సహీహ్ ముస్లిం). అదీ గాక ప్రవక్త శిక్షణశాల (మస్జిదె నబవీ) ఆమె కుటీరానికి ఆనుకునే వుంది. ఈ కారణంగా హదీసుల పరిజ్ఞానానికి సంబంధించి నంత వరకూ ప్రవక్త సతీమణుల్లో ఎవరూ ఆమెకు సాటికాలేకపోయారు.

ఆమెచే ఉల్లేఖితములైన హదీసుల సంఖ్య ఎంత ఎక్కువ అంటే పవిత్ర సతీమణులే కాక, సాధారణ స్త్రీలే కాక, పురుషుల్లో కూడా నలుగురైదుగురి తప్ప ఎవరూ ఆమెకు సమానులమని చెప్పుకోలేక పోయారు. నాయకులయి నటువంటి సహాబా అంటే హ|జత్ అబూబకర్ (రజి), హ|జత్ ఉమర్ (రజి), హ|జత్ ఉస్మాన్ (రజి) ఇంకా హ|జత్ అలీ (రజి)లకు లభించిన సాంగత్య భాగ్యం, సహచర్యం, తెలివితేటలు, బుద్ధికుశలతలు హ|జత్ ఆయిషా (రజి) కన్నా అధికమే అయినా -

సహజంగా సతీమణికి కొన్ని నెలలలో తెలిసే విషయాలు ఇతర అంతరంగిక వ్యక్తులకు కొన్ని సంవత్సరాలలో తెలుస్తాయి. రెండో విషయం ఏమిటంటే ఆ మహనీయులకు విశ్వనాయకుడు (సఅసం) పరమపదించిన మీదట ఖిలాఫత్ (ప్రాతినిధ్యపు) మహోన్నత బాధ్యతలు లభించడం వల్ల వారికి హదీసులను వ్యాఖ్యానించడానికి తీరిక బహుకొద్దిగా చిక్కేది. అయినా వారి వద్ద నేటికీ భద్రంగా వున్న హదీసులన్నీ ఖిలాఫత్ గురించిన తీర్పులు, ఆదేశాలకు సంబంధించినవే.

ఆ మహనీయుల ఉల్లేఖనాలలో అధికసంఖ్య, అల్ప సంఖ్యలకు సంబంధించిన రహస్యం మరొకటి వుంది. ప్రథమశ్రేణి సహచరుల కాలం సహాబాల కాలమే కాబట్టి వారికి ఇతరుల్ని అడిగి తెలుసు కోవలసిన అగత్యం ఏర్పడలేదు. ఆ అపురూప ముత్యాల అన్వేషకులయిన తాబయీన్ (ప్రశిష్యులు) 25,30 ఏండ్ల తర్వాత జన్మించారు. వారు తమ ప్రవక్తకు సంబంధించిన గాథలు తెలుసుకోవాలని ఉవ్విళ్ళూరారు. పెద్దపెద్ద సహాబా తమ జీవిత మజిలీలను దాటిపోయారు. ప్రపంచం వారి ఉనికిని కోల్పోయింది. పిన్నవయస్కులైన సహాబీలు అప్పటికి యుక్త వయస్కులయ్యారు. హిజ్రీ మొదటి శతాబ్దం ఆఖరు వరకు వారి పరంపర కొనసాగింది. ఆ కారణం చేత తమ ఉల్లేఖనాలతో హదీసుగ్రంథాలకు పరిపుష్టి కలిగించిన పిన్నవయస్కులయిన మహనీయులు వీరే (ఇబ్నెసాద్).

అధిక సంఖ్యలో ఉల్లేఖనాలను ఉల్లేఖించిన వారు ఏడుగురు. వీరి ఉల్లేఖనాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఉదాహరణకు:

| పేరు | | ఉల్లేఖనాల సంఖ్య |
|---|---|---|
| హజ్రత్ అబూహురైరా (రజి) | --- | 5364 |
| హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) | --- | 1660 |
| హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) | --- | 2630 |
| హజ్రత్ జాబిర్ (రజి) | --- | 1540 |
| హజ్రత్ అనస్ (రజి) | --- | 2286 |
| హజ్రత్ ఆయిషా (రజి) | --- | 2210 |
| హజ్రత్ అబూసయీద్ ఖుదరీ (రజి) | --- | 1170 |

ఎక్కువ ఉల్లేఖనాలు ఉల్లేఖించిన వారిలో హజ్రత్ ఆయిషా (రజి) ది నాలుగోస్థానం. ఆమె పర్దా పాటించే స్త్రీ అనీ, తన సమకాలీన పురుషుల వలె ఆమె ప్రతి సభలోనూ హాజరు కాలేరనీ, ముస్లిం తాబయీన్ (ప్రశిష్యులు) ఆమె వద్దకు ఎల్లవేళలా రాగలిగేవారు కాదనీ, ఆ మహాపురుషుల లాగా ఆమె దేశాటన చేయలేదనీ, హజ్రత్ ఆయిషా (రజి) విషయంలో మనం గమనిస్తే ఆ సహచరులందరికన్నా ఆమె స్థాయి

https://teluguislam.net

ఉజ్వలంగా కనిపిస్తుంది. పైన తెలుపబడిన పట్టిక ప్రకారం హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనాల సంఖ్య రెండు వేల రెండువందల పది. వాటిలో 286 ఉల్లేఖనాలు సహీహ్‌బుఖారీ, సహీహ్ ముస్లిం వగైరా గ్రంథాలలో చేరివున్నాయి. వాటిలో 174 హదీసులు ఆ రెండు గ్రంథాలలో సంయుక్తంగా వున్నాయి. 54 హదీసులు కేవలం బుఖారీ షరీఫ్ గ్రంథంలో ఉన్నాయి. 58 హదీసులు కేవలం ముస్లిం గ్రంథంలో ఉన్నాయి. ఆ ప్రకారం బుఖారీ షరీఫ్ గ్రంథంలో ఆమె ఉల్లేఖించిన హదీసులు 228, ముస్లిం గ్రంథంలో 232. మిగిలిన హదీసులు ఇతర హదీసు గ్రంథాలలో పేర్కొనబడ్డాయి. ఇమామ్ అహ్మద్‌గారి మస్నద్ (గ్రంథం) ఆరవ కాండంలో హజ్రత్ ఆయిషా (రజి) హదీసులు ఉన్నాయి. అవి ఈజిప్టు ప్రచురణలో సన్నని అక్షరాలలో 253 పేజీలలో అచ్చయి ఉన్నాయి. వాటిని గనక వేరుగా ముద్రించినట్లయితే ఒక లావుపాటి హదీసు గ్రంథమే తయారు కాగలదు.

కేవలం ఉల్లేఖనాలు అధిక సంఖ్యలో ఉండటమే వారి శ్రేష్ఠతకూ, ప్రాముఖ్యతకూ గీటురాయి కాజాలదు. అసలు విషయం ఆయా హదీసులు ప్రవక్త (సఅసం) చేత ప్రవచింపబడిన సమయం సందర్భాలను ఎరిగి వుండటమే. తక్కువ సంఖ్యలో ఉల్లేఖనాలను ఉల్లేఖించిన వారిలో ఫిక్‌హ్ వేత్తలయిన గొప్పగొప్ప సహాబీలు ఉన్నారు. అధికసంఖ్యలో హదీసులను ఉల్లేఖించిన వారుగా పేర్కొనబడ్డ ఏడుగురిలో ఐదుగురు పూర్వుల దృష్టిలో కేవలం ఉల్లేఖకులు మాత్రమే. వారు ఫిక్‌హ్ (ధర్మ) వేత్తలయిన సహాబీలుగా పరిగణనలోకి రారు. కాబట్టి ఇప్పుడు మన వద్ద ప్రోగయిన ఉల్లేఖనాలలో హజ్రత్ అబూహురైరా (రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి), హజ్రత్ జాబిర్ (రజి), హజ్రత్ అబూసయీద్ ఖుదరీ (రజి) గార్ల ద్వారా షరీఅత్ సూత్రాల అన్వయింపు (ఇజ్తెహాద్) వంటి దాఖలాలు లేవు. ఇటువంటి ప్రత్యేక ఘనత హజ్రత్ ఆయిషా (రజి)తోపాటు హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)కు మాత్రమే దక్కింది. హదీసులను అధిక సంఖ్యలో ఉల్లేఖించడంతోపాటు పరిశోధనలో, పర్యాలోచనలో, ధర్మచింతనలో; సంగ్రహణాశక్తిలో ఆమె ప్రముఖ స్థానం ఆక్రమించారు.

హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనాలలో గల మరో ప్రత్యేకత ఏమిటంటే ఆమె ఏ సంఘటననూ, మరే ఆదేశాన్ని వివరించినా దానికి సంబంధించిన పుట్టుపూర్వోత్తరాలను కూడా వివరించారు. సదరు ప్రత్యేక ఆజ్ఞ ఎటువంటి ఔచిత్యంతో కూడుకున్నదో కూడా విప్పి చెప్పేవారు. సహీహ్ బుఖారీలో, శుక్రవారం నాడు గుసుల్‌చేయాలి అనే విషయంపై హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి), హజ్రత్ ఆయిషా (రజి) ముగ్గురి ఉల్లేఖనాలూ ప్రక్క-ప్రక్కనే వచ్చాయి. ఇప్పుడు ఈ ముగ్గురి ఉల్లేఖనాలలోని వాక్యాల్ని చదవండి: హజ్రత్ ఇబ్ను ఉమర్ (రజి) ఉల్లేఖిస్తున్నారు:

https://teluguislam.net

''శుక్రవారం నమాజ్‌కు వచ్చేవారు స్నానం చేయాలని దైవప్రవక్త (సఅసం) అంటుండగా నేను విన్నాను''.

హజ్రత్ అబూసయీద్ ఖుదరీ (రజి) సెలవిచ్చారు:

''ప్రాజ్ఞులయిన ప్రతి ఒక్కరూ శుక్రవారం నాడు విధిగా స్నానం చేయాలి అని దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చారు.''

ఇదే విషయాన్ని హజ్రత్ ఆయిషా (రజి) ఈ విధంగా చెప్పారు:

''ప్రజలు తమ యిళ్ళనుండే గాక మదీనా పరిసర ప్రాంతాల నుండి వచ్చేవారు. దుమ్మూ ధూళి కొట్టుకొని చెమటతో తడిసి ముద్ద అయిపోయేవారు. ఒకసారి ఒక బృందంలోని ఒక వ్యక్తి దైవప్రవక్త (సఅసం) దగ్గరకు వచ్చారు. ఆ సమయంలో ఆయన (సఅసం) నా దగ్గర కూర్చుని ఉన్నారు. ఆయన (సఅసం) సెలవిచ్చారు: ''నువ్వీ రోజు స్నానం చేసివుంటే బాగుండేదే!''

ఆమెగారి మరో ఉల్లేఖనం–

''ప్రజలు తమ పనుల్ని (అంటే వ్యవసాయం వగైరా) తమ స్వహస్తాలతో చేసేవారు. వారు శుక్రవారం నమాజ్‌కు వెళ్ళినా అదే స్థితిలో వెళ్ళేవారు. అందుచేత వారితో మీరు గుసుల్ చేసి వస్తే బాగుండేదే'' అని అనబడింది."

ఒక సంవత్సరం ఆయన (సఅసం) ఖుర్బానీ మాంసాన్ని మూడు రోజులలోగా తినివేయాలి! అని ఆదేశించారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), హజ్రత్ అబూసయీద్ ఖుదరీ (రజి) తదితరులు ఈ ఆదేశాన్ని శాశ్వతమైనదిగా భావించారు. అందుచేత కొందరు అదే విధమయిన సూచనలు చేశారు. కాని హజ్రత్ ఆయిషా (రజి) ఈ ఆదేశాన్ని తాత్కాలికమైనదిగా భావించారు. కాబట్టి ఆమె ఈ ఉల్లేఖనాన్ని ఈవిధంగా వివరించారు:

''ఖుర్బానీ మాంసాన్ని మేము ఉప్పువేసి అలానే ఉంచేవాళ్ళం. మదీనాలో దానిని ఆయన (సఅసం) ముందు సమర్పించే వాళ్ళం, 'మూడు రోజుల తర్వాత తినకండి' అని ఆయన (సఅసం) సెలవిచ్చారు, నిజానికి ఇది 'ఆజ్ఞ' ఎంత మాత్రమూ కాదు. వీలైనంత వరకు ఈ

https://teluguislam.net

మాంసం అగత్యపరులకు పంచి పెట్టాలన్నదే ఆయన (సఅసం) అభిమతం.''

మరొక ఉల్లేఖనం ద్వారా అసలు కారణం తెలిపారు - ఒకసారి ఒక వ్యక్తి ''ఉమ్ముల్ మోమినీన్! ఖుర్బానీ మాంసం తినడం నిషిద్ధమా?'' అని అడిగితే ఆమె ఇలా వివరించారు.

''లేదు. ఆ రోజుల్లో ఖుర్బానీ ఇచ్చేవారు కొద్దిమందే ఉండేవారు. అందుచేత ఖుర్బానీ ఇవ్వలేని వారికి దాన్ని తినిపించాలని ఆయన (సఅసం) అభిలషించేవారు.''

## పదే పదే అడిగి తెలుసు కోవడం

హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనాలలో లోపాలు తక్కువగా వుండటానికి మరో ప్రత్యేక కారణం కూడా వుంది. సాధారణ ప్రజలు ఒకసారి ఏదయినా మాటను దైవప్రవక్త (సఅసం) నోట వినగానే లేక ఏదయినా సంఘటనను చూడగానే దాన్ని యథాతథంగా ఉల్లేఖించేవారు. కాని హజ్రత్ ఆయిషా (రజి) బాగా అర్థం చేసుకోనంతవరకూ దాన్ని ఉల్లేఖించేవారు కాదు. దైవప్రవక్త (సఅసం) చెప్పిన విషయం ఆమెకు అర్థం కాకపోతే ఆయన్ని (సఅసం) పదే పదే అడిగి సంతృప్తి చెందేవారు (సహీహ్ బుఖారీ). ఈ అవకాశం ఇతరులకు బహు తక్కువగా లభించేది. ఇటువంటి ఎన్నో ఉల్లేఖనాల విషయంలో ఆమెకు ఇతర సహాబాలకు మధ్య పరమార్థాల రీత్యా తేడా కనిపిస్తుంది. వాటి వివరాలు రాబోయే పేజీలలో తెలియగలవు.

ఆమె దైవప్రవక్త (సఅసం) నుండి నేరుగా వినని విషయాల్ని ఇతరుల ద్వారా సేకరించేటప్పుడు దానిపై ఎంతో జాగ్రత్త తీసుకొనేవారు. దాని గురించి క్షుణ్ణంగా పరిశీలించి, అది నిజమని తేలిన మీదటే దాన్ని నమ్మేవారు. ఒకసారి హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ ఒక హదీసును ప్రవచించారు. ఒక సంవత్సరం తర్వాత ఆయన మళ్ళీ (మదీనా నగరానికి) వచ్చారు. హజ్రత్ ఆయిషా (రజి) అదే హదీసును అడిగేందుకు ఒక మనిషిని పంపారు. ఆయన హెచ్చుతగ్గులు లేకుండా అదే హదీసును వల్లించారు. ఆ వ్యక్తి వచ్చి హజ్రత్ ఆయిషా (రజి) ఎదుట ఆ హదీసును తిరిగి అప్పజెప్పారు. అది విని ''దైవం సాక్షి! ఇబ్నె అమ్ర్‌కు విషయం గుర్తుందే!'' అని ఎంతో ఆశ్చర్యంతో పలికారు హజ్రత్ ఆయిషా (రజి).

## ఉల్లేఖనంలో జాగ్రత్తలు

అదే సూత్రాన్ననుసరించి ఆమె ఏదయినా ఉల్లేఖనాన్ని ఇతరుల నుండి గ్రహించినట్లయితే ఇంకా ఎవరయినా ఏదయినా ఉల్లేఖనం గురించి ఆమెను దర్యాప్తు

https://teluguislam.net

చేయడానికి వస్తే తాను జవాబిచ్చేబదులు ఆమె వచ్చిన వారిని అసలు ఉల్లేఖకుని వద్దకు పంపేవారు. అలా చేయటంలో ఆమె ఉద్దేశ్యం మధ్యలో అంచెలు ఎంత తక్కువగా వుంటే అంత మంచిదని, ఆధారం ఉన్నతమైనదయతే మేలు అని. దైవప్రవక్త (సఅసం) అసర్ నమాజ్ తర్వాత ఇంటికి వచ్చి సున్నత్ నమాజ్ చేసేవారు. వాస్తవానికి అసర్ నమాజ్ తర్వాత ఎటువంటి నమాజూ లేదని ఖచ్చితమైన ఆజ్ఞ వుంది. కొందరు వ్యక్తులు హజ్రత్ ఆయిషా (రజి) వద్దకు మనిషిని పంపించి ''మీరు ఉల్లేఖించినట్లుగా ఈ హదీసు వివరించబడుతోంది. దీని వాస్తవం ఏమిటి?'' అని అడిగించారు. దానికి ఆమె, ''వెళ్ళి ఉమ్మె సల్మా (రజి)ని అడగండి. అసలు ఉల్లేఖకురాలు ఆమెయే (సహీహ్ బుఖారీ)'' అన్నారు. ఇదే విధంగా ఒక వ్యక్తి తోలుతో చేసిన మేజోళ్ళపై మసహ్ చేసే అంశాన్ని గురించి అడిగినప్పుడు ఆమె ''అలీ (రజి) దగ్గరికెళ్ళి అడగండి. ఆయన దైవప్రవక్త (సఅసం) ప్రయాణాల్లో వెంట ఉండేవారు'' (సహీహ్ బుఖారీ) అని సలహా ఇచ్చారు.

## ఉన్నత స్థాయి

కొన్ని అంశాలపై ప్రవక్త సహచరుల ఉల్లేఖనాలలో గల స్వల్పమైన వైవిధ్యానికి కారణం; విషయావగాహనలో కొన్ని హెచ్చుతగ్గులుండటమే. అయితే హజ్రత్ ఆయిషా (రజి)కు ఇటువంటి తెలివితేటలు దైవప్రసాదితంగా లభించాయి. ఆ గొప్ప పెన్నిధితో ఆమె హదీసు కళలో ఎంతో ప్రావీణ్యం సంపాదించారు.

1. హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించిన ఒక సంఘటన ప్రకారం: ఒక స్త్రీ ఒక పిల్లిని కట్టివేసింది. దానికి తినడానికీ, త్రాగడానికీ ఏమీ పెట్టేది కాదు. ఆ పిల్లి అదే స్థితిలో ఆకలి దప్పులతో అలమటించి చచ్చిపోయింది. ఆ కారణంగా ఆ స్త్రీ దైవశిక్షకు గురయింది.

అబూ హురైరా (రజి) ఒకసారి హజ్రత్ ఆయిషా (రజి) ఇంటికి పరామర్శకు వెళ్లారు. అప్పుడు ''ఒక పిల్లిని హింసించినందుకు గాను ఒక స్త్రీ యాతనకు గురయిందన్న ఉల్లేఖనాన్ని ప్రవచించింది మీరే కదూ!?'' అని అడిగారు హజ్రత్ ఆయిషా (రజి). ''అవును. దైవప్రవక్త (సఅసం) ప్రవచించగా నేను విన్నాను'' అని అబూహురైరా (రజి) అన్నారు. ''దేవుని దృష్టిలో ఒక విశ్వాసి వ్యక్తిత్వం అంతకన్నా ఉన్నతమైంది. ఒక పిల్లి కోసమని దేవుడు ఆమెను యాతనకు గురి చేస్తాడా? ఆ స్త్రీ ఈ పాపం చేయడంతోపాటు ఆమె దైవ తిరస్కారి కూడాను. ఓ అబూహురైరా (రజి)! దైవప్రవక్త (సఅసం) చెప్పిన విషయాన్ని ఉల్లేఖించేటపుడు మీరేం చెబుతున్నారో ఆలోచించుకోండి'' అని ఆయిషా (రజి) చెప్పారు.

(అబూదావూద్)

https://teluguislam.net

2. హ(జత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) ప్రాణాలు పోతుండగా కొత్త బట్టలు తెప్పించుకు తొడుక్కున్నారు. కారణం అడగ్గా "ముస్లిం ఏ దుస్తుల్లో మరణిస్తే ఆ దుస్తులతోనే లేపబడతాడు" అని చెప్పారాయన. హ(జత్ ఆయిషా (రజి)కు ఈ సంగతి తెలిసింది. "ఓ ప్రభూ! అబూ సయీద్‌పై దయదలచు. దుస్తులు అంటే దైవప్రవక్త (సఅసం) దృష్టిలో కర్మలు (ఆచరణలు) అని భావం. ప్రజలు ఖియామత్ నాడు నగ్న శరీరంతో, తల నుండి కాళ్లవరకు అనాచ్ఛాదిత శరీరాలతో లేపబడతారు అని దైవప్రవక్త (సఅసం) స్పష్టంగా చెప్పి ఉన్నారు."

3. విడాకులివ్వబడిన స్త్రీ 'ఇద్దత్' దినాలలో భర్త యింటిలోనే గడపాలని ఇస్లాం ఆజ్ఞాపిస్తోంది. ఈ ఆజ్ఞకు వ్యతిరేకంగా ఫాతిమా (రజి) పేరు గల ఒక సహాబియా తన అనుభవాన్ని వివరిస్తోంది. "నాకు ఇద్దత్ సమయంలో భర్త యింటి నుండి మరో చోటికి పోయేందుకు దైవప్రవక్త (సఅసం) అనుమతినిచ్చి ఉన్నారు." ఆమె వివిధ సందర్భాల్లో అనేక మంది సహాబీల ఎదుట తన అనుభవాన్ని సాక్ష్యాధారంగా పేర్కొంది. దీన్ని కొందరు నమ్మారు. చాలా మందికి నమ్మశక్యం కాలేదు. కాకతాళీయంగా మర్వాన్ మదీనాకు అమీరుగా ఉన్న రోజుల్లో ఇటువంటిదే ఒక కేసు విచారణకు వచ్చింది. ప్రత్యర్థి ఫాతిమా (రజి) మాటల ఆధారంగా అది సక్రమ చర్యేనని వాదించాడు. హ(జత్ ఆయిషా (రజి)కు ఈ విషయం తెలిసి ఆమె ఫాతిమ (రజి)ను నిశితంగా విమర్శించడమే గాక ఇలా అన్నారు: "ఫాతిమా (రజి) తన అనుభవాన్ని ప్రచారం చేస్తూ తిరగడం శ్రేయస్కరం కాదు. దైవప్రవక్త (సఅసం) ఇద్దత్ స్థితిలో ఆమెకు ఇల్లు మారడానికి అనుమతించిన సంగతి నిజమే. అయితే ఆమె భర్త ఉన్న ఇల్లు ఒక భద్రత లేని భయం గొలిపే ప్రాంతంలో ఉండేది. ఈ కారణంగానే ఆమెకు సడలింపు లభించింది."(సహీహ్ బుఖారీ, జామె తిర్మిజీ)

4. ఆయన (సఅసం) మేక ముందు కాళ్ళ వైపు మాంసాన్ని చాలా యిష్టపడేవారని అబూదావూద్ తప్ప తతిమ్మా ప్రామాణిక హదీసు గ్రంథాలలో వుంది. ఈ విషయంలో హ(జత్ ఆయిషా (రజి) ఏమంటారంటే, "ముందు కాళ్ళవైపు మాంసం ఇష్టమని కాదు గాని అసలు మాంసం రోజూ దొరికేది కాదు. ముందు కాళ్ళవైపు మాంసం త్వరగా ఉడుకుతుంది. అందువల్ల ఆయన (సఅసం) ఆ భాగాన్ని యిష్టపడేవారు." (షిమాయిలె తిర్మిజీ)

5. ఫ(జ్ మరియు అసర్ నమాజ్‌ల తర్వాత ఎటువంటి నమాజూ ఎవరూ చేయకూడదని హ(జత్ ఉమర్ (రజి) ఇంకా ఇతర సహాబీల ఉల్లేఖనాల ఆధారంగా తెలియవస్తోంది. హ(జత్ ఆయిషా (రజి) ఏమంటున్నారో చూడండి. దైవం ఉమర్ పై కరుణించుగాక! ఆయన పొరబడ్డారు. సూర్యోదయం, సూర్యాస్తమయాల వేళ పొంచి ఉండగా - అప్పుడు నమాజ్ చేయకూడదు అని మాత్రమే దైవప్రవక్త (సఅసం) చెప్పారు." (సహీహ్ బుఖారీ, తిర్మిజీ, ముస్నద్ అహ్మద్)

https://teluguislam.net

ధర్మవేత్తలు ఆ ప్రత్యేక వేళల్లో నమాజ్ నిషిద్ధమవడానికి గల కారణాన్ని వివరిస్తూ, ఆ వేళలు సూర్యపూజ చేసే వేళల (సంధ్యావందనం)నీ, కాబట్టి సూర్యుని పూజించే వారిని పోలిన విధంగా చేయకూడదనీ అన్నారు. ఈ కారణమే గనక నిజమయితే హ(జత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం పుణ్యానికి అతి చేరువైనదనీ, నిషేధానికి గల అసలు కారణం ఆమె గ్రహించారని తెలుస్తోంది.

ఫజ్ర్ నమాజ్‌కు ముందు సున్నత్ నమాజ్ ఖజా అయిపోతే జమాఅత్‌తో నమాజ్ అయిన తర్వాత దాన్ని పూర్తి చేసుకోవాలని ఒక ఉల్లేఖనంలో ఉంది (తిర్మిజీ). మక్కా వాసులు అలాగే చేసేవారు. దైవప్రవక్త (సఅసం) అసర్ తర్వాత రెండు రకాత్‌లు చదివే వారని హదీసులలో వుంది. ''ఈ రెండు రకాత్లను ఆయన నా యింట్లో ఏనాడూ విడిచి పెట్టలేదని'' హ(జత్ ఆయిషా (రజి) తెలిపారు. అందుచేత కొందరు సహాబీలు, తాబయీన్ కూడా దీన్ని ఆచరించేవారు. మరికొందరు సహాబా దానిని దైవప్రవక్త (సఅసం) యొక్క ప్రత్యేక నమాజుగా భావించారు. హ(జత్ ఉమ్మె సల్మా (రజి) తాను దైవప్రవక్త (సఅసం)ను ఈ రెండు రకాతుల వైనం అడగ్గా జుహర్ నమాజ్‌లోని రెండు రకాత్‌లు తప్పిపోయాయనీ, ఇది వాటి ఖజా అని దైవప్రవక్త (స) తెలిపినట్లు ఉమ్మె సల్మా (రజి) ఉల్లేఖించారు.

మొత్తం మీద హేతువు దృష్ట్యా, ఇంత క్రితపు ఉల్లేఖనాల పరంగా హ(జత్ ఆయిషా, (రజి) ఉల్లేఖనం పరిపూర్ణమైనది గాను, షరీయత్ పరమైన ఔచిత్యానికి లోబడి ఉన్నట్లు గాను కనిపిస్తుంది. షరీయత్ సూత్రమేమిటంటే ఏదైనా ఒక వస్తువును నిషేధిస్తే, ముందు జాగ్రత్తగా అందుకు ప్రేరేపించిన వాటిని కూడా నిషేధిస్తుంది. వాస్తవానికి సూర్యోదయం వేళలోనూ, పొద్దుగూకే వేళలోనూ నమాజ్ నిషిద్ధం. కాని ముందు జాగ్రత్తగా ''ఉదయం, అసర్ నమాజ్‌ల తర్వాత'' అనే పదం ప్రయోగించ బడింది.

6. ఎవరైతే వితర్ నమాజ్ చేయరో వారికి చెందిన ఏ నమాజూ స్వీకారయోగ్యం కాదని హ(జత్ అబూ హురైర (రజి) ఉల్లేఖించారు. అది విన్న హ(జత్ ఆయిషా (రజి) ఇలా వ్యాఖ్యానించారు: ''మేమందరం అబుల్ ఖాసిం (సఅసం) చెపుతుండగా విన్నాము - ఇప్పటిదాకా దాన్ని మరచిపోలేదు. అదేమంటే ''ఎవరైతే ఐదుపూటల నమాజులూ వుజూతో, సరిగ్గా సమయానికి, రుకూలు, సజ్దాలు, సక్రమంగా చేస్తూ నెరవేర్చారో మరియు అందులో ఎలాంటి లోటూ రానీయలేదో వారు తమను యాతన పాలు చేయబోనని దైవంతో వాగ్దానం తీసుకున్నట్లు లెక్క. ఇంకా ఎవరైతే లోటు ఉంచారో వారు వాగ్దానం తీసుకోలేదన్నట్లు లెక్క. దైవం కోరితే వారిని అనుగ్రహించవచ్చు లేదా వారిపై ఆగ్రహించనూవచ్చు.'' (తిబ్రాని)

https://teluguislam.net

చెప్ప వచ్చిందేమంటే వితర్ నమాజ్ సున్నత్. కాబట్టి దాన్ని యాదృచ్ఛికంగా విడిచినంత మాత్రానికే శిక్షగా భావించి అతను ఆచరించిన ఏ నమాజూ స్వీకరించబడదని అనటం భావ్యం కాదు. అంటే అతడి మోక్షానికి గ్యారంటీ లేదనా అర్థం? వాస్తవానికి ఈ శిక్ష ఫర్జులు విడిచి పెట్టినందుకే గాని, సున్నత్‌లు విడిచినందుకు కాదు సుమా!

## వ్యక్తిగత పరిజ్ఞానం

ఆంతరంగిక మిత్రుడిని అతడి ఆంతరంగిక మిత్రుని కంటే స్వంత భార్య బాగా ఎరుగుతుందన్నది పచ్చి నిజం. దైవప్రవక్త (సఅసం) ఆపాదమస్తకమూ ఆదర్శప్రాయంగా విలసిల్లారు. అందుచేత ఆయన (సఅసం) ప్రతి చర్యా ప్రతి ఆచరణా చట్టం లాంటిదే, దైవాదేశానికి ప్రతిరూపమే. ఆ కారణంగా ఆయన (సఅసం) భార్యలకు దీనికి సంబంధించి తెలిసినన్ని విషయాలు ఇతరులకు తెలియటం దుర్లభం. ఎన్నో ధర్మసందేహాలను సహాబా తమ పర్యాలోచనతోనో లేక ఏదైనా ఉల్లేఖనం ఆధారం గానో నివృత్తి చేయగా వాటిని హజ్రత్ ఆయిషా (రజి) తన వ్యక్తిగత పరిజ్ఞానం ఆధారంగా త్రోసిపుచ్చారు. ఆయా ధర్మ సందేహాల విషయంలో ఇప్పటివరకూ హజ్రత్ ఆయిషా (రజి) పలుకులే ప్రమాణబద్ధంగా పరిగణించ బడుతున్నాయి.

1. స్త్రీలు స్నానం చేసేటపుడు జడను విప్పి తలవెంట్రుకలు తడపడం తప్పనిసరిగా చేయాలని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) 'ఫత్వా' (తీర్పు) ఇచ్చారు. హజ్రత్ ఆయిషా (రజి)కు ఇది తెలిసి ''ఇంకా నయం, ఆడవాళ్ళను జడలు కత్తిరించుకోమని చెప్పలేదు? నేను ఆయన (సఅసం) సమక్షంలో స్నానం చేసేదాన్ని. కాని జడ విప్పే దాన్నే కాదు'' అన్నారు ఆమె.

2. ముద్దాడటం వలన వుజూ భంగమవుతుందని ఇబ్నె ఉమర్ (రజి) చెప్పేవారు. హజ్రత్ ఆయిషా (రజి)కు తెలిసి ఇలా అన్నారు. ''దైవప్రవక్త (సఅసం) ఆ సందర్భంలో తాజాగా వుజూ చేసేవారు కాదు'' (సహీహ్ బుఖారీ). ఈ మాటలు చెప్పి చిరు నవ్వు నవ్వారు హజ్రత్ ఆయిషా (రజి).

3. నమాజ్‌లో పురుషుని ఎదుటి నుంచి స్త్రీ లేదా గాడిద లేక కుక్క వెడితే పురుషుని నమాజ్ భంగమవుతుందని హజ్రత్ అబూహురైరా (రజి) చెప్పినట్లు తెలిసింది. ఈ సంగతి హజ్రత్ ఆయిషా (రజి)కు తెలిసి కోపం వచ్చింది. ఆమె అన్నారు, ''మీరు మా ఆడవాళ్ళను గాడిదలు కుక్కలతో సమానంగా నిలబెడతారా?! నేను దైవప్రవక్త (సఅసం) ఎదుట కాళ్ళు జాపి పడుకొని ఉండే దాన్ని (కుటీరంలో స్థలాభావం వల్ల). దైవప్రవక్త(సఅసం) నమాజ్‌లో

నిమగ్నులయ్యేవారు. ఆయన సజ్దాలోకి వెళ్ళేటప్పుడు చేత్తో నెట్టేవారు. కాళ్ళు దగ్గరకు జరుపుకునే దాన్ని ఆయన (సఅసం) నిలబడినపుడు తిరిగి కాళ్ళు చాపుకునే దాన్ని (సహీహ్ బుఖారీ). ఎప్పుడయినా అవసరం వస్తే ఎదుటి నుండి వెళ్ళేదాన్ని''
(సహీహ్ బుఖారీ)

4. తెల్ల వారాక వితర్ నమాజ్ ఖజా అయి వుంటే తిరిగి వితర్ చేయకూడదన్న సమస్యను హ(జత్ అబూదర్దా (రజి) ఉపన్యాసంలో పేర్కొన్నారు. దీనిపై హ(జత్ ఆయిషా (రజి) స్పందిస్తూ, ''అబూదర్దా (రజి) చెప్పింది నిజం కాదు. ఉదయం అయిన తర్వాత కూడా దైవప్రవక్త (సఅసం) వితర్ నమాజ్ చేసుకునేవారు.
(బైహఖీ)

5. దైవప్రవక్త (సఅసం) అంత్యక్రియల సందర్భంగా యమనీ దుప్పటి కఫన్‌గా వాడబడిందని కొందరు చెప్పారు. ''ఇందు కోసం కొందరు ఆ దుప్పటిని తెచ్చిన మాట వాస్తవమే. కాని దాన్ని కఫన్‌గా వాడటం మాత్రం జరగలేదు'' అని హ(జత్ ఆయిషా (రజి) తెలిపారు. (సహీహ్ ముస్లిం, బుఖారీ, తిర్మిజీ, నిసాయి)

6. ఉపవాస దినాలలో ఎవరికయినా ఉదయం స్నానం చేయవలసిన అవసరం ఏర్పడితే ఆ రోజు ఉపవాసం ఉండకూడదని హ(జత్ అబూహురైరా (రజి) ఒకనాడు ఉపన్యాసంలో పేర్కొన్నారు. కొందరు వెళ్ళి హ(జత్ ఆయిషా (రజి) మరియు ఉమ్మెసల్మా (రజి)ను దాని ధృవీకరణ కోరారు. ''దైవప్రవక్త (సఅసం) ఆచరణ ఇందుకు భిన్నంగా వుండేది'' అని ఆమె తెలిపారు. ప్రజలు వెళ్ళి హ(జత్ అబూహురైరా (రజి)ను నిలదీశారు. చివరకు ఆయన తన మాటను ఉపసంహరించుకున్నారు. (సహీహ్ ముస్లిం)

7. హజ్‌లో కంకరరాళ్ళు విసరడం (రమీ), శిరోముండనం చేయించుకోవడం చేసిన తర్వాత సువాసన పూసుకోవటం, మరియు స్త్రీ (సంపర్కం) తప్ప మిగతా పనులు ధర్మసమ్మతములే. అయితే సువాసన పూసుకోవడంలో అభ్యంతరం లేదు. నేను నా చేతులతో ఆయన (సఅసం)కు సువాసన పూశాను'' అని హ(జత్ ఆయిషా తెలిపారు. (సహీహ్ బుఖారీ)

8. ''ఎవ్వరైనా హజ్ చేయకుండా కేవలం తమ ఖుర్బానీని పవిత్ర దైవ గృహానికి పంపిస్తే ఆ జంతువు అక్కడకు చేరుకుని జిబహ్ చేయబడనంతవరకూ దాన్ని పంపిన వ్యక్తికి కూడా హజ్ యాత్రికునిపై గల షరతులు వర్తిస్తాయి'' అని హ(జత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఫత్వా యిచ్చేవారు. దీనిపై హ(జత్ ఆయిషా (రజి) స్పందిస్తూ ''నేను నా చేతులతో స్వయంగా ఆయన (సఅసం) ఖుర్బానీ యిచ్చే జంతువుల కోసం త్రాళ్ళు పేనాను. ఆయన (సఅసం) తమ పవిత్ర హస్తాలతో త్రాళ్ళను ఖుర్బానీ

https://teluguislam.net

పశువుల మెడలలో వేశారు. నా తండ్రి వాటిని తీసుకొని మక్కాకు వెళ్ళారు. అయినా ధర్మసమ్మతమైన వస్తువులేవీ ఖుర్బానీ ఇచ్చేదాకా హరామ్ కాలేదు మరి'' అని వివరించారు. (సహీహ్ బుఖారీ)

## జ్ఞాపక శక్తి

జ్ఞాపక శక్తి అమూల్యమైన దైవప్రసాదం. హజ్రత్ ఆయిషా (రజి) ఈ విషయంలో అందరి కన్నా ఉన్నత స్థాయిలో ఉండేవారు. ఇంతకు ముందు కూడా చదివాం - చిన్నతనంలో ఆటలాడుతుండగా ఏదన్నా ఆయత్ ఆమె చెవినబడితే అది గుర్తుండి పోయేది. ఇంకా హదీసుల్ని గుర్తుంచుకోవడానికీ ఈ శక్తే ఆధారం. దైవదౌత్య కాలం నాటి సంఘటనల్ని గుర్తుంచుకొని వాటిని యథాతథంగా వినిపించడం, దైవప్రవక్త (సఅసం) నోటి వెంట విన్న పలుకులను విన్నది విన్నట్లుగా చెప్పటం ఒక హదీసువేత్త యొక్క అతి ముఖ్య బాధ్యత. ఉమ్ముల్ మోమినీన్ తన సమకాలీకులను, నిర్ద్వంద్వంగా విమర్శించగలిగారంటే అందులో అసాధారణమైన ఆమె జ్ఞాపక శక్తికి ప్రమేయం ఉంది మరి.

1. హజ్రత్ సాద్ బిన్ అబీ వఖాస్ (రజి) మరణించగా ఆయన జనాజా గనక మస్జిద్‌కు వస్తే తాను కూడా జనాజా నమాజ్‌లో పాల్గొనాలని ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా (రజి) భావించారు. ప్రజలు అభ్యంతరం తెలుపగా ''వీళ్ళు ఎంత త్వరగా విషయాన్ని మర్చిపోతున్నారు? దైవప్రవక్త (సఅసం) సుహైల్ (రజి) బిన్ బైజా యొక్క జనాజా నమాజ్ మస్జిద్‌లోనే కదా చేశారు'' అని ఆమె అన్నారు. (సహీహ్ ముస్లిం)

2. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి)ను ''దైవప్రవక్త (సఅసం) ఎన్నిసార్లు ఉమ్‌రా చేశారు''ని ప్రజలు అడగగా ఆయన ''నాలుగుసార్లు, అందులో ఒకసారి రజబ్ మాసంలో'' అని ఆయన జవాబిచ్చారు.

అంతలో ''పిన్నీ! వీళ్ళేమంటున్నారో మీరు వినటం లేదా?'' అని ఉర్వ బిగ్గరగా చెప్పారు.

''ఏమంటున్నారు?'' అని ఆమె అడిగారు.

''ఆయన (సఅసం) నాలుగు ఉమ్‌రాలు చేశారు, వాటిలో ఒకటి రజబ్ మాసంలో అని అంటున్నారు.''

''దైవం అబూ అబ్దుర్రహ్మాన్ (అబ్దుల్లా బిన్ ఉమర్) పై దయదలచుగాక! దైవప్రవక్త (సఅసం) గారు చేసిన ఉమ్రాలలో ఈయన గారు కూడా పాల్గొన్నారు. రజబ్ మాసంలో ఆయన (సఅసం) అసలు ఉమ్‌రా చేయనే లేదు.''

(సహీహ్ బుఖారీ, కితాబుల్ ఉమ్రా)

https://teluguislam.net

3. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) ఒకసారి తన శిష్యులతో, మాసానికి 29 రోజులు అని చెప్పారు. ఈ సంగతిని కొంతమంది హజ్రత్ ఆయిషా (రజి)కు సందర్భవశాత్తు చెప్పగా, ఆమె (రజి) ఇలా అన్నారు, ''దైవం అబూఅబ్దుర్రహ్మాన్ ను కనికరించు గాక! దైవప్రవక్త (సఅసం) ఒక్కోసారి 29 రోజుల మాసం కూడా ఉంటుంది అని మాత్రమే చెప్పారు.'' (ముస్నద్ అహ్మద్)

4. ఆప్తుల రోదన వల్ల మృతులకు యాతన కలుగుతుందని దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చినట్లు ఇద్దరు, ముగ్గురు సహాబా తెలిపారు. హజ్రత్ ఆయిషా (రజి)కు ఈ ఉల్లేఖనం గురించి తెలిసినప్పుడు ఆమె ఇలా పలికారు;

> ''మీరు అసత్యవాదుల ఉల్లేఖనాలను గాని, తిరస్కరింపబడినవారి ఉల్లేఖనాలను గానీ ఉదాహరించటం లేదు. కాని చెవులవల్ల కూడా ఒక్కోసారి పొరపాటు జరగవచ్చు.'' (మస్నద్ అహ్మద్)

## హజ్రత్ ఆయిషా (రజి) హదీసుల క్రోడీకరణ

మహా ప్రవక్త (సఅసం) సహచరుల ఉల్లేఖనాల్నీ, హదీసుల్నీ క్రోడీకరించి గ్రంథస్తం చేసే కృషి మొదటి శతాబ్దం మధ్యకాలం నుండే ఆరంభమయింది. హిజ్రీ మొదటి శతాబ్ది పూర్తవుతుండగా ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రజి) - హిజ్రీ 101లో - ఖలీఫాగా ఉన్నారు. ఆ రోజుల్లో మదీనా మునవ్వరాలో అబూబకర్ (రజి) బిన్ అమ్ర్ బిన్ హజమ్ అన్సారీ ఖాజీగా ఉన్నారు. ఆయన పిన్ని ఉమ్రహ్ కారణంగా ఆయనకు అపార పాండిత్యం అబ్బింది. ఉమ్రహ్ పూర్తిగా హజ్రత్ ఆయిషా (రజి) ఒడిలో శిక్షణ పొందారు. హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రజి) ఉమ్రహ్ ఉల్లేఖనాలను గ్రంథస్తం చేసి తన వద్దకు పంపవలసిందిగా అబూబకర్ పేరిట రాజపత్రాన్ని పంపారు.

## ఖుర్ఆన్ ద్వారా ధర్మసూత్రాల అన్వయింపు

ఏదేని విషయమై ధర్మాధర్మాలను తెలుసుకోదలచినప్పుడు హజ్రత్ ఆయిషా (రజి) అన్నింటికన్నా ముందు దివ్య ఖుర్ఆన్‌పై దృష్టి సారించేవారు. ఒకవేళ అందులో విఫలురాలవుతే హదీసుల వైపు మరలేవారు. ఆ తర్వాత తన బుద్ధీ వివేకాలను ఉపయోగించేవారు. ఒకసారి ఒక వ్యక్తి, ''అరబ్బేతరులు తమ పండుగలలో జంతువును జిబహ్ చేస్తారు కదా. దానిని తినడం ధర్మసమ్మతం అవుతుందా?'' అని అడిగాడు. దానికి ''ప్రత్యేకంగా ఆ దినం కోసమే జంతువును

https://teluguislam.net

జిబహ్ చేస్తే అది ధర్మ సమ్మతం కాదు.'' ఈ ఆదేశాన్ని సంగ్రహించటంలో ఆమె బహుశా ఈ క్రింది ఆయత్‌ను ఆధారం చేసుకొని వుండవచ్చు.

''ఇంకా అల్లాహ్‌కు కాక ఇతరులకు సమర్పించబడిన ఏ వస్తువైనా సరే అది మీ కొరకు నిషిద్ధమే''.
(బఖర్‌హ : 173)

హజ్రత్ జైద్ బిన్ అర్ఖమ్ (రజి) ఒక స్త్రీ నుండి 800కు అప్పుగా ఒక బానిసరాలిని కొన్నారు. పింఛన్ డబ్బులు రాగానే చెల్లిస్తాననే షరతు పెట్టారు. కాని ఈలోగానే అదే బానిసరాలిని ఆ స్త్రీకే 600 నగదుకు అమ్మారు. ఆ మహిళ ఈ వ్యవహారాన్ని హజ్రత్ ఆయిషా (రజి) దృష్టికి తీసుకు రాగా, ఆమె ఇలా పలికారు; ''నువ్వు తప్పు చేశావు, జైద్ బిన్ అరఖమ్ (రజి) కూడా తప్పు చేశారు. దైవప్రవక్త (సఅసం) వెంట సంపాదించిన జిహాద్ పుణ్యం కాస్తా వృధా అయిపోయిందనీ, అయితే ఆయన పశ్చాత్తాప పడవచ్చు'' అని వారితో అన్నారు.

అంటే ఆ ప్రత్యేక పరిస్థితిలో హజ్రత్ ఆయిషా (రజి) ఆ స్త్రీ పొందేలదనపు రెండు వందలను వడ్డీగా భావించారన్నమాట.

## హదీసు ద్వారా....

దివ్యఖుర్‌ఆన్ తర్వాత స్థానం హదీసులది. ఒక ధర్మసందేహం ఉత్పన్నమయ్యింది. ''ఒకవేళ భర్త తన భార్యకు విడాకులు పొందే హక్కునిస్తే, భార్య ఆ హక్కును స్వీకరించక ఆ భర్తకే భార్యగా ఉండాలని కోరుకుంటే అట్టి పరిస్థితిలో భార్యకు విడాకులు వర్తిస్తాయా?!'' - హజ్రత్ అలీ (రజి), హజ్రత్ జైద్ (రజి) దృష్టిలో (మూడింటిలో) ఒకసారి విడాకులు అయినట్లే. హజ్రత్ ఆయిషా (రజి) దృష్టిలో ఒక్కసారి విడాకులు కూడా కావు. తన వాదనకు నిదర్శనంగా ఆమె తనకే చెందిన సంఘటనను వివరించారు, ''దైవప్రవక్త (సఅసం) తన సతీమణులకు వారు ప్రాపంచిక సుఖాలను కోరే పక్షంలో విడాకులు పొంది వెళ్ళిపోవచ్చునీ, లేదా ప్రవక్త కుటీరాలలో ఉంటూ పేదరికాన్ని ఇష్టపడాలని స్వేచ్ఛ ప్రకటించినపుడు వారు అందరూ రెండో షరతునే అంగీకరించారు. మరి అప్పుడు ప్రవక్త సతీమణులకు ఒకసారి విడాకులయినా వర్తించాయా?'' (సహీహ్ బుఖారీ).

ఎవరైనా ఒక బానిసను విడుదల చేసినపుడు యజమానీ, బానిస మధ్య 'వలాఅ' అనే బంధుత్వం ఏర్పడేది. అంటే బానిసకు కూడా కుటుంబ ఆస్తిలో భాగం లభించేది. బానిస చట్టపరంగా తన యజమాని వంశస్థుడుగా పరిగణించ బడేవాడు. ఆ కారణం చేత 'వలాఅ'కి ప్రాముఖ్యత ఏర్పడింది. ఒక బానిస వచ్చి ''నేను ఉత్బా

https://teluguislam.net

ఇబ్నె అబీలహబ్ బానిసత్వంలో ఉండేవాణ్ణి. ఆ దంపతులు నన్ను అమ్మివేశారు. అయితే పూచీ వారిదే అన్న షరతు పెట్టుకున్నారు. ఇప్పుడు నేను ఎవరిచేత కొనబడినట్లు?'' అని అడిగాడు. హజ్రత్ ఆయిషా (రజి) జవాబిచ్చారు, ''బరీరావృత్తాంతం ఇలాంటిదే. దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చారు, ''బరీరాను కొని ఆమెను విడుదల చేసేయి'' అని, కొనుగోలు చేసినవారు దైవాదేశాలకు వ్యతిరేకంగా ఎన్ని షరతులు విధించినా పూచీ నీదే అవుతుంది.'' (బైహఖీ)

హజ్రత్ బరీరా (రజి) ఒక బానిసరాలు. ఆమె పాత యజమానులు పూచీ హక్కు తమకే ఉండే షరతుపై ఆమెను అమ్మివేయదలచారు. బరీరా (రజి) హజ్రత్ ఆయిషా (రజి) వద్దకు వచ్చి, తన పరిస్థితిని వెళ్ళబోసుకున్నారు. హజ్రత్ ఆయిషా (రజి) ఆమెను కొనుగోలు చేయాలన్న కోరిక వెల్లడించారు. కాని పూచీ హక్కును గురించిన షరతుకు ఒప్పుకోలేదు. దైవప్రవక్త.(సఅసం) వచ్చినపుడు జరిగినదంతా వివరించగా, ''నీవు నిరభ్యంతరంగా కొని విముక్తి కలిగించు. దైవాదేశాలకు విరుద్ధమయిన షరతులు వాటంతటవే రద్దయిపోతాయి. ఆమె విముక్తి పొందాక, బానిసగా ఉన్నప్పుడు వివాహమాడిన భర్తను అంగీకరించలేదు. ప్రజలు ఆమెకు 'సద్‌కా' ఇస్తే ఆమె తీసుకునేవారు. వాటిలో తినే వస్తువులు ఒకటీ అరా వస్తే వాటిని దైవప్రవక్త (సఅసం)కు కానుకగా సమర్పించుకునేవారు. ఆయన (సఅసం) స్వీకరించేవారు.

ఇవి మామూలు సంఘటనలే, కాని హజ్రత్ ఆయిషా (రజి) వాటి నుండి ధర్మశాస్త్రానికి సంబంధించిన అనేక అంశాలను సంగ్రహించారు. ''బరీరా ద్వారా ఇస్లాంకు సంబంధించిన మూడు ఆదేశాలు వెలుగులోకి వచ్చాయి'' అని హజ్రత్ ఆయిషా (రజి) అన్నారు.

1. పూచీ హక్కు విముక్తి ప్రసాదించిన వారికే లభిస్తుంది.

2. బానిసలుగా ఉన్నప్పుడు ఒక బానిసకు మరొక బానిస స్త్రీకి వివాహం అయివుండి, భార్య బానిసత్వం నుండి విముక్తురాలయి భర్త బానిసత్వ బంధనాలలోనే ఉంటే అట్టి పరిస్థితిలో తన (పూర్వపు) భర్తను స్వీకరించే లేదా త్యజించే హక్కు ఆ భార్యకు ఉంది.

3. సదకా స్వీకరించదగ్గ వారికి (అగత్యపరులకు) ఏమయినా సద్‌కాగా లభించినపుడు దాన్ని వారు అగత్యపరులు కాని వారికి కానుకగా యిచ్చుకుంటే ఆ అగత్యపరులు కాని వారికి దాన్ని స్వీకరించటం ధర్మసమ్మతం అవుతుంది. అంటే ఆ వస్తువు యొక్క హోదా మారిపోతుంది.

కొన్ని సంగ్రహ విషయాల వివరాలు ఆమె చేత చెప్పబడక పోయినప్పటికీ ఆమె ప్రవచనాలలో నుండి లభించిన సూచనల ఆధారంగా ఫికహ్‌వేత్తలు, ధార్మిక

https://teluguislam.net

సంగ్రహకారులు పెద్దపెద్ద విషయాలను వెల్లడి చేశారు. ''హజ్జతుల్ విదా''లో దైవప్రవక్త (సఅసం) వెంట దాదాపు లక్షమంది ముస్లింలు ఉన్నారు. నాయకులయిన సహాబీలు కూడా వెంట ప్రయాణించారు. ఈ ప్రయాణంలో జరిగిన సంఘటనలు అందరికీ గుర్తున్నాయి. హజ్రత్ ఆయిషా (రజి) కూడా తన సంఘటనల్ని (మస్తిష్కంలో) భద్రపరిచారు. ఆ హదీసులో అన్నీ కూడా పేర్కొనబడ్డాయి. కాని హజ్రత్ ఆయిషా (రజి) పేర్కొన్న సంఘటన ఫికహ్ వేత్తల, సంగ్రహకారుల సూత్రాలలో చోటు చేసుకుంది. హజ్రత్ ఆయిషా (రజి) హజ్ వ్యవధిలో 'అశక్తు'రాలయ్యారు. అలా కావడం ఆమెకు అమిత బాధాకరం అయింది. దైవప్రవక్త (సఅసం) ఆమెను స్థిమిత పర్చారు. ఆయన (సఅసం) ఆజ్ఞతో ఆమె ఆగిపోయి క్రొత్త ఇహరామ్‌తో తవాఫ్ (ప్రదక్షిణం) చేశారు (మూతా ఇమామ్ మాలిక్). హాఫిజ్ ఇబ్నె ఖయ్యిమ్ ఈ ఉల్లేఖనాన్ని అనుసరించి ఇలా వ్రాశారు: ''హజ్రత్ ఆయిషా (రజి) యొక్క ఈ హదీసు వలన హజ్ యొక్క బ్రహ్మాండమైన కొన్ని సూత్రాలు, నిబంధనలు సంగ్రహించబడ్డాయి.''

1. ఏ వ్యక్తి అయినా ఒకేసారి హజ్ మరియు ఉమ్రా - రెండింటి సంకల్పం చేసుకుంటే అతడు రెండింటినీ కలిపి ఒక తవ్వాఫ్, ఒకే సయీ చేస్తే చాలు.
2. అశక్తురాలయిన స్థితిలో స్త్రీ తవ్వాఫ్ (ప్రదక్షిణ) చేయ జాలదు.
3. హజ్ తర్వాత ఉమ్రా సంకల్పం చేసుకోవడం అశక్తురాలయిన స్త్రీకి ధర్మసమ్మతమే.
4. స్త్రీ అశక్తురాలయిన స్థితిలో కాబా గృహ ప్రదక్షిణం తప్ప తక్కిన హజ్ నిబంధనల్ని పాటించ గలదు.
5. 'తనీమ్' హరమ్ (కాబా ఆవరణ) లో చేరి యుండలేదు. అది హరమ్ బయటి ప్రాంతం.
6. ఉమ్రా ఒక ఏడాదిలో రెండుసార్లే కాదు, నెలలో రెండుసార్లు కూడా చేయవచ్చు.
7. ఎవరైనా హజ్, ఉమ్రాలకు వేర్వేరుగా సంకల్పం చేసుకొని అతడికి ఉమ్రా మురిగిపోతుందన్న భయం ఉంటే అతడు హజ్ తర్వాత ఉమ్రా చేయవచ్చు.

హజ్రత్ సఫియ (రజి) కు సంబంధించిన మరో సంఘటన: హజ్‌లో చివరి ప్రదక్షిణ జరిగే సమయానికి ఆమె 'అశక్తు'రాలయ్యారు. ఆమె దైవప్రవక్త (సఅసం)కు ఈ సంగతిని తెలియజేయగా ''అంతకు ముందు ప్రదక్షిణ చేశావు కదా! అని ఓదార్చారు'' ఆయన (సఅసం). హజ్రత్ ఆయిషా (రజి) దీని ఆధారంగా ఆఖరు ప్రదక్షిణం చేయనక్కరలేదని, అశక్తురాండ్రు అయిన స్త్రీలకు ఈ

https://teluguislam.net

విషయంలో మినహాయింపు ఉందన్న విషయాన్ని సం(గహించారు. అందుచేత ఆమెను అనుసరించే స్త్రీలు హజ్ కాలంలో ఈ సూ(త్రాన్నే పాటించేవారు.

(మూతా ఇమామ్ మాలిక్)

## బుద్ధి కుశలత

ఆ తర్వాత స్థానం బుద్ధి కుశలతది. అంటే ఎవరు పడితేవారు తమ తెలివి తేటలలో షరీఅత్ ఆదేశాలను నిర్ణయించటం ఇంగిత జ్ఞానం అనిపించుకోదు. షరీఅత్ మర్మాలను ఎరిగిన పండితులకు, ధార్మిక విద్యా నిపుణులకు, దైవ(గంథం దైవ(ప్రవక్త (సఅసం) సున్నత్‌లతో గల అనుబంధం మూలంగా వారికి ఈ బుద్ధి కుశలత అబ్బుతుంది. వారి దృష్టికి ఏదయినా కొత్త సమస్య వచ్చినపుడు వారా సమస్యను - దైవ(ప్రవక్త (సఅసం) ఇప్పుడు మనలో ఉండి ఉంటే ఈ సమస్యకు ఈ విధంగా జవాబిచ్చేవారని తమ (ప్రావీణ్యతవల్ల (గహిస్తారు. ఉదాహరణకు ఎవరైనా ఒక లీడింగ్ లాయర్ (ప్రత్యేక తరహా కేసులు అసంఖ్యాకంగా వాదించాడనుకోండి - అటువంటి తరహా కేసుల గురించి కూలం కషంగా ఆయనకు అవగాహన ఏర్పడుతుంది. ఆ న్యాయవాది గత అనుభవం దృష్ట్యా ఊహించి ఒక (ప్రత్యేక కేసులో ఆయన సలహా అడిగినపుడు ఈ కోర్టులో ఈ కేసు నడిస్తే ఇలా తీర్పు వస్తుంది అని చెప్పేస్తాడు. అలాగే షరీయత్ పరమైన వివాదాలూ వాటి పర్యవసానాల గురించి హ(జత్ ఆయిషా (రజి)కు క్షుణ్ణంగా తెలుసు. అందుచేత ఆమెగారు తన బుద్ధినుపయోగించి ఊహించిన విషయాల్లో తప్పులు బహు తక్కువగా ఉంటాయని భావించబడేది.

1. దైవ(ప్రవక్త (సఅసం) కాలంలో సర్వసాధారణంగా స్త్రీలు మస్జిద్‌లకు వచ్చేవారు. పురుషుల తర్వాత పిల్లలు, ఆ వెనుక స్త్రీలూ నమాజు చేసేవారు. స్త్రీలను మస్జిద్‌లకు రాకుండా (ప్రజలు నిరోధించరాదు అని ఆయన (సఅసం) ఆదేశించి ఉన్నారు.

మహా(ప్రవక్త తదనంతరం వివిధ జాతుల సమ్మేళనం, అనేక సంస్కృతుల సంగమం, పుష్కలమైన ధనం కారణంగా స్త్రీలలో అలంకారాలూ, తళుకు బెళుకుల వస్త్రధారణ వచ్చేశాయి. ఇది చూసి హ(జత్ ఆయిషా (రజి) ''దైవ(ప్రవక్త (సఅసం) గనక ఇప్పుడు ఉండి ఉంటే స్త్రీలను మస్జిద్‌లకు రానిచ్చేవారు కాదు'' అని వ్యాఖ్యానించారు.

https://teluguislam.net

# గ్రంథ జ్ఞానం - విశ్వాసాలు

ఇస్లాం ఒక నిరాడంబర ధర్మం. దాని విశ్వాసాలూ నిరాడంబరమైనవే. కాని అన్య మతస్థుల కలయిక, జ్ఞాన సంబంధమైన వాదోపవాదాల కారణంగా సహాబీల చివరి కాలంలో కొత్తకొత్త వాదాలు పుట్టుకు రావడం ఆరంభమయింది. దైవప్రవక్త సఅసం) కాలంలో ప్రతి సమస్యకూ ఆయన (సఅసం) ఆదేశమే ఖచ్చితమైన పరిష్కారం. ఎవరికి ఏ అనుమానం వచ్చినా నేరుగా వెళ్ళి సందేహ నివృత్తి చేసుకునేవారు. శుభాలతో కూడిన ఆ కాలం గడిచిపోయాక అటువంటి సందర్భాల్లో ముస్లింలు సహాబా (రజి) వద్దకు వెళితే వారికి ఈ విషయంలో ఖచ్చితమైన ఆయత్ గానీ, హదీసు గానీ తెలిసి వుంటే దాన్ని వివరించేవారు. లేదా ఖుర్ఆన్, హదీసుల ఆధారంగా వారికి సమాధానం చెప్పేవారు. ఈ సందర్భంగా ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా(రజి) ఉల్లేఖించినట్లు నిరూపితమైన ఉల్లేఖనం ఉంటే దాన్నీ ప్రస్తావించే వారు.

## దైవానికి అవయవాలా?

హిజ్రీ 2వ శతాబ్దిలో హజ్రత్ ఆయిషా(రజి) హయాంకు చాలా కాలం తర్వాత ఈ సమస్య బహుళ వ్యాప్తిలోకి వచ్చింది. దివ్య ఖుర్ఆన్ లోనూ, హదీసుల లోనూ దైవానికి కాళ్ళూ చేతులు, కళ్ళు వగయిరా అవయవాల అన్వయింపు ప్రసక్తి ఉంది. అది భౌతిక పరమా? లేక ఊహా పరమా? ఉదాహరణకు చేయి అంటే చేయియేనా లేక శక్తియా? కళ్ళు అంటే భావం దృష్ట్యా లేక జ్ఞానమా? మొదలగునవి.సాధారణ సహాబా (రజి) ద్వారా ఈ విషయమై వివరాలు ప్రస్తావనకైతే రాలేదు. అయితే పుణ్యపురుషుల నమ్మకం ప్రకారం ఆ 'గుణాల'పై నమ్మకం ఉంచాలి. వాటికి సంబంధించి నిఘంటువు అర్థాలను విశ్వసించవచ్చు. కాని వివరాల జోలికి పోకూడదు. హజ్రత్ ఆయిషా(రజి) కూడా ఈ నియమం వైపే మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. బుఖారీ గ్రంథంలో ఆమెగారు చెప్పిన నానుడి ఒకటి ప్రస్తావనకు వచ్చింది -

''ఎవరి చెవుల్లోనయితే అన్ని శబ్దాలకూ అవకాశం ఉందో ఆ దైవం సాక్షి!''

https://teluguislam.net

## దైవ సాక్షాత్కారం :

కొందరేమో దైవ సాక్షాత్కారం ఇహలోకంలోనూ సంభవం కాదు, పరలోకంలోనూ సంభవం కాదు అంటారు. అధికులు ఇందుకు సాధ్యమేనంటారు. సత్య ధర్మానుయాయులు, ''దైవ సాక్షాత్కారము ఇహలోకంలో జరగదు కాని పరలోకంలో పున్నమి చంద్రుడు అందరికీఒకేసారి కన్పించినట్లుగా దైవ సాక్షాత్కారం అవుతుంది'' అని అంటారు. కాని హ(జత్ ఆయిషా( రజి) ఉల్లేఖించిన వివరణాత్మక ఉల్లేఖనాలలో తన శిష్యులకు ఇలా చెప్పారు ఎవరయినా మీకు 'మహమ్మద్ (సఅసం) తన ప్రభువును చూశారు' అని గనక చెప్పివుంటే అతడు అసత్యం చెప్పాడు.'' ఈ వాదానికి ఆమె పవిత్ర ఖుర్ఆన్ లోని రెండు ఆయతులను ఆధారంగా చూపారు. దైవ సాక్షాత్కారం ఇహపరాలలో జరగదు అని వాదించే వారికి ఇంతకంటే బలమైన ఆధారం పవిత్ర ఖుర్ఆన్‌లో లభించలేదు.

لَا تُدْرِكُهُ الْاَبْصَارُ وَهُوَ يُدْرِكُ الْاَبْصَارَ وَهُوَ
اللَّطِيْفُ الْخَبِيْرُ ﴿١٠٣﴾

''చూపులు ఆయన్ని పొందలేవు. కాని ఆయన చూపుల్ని అందుకుంటాడు. ఆయన సూక్ష్మ దృష్టి, సర్వం ఎరిగినవాడు'' (అల్ అన్ ఆమ్ 103)

## రెండో ఆయత్‌లో ఇలా వుంది :

وَمَا كَانَ لِبَشَرٍ اَنْ يُّكَلِّمَهُ اللّٰهُ اِلَّا وَحْيًا اَوْ مِنْ
وَّرَآئِ حِجَابٍ

''మానవమాత్రుడెవరికీ ఆయన (దైవం) తో సంభాషించే శక్తి లేదు. కాని వహీ( సందేశం) ద్వారా లేదా పరదా చాటున వుండి ( మాట్లాడటం సంభవమే). (షూరా : 51)

## అగోచర జ్ఞానం:

అగోచర విషయాల్ని దైవం తప్ప ఇతరులు ఎరుగరు. అగోచర జ్ఞాని అయ్యే శక్తి అల్లాహ్‌కు మాత్రమే వుంది. ఆయనే అగోచరాల్ని, సాక్ష్యాన్ని ఎరిగినవాడు. మరో ఆయతులో ఇలా వుంది:

https://teluguislam.net

''భూమ్యాకాశాలలో అగోచర జ్ఞానాన్ని అల్లాహ్ తప్ప ఎవరూ ఎరుగరు'' (నమల్: 65)

కొందరు అగోచర విషయాలన్నింటినీ ఎరగటం ప్రవక్త ప్రత్యేకతలుగా భావిస్తారు. హజ్రత్ ఆయిషా (రజి) దీన్ని గట్టిగా తిరస్కరించారు. ''దైవప్రవక్త (సఅసం) అగోచర విషయాల్ని ఎరుగుదురు'' అని నీతో ఎవరయినా అంటే అతడు అబద్ధాలకోరు'' అని ఆమె సెలవిచ్చారు. అందుకు ఆధారంగా ఆమె ఈ ఆయత్‌ను ఉదాహరించారు:

''రేపు తాను ఏమి చేయనున్నాడో ఎవరూ ఎరుగరు.''

'ఎవరూ ఎరుగరు' అంటే దైవప్రవక్త (సఅసం)కు కూడా ఆ సంగతి తెలియక పోవచ్చు. మరో సంఘటన, ఒకసారి కొందరు బాలికలు పాడుతున్న పాటలో ఒక చరణం ఇలా ఉంది.

''రేపటి విషయాలు తెలిసిన ప్రవక్త ఒకరు మాలో వున్నారు.....''

''ఇది నిజం కాదు, మొదట పాడిందే పాడుకోండి'' అని ఆ బాలికలను వారించారు దైవప్రవక్త (సఅసం). (సహీహ్ బుఖారీ)

ఈ ఆదేశాన్ని బట్టి, దైవప్రవక్త (సఅసం) అగోచర విషయాలన్నింటినీ ఎరుగుదురు అన్న వాదం ఖండించబడుతోంది.

అయితే అల్లాహ్, కొన్ని అగోచర విషయాలను తన ప్రవక్తలకు కొన్ని పరమార్థాల దృష్ట్యా తెలియచేస్తూ ఉంటాడు.

## ప్రవక్తలు వహీని పూర్తిగా వినిపిస్తారు

దైవప్రవక్తలకు పంపబడ్డ వహీ (సందేశం)లో కొంత భాగాన్ని వారు దాచి పెడతారన్న దురనుమానానికి తావు ఎంతమాత్రం లేదు. ''ముహమ్మద్ (సఅసం) దైవాదేశాలలో కొన్నింటిని దాచి పెట్టుకున్నారనీ, ప్రజలకు తెలియపర్చలేదు అని ఎవరయినా చెబితే అది నిజం కాదని తెలుసుకోండి'' అని హజ్రత్ ఆయిషా (రజి) సెలవిచ్చారు. (సహీహ్ బుఖారీ)

దైవం ఇలా సెలవిస్తున్నాడు:

يَاأَيُّهَا الرَّسُولُ بَلِّغْ مَآ أُنزِلَ إِلَيْكَ مِن رَّبِّكَ وَإِن لَّمْ
تَفْعَلْ فَمَا بَلَّغْتَ رِسَالَتَهُ

"ఓ ప్రవక్తా! నీ ప్రభువు తరఫు నుండి నీపై ఏదైతే అవతరించిందో, దాన్ని ప్రజలకు అందజెయ్యి. ఒకవేళ నీవు ఆ విధంగా చెయ్యలేకపోతే ఆయన (అనుగ్రహించిన) ప్రవక్తా ధర్మాన్ని నిర్వహించనట్లే." (అల్ మాయిద : 67)

హజ్రత్ ఆయిషా (రజి) ఈ ప్రకటనని మరో సంఘటన ఆధారంగా పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ మనిషీ తనకు సంబంధించిన అతి చిన్న బలహీనతనైనా బహిర్గతం కావడానికి ఇష్టపడడు. వాస్తవానికి పవిత్ర ఖుర్ఆన్‌లోని అసంఖ్యాక ఆయత్‌ల ద్వారా ప్రవక్తకు ఆయన పర్యాలోచనా పరమైన తప్పులపై హెచ్చరించడం జరిగింది. దైవప్రవక్త (సఅసం) తన పెంపుడు కొడుకు (విడాకులిచ్చిన) భార్యను వివాహమాడటం అరబ్ మూర్ఖుల దృష్టిలో తీవ్ర అభ్యంతరకరం అయింది. ఆ సంఘటన పవిత్ర ఖుర్ఆన్‌లో సవివరంగా పేర్కొనబడింది. "దైవప్రవక్త (సఅసం) వహీలో కొంత భాగాన్ని దాచి పెట్టేవారే గనక అయితే ఈ ఆయత్‌ని తప్పక దాచిపెట్టేసే వారే కదా! (తద్వారా మూర్ఖులకు ఆక్షేపించే అవకాశం లేకుండా చేయాలని).

وَاِذْ تَقُوْلُ لِلَّذِيْٓ اَنْعَمَ اللّٰهُ عَلَيْهِ وَاَنْعَمْتَ عَلَيْهِ
اَمْسِكْ عَلَيْكَ زَوْجَكَ وَاتَّقِ اللّٰهَ وَتُخْفِيْ فِيْ نَفْسِكَ
مَا اللّٰهُ مُبْدِيْهِ وَتَخْشَى النَّاسَ ۚ وَاللّٰهُ اَحَقُّ اَنْ
تَخْشٰىهُ ۭ

"ఓ ప్రవక్తా (సఅసం)! అల్లాహ్ మరియు నీవు దయ జూపిన ఆ వ్యక్తితో (జైద్‌తో), "నీ భార్యను విడిచిపెట్టకు, అల్లాహ్‌కు భయపడు" అని చెప్పిన ఆ సందర్భాన్ని గుర్తు తెచ్చుకో. ఆ సమయంలో అల్లాహ్ స్పష్టం చేయదలచుకున్న విషయాన్ని నీవు నీ మనసులో దాచి ఉంచావు. (అప్పుడు) నీవు ప్రజలకు భయపడుతున్నావు. వాస్తవానికి ఈ భయభక్తులకు ఎక్కువ హక్కుదారుడు అల్లాహ్‌యే."

(అహ్‌జాబ్ : 37)

https://teluguislam.net

కాని ఆయన (స) దేన్నీ మరుగు పరచలేదు. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే తనపై అవతరించిన సందేశాన్నంతటినీ ఆయన (స) హెచ్చు తగ్గులు లేకుండా - ప్రజల సమక్షంలో బహిర్గతం చేశారు.

## మేరాజ్ ఆత్మకు సంబంధించినదా?

దైవప్రవక్త (సఅసం) చేసిన మేరాజ్ ప్రయాణం శారీరకమైనదా? ఆత్మ సంబంధమైనదా? ఇంకా జాగృదావస్థలో జరిగినదా? లేక స్వప్నావస్థలో జరిగినదా? అనే విషయమై ఉల్లేఖకులలో భిన్నాభిప్రాయం ఉంది.

وَمَا جَعَلْنَا
الرُّءْيَا الَّتِيْٓ اَرَيْنٰكَ اِلَّا فِتْنَةً لِّلنَّاسِ وَالشَّجَرَةَ
الْمَلْعُوْنَةَ فِي الْقُرْاٰنِ

''ఇప్పుడు (మేము) మీకు దేన్నయితే చూపించామో దాన్ని మరియు పవిత్ర ఖుర్‌ఆన్‌లో శపించబడిన వృక్షాన్ని మేము వారి కొరకు ఒక ఉపద్రవంగా చేసి ఉంచాము''
(బనీ ఇస్రాయీల్ - 60).

దివ్య ఖుర్‌ఆన్‌లో మరోచోట అది మనోల్లేఖనంగా చెప్పబడింది.

مَا كَذَبَ الْفُؤَادُ مَا رَاٰى ۝

హృదయము చూచిన దాని గురించి అబద్ధం ఏదీ కల్పించలేదు'' (నజమ్ : 11)

సహీహ్ హదీసు గ్రంథాలలోని ఒక ఉల్లేఖనం ప్రకారం ఆయన (సఅసం) ఆ సమయంలో మగతలో ఉన్నారు. ఒక ఉల్లేఖనంలో మేరాజ్‌లో చూసిన దృశ్యాలు జరిగిన సంఘటనల ప్రస్తావన తర్వాత చివరిలో 'ఆ తర్వాత నేను మేల్కొన్నాను' అని ఉంది. ఇస్‌హాఖ్ (రజి) ఉల్లేఖనానుసారం, హజ్రత్ ఆయిషా (రజి); మేరాజ్ ఆత్మ సంబంధితమని భావిస్తున్నట్లుగా ఉంది. ఆ ఉల్లేఖనంలో ఇలా వుంది: ఇబ్నె ఇస్ హాఖ్ తెలియచేశారు.

''ఆయన (సఅసం) శరీరం అదృశ్యం కాలేదు. ఆయన ఆత్మను మాత్రమే దైవదూత తీసుకువెళ్ళారు అని హజ్రత్ ఆయిషా (రజి) చెప్పేవారని హజ్రత్ అబూబకర్ కుటుంబీకుడొకరు నాతో చెప్పారు.''

https://teluguislam.net

## ప్రవక్త శిష్యుల తటస్థ వైఖరి

మహా ప్రవక్త దగ్గరనుండి - క్రమశిక్షణలో ఆరితేరిన ప్రియ సహచరులంతా సాధారణంగా - ఎవరి విషయంలోనయినా తటస్థంగా ఉండేవారు. తాము ఒకరి తరఫున పుచ్చుకునే వకాల్తా మరొకరికి అన్యాయంగా పరిణమిస్తుందేమోనని భయపడేవారు. అది వారి న్యాయశీలానికి ప్రబల నిదర్శనం అనుకోవాలి. అయితే హజ్రత్ ఉస్మాన్ (రజి) హత్య అనంతరం పరిస్థితుల్లో మార్పు వచ్చింది. హజ్రత్ అలీ - అమీర్ ముఆవియా మధ్య జరిగిన అంతర్యుద్ధాలలో ఈజిప్షియన్లు, సిరియన్లు, ఇరాకీలు తమ వైరి వర్గాల వారిని తూలనాడుకో సాగారు. ఈ పోకడలను చూసిన హజ్రత్ ఆయిషా (రజి) తల్లడిల్లిపోయారు. దీన్ని దైవాదేశానికి వ్యతిరేకంగా భావించేవారు. అందుకు ఆధారం పవిత్ర ఖుర్ఆన్ నుండి చూపారు - ఆమె తన మేనల్లుడిని ఉద్దేశ్యించి ''మేనల్లుడా! ప్రవక్త సహచరులపై కారుణ్యం కోసం ప్రార్థించమని ఆదేశించబడితే, వీళ్ళేమో తిట్లు తిడుతున్నారు'' అని అన్నారు.

(సహీహ్ ముస్లిం)

ముహాజిర్లు, అన్సారులను ప్రశంసిస్తూ వచ్చిన ఖుర్ఆన్ ఆయత్‌లను ఆమె ఈ సందర్భంగా ఉదాహరించేవారు:

وَالَّذِيْنَ جَآءُوْ مِنْۢ بَعْدِهِمْ يَقُوْلُوْنَ رَبَّنَا اغْفِرْ
لَنَا وَلِاِخْوَانِنَا الَّذِيْنَ سَبَقُوْنَا بِالْاِيْمَانِ وَلَا
تَجْعَلْ فِيْ قُلُوْبِنَا غِلًّا لِّلَّذِيْنَ اٰمَنُوْا رَبَّنَآ اِنَّكَ
رَءُوْفٌ رَّحِيْمٌ

''(ఆ సహాబీల తర్వాత వచ్చినవారు) వారికోసం ఇలా వేడుకుంటారు. ఓ ప్రభూ! మమ్మల్ని, మాకు పూర్వం విశ్వసించిన ఆ సోదరులందర్నీ మన్నించు, మా హృదయాలలో విశ్వసించిన వారిపట్ల ఎటువంటి కాపట్యాన్నీ ఉంచకు. ఓ మా ప్రభూ! నీవు గొప్పగా కనికరించేవాడవు, అపార కృపాశీలుడవు''

(అల్ హష్ర్ : 10).

https://teluguislam.net

## ఖిలాఫత్ పరంపర

దైవప్రవక్త (సఅసం) తన అవసాన దశలో హజ్రత్ ఆయిషా (రజి)తో, ''మీ తండ్రిని పిలిపించు - నేను ముందే రాసేస్తాను, లేకుంటే ఎవరైనా ఖిలాఫత్ పదవిని ఆపేక్షించే వారెవరైనా, తానే అర్హుడనని ప్రకటించుకుంటాడన్న భయం నాక్కలుగుతుంది. వాస్తవంలో అల్లాహ్ మరియు ముస్లింలు అబూబకర్‌ను తప్ప మరెవ్వరినీ కోరుకోరు'' అని అన్నారని ముస్లిం గ్రంథంలో హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనంలో పేర్కొనబడింది.

ఆ గ్రంథంలోనే ఈ విధంగానూ పేర్కొనబడింది.

హజ్రత్ ఆయిషా (రజి)గారి ప్రియ శిష్యుడయిన ఇబ్నె అబీ మలేకా అడిగారు, ''ఒకవేళ దైవప్రవక్త (సఅసం) స్వయంగా ఎవరినన్నా ఖలీఫాగా నియమించదలిస్తే ఎవర్ని నియమించేవారు?'' ''అబూబకర్ (రజి)''ని. ''ఆ తర్వాత ఎవరినీ?'' అని అడిగితే ''ఉమర్''ని అని జవాబిచ్చారు. ''ఆ తర్వాత ఎవర్ని?'' అని అడిగితే ''అబూ ఉబేదా బిన్ జరీహ్''ని అని చెప్పి మౌనం దాల్చారు.

దివ్య ఖుర్ఆన్‌లో సమాధి ప్రస్తావనతోపాటు బాధ (పీడ) అనే పదం లేదు. (అయితే మరణానంతరం ఖియామత్‌కు పూర్వం) బర్‌జఖ్ బాధ గురించి మాత్రం ఉంది. కాని దీన్నిబట్టి సమాధిలో బాధ కలిగే విషయం సరిగ్గా బుర్రకెక్కదు.

## సమాధిలో బాధ:

ఇస్లాంలో ఈ విషయమై పరిశోధన హజ్రత్ ఆయిషా (రజి) వల్లే జరిగింది. ఇద్దరు యూదస్త్రీలు హజ్రత్ ఆయిషా (రజి) ఇంటికి వచ్చారు. సందర్భవశాత్తు వారు ఆమెతో, ''దైవం మిమ్మల్ని సమాధి బాధ నుండి కాపాడు గాక!'' అన్నారు. హజ్రత్ ఆయిషా (రజి)కు ఈ మాటలు వింతగా తోచాయి. ''సమాధిలో కూడా బాధ కలుగుతుందా? అని ఆమెకు సందేహం కలిగింది. ఆమె దైవప్రవక్త (సఅసం)ను దర్యాప్తు చేయగా ''నిజమే'' అన్నారు. ఆ తర్వాత హజ్రత్ ఆయిషా (రజి) ఆయన (సఅసం) దువా (ప్రార్థన)లను శ్రద్ధగా గమనించారు. అందులో సమాధి యాతన నుండి శరణు వేడటం కూడా ఒకటి. అంటే మొదట ఈ విషయాన్ని ఆమె అంతగా పట్టించుకోలేదన్నమాట.

## సమాధిలోని శవాలు వింటాయా?

శవాలు వింటాయా? లేదా? ఈ విషయమై సహాబీల అభిప్రాయం రకరకాలుగా ఉంది. హజ్రత్ ఉమర్ (రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), హజ్రత్ అబ్దుల్లా

https://teluguislam.net

బిన్ అబ్బాస్ (రజి)లు, శవాలు వింటాయని అభిప్రాయపడ్డారు. హ॥జత్ ఆయిషా (రజి) దీంతో ఏకీభవించరు. ఆమె ఈ విషయాన్ని కేవలం బుద్ధి వివేకాలతో మాత్రమే ఊహించినా, ఆమె తన వాదానికి సాక్ష్యాధారంగా ఈ క్రింది ఆయత్‌లను పేర్కొన్నారు.

إِنَّكَ لَا تُسْمِعُ الْمَوْتَىٰ

1. ''ఓ ప్రవక్తా! నీవు మృతులకు (నీ మాటను) వినిపించలేవు''. (నమల్: 80)

وَمَا أَنتَ بِمُسْمِعٍ مَّن فِي الْقُبُورِ ○

2. ''మరియు (ఓ ప్రవక్తా!) సమాధులలో ఉన్న వారికి ఏమీ వినిపించలేవు''. (ఫాతిర్: 22)

దీన్ని బట్టి మృతులు మరణానంతరం వినికిడి శక్తిని కోల్పోతారని అర్థమవుతోంది. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో వారికి కొన్ని శబ్దాలు వినబడితే ఏమో!

https://teluguislam.net

# ధర్మావగాహనలో సాటిలేని మేటి

షరీఅత్ యొక్క ఆజ్ఞలన్నీ పరమార్థాలతో ముడిపడి ఉన్నాయనడంలో సందేహం లేదు. అయితే ఆ పరమార్థాలు అన్నీ దాసులకు తెలియనవసరం లేదు. కాని అల్లాహ్ తన కారుణ్యంతో ఆ పరమార్థాలను కూడా చర్చించాడు. దైవప్రవక్త (సఅసం) తాను చేసిన ప్రబోధనల, తాను నెలకొల్పిన ఆదర్శాల మర్మాలను ఒక్కోసారి స్వయంగా వెల్లడించారు. ఒక్కోసారి ఎవరయినా అడిగిన మీదట వెల్లడించారు.

దైవప్రవక్త (సఅసం) కాలంలో స్త్రీలు నిరభ్యంతరంగా మస్జిద్‌లకు వచ్చేవారని, జమాఅత్‌తో చేసే నమాజ్‌లో పురుషులు, బాలల తర్వాత వారి పంక్తులు ఉండేవని లోగడ చదివి ఉన్నాం. 'వారిని రానీయకుండా నిరోధించకండి' అని ఆయన (సఅసం) ఆజ్ఞాపూర్వకంగా తాకీదు చేశారు కూడా. కాని ప్రవక్త పదవీ కాలం అంతమయ్యాక, ధన సంపదల వృద్ధీ, ఇతర జాతుల సమ్మేళనంవల్ల వారి నిరాడంబరత, నిర్మోహమాటం, పవిత్రభావాలు మటుమాయం అయ్యేందుకు దోహదపడ్డాయి. హజ్రత్ ఆయిషా (రజి) ఈ పరిస్థితిని గమనించి, ''దైవప్రవక్త (సఅసం) గనక ఇప్పుడు ఉండి ఉంటే, స్త్రీలు పోతున్న నూతన పోకడల్ని గమనించి వారు మస్జిద్‌లకు రావడాన్ని నిరోధించేవారు'' అని చెప్పారు (సహీహ్ బుఖారీ). ఇదొక పాక్షిక సంఘటన. కాని దీన్నిబట్టి ఆమె దృష్టిలో షరీఅత్ ఆజ్ఞలు పరమార్థాలతో, పరిస్థితులతో ముడిపడినవనీ, వాటిలో మార్పు వచ్చినపుడు ఆదేశాలు కూడా మారగలవని రుజువవుతోంది.

ఒకసారి ఒక వ్యక్తి హజ్రత్ ఆయిషా (రజి) ని కలుసుకునేందుకు వచ్చి ఆ మేరకు అనుమతి కోరారు. హజ్రత్ ఆయిషా (రజి) ఆ వ్యక్తి వదిన పాలు త్రాగి ఉన్నారు. అతణ్ణి కలుసుకునేందుకు ఆమె నిరాకరించారు. దైవప్రవక్త (సఅసం) ఇంటికి వచ్చాక జరిగిందంతా వివరించారు. ''నీవు అనుమతించి ఉండాల్సింది'' అన్నారు ఆయన (సఅసం). అందుకు హజ్రత్ ఆయిషా, ''నాకు పాలు త్రాపించింది అతడి అన్న కాదు గదా! అతడి అన్న భార్య మాత్రమే త్రాపించింది. వదినకు మరిదికి సాపత్యం ఏమిటి?'' అని ప్రశ్నించగా దానికి మహాప్రవక్త (సఅసం) ''కాదు, అతడు నీకు బాబాయి అయ్యాడు'' అని అన్నారు (సహీహ్ ముస్లిం). దీనిని బట్టి ఆమె షరీఅత్ ఆదేశాలలో ఇంగితజ్ఞానాన్ని కూడా ఉపయోగించే వారని వ్యక్తమవుతోంది.

https://teluguislam.net

## పవిత్ర ఖుర్‌ఆన్ అవతరణ

అవతరణా ప్రదేశాన్ని బట్టి దివ్య ఖుర్‌ఆన్ భాగాలు రెండు - 1. మక్కీ, 2. మదనీ. అంటే మక్కాలో అవతరించిన దివ్య ఖుర్‌ఆన్ భాగం ఒకటి. రెండోది హిజ్రత్ తర్వాత మదీనాలో అవతరించిన భాగం. ఈ రెండు భాగాలు వాటి యందలి విషయం మరియు ప్రత్యేకతల రీత్యా కూడా పరస్పరం భిన్నమైనవి. సాధారణ ప్రజలకు వాటి వ్యత్యాసం అంతగా అర్థం కాకపోవచ్చు కాని అరబీ భాషలో మంచి పట్టుగల వారికి, ఖుర్‌ఆన్ శైలి తెలిసిన వారికి - సూరాలలోని పదభావాన్ని బట్టి అది మక్కీ సూరాయో లేక మదీనా సూరాయో ఇట్టే తెలిసి పోతుంది.

### ఈ రెండింటిలోని తేడాలు చూడండి :

| మక్కీ సూరాలు | మదనీ సూరాలు |
|---|---|
| 1. అధికాంశం ఉద్రేకపూరితమైనవై వుంటాయి. భావాలు భావనలను రగుల్గొలిపేవై ఉంటాయి | 1. స్పష్టమైనవి, నికరమైనవి అయి వుంటాయి. |
| 2. గాంభీర్యంతో కూడిన గొప్ప పదాలు. | 2. చట్టపరమైన పదాలు. |
| 3. చాలావరకు హితబోధ, తౌహీద్, స్మరణ, పరలోకం, పాపపుణ్యాలకు సంబంధించిన ఆయత్‌లు. | 3. ఆదేశాలు, నిర్దేశిక నియమాలతో ముడిపడి ఉంటాయి. |
| 4. అంత్యప్రాసల్ని తరచుగా వాడటం జరిగింది. సర్వసాధారణంగా చిన్న చిన్న ప్రాసలు ఉపయోగించబడ్డాయి. | 4. ప్రాసల్ని తక్కువగా వాడటం జరిగింది. ఎక్కడన్నా ప్రయోగించడం జరిగినా పెద్ద, పెద్ద ప్రాసల్ని ప్రయోగించటం జరిగింది. |
| 5. వీటిలో యూదులు, క్రైస్తవుల ముఖాముఖి లేదు. ముక్కు సూటిగా విషయం చెప్పబడింది. | 5. యూదులు, క్రైస్తవుల గురించిన అంశాలు చాలా వున్నాయి. |
| 6. వీటిలో ఆచరణలు, ఆరాధనలను గురించి అంతగా నొక్కి చెప్పలేదు. అధిక భాగం విశ్వాసాలను గురించే చెప్పబడింది. | 6. వీటిలో ఆచరణలు, ఆరాధనలు గురించి పదే పదే నొక్కి వక్కాణించబడింది. |
| 7. జిహాద్ ప్రసక్తి లేదు. కేవలం సందేశ ప్రధానమైన పలుకులు, మృదు భాష్యం గురించి తాకీదు వచ్చింది. | 7. సందేశ వచనాలతోబాటు జిహాద్ గురించిన ఆజ్ఞ కూడా వుంది. |

https://teluguislam.net

ఈ వ్యత్యాసాన్ని, ప్రత్యేకతని బహిర్గతం చేసింది తామేనని యూరపుకు చెందిన చరిత్రకారులు సగర్వంగా చెప్పుకుంటారు. కాని 14 వందల సంవత్సరాలకు పూర్వమే హజ్రత్ ఆయిషా (రజి) ఈ ముడిని విప్పారన్న వాస్తవం పాపం వారికి తెలియదు. సహీహ్ బుఖారీ గ్రంథంలో ఇలా వుంది :-

> "దివ్యఖుర్ఆన్‌లో అవతరింపబడిన మొట్టమొదటి సూరా (వివరణాత్మకమైన) ముఫస్సల్ సూరా. అందులో స్వర్గ నరకాల ప్రస్తావన వుంది. ప్రజలు ఇస్లాం వైపుకు మరలిన తర్వాత హలాల్ - హరాం గురించిన ఆదేశం అవతరించింది. సారా త్రాగకండి అని ముందుగానే (ఆజ్ఞ) అవతరించి ఉంటే, మేము సారాను ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచి పెట్టము అని ప్రజలు అని ఉండేవారు. ఒక వేళ వ్యభిచారం చేయ వద్దని ఆజ్ఞ వచ్చి ఉంటే, మేము వ్యభిచారాన్ని ఎంత మాత్రం విడిచి పెట్టం అని ప్రజలు అని వుండేవారు. నేను మక్కాలో ఆడుకునే రోజుల్లో "వారి వాగ్దాన సమయం ఖియామత్ దినం, ఖియామత్ ఎంతో కఠిన మైనది ఇంకా అది చేదు అనుభవం" అన్న ఆయత్ అవతరించింది. నిసా సూరా బఖరహ్ సూరా అవతరించే నాటికి నేను ఆయన (సఅసం) సేవలో వున్నాను"

దీన్ని బట్టి మెల్లిగా, క్రమ క్రమంగా తన బోధనల పరిధిని విస్తరింప చేయడం ఇస్లాం అభిమతమని అర్థమవుతుంది. ఇస్లాం ఒక అనాగరిక జాతిలో అవతరింప జేయబడింది. మొదట ఉపన్యాస ధోరణిలో - ఉత్తమ రీతిలో స్వర్గం, నరకాల ప్రస్తావన వారి ముందుకు తేబడింది. ప్రజలు దీని పట్ల ప్రభావితులయిన తర్వాత ఇస్లామీయ ఆజ్ఞలు, సూత్రాలు, ధర్మా ధర్మాలు అవతరించ బడ్డాయి.

వ్యభిచారం, మద్యపానం తదితర దుర్వ్యసనాలను విడనాడమని మొదటి రోజే పిలుపునిస్తే ఆ పిలుపును వినే దెవరు ? హిత బోధ నిమిత్తం వాడే భాష, న్యాయ శాసనాల తప్పిళ్ల కొరకు ఉపయోగించే భాష ఒకే విధంగా ఉండాలని ఎవరనగలరు? నిసా, బఖరహ్ సూరాలను గురించి చెబుతూ అవి మదీనాలో అవతరింపబడ్డాయని హజ్రత్ ఆయిషా (రజి) తెలిపారు. మదీనాలో యూదులూ క్రైస్తవులు కూడా ఉండేవారు. కాబట్టి ఆ ఆయత్‌లలో వారిని సంబోధించడం జరిగింది. ఎందుకంటే ఇస్లామీయ సందేశం ఇక్కడ తన ప్రభావం చూపింది. కాబట్టి ఆజ్ఞలు అవతరించబడ్డాయి. ఆదేశిక సూత్రాల భాష కాబట్టి అందులో ప్రాస చాలా తక్కువగా ప్రయోగించబడుతుంది. ఖమర్ సూరా మక్కాలో

https://teluguislam.net

అవతరించబడిందని ఆమె తెలిపారు. ఇస్లాం ఆవిర్భవించిన తొల్దొలి రోజుల్లో ఖియామత్ ప్రస్తావన వుంది. ముష్రికుల వ్యతిరేకతను బట్టి అక్కడ వారితోనే తలపడవలసి వచ్చింది. కాబట్టి చిన్న చిన్న పదాల ప్రాసతో మాటలలో పొందిక, మృదుత్వంతో ప్రభావ పూరితం చేయడమే అందులోని ముఖ్యోద్దేశ్యం. మొత్తం మీద పరిస్థితులలోని వైవిధ్యం కారణంగా మక్కీ, మదనీ సూరాలలో వ్యత్యాసం కనబడుతుంది.

## ఉదయం, అసర్ నమాజ్‌ల తర్వాత .....

అసర్ నమాజ్ మరియు ఫజర్ నమాజ్ చేసిన తర్వాత మరే నమాజా అంటే నఫిల్‌గానీ, సున్నత్ గానీ చేయటం ధర్మసమ్మతం కాదని హజ్రత్ ఉమర్ (రజి) ఉల్లేఖించిన హదీసులలో వుంది. ఈ నిషేధానికి ప్రత్యక్షంగా ఎటువంటి కారణమూ కనిపించదు. దైవం అయితే ఎల్ల వేళలా ఆరాధనకు ఆజ్ఞాపించి యున్నాడు కదా! ఆశ్చర్యకరమైన ఈ సందేహాన్ని హజ్రత్ ఆయిషా (రజి) నివృత్తి చేస్తున్నారు.

> ఉమర్ (రజి) పొరబడ్డారు. సూర్యోదయం, సూర్యాస్తమయాల సమయంలో ఎవరైనా పొంచి వుండి నమాజ్ చేయకూడదని మాత్రమే ఆయన (సఅసం) తాకీదు చేశారు.
> (ముస్నద్‌అహ్మద్)

అంటే సూర్యుని పూజిస్తున్నారన్న అనుమానం కలగ కూడదు లేదా సూర్యోపాసన చేస్తున్న వారితో పూజాసమయంలో వారితో పోలిక ఉందన్న అనుమానమూ ఉండకూడదు. ఇటువంటివే మరికొన్ని ఉల్లేఖనాలు బుఖారీ గ్రంథంలో సహాబీల చేత ఉల్లేఖించబడ్డాయి.

## కూర్చుని నమాజ్ చేయడం

దైవ ప్రవక్త (సఅసం) నఫిల్ నమాజులో కూర్చుని నమాజ్ చేశారన్న ఆధారాలు ఉన్నాయి. అందుచేతనే కొందరు ఎటువంటి కారణమూ లేకుండానే కూర్చుని నమాజ్ చేయడం ముస్తహబ్‌గా భావిస్తారు. వాస్తవానికి కూర్చుని చేసే నమాజ్‌కు, నిలబడి చేసే నమాజ్‌కు లభించే పుణ్యంలో సగభాగం మాత్రమే లభిస్తుంది. ఒక వ్యక్తి హజ్రత్ ఆయిషా (రజి) ను ''దైవ ప్రవక్త (సఅసం) కూర్చుని నమాజ్ చేసే వారా?'' అని దర్యాప్తుచేయగా ఆమె ఈ విధంగా జవాబిచ్చారు :-

> ''ప్రజలు ఆయన్ను విరిచేసి నపుడు (అంటే ఆయన (సఅసం) బలహీనులయినపుడు)''.

https://teluguislam.net

మరో ఉల్లేఖనంలో ఇలావుంది :

> ''ఆయన (సఅసం) తహజ్జుద్ నమాజ్ ను కూర్చుని చేస్తుండగా నేనెప్పుడూ చూడలేదు. కాని ఆయన (సఅసం) వయసు మీరినపుడు మాత్రం (కూర్చుని చేశారు)''.

దీన్ని బట్టి మహాప్రవక్త (సఅసం) సరయిన కారణాంతరాల వల్ల సగం పుణ్యంతో సరిపెట్టు కున్నారని విదితమవుతోంది. ఇక పుణ్యం ఎక్కువ తక్కువలపై దృఢవైఖరి నవలంబించేవారు నిలబడే నమాజ్ చేయడానికి ఇష్టపడతారు. కాని దైవ ప్రవక్త (సఅసం) పట్లగల అపారమైన ప్రేమకల వారు పుణ్యం ఎక్కువ లభించడం కంటే తమ ప్రియతముని అనుసరణకే ప్రాధాన్యత నిస్తారు. అందుచేతవారికి నఫిల్ నమాజ్లో కూర్చుని చేయడం వల్ల పుణ్యం కొంత తగ్గినా ప్రవక్త (సఅసం) పై వీరికి గల ప్రేమ కారణంగా లభించే పుణ్యం ఆ లోటును (ఇన్షా అల్లాహ్) భర్తీ చేయగలదు.

ఉదయం నమాజులో రకాతుల సంఖ్య తక్కువెందుకు ?

ఉదయం నమాజ్లో ఎక్కువ స్థిమితం ఉంటుంది. కాబట్టి మరిన్ని ఎక్కువ రకాతులు ఉండాల్సింది కదా? అన్న ప్రశ్నకు ఆమె(రజిఅన్) సమాధాన మిచ్చారు :-

> ఫజర్ నమాజ్లో కూడా రకాతులు పెంచబడలేదు. దీనికి కారణం ఏమంటే ఉదయం నమాజ్లోని రెండు రకాతుల్లో పెద్ద సూరాలు చదవబడతాయి. '' (ముస్నద్)

ఉదయం నమాజ్లో ప్రత్యేకించి ఏ కాగ్రతకు షరీఅత్ పెద్దపీట వేస్తుంది. మాటి మాటికీ లేవడం, కూర్చోవడం వల్ల ఈ ఏ కాగ్రత సడలి పోవచ్చు. కాబట్టి ఎక్కువ రకాత్ల కన్నా ఏకాగ్రతకు ప్రాముఖ్యం ఇవ్వబడింది. అంటే రకాతుల సంఖ్య రెండే కాని ఖుర్ఆన్ పారాయణం పొడిగించబడింది.

## ఆషూరా ఉపవాసానికి హేతువు

ఆషూరా రోజు అంటే ముహర్రం నెల 10వ రోజు అజ్ఞాన కాలం నాటి వారు ఉపవాసం పాటించే వారు. ఇస్లాం (ధర్మం) అమల్లోకి వచ్చిన తర్వాత కూడా ఈ రోజు ఉపవాసం వాజిబ్గా పరిగణించ బడేది.★ కాని రమజాన్ ఉపవాసాలు (ఫర్జ్)

★ బుఖారీ, ముస్లిం, అబూదావూద్ మరియు ఇబ్నెమాజ గ్రంథాలలో హజ్రత్ ఇబ్ను అబ్బాస్ (రజి) ఉల్లేఖనం మరో విధంగా వుంది, ఆయన ఏ మంటునారంటే ''దైవప్రవక్త (సఅసం) మదీనా వచ్చినపుడు

https://teluguislam.net

విధిగా చేయబడిన మీదట ఈ ఉపవాసం వాజిబ్ కావడం' రద్దు అయింది. హజ్రత్ అబ్దుల్లా ఇబ్నె ఉమర్ (రజి) గారి చేత కూడ హదీసులలో ఈ మేరకు ప్రస్తావన వచ్చింది. కాని అజ్ఞాన కాలంలో ఈ ఉపవాసం పాటించ బడటానికి కారణం ఆయన వెల్లడించలేదు. ఆ కారణాన్ని హజ్రత్ ఆయిషా (రజి) వెల్లడించారు.

> రమజాన్ ఉపవాసాలు విధి గావించబడడానికి పూర్వం ఖురైషులు ఆషూరా ఉపవాసం పాటించే వారు. అ రోజు కాబా గృహానికి క్రొత్త గలీబు తొడిగేవారు.
>
> (ముస్నద్ అహ్మద్)

ఆయన (సఅసం) రమజాన్ మాసమంతా తరావీహ్ ఎందుకు చదవ లేదు ? అన్నది మరో ప్రశ్న -

దైవ ప్రవక్త (సఅసం) రాత్రుళ్ళు చేసే నమాజుల గురించి హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా అభిప్రాయపడుతున్నారు :

'' ఈ విషయాన్ని హజ్రత్ ఆయిషా (రజి) కంటే పరిశీలనాత్మకంగా ఎరిగిన వారు ఎవరూలేరు (సహీహ్ ముస్లిం). ఆమె తెలియజేసిన దాని ప్రకారం దైవప్రవక్త (సఅసం) రమజాన్ మాసంలోగానీ, ఇతర మాసాలలో కానీ 13 రకాతుల కంటే ఎక్కువ చదివేవారు కాదు. రమజాన్ మాసంలో ఒకరోజు ఆయన (సఅసం) మస్జిద్‌లో తరావీహ్ నమాజ్ చేశారు. ఆయన (సఅసం) నమాజ్ చేయడం చూసి మరికొందరు నమాజ్‌లో వచ్చిచేరారు. మరునాడు ఇంకా కొందరు, మూడోరోజు ఇంకా ఎక్కువ మంది వచ్చి చేరారు. నాలుగో రోజు అసంఖ్యాక జనంతో మస్జిద్‌లో చోటు చాల లేదు. కానీ ఆయన (సఅసం) ఇంటి నుండి బయటకు రాలేదు. ప్రజలు ఎదురు చూసి చూసి నిరాశతో వెళ్ళి పోయారు. ఆయన (సఅసం) మరునాడు ఉదయం ఇలా సెల విచ్చారు.

> ''రాత్రి మీ పరిస్థితి నాకు తెలియకుండా లేదు. కాని మీపై తరావీహ్ ఫర్జ్ (విధి)గా మారిపోతుందేమో, మీరు దాన్ని ఆచరణలో పెట్టలేక పోతారేమోనన్న భయం నన్ను బయటకు రాకుండా చేసింది.''
>
> (సహీబుఖారీ, ముస్లిం)

---

యూదులను చూసి ఆ రోజు ఉపవాసం పాటించేవారు. కారణం దర్యాప్తు చేయగా ఆ రోజు దైవం హజ్రత్ మూసా (అస్సలాం) కు ఫిరౌన్‌పై విజయం ప్రాప్తింప చేశాడనీ, దాని జ్ఞాపకార్థమే యూదులు ఆ రోజు ఉపవాసం పాటించేవారనీ తెలిసింది. ''మరయితే ఆ రోజు నేను ఉపవాసం ఉండటం మరింత అవసరం'' అని అన్నారు దైవప్రవక్త (సఅసం). అంచేత ఆయన (సఅసం) ఆ రోజున స్వయంగా ఉపవాసం పాటించి సహచరులను కూడా అందుకు ఆదేశించారు. హజ్రత్ అబూమూసా (రజి) ఉల్లేఖించిన ఇటువంటి ప్రస్తావనే ఒకటి బుఖారీ గ్రంథంలో వుంది.

https://teluguislam.net

కాని దైవ ప్రవక్త (సఅసం) పరమ పదించిన తరువాత ఇక తరావీహ్ నమాజ్ విధి (ఫర్జ్)గా చేయబడదన్న సంగతి నిర్ధారణ అయ్యాక సహాబీలు క్రమబద్ధంగా తరావీహ్ చేశారు. ఇక హదీసుపై దృష్టికలవారు దాన్ని ముస్తహబ్‌గానే భావించారు. కాని సహాబాను అనుసరించినవారు మాత్రం దాన్ని సున్నతె ముఅక్కిదాగా ఖరారు చేశారు.

## హజ్ వాస్తవికత :

హజ్ యాత్రలోని అర్కాన్ అంటే తవాఫ్ (ప్రదక్షిణ) చేయడం, కొన్ని చోట్ల పరుగు తీయడం ఒక్కోచోట నిలబడటం, హజ్‌లో కొన్ని చోట్ల మజిలీ చేయటం కొన్ని చోట్ల కంకరరాళ్ళు విసరడం ఇత్యాదివన్నీ నిరర్థకమైన చర్యలని తెలియని వారు ఆక్షేపిస్తారు. దీని గురించి హజ్రత్ ఆయిషా (రజి) ఏమంటున్నారో చూడండి:

> ''కాబాగృహ ప్రదక్షిణమైనా, సఫా మర్వాల మధ్య కదంతొక్కడమైనా, రాళ్ళు రువ్వడమైనా, ఇవన్నీ దైవ నామస్మరణను నెలకొల్పడానికే.''

అంటే అసలు లక్ష్యం ఈ ఆచరణలు కాదు. ఇవన్నీ దైవాన్ని, దైవధ్యానాన్ని గుర్తుకు తెప్పించే ప్రదేశాలు. హజ్రత్ ఇబ్రాహీం (అ) కాలంలో ఇవన్నీ ఒక రకమైన ఆరాధనగా భావించ బడేదని దివ్యఖుర్‌ఆన్ సూచిస్తోంది. హజ్ కూడా ఒక విధంగా ఇబ్రాహీం (అ) జ్ఞాపకార్థం విధించబడింది. ఈ ఆచరణ (హజ్ చేయడం) స్తోమతగల ప్రతి ముస్లిం జీవిత కాలంలో ఒకసారి చేయడం తప్పనిసరి కార్యం.

## వాహనంపై ఉండి తవాఫ్ చేయడం

హజ్జతుల్ విదా (చివరి హజ్) లో ఆయన (సఅసం) వాహనం పై కూర్చుని ప్రదక్షిణ చేశారు. దీని ప్రకారం వాహనంపై కూర్చుని తవాఫ ప్రదక్షిణ చేయడం సున్నత్ కాబోలు అన్న డౌటు కలిగింది. కొందరు ధర్మ శాస్త్ర కోవిదులు ఇలా చేయడం తమ పద్ధతిగా చేసుకున్నారు. కాని వాస్తవానికి ఇది సరికాదు. దైవ ప్రవక్త (సఅసం) ఏదో ప్రత్యేక కారణం దృష్ట్యా ఇలా చేశారు. ప్రవక్త సహచరులలో ముగ్గురు సహాబీలు మూడు కారణాలు పేర్కొన్నారు కూడా (సహీముస్లిం). ఆయన (సఅసం) కు సుస్తీ చేసినందువల్ల వాహనంపై కూర్చుని తవాఫ్ చేశారని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) అంటున్నారు.

''ప్రజలు తనను (సఅసం) చూడగలిగేందుకు, వారు తన (సఅసం)ను ప్రశ్నించగలిగేందుకు ఇలా చేశారని, లేకుంటే అంత పెద్ద జన సమూహంలో ఆయన

https://teluguislam.net

(సల్లం) ప్రజలకు కనబడే వారు కాదు:'' అని హజ్రత్ జాబిర్ (రజి) చెప్పారు.

మరి హజ్రత్ ఆయిషా (రజి) ఏమంటున్నారో చూడండి ''కాబా ప్రాంగణం హజ్ యాత్రీకులతో కిటకిట లాడుతోంది. వారిలో ప్రతి ఒక్కరూ తాను దైవప్రవక్త (సల్లం) ను సమీపించడానికి ఎగబడేవారు. ఫలితంగా తొక్కిసలాట జరిగి ప్రమాదాలు సంభవించేట్టుంది. ఇలా జరగటం ఆయన (సల్లం) కు ఏ మాత్రం ఇష్టం లేదు. అలా అని ప్రజలను బలవంతంగా దూరం నెట్టివేయడం కూడా ఆయనకు ఇష్టంలేదు. అందుచేత ఆయన వాహనం (ఒంటె) ఎక్కారు.''

## హిజ్రత్ (ప్రస్థానం)

ఎవరైనా తాను ఉన్న ప్రదేశాన్ని విడిచిపెట్టి అక్కడ తాను ఎటువంటి సుఖశాంతులతో, హాయిగా వున్నప్పటికీ మక్కాకో, మదీనాకో వెళ్ళిపోయి స్థిరనివాసం ఏర్పరచుకోవడమే హిజ్రత్ (వలస పోవడం) అని ఈ రోజుల్లో కొంతమంది భావిస్తున్నారు. తాబయీనె ఇమామ్ (ప్రశిష్యుల నాయకుడు)గా ఎన్నదగ్గ అతాబిన్ అబీ రిబాహ్ ఒకసారి ఉమ్ముల్‌మోమినీన్ (హజ్రత్ ఆయిషా) సమక్షంలో హాజరై ''హిజ్రత్ వాస్తవికత ఏమిటి?'' అని ప్రశ్నించారు. ఆమె(రజి) సెలవిచ్చారు:

''ఇప్పుడు హిజ్రత్ లేనేలేదు. ముస్లింలు ఇస్లాం ధర్మాన్ని అనుసరిస్తున్న కారణంగా (పూర్వ మతాన్ని వదలిన కారణంగా) బాధించ బడతామేమోనన్న భయంతో దైవం, దైవప్రవక్తల వైపుకు పరుగులు తీస్తూ వస్తున్నప్పుడు హిజ్రత్ ఉండేది. ఇప్పుడు దైవం ఇస్లాంకు ఆధిక్యత ప్రసాదించాడు. ఇక ముస్లింలు ఎక్కడ వున్నా తమ దైవాన్ని పూజించుకోవచ్చు. అయితే జిహాద్ మరియు సంకల్పాల పుణ్యం మిగిలి ఉంది.''

## దైవప్రవక్త (సల్లం) కుటీరంలో ఖననం చేయబడటం

మహాప్రవక్త (సల్లం) పరమపదించాక ఆయన (సల్లం)ను ఎక్కడ ఖననం చేయాలన్న విషయమై సహాబీలలో భిన్నాభిప్రాయాలు కలిగాయి. హజ్రత్ అబూబకర్(రజి) ప్రవక్తలు చనిపోయిన చోటనే ఖననం చేయబడతారు. కాబట్టి ఆయన (సల్లం)ను ఆయన తనువు చాలించిన హజ్రత్ ఆయిషా(రజి) కుటీరంలోనే ఖననం చేయడం జరిగింది'' అని హజ్రత్ అబూబకర్ చెప్పి వుండవచ్చు. అయినా ఇది చారిత్రక విషయం కాబట్టి దీనికి ఆధారాలు అవసరం, ఇందుకు గల అసలు కారణాన్ని హజ్రత్ ఆయిషా(రజి) వివరించారు:-

> అవసాన దశలో ఆయన (సల్లం) 'యూదులు,
> క్రైస్తవులపై దేవుని శాపం పడుగాక! వారు తమ ప్రవక్తల

https://teluguislam.net

సమాధుల్ని ప్రార్థనా కేంద్రాలుగా చేసుకున్నారు' అని అన్నారు. (హజ్రత్ ఆయిషా(రజి) అంటున్నారు) ఈ సంశయమే గనక లేకుంటే ఆయన (సఅసం) సమాధి విశాల మైదానంలో ఉండేది. కాని అది ఎక్కడ సాష్టాంగ ప్రణామాలకు నిలయం అయిపోతుందోనన్న భయం ఉండేది. (అందువల్ల ఆయన (సఅసం) కుటీరంలో ఖననం చేయబడ్డారు) (ముస్నద్ అహ్మద్)

దైవప్రవక్త (సఅసం) పవిత్ర సమాధి నాలుగు గోడల మధ్య, కటకటాల మధ్య భద్ర పర్చబడటం ఇప్పటికీ ఎందుకు అవసరమో దీనివల్ల విదితమవుతుంది.

* * *

https://teluguislam.net

# బహుముఖ ప్రజ్ఞాశాలి

చరిత్ర, సాహిత్యం, వక్తృత్వం, కవిత్వాలలో హజ్రత్ ఆయిషా(రజి)కు మంచి ప్రావీణ్యం ఉందని ఆమె శిష్యులు తెలియచేశారు. ఇంకా వైద్యంలో కూడా ఆమెకు కొంత ప్రవేశం ఉండేది. హషామ్ బిన్ ఉర్వ ఉల్లేఖించారు:

> ''ఖుర్ ఆన్ పరిజ్ఞానం అనండి, ధర్మాధర్మాల అవగాహన (ఫిక్హ్) అనండి, కవిత్వం అనండి, అరేబియా చరిత్ర అనండి- వీటన్నిటి గురించి హజ్రత్ ఆయిషా (రజి) కన్నా బాగా ఎరిగిన వారిని నేను చూడలేదు.''

## వైద్యం:

''హజ్రత్ ఆయిషా (రజి) కన్నా గొప్ప వైద్య నిపుణురాల్నినేను చూడలేదు'' అని కూడా ఆయన అన్నారు. అరబ్ దేశంలో వైద్యకళ సక్రమరీతిలో లేదన్నది యథార్థమే. ఆ కాలంలో అరేబియాలో అందరికన్నా గొప్ప వైద్యుడు హారిస్ బిన్ కల్దహ్. దేశంలో మరికొందరు చిన్న చిన్న వైద్యులు, మసాజ్ నిపుణులు ఉండేవారు. అనాగరిక జాతులలో చలామణిలో ఉన్న నాటువైద్యమే వారి వైద్య విధానం. కొన్ని మూలికల గుణాలు వారికి తెలిసి ఉండవచ్చు. కొన్ని రోగాలను నయం చేసే మందులు తెలిసి వుండవచ్చు. ఒక వ్యక్తి వచ్చి ఇలా అడిగాడు, ''మీకు కవనంలో ప్రవేశం ఉందంటే నేను అంగీకరిస్తాను. మీరు అబూబకర్ కుమార్తె కాబట్టి కవిత్వం చెప్పగలరని అనుకోవచ్చు. కాని మీకు వైద్యంలో ప్రవేశం ఎలా వచ్చింది?'' దానికి ఆమె ''దైవప్రవక్త (సఅసం) చివరి రోజుల్లో తరచూ రోగ గ్రస్తులయ్యేవారు. అరబ్బు వైద్యులు వచ్చేవారు. ఎప్పుడు ఏ మందు ఇచ్చేవారో నేను గుర్తుంచుకొనేదాన్ని'' అని సమాధానమిచ్చారు.

పూర్వం అమ్మమ్మలు, బామ్మలు పిల్లలకు వైద్యం చేసేవారు. కొన్ని రోగాలను నయం చేసే చిట్కాలు వారికి గుర్తుండేవి. హజ్రత్ ఆయిషా(రజి) కూడ ఆ కోవకే చెందినవారుగా మనం భావించవచ్చు. ముస్లిం స్త్రీలు సర్వసాధారణంగా యుద్ధాలలో దైవప్రవక్త (సఅసం) వెంట వెళ్ళేవారు. క్షతగాత్రులకు కట్లు కట్టేవారు (అబూదావూద్). హజ్రత్ ఆయిషా(రజి) కూడా ఉహద్ యుద్ధంలో సేవలు

https://teluguislam.net

చేశారు. ఆ శుభప్రదమైన యుగంలో ముస్లిం మహిళలకు అవసరానికి అనుగుణంగా ఈ కళలో పరిజ్ఞానం ఉండేదని దీన్నిబట్టి తెలుస్తోంది.

## చరిత్ర :

అరేబియా పరిస్థితులు, అజ్ఞానకాలపు ఆచార దురాచారాలు, తెగల పరస్పర వైమనస్యాల గురించి హజ్రత్ అబూబకర్(రజి) క్షుణ్ణంగా తెలిసినవారు. హజ్రత్ ఆయిషా(రజి) ఆయన కుమార్తె కాబట్టి ఈ కళ ఆమెకు వారసత్వంగా లభ్యింది. అరబ్బుల మూఢాచారాలు, సాంఘిక పరిస్థితుల గురించి కొంత విలువైన సమాచారం హదీసు గ్రంథాలలో హజ్రత్ ఆయిషా(రజి) చేతనే ఉల్లేఖించబడింది. ఉదాహరణకు: అరబ్బులలో పెళ్ళి ఎన్ని రకాలుగా అమల్లో ఉండేదో, విడాకుల పరిస్థితి ఎలా ఉండేదో (తిర్మిజీ), పెళ్ళిళ్ళలో ఏ గీతాలు పాడేవారో (తిబ్రానీ), ఖురైషులు హజ్‌లో ఎక్కడ మజిలీ చేసేవారో(బుఖారీ), శవాన్ని చూస్తే ఏమి చెప్పబడేదో (బుఖారీ) వగైరా విషయాలు హజ్రత్ ఆయిషా(రజి) ఉల్లేఖనాల ద్వారానే మన ముందుకు వచ్చాయి మరి.

హదీసు వేత్తల సభలో అన్సారుల బఆస్ యుద్ధ ప్రస్తావన మనం హజ్రత్ ఆయిషా(రజి) నోటనే విన్నాము(సహీహ్ బుఖారీ). అన్సారులు ఇస్లాం స్వీకారానికి పూర్వం విగ్రహాలను పూజించేవారని ఆమె ద్వారానే మనకు తెలిసింది (సహీహ్ బుఖారి). ఇస్లాంకు సంబంధించిన కొన్ని చారిత్రక సంఘటనలు - అంటే - వహీ ఆరంభం, ప్రవక్త పదవి ఆరంభకాలం నాటి స్థితిగతులు, హిజ్రత్‌కు సంబంధించిన ముఖ్య ఘటనలు విపులంగా ఆమె ద్వారానే (సహీహ్ బుఖారీ) ప్రాచుర్యంలోకి వచ్చాయి. స్వయంగా తన 'ఇఫ్క్' సంఘటన గురించిన యథాతథ పరిస్థితి(సహీహ్ బుఖారీ) ఆమె చేతనే ప్రజలు విన్నారు. ఈ సంఘటనలు సహీహ్ గ్రంథాల్లో చాలా క్లుప్తంగా - రెండు మూడు పంక్తులకు మించకుండా - ఉంటాయి. కాని హజ్రత్ ఆయిషా(రజి)గారి ఉల్లేఖనాలలో ఈ సంఘటనలు రెండేసి, మూడేసి పుటలలో పూసగుచ్చినట్లుగా పేర్కొనబడతాయి. ఖుర్‌ఆన్ ఎందుకు అవతరించింది? ఏవిధంగా అవతరించింది? నమాజ్ ఏయే రూపాలుగా ఇస్లాంలో ఆరంభమయింది? లాంటి ప్రశ్నలకు జవాబు ఆమెయే తెలిపారు. దైవప్రవక్త (సఅసం) మరణశయ్యను గురించిన సంపూర్ణ సమాచారం కేవలం ఆమె ద్వారా మాత్రమే ప్రపంచానికి తెలిసింది. ఆయన (సఅసం) కఫన్‌లో ఎన్ని వస్త్రాలుండేవో, ఎటువంటి వస్త్రాలుండేవో కూడా ఆమెయే తెలిపారు.

సరే, ఇవన్నీ గృహ సంబంధ విషయాలనుకుందాం, కాని మైదానంలోని పరిస్థితుల్ని కూడా ఆమె మనకు విశదీకరిస్తూ కనిపిస్తారు. బద్ర్ యుద్ధంలోని

https://teluguislam.net

కొన్ని సంఘటనలు, (ముస్నద్ అహ్మద్) ఉహద్ పోరాటంలోని సన్నివేశాలు, కందక యుద్ధం నాటి స్థితిగతులు బనీ ఖురైజ యుద్ధపు స్వల్ప సంఘటనలు, (సహీహ్ బుఖారీ) మక్కా విజయాలు, స్త్రీల ప్రమాణం(బైత్), హజ్జతుల్ విదా ఘటనల ముఖ్యభాగాలు (సహీహ్ బుఖారీ) ఆమె ద్వారానే మనకు మరింత విపులంగా తెలిశాయి. ఇంకా దైవప్రవక్త (సఅసం) పవిత్ర గుణగణాలను గురించిన వాస్తవ వివరాలు వివరంగా అందించినవారు హజ్రత్ ఆయిషాయే కదా! ఉదా: బదూహి గాథ, హిజ్రత్ సంఘటనతోపాటు ఆయన (సఅసం)గారి రాత్రుళ్ళు చేసే ఆరాధన, ఆయన (సఅసం) వ్యక్తిగత వ్యాపకాలు (ముస్నద్ అహ్మద్), ఆయన వ్యక్తిగత నడవడిని గురించిన వాస్తవ రూపాన్ని సజీవ చిత్రంగా మలచి మన ముందు ఉంచారామె. దైవప్రవక్త (సఅసం) అనుభవించిన అతి గడ్డురోజు ఏదో ఆమె మనకు తెలిపారు. (సహీహ్ బుఖారీ)

## సాహిత్యం :

సంభాషణల్లో సొగసు, రచనల్లో రమణీయతల రంగరింపే సాహిత్యం. కాగా; హజ్రత్ ఆయిషా(రజి) ఎంతో మధురభాషిణి, భాషా పటిమగల వారన్న విషయాన్ని అనేక ఉల్లేఖనాలు రూఢీ పరుస్తున్నాయి. ఆమె శిష్యుడు మూసా బిన్ తల్హా ఏమంటున్నారో చూడండి:

> ''హజ్రత్ ఆయిషా(రజి) కన్నా భాషా పటిమ కలవారిని
> నేను చూడలేదు.''

అహ్నాఫ్ బిన్ ఖైస్ తాబయీ బస్రీ ఇలా వ్రాస్తున్నారు:

> ''మధుర భాషణలో, గంభీరతలో హజ్రత్ ఆయిషా(రజి)
> నోటి మాటకన్నా ఉత్తమమైనదీ మేలయినదీ అయిన
> మాట మరే ప్రాణి నోటి నుండీ నేను వినలేదు.''

## వక్తృత్వం :

వక్తృత్వం లేక వాక్పటిమ, విశృంఖల మనస్కులయిన అరబ్బులకు సహజంగా అబ్బిన విద్య. పురుషులతో పాటు స్త్రీలకు కూడా ఈ విద్య అబ్బింది. ఇస్లామీయ యుగారంభంలో ముస్లింలలో అరబ్బుల స్ఫూర్తి, ఉత్సాహం ఇంకా మిగిలి ఉన్నప్పుడు వారిలో గొప్ప గొప్ప మహిళా వక్తలు, ప్రసంగికులు ఉండేవారు. అహ్మద్ బిన్ అబీ తాహిర్ అల్‌మతూనీ హిజ్రీ 204లో ''బలాగతున్నిసా'' అనే పేరుతో ఓ పుస్తకం వ్రాశారు. అందులో ఆ కాలపు ముస్లిం మహిళల ఉపన్యాసాలు గ్రంథస్తం చేయబడ్డాయి. తిబ్రీ గ్రంథంలో ఆమె జమల్ యుద్ధ మైదానంలో చేసిన

https://teluguislam.net

ఉపన్యాసాలూ పొందుపరచబడి వున్నాయి. ఇబ్నె అబ్దెరబ అఖ్దల్‌ఫరీద్ (గ్రంథం)లో ఆమె ఉపన్యాసం ఒకదాన్ని పొందుపర్చారు.

అహనఫ్ బిన్ ఖైస్‌తాబయీ బస్రీ బహుశా బస్రాలో హజ్రత్ ఆయిషా(రజి), ఉపన్యాసాలు విన్నారు కాబోలు. "నేను హజ్రత్ అబూబకర్(రజి), హజ్రత్ ఉమర్ (రజి), హజ్రత్ ఉస్మాన్(రజి), హజ్రత్ అలీ(రజి) ఇంకా అప్పటి వరకూ ఉన్న ఖలీఫా లందరి ఉపన్యాసాలూ విన్నాను. కాని హజ్రత్ ఆయిషా(రజి) నోటి నుండి వెలువడే మాటల్లో వున్నటువంటి చక్కదనం, ఔన్నత్యం ఎవరి వాక్కులోనూ ఉండేవి కావు. (హాకిం, ఇమాం అహ్మద్) అహ్నాఫ్ మాటల్లో కొంత అతిశయోక్తి ఉంటే ఉండవచ్చు. అందునా ఒక స్త్రీ ప్రసంగం? అదీ యుద్ధమైదానంలో!! తప్పకుండా ప్రభావ భరితంగా వుండి వుంటుంది. ఏది ఏమైనా ఆమె గొప్ప వాక్చాతుర్యంగల వక్త అనడంలో సందేహం లేదు. ఆయిషా(రజి) కన్నా గొప్ప సమయస్ఫూర్తి, వాక్చాతుర్యం, చురుకయిన మేధాశక్తిగల ఉపన్యాసకురాలిని తాను చూడలేదని హజ్రత్ ముఆవియ(రజి) అంటారు.

ఒక వక్తలో ఉండవలసిన సంభాషణా చాతుర్యం భాషాపటిమతోపాటు ఉచ్ఛస్థాయి కంఠస్వరం భావావేశం, ఉచ్చారణాశైలిలో ఔన్నత్యం, వైభవం-ఇత్యాదివన్నీ హజ్రత్ ఆయిషా(రజి)లో ఉన్నాయి అని మూసా బిన్ తల్హా అభిప్రాయపడతారు. తిబ్రీలో ఇలా పేర్కొనబడింది.

> "----మరి హజ్రత్ ఆయిషా(రజి) ప్రసంగించారు. అది హెచ్చు స్వరంతో చేయబడిన ప్రసంగం. ఆమె కంఠస్వరం ప్రేక్షకులందరినీ శాసించినట్లే ఉండేది. ఎంతయినా ఆమె కంఠస్వరం వీరవనిత స్వరం లాంటిది."

జమల్ యుద్ధ ప్రస్తావన సందర్భంగా ఆమెగారి ఉపన్యాసాలను మీరు వెనుకటి పుటల్లో చదివారు. తర్జుమాలో గొప్పతనం వ్యక్తం కాకపోయినా ఆమెగారి ఉపన్యాసంలోని భావావేశాన్ని, పాండితీ ప్రకర్షను గ్రహించటం కష్టమేమీకాదు.

## కవిత్వం :

ఇస్లాంకు పూర్వం కవిత్వమే అరబ్బుల విజ్ఞాన సర్వస్వం. ఒక అరబ్బు కవి తన భాషా పటిమను గుప్పిస్తే ఒక్కోసారి బడబాగ్ని వ్యాపించినట్లు, మరొకసారి అమృతవర్షం చిలికించినట్లే ఉండేది. ఈ కళ పురుషుల వరకే పరిమితం కాలేదు, స్త్రీలకూ అందులో ప్రవేశం ఉండేది. ఇస్లాంకు పూర్వం ఇస్లాంకు తర్వాత వంద సంవత్సరాల వరకు ముస్లింలలో అరబ్బుల ప్రత్యేకతత్వం మిగిలి ఉన్నంత కాలం

https://teluguislam.net

వందలాది స్త్రీలు కవిత్వంలో ఎంతటి ప్రావీణ్యత సాధించారంటే ఇప్పటికీ వారి కవనం అరబ్బు కవిత్వానికే మకుటంగా వెలుగొందింది.

హజ్రత్ ఆయిషా(రజి) ఆ కాలంలోనే జన్మించారు. ఆమె పితామహులయిన హజ్రత్ అబూబకర్(రజి) అరబ్బు కవిత్వంలో ఉద్దండులు (ముస్నద్). అందుచేత తండ్రిగారి ఒడి నుండే ఆమె ఈ కళను అభ్యసించారు. ''ఆమెగారి కవితాధోరణి మాకు ఆశ్చర్యం కలిగించలేదు. ఎందుకంటే ఆమె అబూబకర్(రజి) కుమార్తె కదా!'' అని ఆమె శిష్యులు చెబుతుండేవారు.

హజ్రత్ ఆయిషా(రజి)లో ఉన్న కవితాభినివేశంను గమనించి కవులు తమ కవితలను ఆమెకు విన్పించేవారు. హజ్రత్ హస్సాన్ బిన్ సాబిత్ అన్సారులలో (కవిత్వంలో) అగ్రగణ్యుడయిన గురువు. 'ఇఫ్క్' సంఘటనలో పాలుపంచుకున్న కారణంగా హజ్రత్ ఆయిషా(రజి)కు ఆయనపై ఏవగింపు ఉండి ఉండాల్సింది. అయినా ఆయన ఆమె సమక్షంలో హాజరయి తన కవితల్ని విన్పించేవారు (సహీహ్ బుఖారీ). హజ్రత్ ఆయిషా ఆయన్ని శ్లాఘించేవారు, ఆయనలోని (సాహితీ) సుగుణాల్ని మెచ్చుకునేవారు (సహీహ్‌బుఖారీ). ఆయనతోపాటు ప్రవక్త దర్బారులోని ఇతర కవులయిన హజ్రత్ కాబ్ బిన్ మాలిక్(రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహ్(రజి)ల పేర్లను కూడా ఈ సందర్భంలో ప్రస్తావించేవారు.

## విద్య:

విద్యను ఇతరులకు పంచిపెట్టడం కూడ విద్యా సేవయే. విద్య ద్వారా ఆత్మశుద్ధితోపాటు, సమాజ సంస్కరణ కూడ చేపట్టాలి. తన బోధనను విన్నవారు, విననివారికి విన్పించాలని దైవప్రవక్త (సఅసం) ఆదేశించారు. మరి హజ్రత్ ఆయిషా(రజి) ఈ విధిని నిర్వర్తించారా?

విద్యాగంధాన్ని వ్యాపింపజేయడం, విద్యను ఆర్జించటం పురుషులకే ప్రత్యేకం అని భావించేవారు, ప్రవక్త ప్రాంగణపు ఈ సౌభాగ్య దీపశిఖ ఈ భాగంలోనూ ఎలా వెలిగి పోతుందో వీక్షించాలి.

దైవప్రవక్త (సఅసం) తదనంతరం సహబీలు ముస్లిం రాజ్యాలన్నింటిలో విద్యావ్యాప్తికై, ఇస్లామీయ సందేశ ప్రచారానికై తరలి వెళ్ళారు. మక్కా, తాయఫ్, బహ్రైన్, యెమన్, డెమాస్కస్, ఈజిప్టు, కూఫా, బస్రా తదితర పెద్ద పెద్ద ముఖ్య పట్టణాలలో ఆ ప్రముఖ ఆచార్యుల చిన్నచిన్న బృందాలు స్థిర నివాసం ఏర్పరచుకున్నాయి. 27 సంవత్సరాల తర్వాత పరిపాలనా కేంద్రం మదీనా మునవ్వరా నుండి కూఫాకు ఆ తర్వాత డెమాస్కస్‌కు బదిలీ అయింది. అయినా మదీనా

మునవ్వరా ఆధ్యాత్మిక ఔన్నత్యం, విద్యా కేంద్ర ప్రతిపత్తి, ఆ విప్లవాల వల్ల కూడా చెక్కు చెదరలేదు. పవిత్ర మదీనాలో అప్పటికి హ(జత్ ఇబ్నె ఉమర్ (రజి), హ(జత్ అబూహురైరా (రజి), హ(జత్ ఇబ్నె అబ్బాస్(రజి), ఇంకా జైద్‌బిన్ సాబిత్(రజి) తదితరుల శాశ్వత పాఠశాలలు నెలకొల్పబడి వున్నాయి. అయితే దైవ ప్రవక్త కుటీరానికి సమీపాన ప్రవక్త సతీమణి నివాస మేర్పరచుకున్న గృహమే ప్రధాన ధార్మిక విద్యాలయం అన్నది నిర్వివాదాంశం.

పిల్లలు, స్త్రీలు హ(జత్ ఆయిషా(రజి) తో పర్దా పాటించనవసరంలేని కొందరు పురుషులు కుటీరంలోనికి వచ్చి అందరితోపాటు కూర్చునేవారు. కొందరు కుటీరానికెదురుగా మస్జిదె నబవీలో కూర్చొనేవారు. ద్వారానికి పరదా కట్టబడేది. పరదా చాటున ఆమె కూర్చునేవారు(మస్నద్). ప్రజలు ధర్మ సందేహాలు అడిగితే ఆమె సమాధానాలిచ్చేవారు. ఎప్పుడన్నా ఏదన్నా చర్చ కొనసాగితే గురుశిష్యులు ఆ ప్రత్యేక అంశంపై సంభాషణ కొనసాగించేవారు (మస్నద్). ఒక్కోసారి ఆమె ఏదన్నా విషయాన్ని ప్రస్తావించి వివరించేవారు. ప్రజలు నిశ్శబ్దంగా వినేవారు. తన శిష్యుల భాష, ఉచ్చారణా విధానం, ఉచ్చారణా యుక్తత కూడా గట్టిగా పర్యవేక్షించేవారు. అప్పుడప్పుడూ ఆమె బోధనలు వినేందుకు వచ్చే పలు కుటుంబీకుల బాల బాలికలను, ఊళ్ళోని అనాధ పిల్లలను తన శిక్షణలో తీర్చి దిద్దేవారు. వారికి విద్యా బుద్ధులు గరపేవారు. కొంతమంది పిల్లలు ప్రాజ్ఞవయస్కులై ఉండేవారు. షరీఅత్ ప్రకారం వాళ్ళు తన ఎదుట రాకూడదు. అందుచేత వారికి తన రక్త సంబంధీకులచేత పాలు త్రాగించి, ఆ పాల సంబంధం దృష్ట్యా వారికి తాను పిన్నిగానో, అమ్మమ్మగానో వ్యవహరించి వారికి లోనికి వచ్చే అనుమతి నిచ్చిన సందర్భాలు కూడా వున్నాయి (పాలు త్రాగిన చుట్టరికం వుంటే పరదా పాటించనక్కరలేదు). లోనికి వచ్చే అనుమతి లేని (మహ్రం కాని) వారు తమకు చక్కని విధంగా విద్యా బుద్ధులు గడించే అవకాశం దొరకనందుకు విచారించేవారు. లోనికి వెళ్ళే అనుమతి వున్న కారణంగా ఉర్వహ్ తనకంటే చదువులో మించి పోయాడని ఖైస్ చెప్పేవారు. ఇరాఖ్‌లోని సర్వజనామోద ఇమామ్ (ఏకగ్రీవ నాయకుడు) అయిన ఇమామ్ నఖయీగారు బాల్యంలో హ(జత్ ఆయిషా (రజి) సమక్షంలో హాజరయ్యేవారు. ఆయన సమకాలీకులు ఈ విషయంలో కించిత్ ఈర్ష్యకు గురయ్యేవారు.

ఏటేటా ఆమె హజ్‌కు వెళ్ళడం ఆనవాయితీ. ఇస్లాం యొక్క విశాల పరిధి ఏడాది కొకసారి ఒకే కేంద్ర బిందువు వద్ద కేంద్రీకరించబడేది. హిరా--సబీర్ పర్వతాలమధ్య హ(జత్ ఆయిషా(రజి) గుడారం వేయబడేది. విద్యాదాహార్తులు తండోపతండాలుగా దూరదూర దేశాల నుండి వచ్చి ధార్మిక బోధనామృతాన్ని తనివితీరా ఆస్వాదించేవారు. తమ సమస్యల్ని వినిపించేవారు. తమ సందేహాల నివృత్తి

https://teluguislam.net

చేసుకోగోరేవారు. కొందరు సందేహాలు వెల్లడించడానికి తటపటాయిస్తే [illegible] బాసటగా నిల్చేవారు. ఒకవ్యక్తి ఒక విషయం అడిగేందుకు సిగ్గుపడుతూంటే, ''నీవు నీ తల్లితో అడగతగ్గవి నా తోనూ అడగ్గలవు'' అన్నారు. హజ్రత్ ఆయిషా(రజి). ఇటువంటి సందర్భమే హజ్రత్ అబూ మూసా అష్ అరీకి ఎదురవ్వగా ఆయనకు కూడా ఇలాగే జవాబిచ్చారు (మూతా, ఇమామ్ మాలిక్). నిజానికి ఆమె తన శిష్యులకు కన్నతల్లి లాగానే విద్య నేర్పేవారు. ఉర్వహ్, ఖాసిమ్, అబూసల్మా, మస్రూఖ్, ఉమ్రహ్(రజి) సఫియాలపై అదే విధమైన మాతృత్వపు మమత కురిపించి విద్యా శిక్షణలు గరిపారు. అంతేకాదు, అలాంటి పిల్లలను దత్తత చేసుకొనేవారు. వారి ఖర్చులకు తానే బాధ్యత వహించేవారు. తన శిష్యులతో వ్యవహరించే తీరు చూసి ఆమె ఆప్తులకు కించిత్ ఈర్ష్య కలిగేది. తన అక్క కొడుకైన హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ అంటే ఆమెకు అమితమైన వాత్సల్యం. అతడు తన పిన్నిగారి శిష్యుడు అస్వద్‌తో ''ఉమ్ముల్ మోమినీన్ నీకు చెప్పే రహస్య విషయాలు నాకు చెప్పు'' అనే వారట. (మస్నద్, అబూదావూద్)

హదీసు విద్యా పారంగతులలోని అగ్రగణ్యులనేకులు హజ్రత్ ఆయిషా(రజి) శిక్షణలోనే పెరిగి పెద్దవారయ్యారు. హదీసు వేత్తల వర్గంలో వీరంతా హజ్రత్ ఆయిషా(రజి)గారి విజ్ఞాన భాండాగారపు బీగాల సంరక్షకులూగా భావించ బడేవారు వీరే

వారిలో కొందరు;

## ఉర్వహ్ :

హజ్రత్ జుబైర్(రజి) కుమారుడు, హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ మనుమడు, అస్మా(రజి) బిన్తె అబీ బకర్(రజి) పుత్రుడు అగు ఉర్వహ్ అంటే హజ్రత్ ఆయిషా(రజి)కు ఎనలేని అనురాగం. ఆయన ఆమె ఒడిలోనే పెరిగి పెద్దవారయ్యారు. మదీనాలో పేరు గాంచినవారు. ఇమామ్ జహ్రీ తదితరులు ఈయన శిష్యులు. సీరత్ విద్యలో ఘనాపాటిగా పరిగణింపబడేవారు. హజ్రత్ ఆయిషా(రజి) ఉల్లేఖనాలను విశదీకరించటంలో, ధార్మిక తీర్పులు ఇవ్వటంలో వీరిని మించినవారు లేరు.

## ఖాసిమ్ బిన్ ముహమ్మద్:

ఈయన ముహమ్మద్ బిన్ అబూబకర్ కుమారులు. హజ్రత్ అబూబకర్(రజి) మనుమలు. హజ్రత్ ఆయిషా(రజి) మేనల్లుడు. ఈయన కూడా తన మేనత్త శిక్షణలోనే పెరిగారు. బాల్యం నుండే ధార్మిక విద్య గడించారు. పెద్దవాడయ్యాక మదీనాలో ఫికహ్ ఇమామ్ అయ్యారు. మదీనాలో ధర్మవేత్తల సభకు చెందిన

https://teluguislam.net

సభ్యులలో ఒకరు. హదీసుల ఉల్లేఖనంలో కడు జాగ్రత్త వహించేవారు. ఒక్కొక్క అక్షరం పట్ల జాగ్రత్త తీసుకునేవారు. ఈయన హిజ్రీ 108లో పరమపదించారు.

## అబూసల్మా:

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) కుమారులు. బాల్యం లోనే అనాథ అయ్యారు. హజ్రత్ ఆయిషా(రజి) ఆయనను సాకారు. ఈయన ఉర్వాహ్‌కు సరిజోడీగా భావింప బడేవారు. మదీనాలోని విద్యా పీఠానికి ఈయన కూడా ఒక అధికారి. పెద్ద పెద్ద హదీసు వేత్తలు ఈయన ఉల్లేఖనాలను చేశారు. హిజ్రీ 94లో కాలధర్మం చెందారు.

ఇక స్త్రీలలో మొట్టమొదట ఉమ్రహ్ బిన్తె అబ్దుర్రహ్మాన్ (రజి)ను పేర్కొనాలి. ఈ ప్రఖ్యాత సహాబియా (శిష్యురాలు) అసద్ ఇబ్నె జరారా(రజి) అన్సారీ గారి మనుమరాలు. స్త్రీలలో హజ్రత్ ఆయిషా(రజి) శిష్యురాండ్రలో ఉత్తమ ఆదర్శవతి. హదీసువేత్తలు ఈమె పేరును ఘనతతో ఉదాహరిస్తారు. ఉమ్మొల్ మోమినీన్ ఈమెను అమితంగా ప్రేమించేవారు. ఈ కారణంగా సామాన్య జనులు కూడా ఆమెను గౌరవించేవారు (అదబుల్ ముఫ్రద్, బుఖారీ). ఇమామ్ బుఖారీ ఉల్లేఖనం ప్రకారం ఆమె హజ్రత్ ఆయిషా(రజి)గారి ముఖ్య లేఖరి. ప్రజలు ఆమె ద్వారానే బహుమతులు, లేఖలూ హజ్రత్ ఆయిషా(రజి)కు సమర్పించేవారు. ఇమామ్ జహరీ హదీసుల సేకరణ ఆరంభించినపుడు ఒక హదీసువేత్త, ''విద్యా నిధిని నీకు చూపించ మంటావా. అయితే ఉమ్రహ్ దగ్గరకెళ్ళు. ఆమె హజ్రత్ ఆయిషా(రజి) ఒడిలో పెరిగారు'' అని అన్నారు. ''నేను ఆమె దగ్గరకెళ్ళిన తర్వాత ఆమె (విద్యా విషయకంగా) ఒక లోతైన సముద్రం అని గ్రహించాను'' అని జహ్‌రీ అంగీకరించారు.

## సఫియ బిన్తె షీబ :

ప్రసిద్ధ తాబియా (ప్రశిష్యురాలు). షీబ గారు కాబా గృహ పరిచారకులు. ఆయన కుమార్తెయే సఫియా. హదీసు గ్రంథాలన్నింటిలోనూ ఆమెగారి ఉల్లేఖనాలున్నాయి. షీబ కూతురయిన సఫియ, హజ్రత్ ఆయిషా(రజి) గారి ప్రత్యేక శిష్యురాలు. లేక హజ్రత్ ఆయిషా గారి స్నేహితురాలుగా హదీసులలో ఆమెను అభివర్ణించడం జరిగింది (ముస్నద్). ప్రజలు ఆమెను ధార్మిక సందేహాలు, హజ్రత్ ఆయిషా(రజి)గారి హదీసులను అడిగి తెలుసుకునేందుకు వచ్చేవారు.

(అబూదావూద్)

https://teluguislam.net

## ఆయిషా బింతె త్వల్హ :

హజ్రత్ త్వల్హ(రజి) కుమార్తె. అబూబకర్ సిద్దీఖ్(రజి)గారి మనుమరాలు. హజ్రత్ ఆయిషా(రజి)గారి సోదరి కుమార్తె. పిన్నిగారి పెంపకంలో పెరిగారు. ఈమె గురించి అబూజకర్ ఇలా చెప్పారు:

> ''ప్రజలు ఆమెగారి విధేయంతాగుణం, మరియు పాండిత్యాలను చూసి ఆమె నుండి హదీసులను సంగ్రహించేవారు.''

## ముఆజ్ బిన్తె అబ్దుల్లా అద్వియ :

స్వస్థలం బస్రా. హజ్రత్ ఆయిషా(రజి) వద్ద శిష్యరికం చేశారు. ఉమ్ముల్ మోమినీన్‌గారి ఎన్నో హదీసులను ఈమెగారు ఉటంకించారు, గొప్ప దైవ భక్తిపరురాలు. భర్త మరణానంతరం ఏనాడూ ప్రశాంతంగా నిద్రించ లేదు. ఒకసారి జబ్బు పడ్డారు. వైద్యుడు బనీజ్ అనే మందును వాడమన్నారు. ఆమె కోసం మందు తయారు చేయబడింది. ఆ మందున్నగిన్నె చేతిలో పెట్టుకొని ప్రార్థించారు : ''దేవా! నీవు ఎరుగుదువు - దైవప్రవక్త(సఅసం) బనీజ్‌ను వారించారని హజ్రత్ ఆయిషా(రజి)నాతో చెప్పారు'' అప్పటికప్పుడే గిన్నె చేతి నుండి జారిపోయింది. ఆమెకు స్వస్థత చేకూరింది.

https://teluguislam.net

# ధర్మాసనం (ఇఫ్తా)

వెనుకటి అధ్యాయంలో హజ్రత్ ఆయిషా(రజి)గారి బహుముఖ ప్రజ్ఞా పాటవాలను గురించి పేర్కొనటం జరిగింది. వాటిని బట్టి దైవప్రవక్త (సఅసం) తదనంతరం హజ్రత్ ఆయిషా (రజి) శేష జీవితాన్ని ఏ విధంగా ప్రజోపయోగకరం గానూ, విశ్వాస పూరిత లక్ష్యంతో గడిపారో గ్రహించవచ్చు. అదీగాక, అదృష్టవశాత్తూ అందుకు సంబంధించిన వ్రాతపూర్వకమైన అసంఖ్యాకమైన, స్పష్టమైన సాక్ష్యాధారాలు మనకు లభిస్తాయి. ఖలీఫాలు, సహాబా(రజి), సాధారణ ముస్లిములు ఆపత్సమయాలలో విపత్కర పరిస్థితులలో ఈ ఆస్థానం వైపుకే మరలేవారు. హదీసు వేత్తలు ఫత్వాల సంఖ్యలో హెచ్చు తగ్గుల్ని బట్టి విద్వాంసులైన సహాబీలను మూడు వర్గాలుగా విభజించారు. మొదటి వర్గం వారి ఫత్వా(తీర్పు)లను శాశ్వతంగా విడివిడిగా సంకలనం చేస్తే ఎన్నో ఉద్గ్రంథాలు తయారవుతాయి. రెండోవర్గం వారి ఒక్కొక్క ఫత్వా ఒక్కో సంచిక పరిమాణంలో వున్నాయి. మూడో వర్గం వారి ఫత్వాలన్నీ కలిపి ఒక సంచిక పరిమాణంలో వున్నాయి. మొదటి వర్గంలో హజ్రత్ ఉమర్.(రజి), హజ్రత్ అలీ(రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ ఊద్(రజి), హజ్రత్ జైద్ బిన్ సాబిత్(రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఇంకా చివరగా ప్రవక్తగారి ధర్మపత్ని, అబూబకర్ సిద్దీఖ్‌గారి గారాలపట్టీ ఉమ్మల్ మోమినీన్ (హజ్రత్ ఆయిషా)గారి ఫత్వాలు (తీర్పులు) హదీసులలో ఎంత పెద్ద సంఖ్యలో పేర్కొనబడ్డాయంటే వాటిని ఒకచోట చేరిస్తే ఒక శాశ్వత భాండాగారమే తయారయిపోతుంది.

## ఇస్లాం ఖలీఫాలు

దైవప్రవక్త (సఅసం) తదనంతరం - ఆమె తన తండ్రిగారు ఖలీఫాగా ఉన్న రోజులలో - ప్రజాభిమానాన్ని చూరగొని 'ఫత్వా పీఠాన్ని' పొందారు. చివరి కాలం వరకూ, మిగతా ముగ్గురు ఖలీఫాల కాలంలోనూ ఆమె ఎల్లప్పుడూ ఈ హోదాలోనే ప్రసిద్ధి చెందారు. సహాబా(శిష్యుల) తర్వాత మదీనాకు చెందిన ఏడుగురు సుప్రసిద్ధ తాబయీ (ప్రశిష్యుల)లలో ఒకరుగా గణుతి కెక్కిన హజ్రత్ ఖాసిమ్ ఇలా వివరిస్తున్నారు:

''హజ్రత్ ఆయిషా(రజి)గారు, హజ్రత్ అబూబకర్ (రజి)గారు ఖలీఫాగా ఉన్న కాలంలోనే శాశ్వత ప్రాతిపదికపై ఫత్వా పీఠాధిపతి హోదా పొందారు. హజ్రత్ ఉమర్(రజి), హజ్రత్ ఉస్మాన్(రజి) ఇంకా వారి తర్వాత జీవితాంతం ఆమె ఫత్వా(ధార్మిక తీర్పు)లను జారీచేశారు.''

హజ్రత్ ఉమర్ ఖలీఫాగా ఉన్నకాలంలో కొంతమంది ప్రత్యేక సహాబాకు తప్ప- అందరికీ- ఫత్వాలు ఇచ్చే అనుమతి లేదు. అయినా ఖలీఫాకు హజ్రత్ ఆయిషా(రజి) ఫత్వాలపై అపారమైన నమ్మకం ఉండేది. ఆమె తీర్పులను ఆయన గౌరవించేవారు.

అమీరు ముఆవియా డెమాస్కస్‌లో ఉండి పరిపాలించేవారు. కాని అవసరం వస్తే ఆయన దూత (సిరియా) నుండి వచ్చి వినయంగా హజ్రత్ ఆయిషా(రజి) ఎదుట నిలబడి తమ అమీరుగారి సందేహాలకు సమాధానాలు పొందేవాడు.

(జామె తిర్మిజీ)

## నాయకులయిన సహాబా

మదీనా నగరం ఘనులైన సహాబా కేంద్రస్థానం. ధర్మపాలకులైన ఖలీఫాల హయాం వరకు హజ్రత్ ఉమర్(రజి), హజ్రత్ అలీ(రజి), హజ్రత్ అబ్దుల్లా ఇబ్నె మస్‌ఊద్(రజి), హజ్రత్ అబూ మూసా అష అరీ(రజి), హజ్రత్ మాజ్ బిన్ జబల్(రజి), హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి), హజ్రత్ అబీ బిన్ కాబ్(రజి), హజ్రత్ అబూజర్(రజి), హజ్రత్ అబూ దర్దా(రజి), హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి)లు ఇస్లాం దర్బారుకు ఆస్థాన తీర్పరులుగా, ధర్మశాస్త్ర కోవిదులుగా చెలామణీ అయ్యేవారు. వారిలో చాలా మంది హజ్రత్ ఉస్మాన్(రజి) హయాంలో పరమపదించారు. వారి తర్వాత యువకులైన సహాబీల మరో యుగం ఆరంభమయింది. దానికి సారథులు హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజి), హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్(రజి), అబూసయీద్ ఖుద్రీ(రజి), జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి), అబ్దుల్లా బిన్ జుబైర్(రజి), అబూ హురైరా(రజి)లు.

హజ్రత్ ఆయిషా(రజి) పిన్న వయస్కురాలయినప్పటికీ ఇంతకు ముందు పేర్కొనబడినట్లుగా ఆరంభంలోనే ఆమె నాయకులయిన సహాబా కాలంలోనే ఫత్వా పీఠాధిపతి హోదా పొందారు. పెద్ద పెద్ద సహాబీలు కొన్ని సందర్భాలలో ఆమెను సంప్రదించేవారు.

పెద్ద పెద్ద సహాబీలు వచ్చి ఆమె వద్ద సందేహాలు తీర్చుకునేవారు అని ఇబ్నెసాద్ (గ్రంథం)లో ఉంది.

https://teluguislam.net

''పండితులయిన సహాబీలు ఆమె వద్దకు వచ్చి సందేహాలు తీర్చుకోవడాన్ని - మేము చూశాం'' అని సురూఖ్ అనే తాబయీ (ప్రశిష్యుడు) ప్రమాణం చేసి చెబుతున్నారు.

హ(జత్ ఇబ్నె అబ్బాస్ (రజి), అబ్దుల్లా బిన్ ఉమర్(రజి) తదితరులు ఫిఖహ్ మరియు పర్యాలోచనల్లో హ(జత్ ఆయిషా(రజి)కు సమానులే. అయినా వారు కూడా కొన్ని విషయాల్లో హ(జత్ ఆయిషా(రజి)ను సంప్రదించి స్థిమితపడేవారు (సహీహ్ బుఖారీ). హ(జత్ అబూమూసా అష్అరీ విద్వాంసుల కోవకు చెందినవారు. మరి ఆయన సయితం ఈ 'అస్థానం'పై ఆధారపడక తప్పేది కాదు.

## ముస్లిం రాజ్యాల ప్రజలు

ఆనాడు ముస్లిం రాజ్యాలకు మదీనా కేంద్రస్థానంగా ఉండేది. సందర్శన నిమిత్తం ప్రజలు ఇటుగా వచ్చేవారు. మదీనా వచ్చినపుడల్లా దైవప్రవక్త (సఅసం) ప్రియ సతీమణి ఇంటికి తప్పక వచ్చేవారు. దూరదూర దేశాల ప్రజలు ఇక్కడి ఆచారాన్ని మర్యాదల్ని ఎరుగరు. వీళ్ళు మొదట హాజరయ్యే పద్ధతుల్ని ఆచారాల్ని గురించి తెలుసుకునేవారు. పద్ధతి ప్రకారం సలాం చేసేవారు (ముస్నద్ అహ్మద్). హ(జత్ ఆయిషా(రజి)వారి పట్ల గౌరవ మర్యాదలతో మెలిగేవారు. మధ్యలో పరదా (వేలాడదీయబడేది. ప్రజలు వివిధ సమస్యల్ని, సందేహాలను ఆమె ఎదుట వ్యక్తం చేసేవారు. ఆమె జవాబులు విని తృప్తి చెందేవారు. ఎవరయినా, ఏ విషయంలోనైనా ప్రశ్న అడిగేందుకు సిగ్గుపడటం గమనిస్తే ''నేను నీ తల్లిని కదా! తల్లి ఎదుట దాపరికం ఎందుకు?'' అని చెప్పి ఆమె వారికి ధైర్యం కలిగించేవారు.

సహాబీల మధ్య భిన్నాభిప్రాయాలు ఎదురయినపుడు ప్రజలు తీర్పు కోసం ఈమె న్యాయస్థానానికే వచ్చేవారు. ఒకరోజు హ(జత్ అబూమూసా అష్అరీ (రజి) వచ్చారు. ''ఒక విషయంలో దైవప్రవక్త (సఅసం) అనుచరుల మధ్య అభిప్రాయభేదం పొడసూపటం నాకు దుర్భరంగా తోచింది. మీ ఉద్దేశ్యం ఏమిటి?'' అని అడిగారు. హ(జత్ ఆయిషా (రజి) జవాబు ఇచ్చిన మీదట ఆయనకు సంతృప్తి కలిగింది. ''మీ తర్వాత ఈ విషయమై ఇక ఎవరినీ ప్రశ్నించను'' (ముతా, ఇమామ్ మాలిక్) అని చెప్పారు.

''తహజ్జుద్ నమాజును తర్వాత చేసుకుందామని ఎవరైనా కాకతాళీయంగా వితర్ నమాజును చేయకుండా ఉంటే తెల్లవారిపోతే, ఇక వితర్ నమాజుకు టైము గడిచిపోయినట్లే''నని హ(జత్ అబూదర్దా (రజి) తీర్పు ఇచ్చేవారు. ప్రజలు ఈ తీర్పుపై సంతృప్తి పడక హ(జత్ ఆయిషా(రజి) దగ్గరకు వచ్చి అడిగి తెలుసుకునేవారు.

https://teluguislam.net

''ఒక్కోసారి తెల్లారి పోయినాసరే దైవప్రవక్త (సఅసం) వితర్ నమాజ్‌ను చేసుకునేవారు'' అని ఆమె జవాబిచ్చారు (మస్నద్). హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్(రజి) మరియు హజ్రత్ అబూమూసా అష్ అరీ(రజి) లిద్దరు ప్రథమ శ్రేణి సహాబీలే. వీరిద్దరిలో 'ఇఫ్తార్' వేళగురించి భిన్నాభిప్రాయం ఉండేది. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ ఇఫ్తార్‌చేసిన వెంటనే మగ్రిబ్ నమాజ్‌కు నిలబడేవారు. హజ్రత్ అబూ మూసా అష్‌అరీ(రజి) ఈ రెండు పనుల్లోనూ కాస్త నింపాదిగా వ్యవహరించేవారు. ఆ విషయమే ప్రజలు హజ్రత్ ఆయిషా(రజి)ను అడిగితే; వారిలో వేగిరపడే వారెవరు? అని హజ్రత్ ఆయిషా అడగ్గా ''హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్'' అని ప్రజలు సమాధానమిచ్చారు. ''దైవప్రవక్త (సఅసం) అలవాటు కూడా అదే'' అని అన్నారు హజ్రత్ ఆయిషా(రజి).

(నసాయి, సహీబుఖారీ, ముస్లిం)

''రమజాన్ మాసంలో మనిషికి గుసుల్ చేయడం వాజిబ్ అయి ఉండగా ఆ స్థితిలోనే తెల్లవారిపోతే ఆనాటి అతని ఉపవాసం సక్రమం కాజాలదు'' అని హజ్రత్ అబూహురైరా(రజి) 'ఫత్వా' యిస్తుండేవారు, ఒక సహచరుడు హజ్రత్ ఆయిషా(రజి)ను, ఆ తర్వాత హజ్రత్ ఉమ్మెసల్మా (రజి)ను దీని గురించి ఫత్వా అడిగారు. వారన్నారు : ''ఇది సరికాదు. దైవప్రవక్త (సఅసం) ఆచరణ ఇందుకు భిన్నంగా వుంది''. ఆ రోజుల్లో మర్వాన్ మదీనాకు అమీరుగా ఉండేవారు. ఆయన తన మనిషిని హజ్రత్ అబూహురైరా(రజి) దగ్గరకు పంపించి హజ్రత్ ఆయిషా(రజి)గారి ఫత్వాను వివరించారు. ఇది విని హజ్రత్ అబూ హురైరా తన ఫత్వాను ఉపసంహరించుకున్నారు.

ఒక సమావేశంలో హజ్రత్ అబూహురైరా(రజి), హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి)గారలు ఇద్దరు పాల్గొన్నారు. వాళ్ళ ముందుకు ఒక సమస్య వచ్చింది. ''ఎవరైనా గర్భిణీస్త్రీ భర్త చనిపోతే, అట్టి వితంతు గర్భవతికి, కొన్నాళ్ళ తర్వాత ప్రసవం అయితే ఆమె ఇద్దత్ గడువును ఏ విధంగా పరిగణించాలి? దివ్య ఖుర్‌ఆన్‌లో పై రెండు విషయాలకు వేర్వేరు ఆదేశాలు పేర్కొనబడ్డాయి. వైధవ్యానికి నాలుగు మాసాల పదిరోజులు, ఇంకా గర్భిణీ స్త్రీకి ప్రసవం అయ్యేవరకు. ఆ రెండింటిలో ఎక్కువ వ్యవధి వున్న కాలమే ఇద్దత్ పరిమాణం'' అని హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) అన్నారు. ''ప్రసవం అయ్యేవరకు ఇద్దత్‌లో ఉంటే చాల''ని హజ్రత్ అబూహురైరా(రజి) అన్నారు. ఇద్దరి మధ్యా ఏకాభిప్రాయం కుదరలేదు. ప్రజలు హజ్రత్ ఆయిషా(రజి), హజ్రత్ ఉమ్మె సల్మా(రజి)గార్ల దగ్గరకు మనిషిని పంపితే వారు ''ప్రసవం అయ్యేవరకు'' అని తెలిపారు. ఇందుకు ఆధారంగా సబీయ వృత్తాంతాన్ని పేర్కొన్నారు. ఆమెకు వైధవ్యం ప్రాప్తించిన మూడవ రోజునే ప్రసవం

https://teluguislam.net

జరిగింది. అప్పుడే ఆమెకు పునర్వివాహం చేసుకునేందుకు అనుమతి లభించింది. ఈ తీర్పు ఎంతో ప్రామాణికమవటంచేత ధర్మవేత్తలంతా.దాదాపు దీన్ని అనుసరించారు.

హ|జత్ అబ్దుల్లా బిన్ ఉమర్(రజి) మరియు హ|జత్ అబూహురైరా(రజి) మధ్య జనాజాల (శవపేటికల) వెనుక నడవటంలో పుణ్యం ఉందా? లేదా? అనే అంశంపై భేదాభిప్రాయం కలిగింది. హ|జత్ అబూహురైరా(రజి) పుణ్యం ఉందని అంటారు. హ|జత్ అబ్దుల్లాబిన్ ఉమర్(రజి) లేదంటారు. వ్యవహారం హ|జత్ ఆయిషా(రజి) వరకూ వెళ్ళింది. ఆమె హ|జత్ అబూహురైరా(రజి) అభిప్రాయం సరైందని ధృవీకరించారు.

హ|జత్ ఆయిషా(రజి) గారి ఫత్వాలు జీవితపు సమస్త రంగాలతో ముడిపడినవే అయినప్పటికీ అవి చాలా వరకు స్త్రీల సమస్యలు, భార్యాభర్తల సంబంధాలు, దైవప్రవక్త (సఅసం) స్థితిగతులు, రాత్రివేళల్లో ఆయన(సఅసం) చేసే ఆరాధనల గురించి విశ్లేషిస్తాయి.

ఇరాఖ్, సిరియా, ఈజిప్టుల నుండి స్త్రీలూ పురుషులు 'ఫత్వా' కోసం వచ్చేవారు. ఆమె జవాబులు విని సంతృప్తి చెందేవారు. ప్రజలు తమ అవసరం కొద్దీ ఆమె సేవలో ఉండే పరిచారికలకు చేరువయ్యేవారు. తరచూగా ఆమె సేవలో పాల్గొన్న భాగ్యశాలి అయిన ఆయిషా బిన్తె తల్హా ఇలా తెలియచేశారు:

''హ|జత్ ఆయిషా(రజి) వద్దకు ప్రతి పట్టణం నుంచీ ప్రజలు వస్తుండేవారు. నాకూ ఆమెకు గల సాన్నిహిత్యం కారణంగా నన్ను కలుసుకునేందుకు వచ్చేవారు. నాతో' సోదరబంధం ఆప్యాయతల అనుబంధం ఏర్పరచుకున్నవారు నాకు బహుమతులు పంపేవారు. ప్రతి పట్టణం నుంచీ ఉత్తరాలు వ్రాసేవారు, హ|జత్ ఆయిషా(రజి)తో, ''పిన్నీ! ఇది ఫలానా వ్యక్తి ఉత్తరం, అతడి నుంచి బహుమతి వచ్చింది'' అని నేను చెప్పేదాన్ని. ''దానికి జవాబు వ్రాయి. బదులుగా నీవు ఏదయినా కానుక పంపు'' అని ఆమె ఉపదేశించేవారు.

ఒకవేళ ఆమెకు విద్యా విజ్ఞానాల వెలుగులో ఇదమిత్థమయిన, సహేతుకమైన సమాచారం ఏదీ లేని విషయంలో ఎవరైనా ప్రశ్నిస్తే లేక దానికి మరింత మేలయిన జవాబు ఇచ్చేవారెవరైనా ఉంటే వారి దగ్గరకు ఈ పృచ్ఛకులను పంపేవారు. ఒకసారి ఒక వ్యక్తి ప్రయాణంలో చర్మంతో తయారైన మేజోళ్ళపై మసహ్ చేసే విషయమై ఆమెను ప్రశ్నించారు. ''అలీ(రజి)ని అడగండి, ఆయన చాలాసార్లు దైవప్రవక్త (సఅసం) వెంట ప్రయాణంలో ఉండేవారు'' (ముస్నద్ ఇబ్నె హంబల్) అని ఆమె జవాబిచ్చారు. ఒకసారి అసర్ వేళ తర్వాత నమాజ్ చేయడాన్ని గురించి ఎవరో ప్రశ్న వేశారు. ''దీన్ని గురించి ఉమ్మె సల్మా(రజి)ను అడగండి'' అన్నారామె.

(సునన్ నిసాయి)

https://teluguislam.net

మరొక సంఘటన-ఒక ప్రశ్నించే వ్యక్తి కవచం ధరించే విషయంలో ఫత్వా అడిగితే ''అబ్దుల్లా బిన్ ఉమర్(రజి) వద్దకు వెళ్ళండి'' అని జవాబిచ్చారు హ॥జత్ ఆయిషా(రజి).

# ఉపదేశం

ధర్మావలంబీకుల్లో అలసత్వం చోటు చేసుకొని వారు తమ ధర్మ ప్రచారకులు చేసిన ప్రబోధనలను, పాఠాలను మరచిపోతున్న తరుణంలో ఆ ధర్మ పునరుజ్జీవనం కొరకు పాటుబడవలసిన అవసరం ఏర్పడుతుంది. దాని కొరకు ప్రవక్తల ప్రబోధనలను పదే పదే నొక్కి వక్కాణిస్తూ జన జీవితంలో ధార్మిక చైతన్యాన్ని మేల్కొల్పవలసి ఉంటుంది. జాతిని జాగరూకం చేసి, వెన్ను తట్టి లేపే ఈ ప్రయత్నాన్నే ఉపదేశం(ధర్మోపదేశం) అంటారు. ఈ బాధ్యతా నిర్వహణలో హ॥జత్ ఆయిషా(రజి) పోషించిన పాత్ర మిగిలిన సహాబీలు చేసిన ప్రయత్నాల కన్నా ఏ విధంగానూ తక్కువ కాదు. ఆమె తన కుటీరంలోగాని, జన సమూహంలోగాని, హజ్ సమ్మేళనంలోగాని, ఏ విధంగానయినా సరే ఈ మహత్కార్యాన్ని బహు చక్కగా నెరవేర్చారు.

హ॥జత్ ఉస్మాన్(రజి) ఖలీఫాగా వున్న హయాంలో కుట్రలు కుతంత్రాలు పెచ్చు పెరిగాయి. అందువల్ల ధర్మం కూకటివ్రేళ్ళతో పెళ్ళగించ బడటాన్ని చూసిన హ॥జత్ ఆయిషా(రజి) చలించిపోయారు. ఆమె జమల్ యుద్ధంలో పాల్గొనడానికి కారణం ఆమెకు కలిగిన మనస్తాపనే.

ఈజిప్టు-అరబ్బేతరుల గిల్లికజ్జాల కారణంగా ప్రజల్లో హ॥జత్ ఉస్మాన్(రజి) పట్ల అసంతృప్తి బాగా పెరిగింది. కొందరైతే తిట్లూ శాపనార్థాలు కురిపించసాగారు. ముఖారిఖ్‌బిన్ షిమామా బస్రాకు చెందిన నాయకుడు. ఆయన తన సోదరిని హ॥జత్ ఆయిషా(రజి) వద్దకు పంపి, ప్రజల్లో ఈ వైముఖ్య ధోరణికి సంబంధించి ఆమె అభిప్రాయం వెల్లడించమని కోరాడు. దానికి ఆమె ఇలా తెలియచేశారు: ''నా పుత్రులకు నా తరపున సలాము అందచేసి చెప్పు, నేను ఈ కుటీరంలోనే తిలకించిన ఆ దృశ్యాన్ని గురించి చెబుతున్నాను. ఆయన (సఅసం) వేంచేసి వున్నారు. జిబ్రయీల్(అ) 'వహీ' తీసుకు వచ్చినపుడు ఉస్మాన్ ఆయన చెంత వున్నారు. ఆయన (సఅసం) ఉస్మాన్ భుజం తట్టి చెబుతున్నారు. 'ఆ! ఉస్మాన్ ఇది వ్రాయి. పవిత్ర ప్రభువు ఈ గౌరవాన్ని అధములకు ప్రసాదించడు'. దీని ప్రకారం హ॥జత్ ఉస్మాన్(రజి)ను తిట్టినవారిపై దేవుని అభిశాపం తప్పదు.''

(అదబుల్ ముఫ్రద్ - ఇమామ్ బుఖారీ)

https://teluguislam.net

ముస్లింలకు, ఈరానీయులకు ఉమరె ఫారూఖ్(రజి) హయాంలో చెలిమి ఏర్పడింది. హజ్రత్ ఉమర్(రజి) శక్తి సామర్థ్యాల కారణంగా ఆయన యెడల గల భయభక్తులవల్ల ముస్లింలలో దురాచారాలు దరి చేరలేదు. అయితే హజ్రత్ ఉస్మాన్(రజి) కాలంలో ఈ చెలిమి అరబ్బు వాతావరణాన్ని కలుషితం చేయనారంభించింది. పావురాలు ఎగుర వేయడం, జూదమాడటం, పందాలు వేయడం వంటి వ్యసనాలు, సమయాన్ని వృథా చేసే కాలక్షేపాలు ఆ కాలంలో వ్యాప్తి చెందసాగాయి. ప్రవక్త సహచరులు ఆ కాలంలో బ్రతికే వున్నారు. వారు ఈ పోకడలను చూసి సహించలేకపోయారు. హజ్రత్ ఆయిషా(రజి)కు చెందిన ఒక యింట్లో కొందరు అద్దెకు ఉండేవారు. వాళ్ళు పాచికలాడతారని వాళ్ళ గురించి తెలిసిన ఆయిషా(రజి) కోపోద్రిక్తురాలయి ''ఆ పాచికలని నా యింటి నుండి తక్షణం బయటకు పారవేస్తే సరి, లేకుంటే నా యింటి నుంచి వాళ్ళను వెళ్ళగొట్టేస్తాను'' ని చెప్పి పంపారు. (బుఖారీ)

ఇబ్నె అబీ సాయిబ్ అనే తాబయీ (ప్రశిష్యుడు) మదీనాలో మంచి వక్తగా వర్ధిల్లేవారు. ఉపన్యాసకులు సభికుల్లో ఉత్సాహం పుట్టించడానికి ప్రాసతో కూడిన దువాలు రచించి చదివేవారు. తమ ఘనతను ప్రదర్శించుకోడానికి ఎటువంటి సందర్భంలోనయినా ఎల్లవేళలా ఉపన్యసించడానికి సంసిద్ధులయి ఉండేవారు. హజ్రత్ ఆయిషా(రజి) ఆయన్ని సంబోధించి, ''నీవు మూడు విషయాల గురించి ప్రమాణం చేయి. లేకుంటే నీ నుంచి గట్టిగా లెఖ్ఖ తీసుకుంటాను (సంజాయిషీ అడుగుతాను)'' అన్నారు.

''అమ్మా! ఏమిటవి?'' అని అడిగారాయన.

''(1) దువాలలో ప్రాసతో కూడిన పదాలు ఉపయోగించకు. దైవప్రవక్త(సఅసం)గానీ, ఆయన సహచరులు గాని ఇలా చేసేవారు కాదు. (2) వారంలో కేవలం ఒక్కరోజు ధర్మబోధ చేయి, లేకపోతే రెండు రోజులు. అంతకంటే ఎక్కువ కావాలంటే మూడు రోజులు. ప్రజలకు దైవగ్రంథం పట్ల విసుగెత్తేలా చేయకు. (3) ఎక్కడ ప్రజలు కూర్చొని ఉంటే అక్కడకు వచ్చి తిష్ట వేసి వారి సంభాషణను తుంచుతూ ఉపన్యాసం మొదలెట్టకు. వారు కోరినప్పుడు వారు అభ్యర్థించినట్లయితేనే ప్రసంగించు''. (ముస్నద్ అహ్మద్)

'విడాకులివ్వబడిన స్త్రీ ఇద్దత్ (గడువు) కాలాన్ని తమ భర్త యింటిలోనే గడపాలి' అని ఇస్లాం ఆజ్ఞాపిస్తోంది. ఈ ఆజ్ఞకు వ్యతిరేకంగా కేవలం ఫాతిమా బిన్తె ఖైస్ సాక్ష్యం మాత్రమే వుంది. ఆమె భర్త విడాకులిచ్చినప్పుడు దైవప్రవక్త(సఅసం) ఆమెను ఆ యింటినే వదలి మరో ఇంట్లో వుండేందుకు అనుమతి ఇచ్చారు. ఫాతిమా ఈ సంఘటనను ఉదాహరిస్తూ, దీని ఆధారంగా ఇల్లు మారేందుకు అనుమతి

ఉందని చెప్పింది. హజ్రత్ ఆయిషా(రజి) కాలంలో ఈ సంఘటన ఆధారం గానే ఒక గౌరవనీయుడయిన తండ్రి, విడాకులివ్వబడిన తన కూతురిని అక్కడి నుండి పిలిపించుకున్నాడు. హజ్రత్ ఆయిషా(రజి) సర్వసాధారణమైన ఈ నియమోల్లంఘన పట్ల గట్టిగా అభ్యంతరం తెలిపారు. ఆ కాలంలో మర్వాన్ మదీనాకు గవర్నరుగా ఉండేవారు. ''మీరు అధికారికంగా ఈ కేసులో జోక్యం చేసుకోండి'' అని మర్వాన్‌కు చెప్పి పంపారు. అంతేకాదు, ఈ సమస్య స్వరూప స్వభావాలను వివరిస్తూ, ''ఈ సంఘటనను అందరూ ఆసరాగా తీసుకోవడం ధర్మ సమ్మతం కాదు. అసలు జరిగిందేమంటే, ఫాతిమా భర్త యిల్లు ఊరికి చివరగా వుండేది. రాత్రివేళల్లో క్రూర జంతువుల భయం ఉండేది. ఆ కారణం చేత దైవ ప్రవక్త (సఅసం) ఆమెకు (ఇల్లు మారే) అనుమతిచ్చారు'' అని చెప్పారామె.

(సహీహ్‌బుఖారీ)

అరబ్బేతర ప్రాంతాలను జయించిన తర్వాత అరబ్బులు సారాయిలోని నూతన రకాలు, వాటి కొత్త పేర్లను తెలుసుకున్నారు. ఆ మద్యపానాలను గురించి ఇస్లాంలో ఎటువంటి ఆజ్ఞ ఉందోనన్న అనుమానం ప్రజలకు వుండేది. హజ్రత్ ఆయిషా(రజి) తమ సమావేశాల్లో సారాయి పాత్రల్లో ఖర్జూరపు పళ్ళు అయినా నానబెట్టకూడదని స్పష్టంగా ప్రకటించారు. తర్వాత కొందరు స్త్రీల వైపు తిరిగి, 'మీరు త్రాగే ఏ ద్రవం వల్ల నిషా కలిగినా అది హరామ్(నిషిద్ధమే). ఎందుకంటే నిషా కలిగించే ప్రతి వస్తువునూ దైవప్రవక్త (సఅసం) నిషేధించారు'' అని ఉద్బోధించారు(నిసాయి).

సహజంగానే పురుషులకన్నా స్త్రీలే అధికంగా ఆమె వద్దకు వస్తుండేవారు. స్త్రీలకు సంబంధించిన సాధారణ సమస్యలను వారికి విడమరచి చెప్పటంతోపాటు వారి భర్తలకు కూడా తెలియపర్చ వలసిందిగా ఆ స్త్రీలకు సలహాలు ఇచ్చేవారు. బస్రా నుండి కొందరు స్త్రీలు ఆమె సమక్షానికి వచ్చారు. నేను పురుషులకు ప్రతిదీ చెప్పడానికి ఇబ్బంది పడుతున్నాను. మీమీ భర్తలకు నీళ్ళతో తహారత్(శుద్ధి) పొందమని చెప్పండి. ఇది సున్నత్(సంప్రదాయం) అని సలహా ఇచ్చారు.

ఒకసారి కూఫాకు చెందిన కొందరు మహిళలు వచ్చారు. ఎక్కడి నుండి వచ్చారని వారిని వాకబు చేశారు. ''కూఫా నుండి వచ్చామని'' వారు జవాబిచ్చారు. ఆ పేరు విన్న ఆమె మోముపై కించిత్ అయిష్టత వ్యక్తమయింది. తర్వాత వారిలో ఒకామె సమస్య యొక్క ఒక స్వరూపాన్ని ముందుకు తెచ్చింది. ప్రఖ్యాత సహాబి హజ్రత్ జైద్ బిన్ అర్ఖమ్(రజి)కు దాంతో ప్రమేయం ఉంది. హజ్రత్ ఆయిషా(రజి) పలికారు:

''మీరిద్దరూ దుర్మార్గానికి ఒడిగట్టారు. జైద్ దైవప్రవక్త (సఅసం)తో కలసి చేసుకున్న జిహాద్ పుణ్యాన్నంతా అధర్మం చేసుకున్నారని ఆయనతో చెప్పండి. అయితే ఆయన పశ్చాత్తాపం చెందితే మన్నించబడే అవకాశముంది.''

ఒకసారి సిరియాకు చెందిన స్త్రీలు దర్శనానికి వచ్చారు. అక్కడ వారు బాత్‌రూమ్‌లో వెళ్ళి దిగంబరంగా స్నానం చేసేవారు. వారినుద్దేశించి ఆయిషా(రజి) పలికారు: ''బాత్‌రూమ్‌లలోకి వెళ్ళే స్త్రీలు మీరేనా? తన యింటి లోపల తప్ప బయట బట్టలు విప్పుకునే స్త్రీ, తనకూ దైవానికీ మధ్య పరదా లేకుండా చేసుకుంటుంది అని దైవప్రవక్త (సఅసం) చెప్పారు.''

హాజ్ కాలంలో హజ్రత్ ఆయిషా(రజి) విడిది చేసిన స్థలం లక్షలాది ముస్లిం హృదయాల కేంద్రంగా మారిపొయ్యేది. నలువైపులనుండి స్త్రీలు ఆమెను చుట్టు ముట్టేవారు. ఆమె ఇమామ్ వలె ముందుకు నడిస్తే మిగతా స్త్రీలందరూ ఆమెను అనుసరించేవారు(ముస్నద్). ఆ వ్యవధిలోనే ఆమె బోధ, ఉపదేశాల బాధ్యతలూ నిర్వర్తించేవారు. ఒకసారి ఒక స్త్రీ దుప్పటిపై శిలువ బొమ్మ ఉండటం గమనించారు. దాన్ని చూడగానే ''ఆ దుప్పటి తీసేయి. ఆ దుప్పటి తీసేయి'' అని గద్దిస్తూ ''దైవప్రవక్త (సఅసం) అటువంటి బట్టల్ని చూస్తే వాటిని చింపేసేవారు'' అని పలికారామె.

ఒకసారి హజ్రత్ ఆయిషా(రజి) సోదరుడు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్(రజి) ఆమెను చూడటానికి వచ్చారు. ఆయన గబ గబా వుజూ చేసి వెళ్ళసాగారు. హజ్రత్ ఆయిషా ఆయన్ని తక్షణం వారిస్తూ ''అబ్దు రహ్మాన్! వుజూ సక్రమంగా చేయి. వుజూలో తడవని శరీర భాగాలపై నరకం శపిస్తుంది'' అని దైవప్రవక్త (సఅసం) చెబుతుండగా విన్నాను'' అని తెలిపారామె! (ముస్నద్)

ఒకసారి ఒకరి యింటికి అతిథిగా విచ్చేశారు. యుక్తవయస్కులైన గృహస్తు కుమార్తెలిద్దరూ దుప్పటి కప్పుకోకుండా నమాజ్‌లో పాల్గొనడాన్ని ఆమె గమనించారు. వారిని హెచ్చరిస్తూ ''ఇక ముందు ఎప్పుడూ దుప్పటి కప్పుకోకుండా నమాజ్ చేయకండి. ఇది దైవప్రవక్త(సఅసం)గారి ఆదేశం'' అని ఉపదేశించారు.

యూద స్త్రీలలో కురుచవెంట్రుకలుగలవారు సవరాలను ఉపయోగించి జుట్టు పెద్దది చేసుకొనే ఆచారం వుండేది. వాళ్ళని చూసిన అరబ్ స్త్రీలలోనూ ఇదే ఆచారం చోటు చేసుకుంది.

ఒకసారి ఒక స్త్రీ వచ్చి నా కుమార్తె పెళ్ళి నిశ్చయమైంది. పెళ్ళి కూతుర్ని చేశాము. జబ్బు పడిన కారణంగా జుట్టు రాలిపోయింది. సవరం వేయించమంటారా? అని అడగ్గా ''దైవ ప్రవక్త (సఅసం) సవరం చేసేవారిని సవరం చేయించుకునేవారిని

https://teluguislam.net

ధూత్కరించారు'' అని హ(జత్ ఆయిషా(రజి) సెలవిచ్చారు. (మస్నద్)

పవిత్ర ఖుర్ ఆన్‌ని ఎంత త్వరగా చదివి పూర్తి చేస్తే అంత పుణ్యమని కొందరు భావిస్తారు. ఒక వ్యక్తి వచ్చి ''ఉమ్ముల్ మోమినీన్! కొందరు ఒకేరాత్రిలో దివ్యఖుర్ ఆన్‌ను రెండేసి, మూడేసిసార్లు చదివేస్తారు. (ఇలా చేయవచ్చునా!) అని అడిగాడు.

వాళ్ళు చదవడం, చదవకపోవడం ఒక్కటే. దైవప్రవక్త (సఅసం) పూర్తి రాత్రి నమాజ్‌లో నిలబడే వుండేవారు. కాని బఖరా, ఆలి ఇమ్రాన్, నిసా సూరాలకన్నా అధికంగా పారాయణం చేయలేకపోయేవారు. అంటే ఈ మూడు సూరాలు చదువుతూండగానే రాత్రి గడిచిపోయేది. శుభవార్త వినిపించే ఆయత్ వచ్చినప్పుడు ప్రార్థించేవారు. హెచ్చరికలు చేసే ఆయత్‌లు వచ్చినపుడు దేవుని శరణు వేడేవారు. (మస్నద్ అహ్మద్)

హ(జత్ ఉసైద్ బిన్ హుజైర్ ఉత్తమ శ్రేణికి చెందిన సహాబి. హజ్ యాత్రీకుల బృందం తిరిగి వస్తూ మక్కా సమీపానికి చేరుకున్నప్పుడు ఆయన భార్య చనిపోయినట్టు ఆయనకు తెలిసింది. ముఖంపై గుడ్డ కప్పుకుని ఏడ్వసాగారు. ప్రేమాతిశయం అలాంటిది. కాని ఈ విధంగా మొహం దాచుకుని ఏడ్వడం-అదీ ప్రజాసమూహం నడుమ అలా ఏడ్వడం సహనమూర్తులకు శోభనివ్వదు కదా! ఆ బృందంలో హ(జత్ ఆయిషా(రజి) కూడా ఉన్నారు. ఆమె హ(జత్ ఉసైద్(రజి)ను సంబోధించి ''మీరు దైవప్రవక్త (సఅసం)గారి శిష్యులు. ఇస్లాం ఆరంభ కాలం నాటి వారన్న గౌరవం మీకు దక్కింది. మీరు ఒక స్త్రీ కోసం ఇంతగా ఏడుస్తున్నారా?'' అని అన్నారు.

కాబాపై ప్రతి ఏడూ ఒక క్రొత్త గలీబు తొడిగించబడుతుంది. పాతది తీసి వేయబడుతుంది. హ(జత్ ఆయిషా(రజి) కాలంలో కాబా ముతవల్లీగారు పాత గలీబును మలిన హస్తాలేవీ తాకరాదన్న ఉద్దేశ్యంతో దాన్ని భూమిలో పాతి పెట్టేసేవారు. ఆ కాలపు కాబా సేవకుడు అయిన షీబా బిన్ ఉస్మాన్ ఇలా తెలియజేశారు. ''మేము గలీబులన్నీ ప్రోగు చేసి ఒక లోతయిన గొయ్యి త్రవ్వి, అందులో వేసి పూడ్చి పెట్టేవారం. ఎందుకంటే మలిన స్థితిలోని వారెవరైనా దాన్ని తొడుక్కుంటారేమోనని మాకు భయముండేది.'' షరీయత్ స్వభావాన్ని క్షుణ్ణంగా జీర్ణం చేసుకున్న ఆయిషా(రజి), ఈ పోకడ షరీఅత్ వ్యతిరేకమైనదని గ్రహించారు. అలా చేయమని దైవం గానీ, దైవప్రవక్త(సఅసం)గానీ ఆజ్ఞాపించి యుండలేదు. దీని నుండి భవిష్యత్తులో మూఢ విశ్వాసం ఏదైనా జనించే అవకాశం వుంది. అందుచేత ఉమ్ముల్ మోమినీన్ షీబాతో ''నీవిలా చేయటం ఏమీ బాగాలేదు. ఆ గలీబును కాబా నుండి తీసివేశాక మలిన స్థితిలో వున్న వారెవ్వరైనా దాన్ని తొడుక్కున్నా అభ్యంతరం ఏమీ లేదు. అసలు నువ్వు దాన్ని అమ్మివేసి అలా అమ్మగా వచ్చిన

https://teluguislam.net

డబ్బును బీదవారికి, బాటసారులకు ఉపయోగించాల్సింది'' అని సలహా ఇచ్చారు. దాదాపు ఆ కాలం నుండే పాత గలీబును చింపి ముస్లింలకు అమ్మడం జరిగింది. ఆసక్తి గల ముస్లింలు దాన్ని ఖరీదు చేసి ప్రసాదంగా ఇళ్ళకు తెచ్చుకొనేవారు. ఈ గౌరవభాగ్యం లభించిన కారణంగా ముస్లింలు, అదీ ఉమ్ముల్ మోమినీన్ చూపిన చొరవవల్ల తమకు ఈ భాగ్యం లభించినందుకు ఆమెకు కృతజ్ఞతలర్పించాలి!

ఒకసారి ఒక సహచరుడు( బహుశా అబూహురైరా (రజి) మస్జిదె నబవీలోకి వచ్చారు. హజ్రత్ ఆయిషా(రజి) కుటీరం ఎదురుగా కూర్చుని బిగ్గరగా ఆమెకు విన్పించేలా హదీసులను గబగబా విన్పించసాగారు. అప్పుడు హజ్రత్ ఆయిషా(రజి) నమాజ్ చేస్తున్నారు. నమాజ్ పూర్తయ్యాక చూస్తే ఆయన లేచి వెళ్ళిపోయారు. ఉర్వహ్ ఆమెను కలుసుకునేందుకు వెళ్ళగా ఆయనతో హజ్రత్ ఆయిషా(రజి) అన్నారు, ''ఫలానా వ్యక్తి కుటీరం దగ్గర కూర్చుని నాకు వినిపించాలని గబగబా హదీసులను పఠించసాగారు. నేను నమాజ్‌లో వున్నాను (నమాజ్ ముగించేసరికి) ఆయన లేచి వెళ్ళిపోయారు. ఎంత ఆశ్చర్యకరమైన విషయం! ఆయనగారు నన్ను కలుసుకుంటే దైవప్రవక్త (సఅసం) మీలాగా గబగబా సంభాషించేవారు కాదు అని చెప్పి ఉండేదాన్ని'' (సహీహ్ బుఖారీ). ఉమ్ముల్ మోమినీన్(రజి) ఉద్దేశ్యంలో, ప్రవక్త (సఅసం) ప్రవచనాలను విన్పించే కార్యక్రమం చేపట్టినప్పుడు వారి మాటలకు-చేతలకు పొంతన ఉండాలి. లేకుంటే హదీసులు ప్రభావ రహితం అయిపోతాయి.

హజ్ కాలంలో 'మినా' లో ఒక గుడారంలో ఉండగా ప్రజలు కలుసుకునేందుకు వస్తున్నారు. కొందరు ఖురైష్ యువకులు నవ్వుకుంటూ వచ్చారు. వారి నవ్వుకు కారణం విచారించగా 'ఆ ఏమీ లేదు. ఒకాయన గుడారపు తాడు అడ్డంపడి దభేలున కింద పడ్డారు. ఆ పడటంలో ఆయన కన్నుపోయేదే. లేదా మెడ విరిగేది. మాకు ఆ దృశ్యం చూసి అప్రయత్నంగా నవ్వు వచ్చింది' అన్నారు వాళ్ళు. ''అలా నవ్వకూడదు. ఒక మనిషికి ముల్లుగుచ్చుకున్నా, లేక అంతకంటే చిన్న కష్టం ఏదయినా వచ్చినా దానివల్ల దైవం అతని అంతస్థును పెంచుతాడు. ఇంకా అతని పాపాన్ని మన్నిస్తాడు'' అని ఆమె బోధపరిచారు. (సహీహ్ ముస్లిం)

https://teluguislam.net

# మహిళా లోకానికి మహోపకారం చేసిన మహిళామణి

ఇక మనం ఈ పుస్తకం ఆఖరి అధ్యాయంలో అడుగు పెట్టాము. మన విజ్ఞాన యాత్రలో చివరి మజిలీ ఇది. ఆమె పవిత్ర జీవితంలోని ఘనకార్యాలలో ఆమె మహిళా లోకానికి వివిధ రకాలుగా చేసిన మహోన్నత సేవలు ప్రత్యేక అధ్యాయంలో చెప్పుకోక తప్పదు.

మహిళా లోకానికి ఆమె చేసిన అత్యున్నత మహోపకారం; ఒక ముస్లిం స్త్రీ పరదా పాటిస్తూనే మత, రాజకీయ, వ్యక్తిగత, సామూహిక, సంస్కరణ, ఉపదేశకార్యాల్ని, సమాజ శ్రేయస్సుకోసం కార్యక్రమాన్ని చేపట్టగలదని ప్రపంచానికి చాటి చెప్పటం.

గతంలో పురుషాధిక్య సమాజం చేత అణగద్రొక్కబడిన స్థితి నుండి మహిళా లోకం సాధించిన ప్రగతి వికాసాలకు సజీవ వ్యాఖ్యానం ఉమ్ముల్ మోమినీన్ జీవిత చరిత్ర.

సహాబియాత్ (ప్రవక్త సహచారిణులు) తమ అభ్యర్థనల్ని ఉమ్ముల్‌మోమినీన్ ద్వారా దైవప్రవక్త (సఅసం)కు పంపేవారు. ఆమె తనకు సాధ్యమయినంత వరకు వాళ్ళకు తోడ్పడేవారు. హజ్రత్ ఉస్మాన్ బిన్ మన్ తుల్ అనే ఒక పవిత్రుడయిన సహాబి ఉండేవారు. ఆయన సన్యాసత్వ జీవితం గడిపేవారు. ఒక రోజు ఆయన భార్య హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరకు వచ్చారు. ఆమె స్త్రీ సంబంధమైన అలంకారాలేవి లేకుండా అతి నిరాడంబరంగా ఉండటం హజ్రత్ ఆయిషా గమనించారు. కారణం విచారించారు. ఆవిడ పాపం ఏం చెబుతుంది? గుచ్చి గుచ్చి అడిగితే, తన భర్త పగలంతా ఉపవాసం పాటిస్తాడనీ, రాత్రుళ్ళు పూర్తిగా నమాజ్‌లోనే గడుపుతాడనీ తెలిపింది. దైవ ప్రవక్త (సఅసం) వచ్చాక మాటల సందర్భంగా ఈ విషయాన్ని ప్రస్తావించారామె. ఆయన (సఅసం) హజ్రత్ ఉస్మాన్ దగ్గరకు వెళ్ళారు. "ఉస్మాన్! మనకు సన్యాసత్వ జీవితం గడపమని ఆజ్ఞాపింప బడలేదయ్యా! నా జీవిత విధానం అనుసరణీయం కాదా! నేను మీ అందరి కంటే ఎక్కువగా దైవానికి భయపడతాను. ఆయన ఆజ్ఞల్ని మీ అందరికంటే ఎక్కువగా దృష్టిలో పెట్టుకుంటాను (ముస్నద్).

అయినప్పటికిన్నీ భార్యల పట్లగల నా బాధ్యతనూ నెరవేరుస్తాను'' అని ఉపదేశించారు.

హౌలా (రజి) అనే ఒక సహాబియా (శిష్యురాలు) ఉండేవారు. ఈమె రాత్రి నిదురించేది కాదు. రాత్రంతా నమాజ్‌లో గడిపేది. అనుకోకుండా ఆమె ఒకసారి ఎదురయింది. హ(జత్ ఆయిషా (రజి) ఆమెను పరిచయం చేయిస్తూ, ''దైవప్రవక్తా! ఈమె హౌలా. ఈమె రాత్రంతా పడుకోదు అని ప్రజలు చెప్పుకుంటారు'' అని అసలు సంగతిని మహా ప్రవక్త దృష్టికి తీసుకు వచ్చారు. ఆయన (సఅసం) ''రాత్రంతా పడుకోదా?'' అని ఆశ్చర్యపోయారు. మరల అన్నారు, ''నీకు చేతనైన మేరకే పనిచేయి'' అని బోధించారు.

ఒక స్త్రీ దొంగతనం చేసిన నేరానికి శిక్షించబడింది. ఆ తర్వాత ఆమె పశ్చాత్తాప పడి పుణ్యవతిగా మారిపోయింది. ఆమెలో పరివర్తన వచ్చినప్పటికీ ఎవరినీ కలుసుకోవడానికి ఇష్టపడేది కాదు. కాని ఆమె హ(జత్ ఆయిషా (రజి) దగ్గరకు వచ్చేది. ఆమెను కలుసుకునేది. అవసరమనుకుంటే ఆ స్త్రీ దరఖాస్తును ఆమె దైవప్రవక్త (సఅసం)కు అందచేసేవారు.

ఒక సహాబియాను ఆమె భర్త కొట్టడంచేత శరీరంపై చాలా చోట్ల వాతలు తేలాయి. ఆమె నేరుగా ఉమ్ముల్ మోమినీన్ (రజి) దగ్గరకు వచ్చి తన శరీరాన్ని చూపారు. దైవ ప్రవక్త (సఅసం) ఇంటి కొచ్చాక ఉమ్ముల్ మోమినీన్ ఈ విధంగా ఫిర్యాదు చేశారు.

> ''ముస్లిం స్త్రీలు అనుభవిస్తున్న కష్టాలను నేను వర్ణించజాలను. ఈ స్త్రీ శరీరం ఈమె బట్టలకన్నా హీనంగా తయారయింది.''

తన భార్య ఉమ్ముల్ మోమినీన్ సమక్షానికి వెళ్ళినట్లు ఆమె భర్తకు తెలిసి ఆయన కూడా పరుగున వచ్చాడు. వాళ్ళ వాదన విన్న తర్వాత తప్పు రుజువయింది. (సహీహ్ బుఖారీ).

స్త్రీలను హీనంగా చూసే వారిని ఉమ్ముల్ మోమినీన్ ఏవగించుకునేవారు. ఏ కోణంలోనైనాసరే స్త్రీలను కించ పరచే ధోరణి ప్రబలితే తక్షణం దాన్ని సంస్కరించే వారామె. 'స్త్రీగానీ, కుక్కగానీ, గాడిదగానీ - వీటిలో ఏ ఒక్కటి నమాజ్ చేసేవారి ముందు నుంచి పోయినా నమాజ్ భంగమవుతుంది' అని కొందరు సహచరులు చెప్పగా ఇది విన్న హ(జత్ ఆయిషా (రజి), ''అంటే స్త్రీ కూడా ఒక చెడ్డ జంతువనుకుంటున్నారా? మమ్మల్ని గాడిదలు, కుక్కల సరసన నిలబెడతారా?! దైవప్రవక్త (సఅసం) నమాజ్ చేస్తున్నపుడు నేను ఆయన కెదురు వైపు పడుకొని ఉండేదాన్ని తెలుసా?!'' అని హెచ్చరించారు.

https://teluguislam.net

దైవప్రవక్త (సఅసం) సెలవిచ్చారని హజ్రత్ అబూ హురైరా (రజి) వివరించారు: ''మూడు విషయాల్లో అశుభం వుంది. అవి ఏమంటే గుర్రం, ఇల్లు మరియు స్త్రీ.''

ఇది విన్న హజ్రత్ ఆయిషా (రజి)కు కోపం వచ్చింది. వెంటనే చెప్పారు, ''దైవం సాక్షి! ఎవరి చేతుల్లో అయితే ముహమ్మద్ ప్రాణాలున్నాయో ఆయన (సఅసం) ఇలా ఎంత మాత్రం చెప్పలేదు. కాకపోతే అజ్ఞాన కాలంలోని వారు వీటిని అపశకునంగా భావించేవారు.''

స్త్రీలు షరీయత్ పరమైన శుద్ధికోసం కొప్పులముడి విప్పి స్నానం చేయాలని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) 'ఫత్వా' ఇచ్చారు. హజ్రత్ ఆయిషా (రజి) ఇది విని ''ఇంకా నయం స్త్రీలు తమ కొప్పులు కత్తిరించేయాలన్నారు కాదు! నేను దైవప్రవక్త (సఅసం) సమక్షంలో గుసుల్ చేసేదాన్ని. కేవలం మూడుసార్లు నీరు పోసుకునేదాన్ని (సహీహ్ ముస్లిం). ఒక్క కేశాన్ని కూడా విప్పేదాన్నికాను.'' (నసాయి)

హజ్ యాత్రలో శిరోముండనం చేయించడం లేదా వెంట్రుకల్ని చిన్నవి చేయించడం కూడా అవసరమే. స్త్రీలు కేవలం కొన్ని కేశాలు కత్తిరించుకున్నా చాలు. ''కాలిచి నాలుగు వేళ్ళ పరిమాణంలో వెంట్రుకలు కత్తిరించాలని హజ్రత్ ఇబ్నె జుబైర్ ఫత్వా ఇచ్చేవారు. హజ్రత్ ఆయిషాకు ఆయన గారి ఫత్వా విషయం తెలిసింది. ''మహారం స్త్రీని బెత్తెడు జుట్టు కత్తిరించుకోమని చెబుతున్న ఇబ్నె జుబైర్ (రజి) మాటలు మీకు వింతగా తోచటం లేదా! వాస్తవానికి ఏ ప్రక్కనుంచయినా కొన్ని కేశాలు కత్తిరించుకుంటే చాలు'' అని ఆమె చెప్పారు.

ఇహ్రామ్ స్థితిలో పురుషులు చర్మంతో తయారైన నిండైన చెప్పులు, బూట్లుగానీ వేసుకోరాదు. ఒకవేళ ఏదన్నా తప్పని పరిస్థితి ఎదురవుతే చీలమండల నుంచి పైభాగాన్ని కోసి వేయాలి. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) స్త్రీలు తమ బూట్లను చీలమండల పైభాగాన్ని కోసి వేయటం అవసరం అని ఫత్వా యిచ్చారు. దీనికి హజ్రత్ ఆయిషా (రజి), ''ఈ నిబంధన పురుషులకు మాత్రమే పరిమితం, ఇది స్త్రీలకు వర్తించదు. ఎందుకంటే దైవప్రవక్త (సఅసం) వారికి (స్త్రీలకు) ఆ మేరకు అనుమతి ఇచ్చారు'' అని చెప్పారు. ఇది విన్న హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) తన తీర్పును ఉపసంహరించుకున్నారు. (అబూదావూద్)

ఇహ్రామ్ స్థితిలో సువాసన ద్రవ్యాలు వాడటం నిషిద్ధం. ఎందుకంటే దానివల్ల హాజీలో సహజత్వం కనబడదు. దీన్నిబట్టి కొందరు సహాబీలు ఇహ్రామ్ కట్టుకున్నపుడు కూడా సువాసన పులుముకోవడం ధర్మసమ్మతం కాదని అభిప్రాయ

https://teluguislam.net

పడ్డారు. హజ్రత్ ఆయిషా (రజి) ఈ ధోరణిని ఖండిస్తూ "(ప్రవక్త సతీమణులమైన) మేము ఇహ్రామ్ కట్టుకున్న తర్వాత నుదుటిపై సువాసన పులుముకునేవారం. చెమట వల్ల ఆ సువాసన ద్రవ్యం జారి కొందరి ముఖాలపై పడేది. దైవప్రవక్త (సఅసం) ఇది చూసేవారు కాని అభ్యంతరం తెలిపేవారు కాదు" అని చెప్పారు. (అబూదావూద్)

"ఇహ్రామ్ స్థితిలో ముఖంపై నఖాబ్ (వదనంపై వస్త్రం) వేయకూడదు" అని దైవప్రవక్త (సఅసం) తెలిపారని హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) ఉల్లేఖించారు. (అరేబియా దేశంలో పురుషులు కూడా ఎండ తీవ్రత నుండి కాపాడుకోవడానికి ముఖంపై నఖాబ్ వేసుకునేవారు) కాని స్త్రీలు ఎల్లవేళలా అలా చేయడం కష్టమయిపోయింది. హజ్రత్ ఆయిషా (రజి) సెలవిచ్చారు. "మేము ఆయన (సఅసం) వెంట హజ్జతుల్ విదా (కడపటి హజ్)లో పాల్గొన్నాం. హాజీల బృందాలు మా ఎదుట నుంచే తరలి వెళ్ళేవి. మాకు ఎదురుగా వచ్చినపుడు మేము ముఖాలపై దుప్పటి కప్పుకునేవారం. వాళ్ళు దాటి పోయాక మేము ముఖాలపై నుంచి వస్త్రాలను తొలగించేవారం (మూతా ఇమామ్ మాలిక్). అందుచేత ప్రప్రథమ కాలం నాటి స్త్రీలు హజ్రత్ ఆయిషా (రజి)గారి ఫత్వానే అనుసరించారు. ఒక తాబియ (సహచారిణి) హజ్రత్ ఆయిషా (రజి) అక్కగారైన హజ్రత్ అస్మా (రజి) వెంట హజ్ చేశారు. ఆమె ఇలా తెలియచేశారు. "మేము ముఖాలను దాచుకునేవాళ్ళం. ఆమె వారించేవారు కాదు."

ఒక సహాబి అడిగిన ప్రశ్నకు సమాధానంగా మహా ప్రవక్త (సఅసం) "ఇహ్రామ్ స్థితిలో కుర్తా, పైజామా, అమామా, టోపీ, తోలు బూట్లు ధరించరాదు. కుంకుమరంగు తదితర రంగులు అద్దిన వస్త్రాలూ తొడుక్కోకూడదు" అని సెలవిచ్చారని హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖించారు.

ఈ హదీసు ఆధారంగా స్త్రీలు కూడా ఇహ్రామ్ స్థితిలో కుంకుమరంగు తదితర రంగులు అద్దిన వస్త్రాలు ధరించరాదని కొందరు వక్కాణిస్తారు. కాని ఈ ఆజ్ఞ పూర్తిగా పురుషులకు సంబంధించినదని కాస్త సావధానంగా ఆలోచిస్తే తెలియగలదు. ఇది ఒక పురుషుని ప్రశ్నకు జవాబుగా ఆయన (సఅసం) సెలవిచ్చారు. హజ్రత్ ఆయిషా (రజి) ఇహ్రామ్ స్థితిలో కుంకుమ రంగు అద్దిన వస్త్రాలు ధరించేవారు. అంతేకాదు, స్త్రీలు ఇహ్రామ్ స్థితిలో నగలు ధరించేందుకు, నలుపు, గులాబీ రంగు వస్త్రాలు, తోలు బూట్లు ధరించేందుకు కూడా ఎటువంటి అభ్యంతరమూ తెలుపలేదు.

వెండి, బంగారాలతో చేయబడిన నగలు ధరించేవారు ఆ నగలపై జకాత్ ఇవ్వాలా? లేదా? ఈ విషయమై ప్రవక్త సహచరులలో భిన్నాభిప్రాయాలున్నాయి. హజ్రత్

https://teluguislam.net

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) ఇంకా ఇతర సహాబా తాబయియాన్, ఇమాములు నగలపై జకాత్ ఇవ్వాలన్నారు. హనఫీ ఫిక్‌హ్‌వేత్తలు కూడా వారినే అనుసరించారు. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి), హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి), హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) తదితర ప్రభృతులు మాత్రం జకాత్ లేదన్నారు. ఇమామ్ షాఫయీ, ఇమామ్ మాలిక్ బిన్ అనస్ మరియు ఇమామ్ అహ్మద్ కూడా ఇదే అభిప్రాయం కలిగి వున్నారు. నగల వ్యవహారం అధికంగా స్త్రీలకు సంబంధించింది. కాబట్టి ఈ విషయంలో హజ్రత్ ఆయిషా (రజి) అభిప్రాయం ఎక్కువ ప్రామాణికం కావలసింది. కాని ఆమెగారి వైఖరి కూడా ఈ విషయంలో సుస్పష్టంగా లేదు. (తిర్మిజీ)

అరేబియా దేశంలో ఇస్లాంకు పూర్వం వారసత్వంలో స్త్రీకి వాటా ఉండేది కాదు. ఇస్లాం వచ్చి వారికి కూడా వారి వాటాను ఇప్పించింది. వారసత్వపు విషయాలను గురించి ఎక్కువగా పవిత్ర ఖుర్‌ఆన్‌లోనే ప్రస్తావన వుంది. అందులో కుమార్తెల వాటాల వివరాలు కూడా ఉన్నాయి. అయితే కొన్ని జటిలమైన కొత్త అంశాలున్నాయి. వాటిని పరిష్కరించాలంటే దైవగ్రంథం మరియు సున్నత్‌ల గురించి మంచి అవగాహన ఉండాలి. అటువంటి సందర్భాలలో హజ్రత్ ఆయిషా (రజి) తన తోటి మహిళామణుల హక్కును విస్మరించలేదు. ఒక అంశం: కుమారులు వారసులుగా లేకుండా కేవలం కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్ళు (కుమారుని పిల్లలు) ఉండి ఉంటే, అప్పుడు ఆస్తి పంపకం ఎలా? హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) మనుమరాళ్ళకు భాగం ఇప్పించరు, మనుమలకు మాత్రమే భాగమిస్తారు. కాగా; హజ్రత్ ఆయిషా (రజి) మనుమరాళ్ళకూ భాగం కేటాయించారు. (మస్నద్, దారమి)

స్త్రీలు దైవప్రవక్త (సఅసం) సమక్షానికి తమ సందేశాల సమాధానాల కోసం వచ్చేవారు. వాటిలో కొన్ని పరదాకు సంబంధించినవి. అవేమో స్వల్పమయిన జ్ఞానంగల స్త్రీలకు అర్థం కావు. మరి ఆయనేమో లజ్జ వల్ల వివరంగా చెప్ప లేకపోయేవారు. అటువంటి సమస్యలు ఉత్పన్నం అయినపుడు హజ్రత్ ఆయిషాయే తన సాటి సోదరీమణులతో సహకరించేవారు. వారిని తన దగ్గరకు పిలిచివాటి భావాన్ని విడమరచి చెప్పేవారు (సహీహ్‌బుఖారీ). వారి ప్రశ్నలను ఆయన (సఅసం)కు చేరవేసి ఆయన (సఅసం) జవాబులను వారికి వివరించేవారు.

అరేబియాలో దుస్తులు పెద్దవి (బారుగా)గా ఉంటే గర్వకారణంగా, గౌరవ ప్రదంగా భావించేవారు. ఆయన (సఅసం) సెలవిచ్చారు: ''ఎవరైతే తమ దుస్తుల్ని నేలకు ఈడ్చుకుంటూ నడుస్తారో దైవం వారిపై తన చల్లని చూపును ప్రసరించడు'' ఇది విన్న హజ్రత్ ఆయిషా (రజి) ''దైవప్రవక్తా! స్త్రీల విషయంలోగల ఆదేశం

https://teluguislam.net

ఏమిటి?'' అని ప్రశ్నించగా, ఆయన (సఅసం) ''ఒక్క జానెడు మాత్రం క్రిందికి వేలాడవచ్చు'' అని జవాబిచ్చారు. ''ఆ కాస్తకే చీలమండలు చాపడం సాధ్యపడుతుందా?'' అని ఆమె అంటే ''అలాగయితే ఒక మూరెడు'' అని ఆయన (సఅసం) సమాధాన మిచ్చారు. (మస్నద్ అహ్మద్)

ఇస్లాంలో నికాహ్ సక్రమం కావడానికి పెళ్ళి కుమార్తె అంగీకారం పొందటం అవసరం. ఆయన (సఅసం) సెలవిచ్చారు: ''అవివాహిత స్త్రీలైతే వారి అనుమతి పొందాలి. వైధవ్యం పొందిన స్త్రీల పునర్వివాహం అయితే ఆ మేరకు వారి నుండి 'ఆజ్ఞ'ను కోరాలి''. కాని స్త్రీలకు సహజంగానే లజ్జాబిడియాలు ఉంటాయి. ఈ కారణంచేత వారు నోటితో అంగీకారం తెలుపటం దాదాపు అసాధ్యం. ఉమ్ముల్ మోమినీన్‌కు ఈ సంగతి తెలుసు. అందుకే ''వారి మౌనమే వారి అంగీకారం'' అని ఆమె సెలవిచ్చారు.

కొందరు తల్లిదండ్రులు తమ కుమార్తె ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా తమ ఇష్టప్రకారం నికాహ్ జరిపించేస్తారు. దైవ ప్రవక్త (సఅసం) కాలంలో ఇలాంటి సంఘటన ఒకటి జరిగింది. ఆనాడు అత్యున్నత మహిళా న్యాయస్థానం ఏదో తెలుసా? హజ్రత్ ఆయిషా (రజి) కుటీరమే. ఆ బాలిక ఈ న్యాయస్థానానికి వచ్చింది. ఆ సమయంలో దైవప్రవక్త (సఅసం) ఇంట్లోలేరు. హజ్రత్ ఆయిషా (రజి) ఆమెను కూర్చోబెట్టారు. దైవప్రవక్త (సఅసం) వచ్చిన తర్వాత అసలు సంఘటనను ముందుంచారు. ఆయన పిల్ల తండ్రిని పిలిపించారు. అంతిమ నిర్ణయం ఆ పిల్లదేనన్నారు. అప్పుడా అమ్మాయి, ''దైవప్రవక్తా! ఇప్పుడు నేను, నా తండ్రి చేసిన దాన్ని మనఃపూర్వకంగా శిరసావహిస్తున్నాను. తమకు గల హక్కును స్త్రీలకు తెలియపర్చడమే నా ఉద్దేశ్యం'' అని ఆ బాలిక చెప్పింది. (నసాయి)

తన భార్యకు ఒకసారి లేక రెండు సార్లు విడాకులిచ్చిన భర్త ఇద్దత్ కాలపరిమితి వరకూ ఆమెకు, భోజన సదుపాయాన్ని, నివాస సౌకర్యాన్ని తానే కల్పించవలసి ఉంటుంది. కాని మూడు సార్లు విడాకులు ఇచ్చేసిన మీదట పరిస్థితి ఏమిటి? దీనిపై భిన్నాభిప్రాయముంది. అంటే విడాకులు పూర్తిగా ఇచ్చేశాక కూడా మనోవర్తి (మెయింటెనెన్స్), నివాసం కల్పించాల్సిన బాధ్యత భర్తపై ఉంటుందా? లేదా? కొందరు 'లేదు' అని అన్నారు. ఆధారం ఏమిటండీ అంటే దానికి వారు ఇలా అంటారు: ఖుర్ఆన్‌లో ఈ ప్రస్తావన వచ్చినప్పుడు భర్త యింటి నుండి స్త్రీ వెళ్లటం గానీ, భర్త ఆమెను ఇంటి నుండి వెళ్ళ గొట్టటం గానీ చేయకూడదని చెప్పబడిన తర్వాత ''బహుశా ఆ తర్వాత దైవం ఆ దంపతుల కోసం ఏదైన మార్గం సృష్టించవచ్చు'' అని అనబడింది. అంటే విడాకులివ్వబడిన స్త్రీ ఇద్దత్ కాలం వరకు భర్త యింటిలోనే ఉంటే అనాలోచితమైన చేష్టలవల్ల ఏర్పడిన గొడవలు, పొరపొచ్చాలు

https://teluguislam.net

సమసిపోయి ఆ దంపతులలో తిరిగి అన్యోన్యం కలగవచ్చు. కాని ఈ సర్దుబాటేదో మూడు బుతువులకులోపే జరగాలి. మూడుసార్లు విడాకులు గనక అయిపోతే ఆ జంట తిరిగి ఏకం కాజాలదు. కాబట్టి ఇకపైన ఆమె ఒకే యింటిలో వుండటానికి గల కారణం నిర్హేతుక మయిపోతుంది. అంటే దివ్య ఖుర్ఆన్ లోని ఈ ఉత్తర్వు తలాఖె రజయి (ఈ స్థితిలో దంపతులు ఇష్ట పడితే తిరిగి కాపురం చేయవచ్చు)కి సంబంధించినదనీ, తలాఖె బాయిన్‌కు సంబంధించింది కాదనీ తెలుస్తోంది. (తలాఖె బాయిన్ అంటే ఆ జంట తిరిగి ఏకం కాలేదు). (అబూదావూద్)

కాని వాస్తవానికి ఈ నిరూపణ కూడా పూర్తిగా సరైంది కాదు. ఇది పాక్షికంగా మాత్రమే సరైంది. 'ఇద్దత్' కాలంలో భర్త యింట్లో వుండటం వల్ల ఆ దంపతులిద్దరూ తమ పొరబాట్లను బేరీజు వేసుకుని రుజావర్తనులయ్యే అవకాశం ఉందని అనటం నిజమేననుకోండి. అయితే దాని అసలు ఉద్దేశ్యం అదే అన్నది మాత్రం కరెక్టు కాదు. ఈ ఉత్తర్వులో మరికొన్ని పరమార్థాలు ఉన్నాయి. మొదటి భర్త విడాకులిచ్చినపుడు అప్పటికి ఆమె గర్భం దాల్చినదేమో చూడాలికదా! అందుకు కొన్ని నెలలు వేచి ఉండాలి. అందుచేత ఆమె పునర్వివాహం అప్పటికప్పుడే చేసుకోజాలదు. మొదటి భర్త కారణంగా ఆమెకు ఈ నష్టం జరిగినందువల్ల ఆమెకు ఆ వేచియున్న కాలానికి గాను భోజన పానీయాలు, వసతి సౌకర్యం ఏర్పాటు చేయవలసిన బాధ్యతను ఆ మొదటి భర్తే తీసుకోవాల్సి వుంటుంది. అందుచేతనే హజ్రత్ ఆయిషా (రజి) ఫాతిమా చూపిన ఆధారాన్ని నిర్ద్వంద్వంగా ఖండించారు. ఆమె (ఫాతిమా) తన విషయంలో జరిగిన సంఘటనను ఆధారంగా తీసుకొని దానికి ప్రాచుర్యం ఇవ్వటం శ్రేయస్కరం కాదన్నారు. ఆమె మొదటి భర్త యింటికి భద్రతా ఏర్పాట్లు లేని కారణంగానే దైవప్రవక్త (సఅసం) ఆమెను ఇల్లు మారడానికి అనుమతించిన సంగతిని ఇంతకు ముందు చదువుకున్నాం. మర్వాన్ ఖలీఫాగా ఉన్న కాలంలో ఇటువంటి సంఘటనే ఎదురయింది. అప్పుడు మర్వాన్ కూడా ఫాతిమా ఉల్లేఖనాన్నే ఆధారంగా చేసుకోదలిస్తే హజ్రత్ ఆయిషా (రజి) ''నీవు చేసిన పని సరికాదు. ఫాతిమా విషయం వేరు. ఆ దంపతులకు పడేదికాదు'' అని ఆయనకు చెప్పిపంపారు. మరి కొన్ని ఉల్లేఖనాల్లో ''ఫాతిమా నోటి దురుసు తనం మూలంగా దైవప్రవక్త (సఅసం) ఆమెను మరో చోటికి మార్పించారు'' అని ఉంది.

(సహీహ్ బుఖారీ, అబూదావూద్, మూతా)

భర్త మరణానంతరం స్త్రీ నాలుగు మాసాల పదిరోజులు 'ఇద్దత్ కాలం' గా గడపాలి. గడపదాటి మరో ప్రదేశానికి పోరాదు. దీన్ని బట్టి కొందరు ధర్మవేత్తలు; ''ఒకవేళ ఆమె భర్త వెంట ఉండి ఉంటే భర్త మరణించిన చోట, ఒకవేళ వెంటలేనట్లయితే ఆమెకు ఆ కబురు అందిన చోటే ఉండిపోయి ఇద్దత్ కాలం గడపాలి

https://teluguislam.net

అనీ, అంటే ఆ స్థితిలో ఆమె ఇతర చోట్లకు ప్రయాణించడం ధర్మసమ్మతం కాదనీ అభిప్రాయపడి అందుకు ఎన్నో ఆధారాలను చూపుతారు. అంటే ఇంటి నుంచి, స్వదేశం నుండి బయటకు కదలకూడదని వారి అభిప్రాయం. మరలాంటప్పుడు బయట నుంచి ఇంటికి కూడా రాకూడదని, ప్రయాణం చేసి స్వదేశానికి కూడా రాకూడదని నిరూపించాలి కదా! అందుచేతనే ఉమ్ముల్‌మోమినీన్ (రజి) ధర్మవేత్తల ఈ వాదనతో ఏకీభవించరు. ఆమె సోదరి ఒకర్తె పేరు ఉమ్మె కుల్సూమ్. ఆమెను హజ్రత్ తల్హా (రజి) వివాహం చేసుకున్నారు. ఆమె తన భర్తతో పాటు జమల్ యుద్ధంలో పాల్గొన్నారు. హజ్రత్ తల్హా (రజి) అక్కడ వీరమరణం పొందారు. ఇట్టి పరిస్థితిలో - పై వాదన ప్రకారం - ఆమె ఇద్దత్ కాలం ముగిసేదాకా అక్కడే (యుద్ధ మైదానంలోనే) ఉండాల్సింది. కాని హజ్రత్ ఆయిషా (రజి) ఆమెను తన వెంట మదీనాకు తీసుకుపోయారు. దారిలో మక్కా నగరంలో కూడా వారు ఆగారు. ప్రజల్లో దీని గురించి తర్జన భర్జన జరిగింది. అయ్యూబ్ అనే ఒక తాబయీ, ''ఇది ఇంట్లోంచి బయటికి రావడం కాదు, బయటి నుంచి ఇంట్లోకి రావడమే. హజ్రత్ ఆయిషా (రజి) ఆమెను ప్రయాణావస్థ నుంచి స్వదేశానికి తరలించారు'' అని జవాబిచ్చారు. ఇదే సరయిన జవాబు. సంఘటనలను బట్టి గమనిస్తే, హజ్రత్ ఆయిషా (రజి) గనక ఈ వ్యవహారాన్ని చర్చకు తెచ్చి స్పష్టంగా బోధపర్చకుండా ఉన్నట్లయితే స్త్రీలు ఎన్ని కష్టాలను ఎదుర్కోవలసి వచ్చేదో అర్థం చేసుకోవచ్చు!

ధర్మ సమ్మతమైన పనులన్నింటిలోకి అత్యంత అయిష్టకరమైనది విడాకులివ్వడమే. కాబట్టి వీలయినంత వరకు దాని పరిధిని కుంచింప జేయాలి. భర్త భార్యకు తన నుండి విడాకులను పొందేందుకు స్వేచ్ఛనివ్వగా ఆమె ఆ అనుమతిని వాపసు చేస్తూ భర్త దాంపత్యంలోనే ఉంటానని కోరుకుంటే అట్టి సందర్భంలో కూడా ఒకసారి విడాకులు అయిపోయినట్లేనని కొందరు సహాబా 'ఫత్వా' ఇచ్చారు. హజ్రత్ ఆయిషా (రజి) ఈ ఫత్వాను తిరస్కరించారు. అందుకు ఆధారంగా స్వయంగా దైవప్రవక్త (సఅసం) కు ఎదురయిన సంఘటనను పేర్కొన్నారు. ఆయన (సఅసం) 'తఖ్‌యీర్' సంబంధించిన ఆయత్ అవతరించిన తర్వాత సతీమణులందరికీ వారు కోరుకున్నయెడల వేరు పడేందుకు అధికారమిచ్చారు. కాని ఎవరూ వేరుపడలేదు. మరయితే మాకు ఒక విడత (మొదటి విడత) విడాకులు ఇచ్చినట్లవుతుందా? ఒకవేళ అదే అయితే అది విశ్వసనీయత, నిజాయితీ తత్పరత కలవారిపై వేటుకాదా? భర్తకు విధేయురాలై, విశ్వసనీయురాలై మెలగిన భార్యకు ఆమె చేసిన త్యాగానికి గాను షరీఅత్ తరఫునుండి లభించే ప్రతిఫలం ఇదేనా?! ముమ్మాటికీ కాదు. అందుచేత ఫిక్‌హ్ వేత్తలలో, హదీసు వేత్తలలో అధికులు హజ్రత్ ఆయిషా (రజి) గారి ఈ ఫత్వానే శిరసావహించారు.

https://teluguislam.net

ఇదే విధంగా ఎవరయినా ఒకరి భార్యను విడాకులివ్వమని బలవంతం చేసి, విడాకులివ్వకుంటే నిర్బంధిస్తామనో, చంపివేస్తామనో బెదిరిస్తే ఆ బెదిరింపులకు భయపడిన భర్త తన భార్యకు విడాకులిచ్చేస్తే అప్పుడేమిటి? అన్న ప్రశ్నకు హ(జత్ ఆయిషా (రజి) సమాధానంగా ''ఈ విడాకులు షరీఅత్ పరంగా చెల్లవు ''(బుఖారీ, ముస్లిం)'' అని నిర్ద్వంద్వంగా చెప్పారు. ఒక్క ఇమామ్ అబూ హనీఫా తప్ప మిగతా ధర్మవేత్తలు, హదీసువేత్త లందరూ ఈ సూత్రాన్ని అంగీకరించారు. ఇస్లామీయ చట్టంలో ఈ అధికరణమే గనక లేనట్లయితే సౌశీల్యవంతులైన స్త్రీలకు క్రూరులు, దుష్టులు అయిన అమీర్లు, సుల్తానుల కబంధ హస్తాల నుండి రక్షణ పొందటం దుర్లభమయిపోయేది.

అజ్ఞాన కాలంలోని స్త్రీల సున్నితమైన మెడలకు పడి ఉండే ఆచార దురాచారాల ఇనుప సంకెళ్ళలో ఒకటి; ఆ కాలంలో దశలవారీ విడాకులు గానీ, విడాకులు తర్వాత 'మరలింపు'కు అవకాశం గానీ! విడాకులకు సంబంధించిన షరతులుగానీ వుండేవి కావు. రాతిగుండె కల భర్త నిర్లక్ష్యంగా భార్యకు విడాకులిచ్చేవాడు. తిరిగి కలుసుకునే గడువు పూర్తయ్యేలోగా తిరిగి దాంపత్యంలోకి తీసుకునే వాడు. మరల విడాకులిచ్చేవాడు. అతడు గనక దయదలచకపోతే జీవితాంతం స్త్రీ ఈ సాలెగూటి నుండి తప్పించుకోజాలదు. ఆ విధంగా ఈ నిస్సహాయురాలు శాశ్వతంగా దుఃఖిస్తూ క్షోభ పడవలసిందే తప్ప ఎన్నటికీ అతడి కబంధ హస్తాల నుండి ఆమెకు స్వేచ్ఛ లభించేది కాదు. కాని ముస్లిం స్త్రీలకు ఉమ్ముల్ మోమినీన్ వల్ల జరిగిన మహోపకారమేమంటే, ఆమె వారిని అజ్ఞానపు పీడ నుండి శాశ్వతంగా విముక్తి కలిగించారు. ఇస్లాం యుగంలో కూడ అటువంటి సంఘటన ఒకటి ఎదురయ్యింది. బాధితురాలయిన భార్య దారి చూపించమని ఉమ్ముల్‌మోమినీన్‌సమక్షానికిదొడు తీసింది. ఆమె ఈ కేసును దైవప్రవక్త (సఅసం)కు నివేదించారు. అప్పుడు ఈ దివ్య వచనం (ఆదేశం) అవతరించింది. (ఈ సంఘటన సవివరంగా తిర్మిజీ గ్రంథంలో వుంది)

> ''విడాకులు రెండు సార్లు ఇవ్వాలి. తరువాత భార్యను సక్రమంగా తమ వద్ద ఉండనివ్వాలి. లేదా ఆమెను సహృదయంతో సాగనంపాలి.'' (అల్ బఖర - 229)

## మహిళా ప్రపంచంలో ఆయిషా (రజి) స్థానం

మీరిప్పటి వరకు హ(జత్ ఆయిషా సిద్దీఖా (రజి అన్హా) జీవిత చరిత్రను అన్ని కోణాల నుంచి పరిశీలించారు. ఆమె పవిత్ర జీవితంలోని ఒక్కో సంఘటన మీ కళ్ళముందు మెదిలింది. మీరు ప్రపంచంలోని ఎంతో మంది గొప్పగొప్ప మహిళల

https://teluguislam.net

జీవిత చరిత్రను చదివి ఉండవచ్చు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మహిళల జీవితాల్లోని అసంఖ్యాక పుటల్ని చరిత్ర మీ ముందుకు తెచ్చి ఉండవచ్చు. కాని ఎప్పుడయినా మీరు పోల్చి చూశారా?!

ప్రపంచంలోని సుప్రసిద్ధ ముస్లిమేతర మహిళల జాబితాలో ఉన్న పేర్లలో చాలా మటుకు తమ స్త్రీ త్వస్థాయి కంటే కాస్త ఉన్నతమైన ఘనకార్యం ఏదైనా యాదృచ్ఛికంగా ఉనికిలోకి వచ్చిన కారణంగా చివరకు అదే వారి సిగలో పువ్వుగా వారికి పేరు తెచ్చినందువల్ల ప్రసిద్ధులయిన వారే. ఒక స్త్రీ ఉద్రేక పూరిత జన సమూహంలో ఏదైనా ఉపన్యాసం చేసి ఉండవచ్చు! ఏదో ఉపాయంతో శత్రువుల కుట్రను వమ్ముచేసి శభాష్ అనిపించుకుని ఉండవచ్చు! లేక తన భుజబలంతో జీవితపు ఏదైనా రంగానికి వన్నె తెచ్చి ఉండవచ్చు! లేక భౌతిక కారణాలు వారి చారిత్రక ఉనికిని, పేరు ప్రఖ్యాతులకు తోడ్పడి ఉండవచ్చు!

కాని మీరే ఆలోచించండి. వీటినన్నింటినీ ఒక ఎడతెగని వ్యవస్థీకృతమైన, అవిచ్ఛిన్నమైన కృషితో, ఘనకార్యంతో పోల్చగలమా? అందచందాలతో రాజకుమారులను, రారాజులను సమ్మోహన పర్చడానికి పిల్లలులేని రాచ కుటుంబం యొక్క బంగారు కిరీటాలను సవరించడానికి తరచుగా స్త్రీ ఉపయోగపడింది. కాని మీకు తెలుసు, అటువంటి వారి పర్యవస్థానం చరిత్రలో ఎప్పుడూ నిరాశ, పరాభవాలనే చవి చూసింది, ఈజిప్టు, ఈరాన్, రోము దేశాల చరిత్ర సారాంశం మీ ముందు ఉన్నది. ఆ దృష్టాంతాలను ఒక పవిత్రమైన, సౌశీల్యవంతమైన సఫలీకృతమైన జీవితంతో పోల్చడం సమంజసమా?

ఈ సాధారణ హోదాలను ప్రక్కన బెట్టి, ధర్మం, నైతికత, పవిత్రతల కోణాలలో పరిశీలిస్తే మహిళా ప్రపంచతారకల్లో ఏ ఒక్కటీ ఆ స్థాయికి చేర లేదని తెలుస్తుంది. ప్రపంచ మహిళల్లో హ|జ్రత్ ఆయిషా సిద్ధీఖా కన్నా మతం నైతికత, ఘనతలతో పాటు మత, విద్యా, రాజకీయ, సామాజిక ఒకటేమిటి అన్నిరకాల బాధ్యతలు నెరవేర్చిన వారు ఎవరన్నా ఉన్నారా? ఇంకా, తన జీవితంలో సాధించిన విజయాలతో దైవ భక్తి తత్పరతలు ఉదాహరణలతో, నైతికతకు సంబంధించిన క్రియాత్మక దృష్టాంతాలతో, ఆధ్యాత్మిక బోధనలతో ధర్మం, షరీయత్, చట్టాల శిక్షణ, వివరణలతో ప్రపంచంలోని కోట్లాది మహిళల కోసం ఒక పరిపూర్ణ జీవనం అత్యంత విలువయిన ఆచారణాత్మక నమూనాను మిగిల్చిన వారు, ఇంకా అసంఖ్యాకస్త్రీ జనానికి తన ధార్మిక సామూహిక విద్యా విషయక మేళ్ళను గ్రుమ్మరించిన స్త్రీ ప్రపంచంలో ఎవరున్నారు?

ముస్లిం స్త్రీల చరిత్రలో ప్రవక్తగారి పవిత్ర సతీమణులు, పవిత్రులయిన కుమార్తెలు తప్ప హ|జ్రత్ ఆయిషా(రజి) జీవితాన్ని ఎవరితోనని పోల్చగలం?

https://teluguislam.net

ఇస్లాంలో హజ్రత్ ఖదీజతుల్ కుబ్రా(రజి), హజ్రత్ ఫాతిమ జహరా(రజి), హజ్రత్ ఆయిషా సిద్దీఖా(రజి)గారలు మహిళల్లో అందరికన్నా శ్రేష్ఠులు అని ఇస్లామీయ పండితులందరూ ముక్త కంఠంతో ఏకీభవిస్తారు. పండితులలో అధికులు అందరికంటే ముందు హజ్రత్ ఫాతిమా(రజి) తర్వాత ఖదీజా(రజి) ఆ తర్వాత మూడవ స్థానంలో హజ్రత్ ఆయిషా(రజి)ను పేర్కొంటారు. కాని ఈ క్రమానికి షరీయత్ పరంగా గానీ, సహీహ్ హదీసుల దృష్ట్యా గానీ ఎలాంటి ఆధారం లేదు. కాకపోతే పండితులు తమ అంచనాలను, పర్యాలోచనను, ఆదరాభిమానాలను బట్టి ఈ క్రమాన్ని ఏర్పరచి ఉండవచ్చు. ఈ మహిళాత్రయం ప్రత్యేకతలు, విశిష్టగుణాలు హదీసులలో వేర్వేరుగా ఉల్లేఖించబడ్డాయి. ఆ కారణంచేతనే కొందరు పండితులు ఈ క్రమాన్ని ఏర్పరచడం అంటే సీరియల్ ఆర్డర్ యివ్వడంలో ఆచితూచి వ్యవహరించటం సముచితంగా భావించారు.

అల్లామా ఇబ్నె హజమ్ పండితులందరి అభిప్రాయాలకు భిన్నంగా - హజ్రత్ ఆయిషా(రజి)గారు స్త్రీలందరిలోనే కాదు, ప్రవక్త సహచరులందరికన్నా శ్రేష్ఠులని వాదించారు. ఈ వాదనను బలపరచే ఆధారాలు ఆయన దగ్గర చాలా వున్నాయి. ఈ విషయంలో ఆసక్తి ఉన్నవారు అల్లామా ఇబ్నె తైమియ, ఆయన శిష్యులయిన హాఫిజ్ ఇబ్నె ఖయ్యిమ్‌ల రచనలను అధ్యయనం చేయవచ్చు. వాళ్లు ఇలా వ్రాశారు: పరలోకశ్రేష్ఠతే అసలు శ్రేష్ఠత అని భావించినట్లయితే ఆ విషయం దైవానికే బాగా తెలుసు. కాని ప్రాపంచిక పరంగా అయితే వారి శ్రేష్ఠతలు ఒక్కో ప్రత్యేకత రీత్యా భిన్నంగా వున్నాయి. వంశానుగుణంగా చూడదలిస్తే ఆ శ్రేష్ఠత హజ్రత్ ఫాతిమా(రజి)కు దక్కుతుంది. విశ్వసనీయత రీత్యా చూస్తే ప్రప్రథమంగా ముహమ్మద్‌ను దైవప్రవక్తగా నమ్మినవారు, ఇస్లాం ఆవిర్భావ కాలంలోని కష్టాల కడలిని ఈదడంలో దైవప్రవక్త (సఅసం)కు సహకరించడంలో వెన్నుదన్నుగా నిలబడటంలో సాటిలేని వారు హజ్రత్ ఖదీజా (రజి)యే. అయితే విద్యా పరిమళాన్ని వెదజల్లడంలో, జ్ఞానసుధను చిలికించి ధార్మిక సేవలు అందజేయడంలో, దైవప్రవక్త (సఅసం) బోధనల్ని వ్యాపింపజేయడంలో హజ్రత్ ఆయిషా(రజి)తో సరితూగ గల మహిళ ఎవరయినా ఉన్నారా అంటే సమాధానం 'లేదు' అనే వస్తుంది.

(సమాప్తం)

https://teluguislam.net